

# మోదీ "భార" తం

( 26 మే 2014 - 25 మే 2022 )

## హిందూత్వ రాజకీయం - ఉపశ్రేణుల ప్రతిఘటన

ప్రత్యేక వ్యాసాల సంచిక


TWO OF THE SAME SOIL !
MY EXPERIMENTS WITH TRUTH
GANDHI
MY EXPERIMENTS WITH LIES
MODI


NRC
DETENTION CAMP
CAB


IRREGULAR by MANJUL
twitter @MANJULtoons facebook @IndianEditorialCartoons
SAVE COW
KILL HUMANS
©MANJUL


INDIAN RUPEE
PETROL DIESEL PRICES
ACHCHE DIN
₹
ECONOMY
UTTAM


विकासपथ पर अग्रसर
आत्मनिर्भर भारत
PERFORM INDIA


WAH RE WAH! THIS REMOTE WORKS ON DOORDARSHAN TOO!
DD
LIVE
SATISH ACHARYA










## CHART 2: STATE OF EMPLOYMENT & UNEMPLOYMENT

| | 2011-12 | 2017-18 |
|---|---|---|
| Total employed | 474 mn | 465 mn |
| Unemployment rate | 2.2% | 6.1% |
| Total unemployed | 10mn | 30 mn |

*Source: Santosh Mehrotra/PLFS*

## CHART 3: EMPLOYED & UNEMPLOYED, YEAR BY YEAR

| Year | Total employed | Total unemployed |
|---|---|---|
| 2016-17 | 407,269,078 | 32,863,858 |
| 2017-18 | 405,930,230 | 19,688,223 |
| 2018-19 | 400,901,359 | 27,154,496 |
| 2019-20 | 403,450,655 | 33,331,933 |

*Source: CMIE*

*Note: Figures from CMIE and PLFS are not comparable because of different methodologies*



# మోదీ భారతం

## విషయ సూచిక


1 మోడీ పాలన...ద్వేష రాజకీయం 4
- రావు కృష్ణారావు

2 మోడీ పాలనలో మూల్యం చెల్లిస్తున్న భారత్ 8
- ఆకార్ పటేల్

3. సాంస్కృతిక జాతీయవాదం నుంచి బుల్డోజర్ సంస్కృతి దాకా -ఎన్. వేణుగోపాల్ 10

4. మోడీ పాలనం : కార్పొరేట్, కాషాయ కషాయం - తెలకపల్లి రవి 14

5. ఈ దేశాన్ని ప్రజలే కాపాడు కోవాలి 20
- కొండుభట్ల రామచంద్రమూర్తి

6. కశ్మీర్, గో రక్షణ, మూకదాడులు, మతాంతర వివాహాలపై గాంధీ అభిప్రాయాలేంటి? 24

7. హిందూ రాజ్యం : హరిద్వార్ ధర్మ సంసద్లో... 26

8. మతం, మార్కెట్ కలిసిన రాజకీయం 27
- ప్రొ॥ అజయ్ గుడవర్తి

9. విధానాలు సంఘ్ పరివార్ వి - అమలు మోడీది 29
-ఆర్వీ రామారావు

10. అద్దెకు జాతీయ వనరులు! 32
- ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్

11. మోడీ పాలనలో : ఆర్థిక వృద్ధి కంటే మత విభజనకే పెద్ద పీట ! 34
- ఎం. కోటేశ్వరరావు

12. పర్యావరణానికి హాని చేస్తున్న మోడీ ప్రభుత్వం - డా॥ పి. నారాయణరావు 40

13. భారత రాజ్యాంగ పీఠిక ఒక జాతీయ గీతం 43
- ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్

14. బహుళత్వమే కదా, భారతీయ ఆత్మ! 45
- కె. శ్రీనివాస్

15. భారత చరిత్రపై సంఘ పరివారపు చేతబడి 47
- ఇర్ఫాన్ హబీబ్

16. హేతువాదం Vs HATE వాదం 53
- డాక్టర్ దేవరాజు మహారాజు

17. "హిందూ రాజ్యం" హిందువుల బాగు కోసం కాదు - ప్రభాత్ పట్నాయక్ 55

18. ఇండియా @ 75 57
- కొప్పర్తి వెంకటరమణమూర్తి

19. దేశ ప్రజలకు ఆనంద్ తేల్తుంబ్డే లేఖ 59
- ఆనంద్ తేల్తుంబ్డే

20. సమైక్య స్ఫూర్తిగా బాపు, బాబాసాహెబ్ 62
- రామచంద్ర గుహ

21. ప్రత్యామ్నాయ హెజిమనీ శక్తిగా రైతుల ఉద్యమం 65
- డా॥ బి రమేష్ చంద్రబాబు

22. బీజేపీ ఆధిపత్యంపై పోరాటం తెలుసుకోవలసిన నాలుగు సత్యాలు 67
- యోగేంద్ర యాదవ్

23. మోదీ ని ఓడించే భావజాల పోరాటం 70
- డివివియస్. వర్మ



పుస్తకాలకు...

విశాలాంధ్ర బుక్ హౌస్ ❁ నవచేతన బుక్ హౌస్

ప్రజాశక్తి బుక్ హౌస్ ❁ నవతెలంగాణ బుక్ హౌస్

ప్రతులు : 1200 ❁ ప్రచురణ: 2022 మే

ముద్రణ : విశాలాంధ్ర ప్రెస్, విజయవాడ – 4

వెల : 30/-

ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**

సంపాదకవర్గం

**మందలపర్తి కిషోర్**

**కొప్పర్తి వెంకటరమణ మూర్తి**

**డి . సోమసుందర్**

**బి . రమేష్ చంద్ర బాబు**



**చిరునామా :** బి రమేష్ చంద్ర బాబు, క్రాంతి నర్సింగ్ హోమ్, నన్నయ విగ్రహం దగ్గర, రాష్ట్ర పతి రోడ్, తణుకు-534211 ఆంధ్రప్రదేశ్



# మోదీ జైత్రయాత్రకు అడ్డుకట్ట పడుతుందా?

## సంపాదకీయం

**మే** 26 తో మోదీ పాలనకు 8 ఏళ్లు నిండుతున్నాయి. మోదీ సాగిస్తున్న జైత్రయాత్ర మీద, పాలన ఫలితాల మీద సమాలోచనకు ఇదొక సందర్భం. మోదీకి ఒక భక్త బృందం వుంది. వారు యీ జైత్రయాత్రకు ఎదురులేదంటారు. "హిందూరాష్ట్ర' కనుచూపు మేరలోకి వచ్చిందంటారు. మరోపక్క మోదీని విమర్శించే వారున్నారు. 2024లో మోదీ ఓటమి సాధ్యపడేలా లేదంటారు. మోదీకి ధీటైన నాయకుడు లేడని, ప్రతిపక్షాలు ప్రశ్నించడానికే తప్ప ప్రతిఘటించే ఉమ్మడి వ్యూహం వారికి లేదంటారు. ఎన్నికల బాండ్ల రూపంలో దానికి అపరిమిత ఆర్థికబలం వుందనీ, క్షేత్రస్థాయిలో పుకార్లు నడిపించే పదాతి దళాలు వున్నాయని అంటారు. ఇవన్నీ అందరూ ఏదోమేరకు అంగీకరించే విషయాలుగానే కనిపిస్తాయి.

పోతే మోదీ రాజకీయాలను, పాలనాతీరును లోతుగా పరిశీలిస్తే అందులో చాలా వైరుధ్యాలు కనిపిస్తాయి. ఆయన జైత్రయాత్రను అడ్డుకునే బహుకోణాలు కనిపిస్తాయి. అవి ప్రజలు ఆదరించే ప్రత్యామ్నాయ రాజకీయానికి దారులను సూచిస్తాయి.

మొదటిది– మోదీ అనుసరిస్తున్న హిందూత్వ భావజాలం ముందు చూపుగలది కాదు. గతకాలపు వైభవాలను ఆవాహన చేస్తుంది. అనాదికాలపు రాచరికాలను ఆధునిక ప్రజాస్వామ్యం కంటే మిన్నగా భావిస్తుంది. ప్రజల సార్వభౌమాధికారానికి పట్టంకట్టే ఆధునిక రాజ్యాంగానికి భిన్నంగా నిచ్చెనమెట్ల కులాలను, వివక్షను సమర్థించే 'మనుధర్మశాస్త్రాన్ని' ఆహ్వానిస్తుంది. మనం గతాన్ని తెలుసుకోవాలి. కాని గతంలోకి ప్రయాణించకూడదు. ఎందుకంటే వర్తమాన సమస్యలకు పరిష్కారం ఎంత వెదికినా గతంలో దొరకదు. అది భవిష్యత్తులోనే సాధ్యం అవుతోంది. ఈ గతం మత్తు దాని వైభవం ఎల్లకాలం పనిచేయదు. జనజీవనం ఎన్ని ఆటుపోట్లు వున్నా ముందుకే సాగుతుంది. వెనక్కి నడవదు. హిందూత్వకి వున్న ఈ వెనక చూపు వదిలించుకునే దారి జీనజీవనమే నేర్పుతుంది.

ఇంక రెండోది – భారత జాతీయవాదం స్థానంలో హిందూ జాతీయ వాదాన్ని, సాంస్కృతిక జాతీయవాదాన్ని, మెజారిటీ జాతీయవాదాన్ని హిందూత్వ తన రాజకీయ సిద్ధాంతం చేసుకుంది. ఇన్ని భాషలు, ప్రాంతాల ప్రత్యేకతలు వాటి ప్రత్యేక సంస్కృతులు, కులాలు, మతాలు, వర్గాలు వున్న దేశంలో ఒకే జాతి, ఒకే మతం, ఒకే భాష, ఒకే ఆహారం, ఒకే ఆహార్యం అన్న నినాదాలు హిందూత్వ సాంస్కృతిక జాతీయవాదాన్ని ప్రతిఘటిస్తాయే గాని, తమ అస్తిత్వాన్ని వదులుకోవు. స్వాతంత్ర్యానంతరం రాష్ట్రాల ఏర్పాటుకు ఈ ప్రత్యేకతలే ప్రాతిపదికగా వున్నాయి. ఒకే భాష మాట్లాడే తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలు ఏర్పడడం యీ ప్రాంతీయ ప్రత్యేకతలనే స్పష్టం చేస్తున్నది.

హిందూత్వ సాంస్కృతిక బుల్డోజర్‌కు బెంగాల్ ఎన్నికలలో ఏలదా తమిళనాడు ఎన్నికలలో అడ్డుకట్టలు వేసింది ఈ ప్రత్యేకతలే. భిన్నత్వాన్ని ఆమోదిస్తేనే ఏకత్వం సాధ్యమయ్యే దేశం మనది. భిన్నత్వాన్ని చెరిపేసి ఏకత్వాన్ని సాధించాలన్న హిందూత్వకు ఈ వైవిధ్యం అడ్డుగోడగా నిలుస్తున్నది.

ఇక మోదీ ఆర్థిక విధానాలు గురించి చెప్పవలసిన పనిలేదు. నిత్య జీవితంలో వాటిని ప్రజలు అనుభవిస్తున్నారు. సంపన్నులకు రాయితీలు, పేదలపై భారాలు అందరికీ కనిపిస్తున్నదే. దేశంలో విభజన రాజకీయాలపైనా, పేదలపై పడుతున్న ఆర్థిక భారాలపైనా, దళితులు, మైనారిటీల పట్ల వివక్ష పూరిత కక్ష రాజకీయాలు అందరి కళ్ళూ తెరిపిస్తున్నాయి.

వివక్షకు వ్యతిరేకంగా ఆజాదీ నినాదాలతో యూనివర్శిటీ విద్యార్థులు సాగించిన ఉద్యమాలు, మత వివక్షతో కూడిన పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా జరిగిన సామూహిక ఉద్యమాలు లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికవర్గం సాగిస్తున్న బంద్‌లు, ఆందోళనల్లో కోట్లాది మంది పాల్గొంటున్న తీరు నిరసన గళాల నోరు నొక్కే నల్ల చట్టాలపై మేధావులు వ్యక్తం చేస్తున్న నిరసనలు, అన్నింటికీ మించి మోదీ ప్రభుత్వానికి తిరుగులేని ప్రతిఘటన ఇచ్చిన రైతు ఉద్యమం, దళితుల ప్రతిఘటనలు అన్నీ మోదీ ఆధిపత్య రాజకీయాన్ని నిలదీస్తున్న ఉద్యమాలే.

ఈ ఉపశ్రేణుల ఉద్యమాలకు ఒక ఉమ్మడి వేదిక రాలేదు. అలాగే మోదీ ప్రభావాన్ని వ్యతిరేకించే పార్టీలు ప్రత్యామ్నాయ రాజకీయానికి ప్రయత్నాలు లేవు. మోదీ ప్రభుత్వాన్ని సవాలు చెయ్యడానికి హిందూత్వ భావనకు వ్యతిరేకంగా భారత్ భావనని, ఆర్థిక అసమానతలు అంతానికి సంపద పంపిణీ మార్గాన్ని, గతంపైనా భవిష్యత్తుపైనా ప్రజల మనోభావాలను, కొత్త ఆకాంక్షలను కలిగించే సాంస్కృతిక ఉద్యమాన్ని రూపొందించగలిగితే మోదీ జైత్రయాత్రకు అడ్డుకట్ట పడుతుంది. అలాంటి ప్రయత్నాలు జరుగుతాయని భావిద్దాం. ◆


**– డివివియస్ వర్మ**
**ప్రధాన సంపాదకులు**
**8500678977**



# మోడీ పాలన...ద్వేష రాజకీయం

- **రావు కృష్ణారావు,** మార్క్సిస్టు విశ్లేషకులు



నేడు ప్రపంచాన్ని పెట్టుబడి పాలిస్తున్నది. భారత దేశం కూడా అందులో భాగమే! అందు చేత ఈ దేశాన్ని దాన్నుండి విడదీసి చూడకూడదు.

ప్రజాస్వామ్య శక్తులనుండి, ప్రజల నుండి పెట్టుబడి పాలనకు ముప్పు వస్తోందన్నప్పుడు, పెట్టుబడి దారీ పాలకవర్గం తన ప్రజాస్వామ్య ముసుగును తొలగించి తన అసలు నియంతృత్వ రూపాన్ని చూపుతుందనే విషయం ప్రపంచ చరిత్రలో పలుమార్లు రుజువయ్యింది. ప్రస్తుతం భారత దేశంలో ప్రజాస్వామ్య శక్తులు, ప్రజా చైతన్యం చాల బలహీనంగా ఉన్న దశలో మెజారిటీ మత జాతీయవాదాన్ని ఆసరా చేసుకొని నియంతృత్వాన్ని నెలకొల్పే ప్రయత్నాలు ఎందుకు జరుగుతున్నాయి?

సుమారు మూడు దశాబ్దాలనుండి అమలవుతున్న నయా ఉదారవాద విధానాలు ప్రజలను ఆకట్టుకోలేక పోయాయి. నయా ఉదారవాద ప్రవక్త మన్మోహన్ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని, పార్టీని ప్రజలు ఓడించారు. ఓడిపోయే ప్రమాదముందని తెలిసినా ఆయనా, ఆయన పార్టీ ఎంతో నిబద్ధతతో నయా ఉదారవాద ఆర్థిక విధానాలను ముందుకు తీసుకుపోయారు. ప్రజల్లో వ్యాపించి ఉన్న పెట్టుబడిదారీ సంస్కృతి, ఐడియాలజీ ఆయన ప్రభుత్వాన్ని రక్షించలేక పోయాయి. దిగజారిన ప్రజల నిజ జీవిత పరిస్థితుల తీవ్రత ముందు పెట్టుబడిదారీ ఐడియాలజీ బలం సరిపోలేదు. పెట్టుబడిదారీ విధానం పట్ల వ్యతిరేకత చూపకుండానే కేవలం పాలకపార్టీ పట్ల కోపం చూపించారు. తమ ఐడియాలజీ పరిమితులు గ్రహించిన పాలక పెట్టుబడిదారీ వర్గం మతతత్వ మసాలా దట్టించిన బలమైన ఐడియాలజీ కలిగిన పార్టీని ఎంచుకుంది. మోడీని నాయకునిగా ఎంపిక చేయడంలో కూడా భారతీయ బడా పెట్టుబడిదారులు క్రియాశీలంగా జోక్యం చేసుకున్నారనే కథనాలు వినిపించాయి.

మోడీ చేసిన వాగ్దానాలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారనేది అబద్ధం. ఎప్పటిలాగానే కాంగ్రెస్ పార్టీ పాలన పట్ల వ్యతిరేకత ప్రధానంగా పని చేసింది. మోడీ నాయకత్వాన బాజపా అధికారంలోకి వచ్చింది. బరితెగించి నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానాలను అమలు చెయ్య సాగింది. మొత్తం మీడియాను అదుపులో ఉంచుకొని ప్రజల గొంతు వినిపించకుండా చేయగలిగింది. మోడీ పాలనలో ప్రజలు పెనం మీదినుంచి పొయ్యిలో పడ్డారు. పొయ్యిలోని వేడిని ప్రజలు సహించేలా, లేదా మరిపించేలా ద్వేష రాజకీయమనే మత్తు మందును పాలకవర్గం ప్రజలకు అందించింది. ఈ ద్వేషం చాలా శక్తి వంతమైనది. పొయ్యిలో తనను కాలుస్తున్న మంటను, నిప్పును విస్మరింపచేసే శక్తి దాని కుంది.

ద్వేషించాల్సిన వారిని భాజపా జాగ్రత్తగా ఎంపిక చేసుకొంది. ముస్లిములు, దళితులను శత్రువుల్లా చూపింది. వీరిపట్ల ద్వేషానికి కావలసిన సరంజామా గతం నుండి వారికి లభించింది. మతపరమైన ద్వేషానికి ముస్లిములు, కులపరమైన ద్వేషానికి దళితులు పనికొచ్చారు. అగ్ర రాజ్యాలకు భయపడి క్రైస్తవం పట్ల బహిరంగ ద్వేషాన్ని ప్రదర్శించడం లేదు. ఈ ద్వేషం అనే ఎత్తుగడతో ఉన్న సుఖం ఏమంటే ఇతర మతాన్ని కులాన్ని ద్వేషించాలనేదే ప్రధానం కాని తన మతాన్ని, కులాన్ని ప్రేమించి వాటి అభివృద్ధికి పనిచేయాలనే నిబంధన ఏమీ లేదు.

అన్య మత, కుల ద్వేషానికి స్వీయ మత, కుల ఉద్ధరణ షరతు కాదు. ప్రజలు కులాలుగా విడిపోయి ఉండాలికాని హిందువులుగా ఐక్యమై భాజపాను సమర్థించాలి. హిందువు అంటేనే ఏదో ఒక కులానికి చెందిన వాడై ఉంటాడు.

దేశంలో కులానికి ఉండవలసిన ముఖ్య లక్షణాలన్నిటినీ కేపిటలిజం దొలిచేసింది. కాని బూర్జువా వర్గం కులాన్ని ఒక రాజకీయ శక్తిగా బలోపేతం చేసింది. కులం రాజకీయాల్లో వ్యవస్థాగత శక్తిగా మారింది. మౌలికంగా పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకించని కుల నాయకులకు వివిధ స్థాయిల్లో రాజకీయాధికారాన్ని పంచి, తద్వారా ఆర్థిక ప్రయోజనాలు కలిగించి వారిని కలుపుకుంటున్నది. కుల నాయకులు రాజకీయంగా, ఆర్థికంగా ప్రత్యక్ష ప్రయోజనాలు పొందుతున్నారు. ఆయా కులాల ప్రజలకు 'తమకూ రాజకీయాధికారం ఉందనే సంతృప్తి'దక్కుతోంది. ఈ సంతృప్తి చిన్న విషయం కాదు. తరతరాలుగా కులపరమైన అణచివేతకు ప్రతిస్పందన ఇది. ఆర్థిక రంగంలో తగ్గిన కుల వివక్షను ఆధారం చేసుకొని సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఎదగడానికి వెనుకబడిన కులాలు ప్రయత్నిస్తున్నాయి. సామాజికవేత్తలు చెప్పినట్లు 'సాంస్కృతీకరణ' ప్రయత్నాలు బలంగా జరుగుతున్నాయి. గతం నుండీ సంస్కృతి మతంతో తెగని విధంగా ముడిపడి ఉండటం వల్ల సాంస్కృతిక ఉద్ధరణలో మత సంబంధ కార్యక్రమాల నిర్వహణ ఒక భాగంగా సాగుతోంది. ఇది హిందూ మతాన్ని, తద్వారా మతాన్ని రాజకీయాలకు వాడుకుంటున్న భాజపాను బలోపేతం చేస్తున్నది. ఈ కుల రాజకీయ వ్యవస్థ ఎంత బలంగా తయారయ్యిందంటే వామపక్షాలు సైతం ఎన్నికల్లో కులాన్ని విస్మరించలేక పోతున్నాయి.

ఇలా కులాన్ని ప్రధాన రాజకీయ శక్తి చేయడంలో బూర్జువా వర్గానికి రెండు ప్రయోజనాలున్నాయి. కులం ఆధారంగా ఓట్లు పొందడం ఒకటి కాగా, రెండోది శ్రామిక ప్రజల్లో ఐక్యత, వర్గ చైతన్యం పెరగకుండా అడ్డుకోవడం. దీర్ఘకాలికంగా చూసినప్పుడు ఈ రెండోది ఎక్కువ హాని చేస్తుంది. దేశంలో బి.సి. ల సంఖ్య ఎక్కువ కాబట్టి మోడీ చాలా ముందు చూపుతో బి.సి. లలో చేరిపోయారు. అది ఆయన ప్రధాని అభ్యర్థి కావడానికి, అధికారంలోకి రావడానికి సాయపడింది.

మళ్ళీ అసలు విషయానికి వస్తే ద్వేషం అనేది పూర్తిగా ప్రతికూల విషయం కాదు. దీని మరో పార్శ్వం ప్రేమ. మంచిని ప్రేమించాలంటే చెడును ద్వేషించాలి. అన్యాయాన్ని ద్వేషించలేని వాడు నిజంగా న్యాయాన్ని ప్రేమించలేడు. కేపిటలిజం, దోపిడీ వర్గం, ఆధిపత్యం పట్ల పీడిత ప్రజల్లో సహజంగానే ఉండే ద్వేషాన్ని పెంచి ప్రోత్సహించడంలో వామపక్షాలు విఫలమయ్యాయి. ఆ ఖాళీని కుల,మత,భాషా, ప్రాంతీయ విద్వేషాలతో నింపి తమ పబ్బం గడుపుకుంటున్నాయి పాలక వర్గాలు. దోపిడీ పట్ల ద్వేషంలో సాటి పీడిత జనావళి పట్ల ప్రేమ విడదీయరాని భాగంగా ఉంటుంది. బాజపా పెంచి పోషించే ద్వేషంలో అటువంటి సానుకూల పార్శ్వం ఏమీ ఉండదు. ముస్లిముల పట్ల ద్వేషంలో సాటి హిందువుల జీవితాలు బాగుపడాలనే ఆకాంక్ష ఏమీ ఉండదు. ఇతర కులాలను ద్వేషించే వారిలో తమ కులంవారు బాగు పడాలనే కోరిక ఏమీ ఉండదు. నిజంగా అటువంటి కోరిక ఉంటే ఆ ద్వేషం అతి త్వరలోనే భాజపాకే ఎదురు తిరుగుతుంది. ఎందుకంటే అది హిందూ ప్రజలను విదేశీ, స్వదేశీ పెట్టుబడి దారులు మరింతగా దోచుకోవడాన్ని ప్రోత్సహిస్తున్నది.

'హిందూ మతం, సంస్కృతి' అనేవి నిజానికి అమూర్త భావనలు కావు. వాటికి నిర్దిష్ట చరిత్ర ఉంది. మెజారిటీ హిందువుల జీవితంలో అవి భాగం. వాటిని అమూర్త భావనగా చేసి దాన్ని ఆధారం చేసుకొని ద్వేషాన్ని పెంచుతున్నారు. ఇందులో మనుషులకు స్థానం లేదు. దీనికి రంగు, రుచి, వాసన లాంటివి ఏమీ ఉండవు. అంటే హిందూ మతం, సంస్కృతి ఎలా వుండాలో చెప్పరు. దాన్ని సంస్కరించే, పునరుద్ధరించే ప్రయత్నాలేవీ చెయ్యరు. పోనీ ముస్లిములు ఎలా వుండకూడదో కూడా స్పష్టంగా చెప్పరు. గతంలో ముస్లిములు చేసిన పాపాలకు, ఇప్పుడు వారిని ద్వేషించాలి. లేని ప్రమాదాన్నుండి హిందూ మతాన్ని రక్షించాలి.అంతే! నిజానికి హిందూ మతాన్ని వ్యాపారమయం చేసేసింది కేపిటలిస్టు సంస్కృతి. ప్రాచీన హిందూ మతం, సంస్కృతులను ఘనంగా కీర్తించడం వాటిని పున రుద్ధరించడానికి కాదు,ఆ ఘనతను కోల్పోవడం ముస్లిముల వల్లనే జరిగిందని చెప్పి వారి పట్ల ద్వేషం పెంచడానికే!

హిందూ మతం, సంస్కృతి అనే అమూర్త భావన ఆధారంగా ప్రజల్లో ద్వేషాన్ని పెంచ గలిగారంటే, ఆ ద్వేషానికి మూలాలు ప్రజల జీవితాల్లో ఉండాలి. ఉంటాయి కూడా! అవేమిటి? కేపిటలిజం అభివృద్ధి చెందే కొలదీ అది ప్రజల జీవితాల్లోకి మరింతగా చొరబడుతుంది. కేపిటలిజం యొక్క తప్పనిసరి ఫలితమైన ఎలియనేషన్ ప్రజలను ఆవహించింది. మనిషి సమాజం నుండి, కుటుంబం నుండి, చివరకు తననుండి తాను వేరుపడి పరాయివాడై పోతున్నాడు. తనెవరో తనకే తెలియని అనామకునిగా భయంకరమైన ఒంటరితనంతో బాధపడుతున్నాడు. ఏమాత్రం అర్థం కాని అంధ సామాజిక శక్తుల వరద గోదాట్లో కొట్టుకు పోతూ అందిన తాడును పట్టుకుంటున్నాడు. అది తాడు కాదు, పాము అని తెలియదు. ముస్లిముల పట్ల ద్వేషం ప్రాతిపదికగా ఏర్పడిన హిందూ బృందంలో చోటు సంపాదించి తన ఒంటరితనాన్ని పోగొట్టుకోవాలని,

అనామకత్వాన్ని వదులుకొని ఒక గుర్తింపు పొందాలని తాపత్రయ పడుతున్నాడు. ఇది విఫల యత్నమే! ఎందుకంటే పరులను ద్వేషించే ఈ ఉద్యమంలో తనవారి మేలు కోరే ఎజెండాలేదు. తనవారి పట్ల ప్రేమలేకుండా, కేవలం పరుల పట్ల ద్వేషం మాత్రమే ఉంటే అది మరింతగా ఎలియనేట్ చేస్తుంది. భాజపా పెంచి పోషిస్తున్న పెట్టుబడిదారీ సమాజంలో జీవిస్తూ ఆ పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడకుండా ఎలియనేషన్ భారాన్ని కొద్దిగా కూడా తగ్గించుకోవడం సాధ్యం కాదు.

తనవారి శ్రేయస్సు కోసం తన ప్రయోజనాలను సైతం వదులుకొనే స్వభావం ఆదిమ సమాజ సమిష్టి జీవితంలో మనిషికి అలవడి అది మనిషి స్వభావంలో భాగమయ్యింది. ఆ స్వభావం రకరకాలుగా పరిణామం చెందింది. భూస్వామ్య వ్యవస్థలో కులం, వంశం, కుటుంబాల కోసం, వాటి కట్టుబాట్లు, గౌరవాల కోసం ప్రాణాలను సైతం వదులుకునేందుకు సిద్ధమయ్యాడు. కేపిటలిజం అన్నిటినీ తలకిందులు చేస్తుంది. ఇప్పుడు తన ద్వేషాగ్నికి ఆజ్యం పోస్తున్నవారి కోసం తన ప్రయోజనాలను వదులుకుంటున్నాడు. వారి పాలన తనకు కలిగిస్తున్న కష్టాలను సహిస్తున్నాడు. పెట్రోలు రెండు వందలైనా నేను మోడీనే సమర్ధిస్తాను అని ఒక మధ్యతరగతి మనిషి అనగలిగాడు. ఈ ద్వేషం నీటిలో తేలుతున్న మంచు కొండలా అతికొద్ది భాగమే పైకి కనిపిస్తున్నది. పైకి కనిపించని భాగం చాలా ఎక్కువ.

దళితులు, ఆదివాసీల పట్ల ద్వేషం పెంచడం వల్ల బాజపాకు నష్టం కన్నా లాభం ఎక్కువ. దళితులను హిందూ మత భావనలో కలపడానికి ఛాందస హిందువులను ఒప్పించడం కష్టం. దళిత వ్యతిరేక వైఖరి తీసుకొంటే రిజర్వేషను వ్యతిరేకుల మద్దతు మరింతగా లభిస్తుంది. పెట్టుబడిదారులు అడవుల్లోని గనులు తవ్వడాన్ని ఆదివాసీలు వ్యతిరేకిస్తున్నారు. దళిత ఓట్లు తనకు వ్యతిరేకంగా పడకుండా వాటిని చీల్చే కొంతమంది దళిత నాయకులు ఎలాగూ ఉన్నారు. అలాగే ముస్లిం ఓట్లను చీల్చే ముస్లిం నాయకులూ ఉన్నారు. తన ఆత్మ గౌరవాన్నే కాక తనవారి ఆత్మగౌరవాన్ని కూడా అమ్మేసుకునే దళిత, ఆదివాసీ, ముస్లిం వ్యక్తులకు కొదవలేదు.

మోడీ అధికారంలోకి వచ్చిన దగ్గరనుండీ పనిగట్టుకొని అశాస్త్రీయమైన మూఢనమ్మకాలను ప్రచారం చేస్తున్నారు. ప్రజలను సవిమర్శనాత్మక సహేతుక ఆలోచన నుండి దూరం చెయ్యడం దీని లక్ష్యం. భుస్వామ్య వర్గం, దాని సంస్కృతులపై పోరాటంలో బుర్జువా వర్గం హేతువాదాన్ని అభివృద్ధి చేసింది. అది అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హేతువాదాన్ని మార్కెట్ తర్కంగా దిగజార్చింది. ఆ మార్కెట్ తర్కం వినిమయ సంస్కృతిగా మారి ప్రజల రక్తంలో ఇంకిపోయింది. మరింత అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానం అత్యంత అహేతుకంగా తయారయ్యింది. ఇక ఇప్పుడు సవిమర్శనాత్మక, సహేతుక దృక్పధం కేపిటలిజానికి శత్రువు. మోడీ, ఆయన బృందం చేసే మూఢ విశ్వాస ప్రచారానికి కేపిటలిజం మద్దతు ఉంది.

మన దేశంలో వ్యక్తి ఆరాధన, నియంతృత్వ ధోరణులు మోడీ అధికారంలోకి రాక ముందు చాలా కాలం నుండే ఉన్నాయి. చాల పార్టీలు వ్యక్తుల సొంత ఆస్తిగా, సొంత సంస్థగా ఉంటూ వచ్చాయి. పాలనా పద్ధతుల్లో గతానికి మౌలికంగా భిన్నమైన విధానాలను ప్రవేశ పెట్టలేదు. పాలనలో ప్రజా ప్రతినిధులు, మంత్రుల పాత్ర శూన్యమయ్యింది. బ్యూరోక్రసీ పాత్ర విపరీతంగా పెరిగింది. న్యాయ వ్యవస్థ క్రమేణా పాలనా యంత్రాంగంలో భాగమైపోతున్నది. వ్యక్తి పూజకు, వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకమని ఘనంగా ప్రచారం చేసుకున్న భాజపా, అధికారంలోకి వచ్చాక ఏక వ్యక్తి పెత్తనంగా మారిపోయింది. అసలైన అధిష్టానం అని చెప్పబడే 'సంఘం' ఇప్పటి వరకూ మోడీ ఏక వ్యక్తిపాలనను అడ్డుకొనే ప్రయత్నాలు చేసిన దాఖలాలు లేవు. ఇవన్నీ నియంతృత్వానికి దగ్గరిదారి.

మోడీ ప్రభుత్వాన్ని ఎవరు సమర్ధిస్తున్నారు? మొత్తంగా చూస్తే ఇంచుమించుగా మూడవవంతు ప్రజలు మాత్రమే మోడీకి ఓట్లు వేశారు. ఓట్లు వేసిన వారందరూ మోడీకి క్రియాశీల మద్దతు తెలుపుతున్నారని చేప్పలేము. కులాభిమానం, కులద్వేషాలు, స్థానిక సమస్యలు, ఇలా అనేక విషయాలు కారణం అవుతున్నాయి. ఎలక్షనీరింగ్ అనేది అతి ముఖ్యమైన పరిశ్రమగా అవతరించింది. భాజపా దీన్ని సమర్ధంగా వినియోగించు కుంటున్నది. ఓట్లు సంపాదించే, అంతకంటే ముఖ్యంగా ప్రత్యర్ధులకు పడే ఓట్లను చీల్చే మత, కుల, ప్రాంత నాయకులను కొనడం, లేదా బెదిరించి, ఆశపెట్టి లొంగదీసుకోవడం అనే కళలో ఆరితేరిపోయింది బాజపా. మొత్తంగా చూస్తే మైనారిటీ ఓట్లతోనే ఘన విజయాలను సాధించ గలుగుతున్నది. బాజపాకు ఓటు వేస్తున్న బడుగు వర్గాలు మత తత్వంతో, పరమత ద్వేషంతో ఓటు వేస్తున్నారని చెప్పలేము.

మొత్తం పెట్టుబడిదారీ వర్గమంతా ఏక మొత్తంగా మోడీని సమర్ధిస్తున్నదా? అని ప్రశ్నించుకుంటే స్పష్టమైన సమాధానం దొరకదు. మన దేశంలో వస్తూత్పత్తి రంగం కునారిల్లుతున్నది. ప్రజల అవసరాలు తీర్చే వస్తువుల్లో అధిక భాగం విదేశాల నుండి, ముఖ్యంగా చైనా నుండి దిగుమతి అవుతున్నాయి. అందుచేత వస్తుత్పత్తి రంగంలో ఉన్న పెట్టుబడిదారులు సహజంగానే మోడీ ప్రభుత్వ విధానాల పట్ల వ్యతిరేకతతో ఉండాలి. మోడీ ప్రభుత్వం నిస్సంకోచమైన, దాపరికం

లేని క్రోనీ కేపిటలిజాన్ని, అంటే ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్నది. అందుచేత అత్యధిక ప్రయోజనాలను కొద్దిమంది ఆశ్రితులైన పెట్టుబడి దారులు పొందుతున్నారు. అందుచేత మొత్తం పెట్టుబడిదారీ వర్గం మోడీ ప్రభుత్వాన్ని సమర్ధిస్తున్నదని చెప్పలేము.

ఇక మిగిలింది మధ్యతరగతి. మోడీ మతతత్వ, విద్వేష రాజకీయాలను వ్యతిరేకిస్తున్న వారిలో అత్యధికులు మధ్యతరగతి వారే! అయితే మొత్తం మధ్యతరగతి సంఖ్యతో పోలిస్తే వీరి సంఖ్య చాలా చాలా తక్కువ. మోడీ విధానాలను సమర్ధిస్తున్న అతి పెద్ద ప్రజా సమూహం మధ్యతరగతే అని చెప్పవచ్చు. ఈ మధ్య తరగతి గతంలో రాజకీయాల పట్ల నిరాసక్తి చూపేది. ఓటు వేసే వారి సంఖ్య చాలా తక్కువ. ఇప్పుడు రాజకీయంగా కొంత క్రియాశీలంగా మారిందని చెప్పవచ్చు. వీరిలో ఓటు వేసే వారి సంఖ్య బాగా పెరిగింది. ఇక్కడొక ఇబ్బంది ఉంది. మధ్యతరగతిని ఇతర ప్రజల నుండి కచ్చితంగా విడదీసి చూపడం కష్టం. ఆర్థికంగా కాస్త మెరుగైన జీవితం గడుపుతున్న శ్రామికులు, ఇతర వృత్తుల వారికి మధ్యతరగతి మనస్తత్వం బాగా వంటబట్టింది. ఉన్నత కులాలకు చెంది, ఆర్థికంగా అతి సామాన్యమైన జీవితం గడుపుతున్న వారు తమను తాము మధ్యతరగతిగానే పరిగణించుకుంటున్నారు. మనస్తత్వం, ప్రవర్తనల ఆధారంగా విభజిస్తే మన దేశంలో మధ్యతరగతే అతి పెద్ద ప్రజా సమూహం అవుతుందేమో! నానాటికీ మధ్యతరగతి ఓటింగు పెరుగుతున్నది. అదొక రాజకీయ శక్తిగా మారి భాజపాను బలపరుస్తున్నది.

పెట్టుబడిదారీ వ్యవస్థ జూద గృహం లాంటిది. అందులో కొంతమంది హఠాత్తుగా ధనికులో బీదలో అయిపోతుంటారు. వీరిని చూసి ఒకవైపు అంతులేని ఆశ, మరోపక్క భయం ఉక్కిరి బిక్కిరి చేస్తుంటాయి. వీరి ప్రవర్తన దురాశ, భయాలతో నిండి ఉంటూ అర్థం కాకుండా ఉంటారు. వీరి జీవితాలు దిగువ వర్గానికి దగ్గరగా ఉంటాయి. మనసులు మాత్రం ధనికులతోనే ఉంటాయి. అందుచేత పాలకవర్గాలకే అనుకూలురు. పెట్టుబడిదారీ వర్గ సంస్కృతిలో వికృతంగా మారిన మనసులు ఆ పెట్టుబడిదారీ వర్గానికే బాగా ఉపయోగ పడుతున్నాయి.

నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత ప్రజల కొనుగోలు శక్తిని పెంచి మార్కెట్‌ను బతికించడానికి పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు పెంచారు. అప్పుచేసి 'అభివృద్ధి' పేరుతో చేసిన పెట్టుబడిదారీ నమూనా వ్యయం, ఆటో మొబైల్, సాఫ్ట్ వేర్ పరిశ్రమల అభివృద్ధికి ఇచ్చిన ప్రోత్సాహంతో 20 శాతం ప్రజల ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. మరో 20-30 శాతం ప్రజల ఆదాయాలు కూడా ఎంతోకొంత పెరిగాయి. తినమరిగిన కోడి ఇల్లెక్కి కూసిందని అంటారు. ఇలా అధికాదాయం పొందే వారి ఆదాయ పెరుగుదల స్తంభిస్తే తల్లడిల్లి పోతున్నారు. ఓట్లకోసం వివిధ ప్రభుత్వాలు, పార్టీలు చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను తమకు చేస్తున్న ద్రోహంగా భావిస్తున్నారు. మన్మోహన్ ప్రభుత్వం రైతుల రుణ మాఫీ చేసినప్పుడు ఎక్కువ గోల చేసింది మధ్య తరగతే! ప్రభుత్వం పెట్టుబడి దారులకు ఇస్తున్న రాయితీలు, చేస్తున్న రుణ మాఫీలు వీరికి కనిపించవు. మొత్తం మీద వీరు సామాన్యులను శత్రువులుగా భావిస్తూ పెట్టుబడి దారులను ఆరాధనా భావంతో చూస్తున్నారు. ప్రతీ వాడికీ తానో, తన వారసులో ఏదో ఒకనాటికి పెట్టుబడి దారు, లేదా ధనిక వ్యాపారి అయిపోతామని ఆశ. ప్రజలను కొట్టి పెట్టుబడిదారులను పోషిస్తున్న ప్రభుత్వ విధానాలను విమర్శిస్తే, వ్యతిరేకిస్తే, అవి మారిపోతే రేపు తను పెట్టుబడిదారుడయ్యాక అవి అందవేమోననే భయం. మొత్తం మీద సామాన్య ప్రజలకు ఎంగిలి మెతుకులు కూడా రాల్చని మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు మధ్య తరగతికి నచ్చుతున్నాయి. అంతకంటే ముఖ్యంగా తమను దహించి వేస్తున్న విద్వేష విషాన్ని బహిరంగంగా ఎప్పటికప్పుడు, ఎక్కడపడితే అక్కడ కక్కేసే అవకాశం కల్పించినందుకు మోడీని రాముని కంటే, దేవుని కంటే ఎక్కువ ప్రేమిస్తున్నారు.

తమ పాలకవర్గ ప్రయోజనాలకోసం మోడీ బృందం అత్యంత ప్రమాదకరమైన ఆట ఆడుతున్నారు. వారు అధికారం కోల్పోయినా దీని ప్రభావం దీర్ఘకాలం కొనసాగనున్నది. దీనికి భారతీయులందరూ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ◆





# మోడీ పాలనలో మూల్యం చెల్లిస్తున్న భారత్

- **ఆకార్ పటేల్,** ప్రముఖ పత్రికా రచయిత

**ప్రముఖ కాలమిస్ట్, 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' భారత అధ్యక్షుడు ఆకార్‌పటేల్... ఫ్రంట్‌లైన్ ప్రతినిధి జియా ఉస్సలామ్ కు ఇచ్చిన ఇంటర్వ్యూ లోని కొన్ని ముఖ్యాంశాలు.**

నరేంద్ర మోడీ ఆర్.ఎస్.ఎస్ ను అంగీకారయోగ్యంగానే కాక గౌరవింపబడే సంస్థగా చేశారు. ఈ నేపథ్యంలో దేశం చెల్లించిన మూల్యం ఏమిటి?

ఏది సాధిస్తే ఆర్.ఎస్.ఎస్ గౌరవప్రదంగా భావిస్తుందో, దానిని మోడీ చేస్తున్నారు. వాటిలో మొదటిది, ముస్లింలను రాజకీయంగా ప్రాధాన్యతలేని వారిగా పక్కకు నెట్టివేయడం. ఇది పార్టీ లక్ష్యమని 1965లో దీనదయాళ్ ఉపాధ్యాయ పూణేలో చేసిన ప్రసంగంలో చెప్పాడు. రెండోది, మైనారిటీలను భారతీయేతరులుగా పరిగణింపబడుతున్నారు కాబట్టి వారిని నిరంతరం వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ వేధింపులకు ప్రభుత్వ ఆమోదం, ప్రోత్సాహం ఉంది కాబట్టి అవి కొనసాగుతాయి. ప్రపంచం కూడా భయపడిపోయే భారతదేశాన్ని అవి సృష్టించాయి. ఇక ఏ మాత్రం అభివృద్ధి చెందిన, నాగరికత గల దేశాల చెంతన చేరే ఆశలను భారత్ వదిలేసి మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుంది.

**మోడీకి పెరిగిన ప్రాధాన్యత, 'లౌకికతత్వం' అనే పదాన్ని ఒక అసాధారణ స్థాయికి తగ్గించింది. లౌకిక పార్టీలు కూడా ఆ పదాన్ని ఉపయోగించడం లేదు. నేడు భారతదేశంలో మత స్వేచ్ఛ గురించి ఇదేం చెపుతున్నది?**

నేడు భారతదేశంలో మత స్వేచ్ఛ లేదు, మైనారిటీలు అత్యంత సహనశీలతతో బతుకుతున్నారు. దేశ రాజధాని ప్రాంతంలో ముస్లిం వలస కార్మికులు, వేధింపులు లేకుండా వారికి నిర్దేశించిన నమాజ్ ప్రాంతాల్లోకి వెళ్లలేకపోతున్నారు. ఆదివారం రోజున ప్రార్థనా స్థలాల్లో దేశ వ్యాప్తంగా క్రైస్తవులపై దాడులు చేస్తున్నారు. దేశంలో ఒక మతాన్ని స్వేచ్ఛగా ప్రచారం చేయడం, దానిని అనుసరించడం ప్రాథమిక హక్కు. ఒక వ్యక్తి యొక్క మత స్వేచ్ఛను సమర్థించడం కంటే .... మత ఆచరణను కట్టడి చేస్తూ తీసుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయ వ్యవస్థ సమర్థిస్తుంది. మైనారిటీ



మతస్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు వాస్తవానికి ఉనికిలో లేకుండా పోయాయి. లౌకికతత్వం అనే పదాన్ని రాజకీయ పార్టీలు కూడా ఉచ్చరించడం లేదు. వారు ఆ పదం లోని నిజమైన అర్థాన్ని వదిలివేశారు.

**2002 గోద్రా అల్లర్లలో, గుజరాతీ భాషా మీడియా పక్షపాత వైఖరిని ప్రదర్శించింది. భారతదేశాన్ని మించిన గుజరాత్ తరహాతో, జాతీయ మీడియా కూడా అదే మార్గాన్ని అనుసరిస్తోందా?**

గత దశాబ్ద కాలంగా భారతీయ మీడియా తులనాత్మక స్థితిని కోల్పోయింది. ఎన్నికల్లో బిజెపి విజయం సాధించడం ద్వారా ఆమోదం పొందిన హిందుత్వ...భారతీయ మైనారిటీలపై... ముఖ్యంగా ముస్లింలపై దాడులకు తెరలేపింది. కుంచించుకు పోయిన ప్రచార మార్కెట్లో ఆడియో విజువల్ పబ్లిసిటీ డైరెక్టరేట్ వద్ద పెద్ద మొత్తంలో విడుదలైన నిధుల విషయంలో ప్రభుత్వ పని తీరును పరిశీలించడంలో మీడియా కొంతమేరకు అయిష్టత వ్యక్తం చేసిందని చెప్పవచ్చు.

**మీ రచనలో మతాధిపత్యం గురించి మాట్లాడారు. 2021 లోని మోడీ భారతదేశం, 1986 లోని జియా ఉల్ హక్ పాకిస్థాన్ ను గుర్తు చేస్తుందా?**

మైనారిటీలను, అణగారిన వర్గాలను లక్ష్యంగా దాడులు చేయడంలో రెంటి మధ్య కొన్ని పోలికలున్నాయి. జియా ఉల్ హక్ కు మోడీకి ఉన్నంత మతమౌఢ్యం లేదు. మోడీకి ఉన్నంత ప్రజాస్వామిక ఆమోదం జియా ఉల్ హక్ కు లేదు. అందుకనే,

అత్యాచారంపై పాకిస్థాన్ చట్టాన్ని, ఎటువంటి వ్యతిరేకత లేకుండా ముస్లిం మత చట్టం నుండి న్యాయ వ్యవస్థకు తిప్పి పంపారు. బ్యాంకింగ్ వ్యవస్థలో వడ్డీని రద్దు చేసే ఉత్తర్వులు అమలుకు నోచుకోలేదు. ఆధునిక పండితులు, న్యాయ కోవిదుల సలహా మేరకు రాళ్ళతో కొట్టడం, కాళ్ళూ చేతులూ నరికేయడం లాంటి (ఇస్లాం మత చట్టం ప్రకారం) శిక్షలు కూడా అమలుకు నోచుకోకుండా కాగితాలకే పరిమితమయ్యాయి.

మరోవైపు భారతదేశంలో, ముస్లిం వ్యతిరేక చట్టాలు మైనారిటీల వ్యక్తిగతమైన స్వేచ్ఛలో జోక్యం చేసుకుంటూ, ముస్లిం, క్రైస్తవ ప్రార్థనలను నిలువరించేందుకు, బతుకుదెరువు కోసం పోరాడుతున్న ముస్లింలను వేధింపులకు గురి చేయడం, ముస్లింలను కొట్టి చంపే చర్యలు నిత్యకృత్యమని ఆమోదించే స్థితికి సమాజాన్ని ప్రోత్సహించారు. రాజకీయాల నుండి ముస్లింలను మొత్తంగా మినహాయించేందుకు కూడా ఇక్కడ ఆమోదం లభించింది. నేడు పాకిస్థాన్ కొన్ని విషయాల్లో లౌకిక తత్వం మార్గంలో పయనిస్తుంటే, భారతదేశం మాత్రం లౌకిక తత్వం మార్గం నుండి దూరంగా జరుగుతున్నది.

**స్వతంత్ర భారతదేశంలో 2014 తరువాత జరిగిన హింసలో ఆవుకు సంబంధించిన హింస 97 శాతంగా ఉంది. దీనిపై మీ అభిప్రాయం?**

గోవధ అనేది వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో భాగం. ట్రాక్టర్ల వాడకం మొదలైన తరువాత కోడె దూడలతో ఉపయోగం లేదు. వాటిని ఉంచుకోవడం ఖర్చుతో కూడుకున్నది. ఇది వ్యవసాయం చేసే వారికి బాగా తెలుసు. గొడ్డు మాంసాన్ని కలిగి ఉండడాన్ని నేరంగా భావిస్తూ చట్టం చేసేందుకు ప్రధాని ప్రయత్నించి, 2015 తరువాత బిజెపి పాలిత రాష్ట్రాల్లో చట్టం చేసిన తర్వాత చట్ట వ్యతిరేకంగా మూక దాడులతో హత్యలు మొదలయ్యాయి.

2018 అనంతరం బిజెపి పాలిత రాష్ట్రాల్లో "లవ్ జీహాద్" చట్టం చేసిన తర్వాత మతాంతర వివాహాలు చేసుకున్న వారిపై కూడా ఇదే తరహాలో మూకదాడులు జరుగుతున్నాయి. ఇలాంటి చట్టాలను ప్రయోగించి భారతదేశంలో ప్రభుత్వాలు మైనారిటీలపై హింసాత్మక దాడులకు పాల్పడుతున్నాయి. గుజరాత్ రాష్ట్రంలో గోవధకు పాల్పడిన వ్యక్తులకు విధించే శిక్ష జీవిత ఖైదు. ముస్లింలను ప్రమాదకారులుగా చిత్రీకరించడానికి ఈ చట్టాలు ఉద్దేశించబడ్డాయి. అలా చేయడంలో వారు కృతకృత్యులయ్యారు.

**మోడీ పాలనలో భారతదేశం చెల్లిస్తున్న మూల్యం ఏమిటి?**

ఒకటి, మోడీ పాలనలో, ఆర్థిక వ్యవస్థ భారీగా పేదరికాన్ని కొనసాగించే, పెద్ద సంఖ్యలో నిరుద్యోగులను సృష్టించే మార్గంలో ఉంది. ఇప్పుడున్న విధంగా, కొద్దిమంది మాత్రమే మెజారిటీ వనరులు, సంపదను అదుపు చేస్తారు. రెండోది, నేడు హిందూత్వ అల్లరి మూకలు భారత దేశాన్నేలుతూ, భవిష్యత్తులో వారనుకున్నది జరగాలని కోరుకుంటున్నాయి. ◆

**(ప్రజాశక్తి సౌజన్యంతో...)**





# సాంస్కృతిక జాతీయవాదం నుంచి బుల్డోజర్ సంస్కృతి దాకా

- **ఎన్ . వేణుగోపాల్,** సంపాదకులు, వీక్షణం మాస పత్రిక

**భా**రతదేశానికి మోడీ 2014లో ప్రధానమంత్రి కావడమనేది ఒకానొక యాదృచ్ఛిక సందర్భమే గాని, ఈ ఎనిమిది సంవత్సరాలలో ఆయన పాలనలో జరిగిన పరిణామాలకు అంతకన్న విశాలమైన, లోతైన పర్యవసానాలున్నాయి. అసలు ఈ ఎనిమిది సంవత్సరాలలో భారత సమాజంలోని అన్ని రంగాలలో, స్థాయిలలో, శాఖలలో లెక్కపెట్టడానికి వీలులేనన్ని పరిణామాలు జరిగాయి. ఆ పరిణామాలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, పాలనా, విద్యా, న్యాయ, మత రంగాలలో అనేక మార్పులను ప్రవేశపెట్టాయి, లేదా దశాబ్దాలుగా చాపకింద నీరులా సాగుతున్న మార్పులనే బలోపేతం చేశాయి, వ్యవస్థీకృతం చేశాయి, కొన్ని రంగాలలోనైతే మళ్లీ సవరించడానికి వీలులేని విధంగా మార్చివేశాయి. ఆ పరిణామాల ఉమ్మడి ఫలితం భారత ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలలో పెను సంక్షోభంగా పర్యవసిస్తున్నది. ఇప్పటికే అనేక స్థాయిలలో మౌలికమైన భావజాల పర్యవసానాలు సంభవించాయి. దేశంలోని సకల రంగాలలో సుళ్లు తిరుగుతున్న ఆ సంక్షోభాన్నీ, ఆ భావజాల మార్పులనూ సంపూర్ణంగా వివరించడం ఒక వ్యాస పరిధిలో సాధ్యం కాదు. స్థూలమైన మార్పులను, వాటి దిశను, ఇప్పటికే బైటపడుతున్న, భవిష్యత్తులో బైటపడనున్న పర్యవసానాలను వివరించడానికి మాత్రమే పరిమితమవుతాను.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కు రాజకీయ అంగంగా అంతవరకూ ఉంటూ వచ్చిన జనసంఘ్, 1980లో భారతీయ జనతా పార్టీగా మారినప్పుడు తన సైద్ధాంతిక విధానం గాంధేయ సోషలిజం అని, తన భావజాల పునాది సాంస్కృతిక జాతీయ వాదం అని, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన భారతదేశాన్ని ఏకం చేయడానికి ఏకాత్మతా యాత్ర చేస్తానని ప్రకటించుకున్నది. నరేంద్ర మోడీ %--% అమిత్ షా ల నాయకత్వంలో ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ అధికారం నెరపుతున్న భారతీయ జనతా పార్టీకి గాంధేయ వాదంతో గాని, గాంధీతో గాని సుదూర సంబంధం కూడా లేదు. పైగా గాంధీని చంపిన గాడ్సే తమకు ఆరాధ్యుడని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రకటించే నాయకగణానికి ఈ ప్రధాని, ఈ ప్రభుత్వం మద్దతు కూడా ప్రకటిస్తున్నాయి. అలాగే సోషలిజం అనే మాట వింటేనే గంగవెర్రులెత్తే, సోషలిజానికి ఒకానొక చిన్న చిహ్నమైన ప్రభుత్వ రంగం ఉనికినే సహించని భావజాలం ఇవాళ అధికారం చలాయిస్తున్నది. సాంస్కృతిక జాతీయవాదంలోని నాగరిక, ప్రజాస్వామిక, బహుళత్వ సంస్కృతీ మిగలలేదు, సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థలకు దాసోహం అనడంలో జాతీయవాదమూ మిగలలేదు గాని భారత సమాజపు మౌలిక సారభూత అంశాలను నేలమట్టం చేసే బుల్డోజర్ సంస్కృతి కొనసాగుతున్నది. దేశపు బహుళత్వాన్ని, భిన్నత్వాన్ని ధ్వంసం చేసి గుత్తాధిపత్య ఏకత్వం వైపు ప్రయాణం సాగుతున్నది. గాంధేయ సోషలిజం నుంచి గాడ్సే ఆరాధక కార్పొరేటిజం దాకా, సాంస్కృతిక జాతీయవాదం నుంచి బుల్డోజర్ సంస్కృతి దాకా, భిన్నత్వాన్ని గౌరవించడం నుంచి భిన్నత్వాన్ని అణచివేయడం దాకా ఈ ప్రయాణంలో కీలకభాగం సారథిగా నరేంద్ర మోడీ ఉన్న ఈ ఎనిమిదేళ్లలోనే జరిగింది. నిజానికి దీన్ని ప్రయాణం అనడం కన్నా విధ్వంస యాత్ర అనడం సరైనది. మోడీ నేతృత్వంలో సొంత పార్టీ ప్రకటిత లక్ష్యాల విధ్వంసం మాత్రమే కాదు, భారత సమాజ మౌలిక విలువల విధ్వంసమే ప్రారంభమయింది, కొనసాగుతున్నది.

అన్ని మార్పులకూ కీలకమైన, అన్ని మార్పులకూ పునాదిగా నిలిచే ఆర్థిక రంగ మార్పులు 1991 నాటి నూతన ఆర్థిక విధానాల నుంచే (ఇంకా చెప్పాలంటే 1985 దిగుమతుల సడలింపు విధానం నుంచే) మొదలయినప్పటికీ, అంతకు ముందరి ఇరవై సంవత్సరాలలో జరిగిన పనుల కన్న ఎక్కువ, అంతకన్న విస్తృతంగా ఈ ఎనిమిది సంవత్సరాలలో జరిగాయి. ప్రతి ఒక్క పాలనా విధానమూ కార్పొరేట్ ప్రయోజనాల కోసమే రూపకల్పన జరిగింది, అమలయింది. అంతర్జాతీయ ద్రవ్య సంస్థల షరతులకు, ఆంక్షలకు లోబడి దేశ పాలనా విధానాల రూపకల్పన జరిగింది. సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థల వ్యాప్తికి ఇంకా ఎక్కువ అవకాశం దొరికింది. ఆ క్రమంలో విదేశీ రుణభారం కనీవినీ ఎరగని స్థాయిలో పెరిగిపోయింది. దేశపు ఖజానాలో విదేశీ మారక ద్రవ్య నిలువలు

ఎన్నడూ లేనంతగా తరిగిపోయాయి. ఆరు దశాబ్దాలుగా ప్రజాధనంతో విస్తరిస్తూ వచ్చిన ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా, నిర్విచక్షణగా, దురుద్దేశపూరితంగా దేశ విదేశ కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలు, చర్యలు విరివిగా అమలయ్యాయి. రక్షణ రంగం, బ్యాంకింగ్ రంగం, బీమా రంగం, వియానయాన రంగం, రహదారుల నిర్మాణం, రైల్వేలు వంటి అనేక రంగాలలో ప్రైవేట్, కార్పొరేట్ శక్తుల జోక్యం పెరిగింది. తద్వారా దేశీయ బడా దళారీ పెట్టుబడుదారుల సంపదలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. ముకేశ్ అంబానీ, గౌతం అదానీ అనే ఇద్దరు గుజరాతీ వ్యాపారవేత్తల ఆస్తులు, వారి మార్కెట్ ప్రాబల్యం, ప్రభుత్వాల మీద, సమాజం మీద వారి పట్టు విపరీతంగా పెరిగిపోయాయి.

చెపుతూ పోతే ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో ప్రభుత్వం ఆర్థిక రంగంలో చేపట్టిన చర్యలే ఒక గ్రంథమవుతాయి. మేకిన్ ఇండియా, పెద్దనోట్ల రద్దు, జి ఎస్ టి, ఆత్మనిర్భర భారత్, ప్రజా ఆస్తుల ద్రవ్యీకరణ, కార్మిక చట్టాల రద్దు, వ్యవసాయ చట్టాలు వంటి అనేక విధానాలు ప్రకటిత లక్ష్యాలేవైనప్పటికీ అంతిమంగా బహుళ జాతి సంస్థలకు, వారి దేశీయ దళారీలకు విస్తారమైన లాభాలు సంపాదించి పెట్టడానికి తప్ప నిజంగా ప్రజలకు వీసమెత్తు సహాయం కూడ చేయలేదు.

ఈ ఆర్థిక విధానాల దుష్ఫలితాలు ద్రవ్యోల్బణంలో, ధరల పెరుగుదలలో, చిన్న, మధ్యతరహా వ్యాపార, పారిశ్రామిక సంస్థల మూసివేతలో, భారీ ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణకో, మూసివేతకో గురి కావడంలో, నిరుద్యోగంలో వ్యక్తమయ్యాయి. ఒక్క మాటలో చెప్పాలంటే దేశ ఆర్థిక వ్యవస్థ తిరోగమన మార్గంలో వేగంగా దిగజారడం మొదలయింది. మూలిగే నక్క మీద తాడిపండు అన్నట్టుగా ఆ తిరోగమనాన్ని మరింత తీవ్రంగా, భయానకంగా మార్చినది కరోనా వైరస్ వ్యాప్తి. దాని పట్ల ప్రభుత్వం తీసుకున్న హడావుడి లాక్ డౌన్ వంటి చర్యలు, వైద్య, ఆరోగ్య వ్యవస్థల వైఫల్యం, మార్కెట్ కుంచించుకు పోవడం వల్ల లక్షలాది చిన్న, మధ్యతరహా పారిశ్రామిక, వ్యాపార, సేవా సంస్థలు మూతబడి లక్షలాది మంది కొత్తగా నిరుద్యోగంలో, చిరుద్యోగాలలో ప్రవేశించారు. కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపిన ప్రభుత్వం దాన్ని నెరవేర్చకపోగా, తన విధానాలతో కొత్త నిరుద్యోగాన్ని కల్పించింది.

ఈ ఆర్థిక సంక్షోభం అనివార్యంగా రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల మీద ప్రభావం చూపుతున్నది. మొట్టమొదట, అంతకు ముందే అస్తవ్యస్తంగా ఉన్న భారత రాజకీయ రంగస్థలం, ముఖ్యంగా పాలనా రంగం, ఈ ఎనిమిది సంవత్సరాలలో దారుణమైన విపరిణామాలకు గురైంది. రాజకీయ రంగంలో విలువలకు, సూత్రాలకు, తామే ప్రకటించే ఆదర్శాలకు ఎంత మాత్రం నిలబడకపోవడమే సాధారణ స్థితిగా కొనసాగుతున్నది. రాజకీయ, పాలనా వ్యవస్థలలో ప్రతి ఒక్కదాన్నీ ధ్వంసం చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకీ, హోమ్ మంత్రి అమిత్ షా కూ దక్కుతుంది. వారిద్దరూ కలిసి ప్రభుత్వ శాఖలనూ, విభాగాలనూ, వ్యవస్థలనూ ప్రతిపక్ష నాయకుల మీద, భిన్నాభిప్రాయాలున్నవాళ్ల మీద, ప్రభుత్వ విధానాలను విమర్శించేవారి మీద అణచివేత సాధనంగా వాడుకుంటున్నారు. అటువంటి అధికార యంత్రాంగ దుర్వినియోగం అంతకు ముందరి ఆరు దశాబ్దాలలో ఎంతో కొంత జరిగింది గాని, ఈ ఎనిమిది సంవత్సరాలలో అధికారపక్షం ఆ పనినే ప్రధానంగా పెద్ద ఎత్తున విచ్చలవిడిగా కొనసాగిస్తున్నది. ఆర్థిక, హోం మంత్రిత్వ శాఖలు, అసలు ప్రభుత్వం మొత్తంగా రాజ్యాంగ బద్ధంగా, అమలులో ఉన్న పని పద్ధతుల ఆధారంగా పని చేయాలి. కాని మోడీ పాలనలో రాజకీయ నాయకుల ఇష్టానుసారం, ప్రత్యర్థుల మీద కక్ష సాధింపుకోసం మాత్రమే పని చేస్తున్నాయి.

ప్రభుత్వ ఉన్నతాధికారులు, నిర్ణయాధికారం ఉన్న అధికారులు ఎవరైనా చట్టబద్ధ పాలన అనే అవగాహనతో రాజ్యాంగాన్ని, చట్టాన్ని అమలు చేయడానికి మాత్రమే పని చేయాలి. ప్రభుత్వాధికారుల ప్రవర్తనా నియమావళి నిర్దేశించేది అదే. కాని ఈ ఎనిమిదేళ్లలో అన్ని ప్రభుత్వ విభాగాలు సంఘ్ పరివార్ ఆదేశాల కింద పనిచేసే సంస్థలుగా, సంఘ్ పరివార్ లోని సభ్య సంస్థలుగా మారిపోయాయి. ఎలక్షన్ కమిషన్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ వంటి స్వతంత్ర ప్రతిపత్తి ఉండే సంస్థలు కూడా ఆర్ ఎస్ ఎస్ నాయకుల నిలయాలయ్యాయి. కింది స్థాయి న్యాయస్థానాల నుంచి సుప్రీం కోర్టు దాకా తమ రాజ్యాంగబద్ధ కర్తవ్యమైన న్యాయసమీక్షను పక్కనపెట్టి సంఘ్ పరివారం ఏది చెపితే అది తీర్పులుగా ప్రకటించడం మొదలయింది. అంతకు ముందు ఆరు దశాబ్దాలుగా, ఆ మాటకొస్తే వలస పాలన కాలం నాటి నుంచీ అమలులో ఉన్న ప్రభుత్వ శాఖల అలవాటైన, స్థిరీకరించిన పనివిధానాన్ని పక్కన పెట్టి, అధికారపక్ష రాజకీయ నాయకులకు, వారిని ఆదేశించే నాగపూర్ అధిష్ఠానానికి అడుగులకు మడుగులొత్తే పనిలో ఉన్నాయి. ప్రత్యర్థుల మీద, చివరికి భావజాలంలో తమ సహప్రయాణికులే అయినా మహారాష్ట్రలో మరొకరితో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారనే అక్కసుతో శివసేన నాయకుల మీద కూడా ఇన్ కమ్ టాక్స్ దాడులు, ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ దాడులు, తామే డ్రగ్స్ పెట్టి దాడులు

చేసి కేసులు పెట్టడం, ఎన్ఐఎ దాడులు సర్వసాధారణమైపోయాయి. ప్రధాన స్రవంతి పత్రికా రంగాన్ని బెదిరించి తమ గుప్పిట్లో పెట్టుకుని, ఇంకా ఎక్కడైనా ఒకటీ అరా జర్నలిస్టులు వాస్తవాలు రాస్తారేమోనని వారిని బెదిరించడానికి జర్నలిస్టుల మీద విచ్చలవిడిగా యుఎపిఎ కేసులు పెట్టడం మామూలైపోయింది.

ఈ వ్యవస్థల ధ్వంసం ఇప్పటికిప్పుడు సంఘ్ పరివార్ తక్షణ ప్రయోజనాలను తీర్చవచ్చు, నరేంద్ర మోడీ అనే ప్రచారార్భాటపు అహంకారికి సంతృప్తి కలిగించవచ్చు గాని, దీర్ఘకాలికంగా వ్యవస్థా నిర్వహణే సంక్షోభ మయంగా మారిపోతుంది. భవిష్యత్తు అంధకార బంధురమైపోతుంది. స్థిరీకరించిన పద్ధతులను తిరస్కరిస్తే మిగిలేది అరాచకపు ఇష్టారాజ్యమే. ఆ అరాచకత్వం అంతర్యుద్ధానికి రాచమార్గం.

దేశాన్ని ఇలా సంక్షోభం దిశగా, అంతర్యుద్ధం దిశగా తీసుకుపోతున్న అధికార పక్ష దుర్మార్గం ఒక పక్కన ఉండగా, పార్లమెంటరీ ప్రతిపక్షాలన్నీ కూడ అవకాశవాదంతో, దివాళాకోరుతనంతో సాగుతున్నాయి. ముంచుకొస్తున్న ప్రమాదం ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా పెడచెవిన పెడుతూ తమలో తాము అంతర్గత కుమ్ములాటల్లో, స్వార్థ రాజకీయాల్లో, ఎవరితో ఎన్నికల పొత్తు ఎక్కువ లాభిస్తుందనే దురాశల లెక్కల్లో మునిగిపోయి ఉన్నాయి. సంఘ్ పరివార్ దుర్మార్గ పాలనలో అణచివేతకు గురవుతున్న వేరువేరు సమూహాల ప్రయోజనాల కోసమే ఏర్పడ్డామని చెప్పుకుంటున్న పార్టీలు కూడా ఈ అక్రమాలను ఆపే రాజకీయ చర్యల గురించి ఆలోచించడం లేదు. ప్రాంతీయ పార్టీలుగా తమను తాము చెప్పుకుంటున్నవి కూడా మోడీ పాలనలో ధ్వంసమైపోతున్న సమాఖ్య స్వభావాన్ని గురించి ఆలోచించడం లేదు. సంఘ్ పరివార్ దాడికి గురవుతున్న అన్ని వర్గాలనూ, సమూహాలనూ ఉమ్మడి కనీస కార్యక్రమం కింద ఏకం చేసి, ఒక విశాలమైన పోరాటం సాగించాలనే దృష్టి ఏ ఒక్క ప్రతిపక్ష పార్టీలో కూడా కనబడడం లేదు. ఇదంతా కొనసాగుతున్న రాజకీయ సంక్షోభానికి ఒక ముఖం.

అధికార, ప్రతిపక్ష రాజకీయ వర్గాలు సమాజాన్ని ఇట్లా తిరోగమన మార్గంలో నడుపుతున్నప్పుడు ఎంతో కొంత ఆశ పౌరసమాజం మీద ఉంటుంది. పౌరసమాజమైనా ప్రజలను చైతన్యవంతులను చేసి, సమీకరించి, సంఘటిత పరిచి, పరిమిత స్థాయిలోనైనా ప్రతిఘటనను ప్రదర్శిస్తారని ఆశ ఉంటుంది. కాని పౌరసమాజం ఎంతమాత్రం పని చేయకుండా చేయడానికి సంఘ్ పరివార్ శక్తులు అనేక రకాలుగా ప్రయత్నిస్తున్నాయి. ఒకవైపు క్రూరమైన నిర్బంధ చట్టాలను ప్రయోగిస్తున్నాయి. బెదిరిస్తున్నాయి, బుజ్జగిస్తున్నాయి, కుల, మత విభజనలను వాడుకుంటున్నాయి. స్వచ్ఛంద సంస్థల నిధుల మీద ఆంక్షలు విధిస్తున్నాయి. సామాజిక కార్యకర్తలను, న్యాయవాదులను, జర్నలిస్టులను, రచయితలను క్రూరమైన యుఎపిఎ కింద జైళ్లలో నిర్బంధించి ఏళ్ల తరబడి సామాజిక జీవితంలోకి రాకుండా అడ్డుకుంటున్నాయి. తద్వారా మొత్తం సమాజంలోనే భయ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే మోషా పాలన భారత సామాజిక వాతావరణాన్నే కలుషితం చేస్తున్నది. అశేష ప్రజానీకంలో అసంతృప్తి రగుల్కొంటున్నప్పటికీ, ఆ అసంతృప్తిని వ్యక్తీకరించే, సమీకరించే, సంఘటితం చేసే అన్ని మార్గాలనూ అడ్డుకుంటున్నారు.

ఈ అసంతృప్తిని మూసిపెట్టే ధోరణి సహజంగానే సామాజిక, సాంస్కృతిక సంక్షోభానికి దారి తీస్తున్నది. అసలు మోడీ పాలన సామాజిక, సాంస్కృతిక రంగాలలో తీసుకువస్తున్న మార్పులు సంక్షోభాన్ని సృష్టిస్తుండగా, అసంతృప్తిని అణచిపెట్టే చర్యలు ఆ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. మోషా పాలన ప్రవేశపెట్టిన, ప్రవేశపెడుతున్న, విస్తరిస్తున్న సామాజిక, సాంస్కృతిక మార్పులలో ప్రధానమైనది సమాజంలో విభిన్న సమూహాల మధ్య విద్వేషం పెంచడం. పచ్చి అబద్ధాలతో ఒక వర్గానికి వ్యతిరేకంగా మరో వర్గాన్ని ఎక్కుపెడుతున్నది. ఒక వర్గం తననే ఏకైక రక్షకుడని భావించి, తన వోట్ బ్యాంకుగా మారి, తాను చేసిన అన్ని పనులనూ సమర్థించే మూఢభక్తులుగా తయారుచేసుకోవడానికి ప్రయత్నిస్తున్నది. రెండో వర్గాన్ని నిత్యం భయభీతావహంలో, అభద్రతలో ఉంచి ఆ భయం ఆధారంగా రాజ్యం ఏలదలచుకుంటున్నది. యూదుల మీద హిట్లర్ అమలు చేసిన విధానం అక్షరాలా అదే. భారతదేశంలో కూడా హిట్లర్ విధానాలను అమలు చేయాలనీ, హిట్లర్ యూదుల పట్ల ప్రవర్తించినట్టే ముస్లింలను అదుపులో పెట్టాలని గోల్వాల్కర్ ఎప్పుడో ఎనిమిది దశాబ్దాల కింద రాసిన మాట ఇప్పుడు పూర్తిగా అమలులోకి వస్తున్నది. సమాజమంతా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్గాలకు, ద్విజులకు సేవ చేయడానికే ఉన్నదని మనుస్మృతి చేసిన నిర్దేశం సంఘ్ పరివార్ కు శిరోధార్యం. అది కూడా అమలులోకి తేవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందువల్లనే సంఘ్ పరివార్ సామాజిక సాంస్కృతిక విధానానికి ప్రధాన లక్ష్యంగా ఉన్నది ముస్లింలు, ఆదివాసులు, దళితులు.

ముస్లింల పట్ల ద్వేషం రెచ్చగొట్టడమే, వారి పట్ల సంతుష్టీకరణ విధానం అమలవుతున్నదనే అబద్ధాన్ని పదేపదే ఊదరగొట్టి అమాయకులను నమ్మించడమే వారి కార్యక్రమం. ముస్లింల పట్ల ద్వేషం వ్యాపింపజేయడమే తమ జీవనాధారంగా బతుకుతున్న సంఘ్ పరివార్ ఇప్పుడు కేంద్రంలో దొరికిన అధికారం

సహాయంతో ముస్లింల ఆహారం మీద, ఆహార్యం మీద, ప్రార్థనల మీద, చిరు వ్యాపారాల మీద, మొత్తంగా సామాజిక జీవితం మీద దాడి ప్రారంభించింది. ముస్లింలు ఏ హక్కులూ లేకుండా రెండో తరగతి పౌరులుగా బతకాలని గోల్వాల్కర్ ఎప్పుడో రాసిన అంశాన్ని ఇప్పుడు ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తున్నది. గోమాంసం తిన్నాడనే తప్పుడు ఆరోపణతో అఖ్లాక్ హత్య, ఈద్ రోజు ముస్లిం సాంప్రదాయక దుస్తులు ధరించాడని జునేద్ హత్య, అనేక రాష్ట్రాలలో మతాంతరీకరణ వ్యతిరేక చట్టాలు, కర్ణాటకలో హిజాబ్ వివాదం, ముస్లింల దగ్గర వస్తువులు కొనవద్దనీ, వారికి అమ్మవద్దనీ ప్రతిజ్ఞలు, ఆలయాల ముందర పూలు అమ్ముకుంటున్న ముస్లిం చిరు వ్యాపారుల తొలగింపు, మసీదుల మీద దాడులు, ప్రార్థనల మీద ఆంక్షలు వంటి అసంఖ్యాక ఘటనలు ఈ ఎనిమిది సంవత్సరాలలో జరిగిపోయాయి.

ఈ దాడులు, వేధింపులు, హింసాకాండ కేవలం ముస్లింలతో ఆగిపోవు, ఆగిపోలేదు. మనువాద భావజాలంలో సహజమైన అంశం దళితుల పట్ల, శూద్రుల పట్ల వ్యతిరేకత. తాము దేవతగా, మాతగా పూజించే గోవు మాంసం తింటారనేది ఒక సాకు. ఆ సాకుతో ఉత్తరాది అంతటా ఈ ఎనిమిదేళ్లలో దళితుల మీద దాడులు పెచ్చరిల్లాయి. మోషా పాలనలో మతోన్మాద, ఆధిపత్య కుల హింస ప్రబలిపోయిందనడానికి డజన్లకొద్దీ ఉదాహరణలున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మోషా పాలనలో సామాజిక, సాంస్కృతిక రంగాలలో మున్నెన్నడూ లేనంత సంక్షోభం, విద్వేషం, అవిశ్వాసం ఇవాళ రాజ్యం చేస్తున్నాయి. ఈ ధోరణులు ఇట్లాగే కొనసాగితే సమాజం అంతర్యుద్ధం దిశగా, మితిమీరిన హింసాకాండ దిశగా పయనిస్తుందనే అనుమానం వ్యక్తమవుతున్నది.

బహుళత్వానికి, వైవిధ్యానికి, భిన్న సమూహాలకు, భిన్న సంస్కృతులకు, భిన్న భాషలకు చిహ్నమైన దేశాన్ని ఒకే దేశం ఒకే ప్రజ, ఒకే జాతి, ఒకే మతం, ఒకే భాష, ఒకే ఆహారం, ఒకే ఆట, అనే గుత్తాధిపత్యం కిందికి తేవడమే సంఘ్ పరివార్ రాజకీయార్థిక వ్యూహం. ఆ వ్యూహాన్ని నూటికి నూరుపాళ్లు కొనసాగించడమే నరేంద్ర మోడీ లక్ష్యం. తత్ఫలితంగా భారత సమాజం సంక్షోభానికి గురైనా, అంతర్యుద్ధానికి గురైనా సంఘ్ పరివార్ కు లెక్కలేదు. హిందుత్వ సిద్ధాంతం లోనే స్నేహానికీ, ప్రేమకూ, సామరస్యానికీ, సంఘ జీవనానికీ చోటు లేదు. అది అసమానత మీద, అస్పృశ్యత మీద, వివక్ష మీద, హింస మీద ఆధారపడిన సిద్ధాంతం. మనిషి ప్రాణమంటే, మానవ గౌరవమంటే దానికి లెక్కలేదు. అది అమానుష భావజాలం.

ఈ అమానుష శక్తులను పెద్ద ఎత్తున ప్రతిఘటించడమే, ఎంత వేగంగా వీలయితే అంత వేగంగా ఓడించడమే ఇవాళ దేశ ప్రజల ముందున్న కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని ప్రజలకు తెలియజెప్పే, ప్రజలను సమీకరించి, సంఘటితం చేసే బాధ్యతను బుద్ధిజీవులు, ప్రగతిశీల ఆలోచనాపరులు తీసుకోవాలి. భారత సమాజం మీదికి దూసుకొస్తున్న ఈ బుల్డోజర్ ను తక్షణమే ఆపవలసి ఉంది. అదేదో మహా బలవత్తర శక్తి అనీ, దాన్ని ఆపలేమనీ నిరాశ పడవలసిన అవసరం కూడా లేదు. ఆ హిందుత్వ మోషా బుల్డోజర్ ను ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాది పాటు ఐక్యంగా, సంఘటితంగా పోరాడిన రైతులు ఆపివేశారు. జహంగీర్ పురి నిరుపేద ముస్లిం గుడిసెల మీదికి దూసుకొస్తున్న బుల్డోజర్ ను సుప్రీం కోర్టు ఆదేశాల సహాయంతో ఒక వామపక్ష రాజకీయనేత ఆపగలిగారు. కనుక ఈ బుల్డోజర్ ను ఆపడం, తిప్పికొట్టడం ఇవాళ చరిత్ర, సమాజం మన నుంచి కోరుతున్న అనివార్య కర్తవ్యమనీ, అది అత్యవసరమైనదనీ, అది సంపూర్ణంగా సాధించగలిగినదేననీ విస్తృతంగా ప్రచారం చేయడానికే బుద్ధిజీవులు తమ శక్తి సామర్థ్యాలన్నిటినీ వెచ్చించాలి. ◆





# మోడీ పాలనం : కార్పొరేట్, కాషాయ కషాయం

- **తెలకపల్లి రవి,** ప్రధాన సంపాదకులు, సాహిత్య ప్రస్థానం మాస పత్రిక

**మొ**దట గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలై ప్రధాని పీఠం చేరిన నరేంద్రమోడీ పాలనాధికారం ఇప్పటికి ఇరవయ్యేళ్లు అయిందని బిజెపి వేడుకలు చేస్తుంటే మీడియా కూడా ముందస్తు కథనాలు ప్రచురిస్తున్నది. మోడీ20ఇయర్స్ పుస్తకం దేశానికి భగవద్గీత వంటిదని సాక్షాత్తూ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రకటించారు. 2022 అక్టోబర్ ఏడు నాటికి 13 ఏళ్లు గుజరాత్ ముఖ్యమంత్రిగానూ, ఏడేళ్లు ప్రధానిగానూ పనిచేసిన ఆయన ఈ రెండు పదవుల్లో కలసి ఈ విధంగా ఇంత సుదీర్ఘకాలం మరెవరూ వుండలేదని కూడా కథనాలు వస్తున్నాయి. మోడీ ఏది చేసినా అందులో మిస్టరీ, ట్విస్టరీ వుంటుందని అంటుంటారు. ఇందులో కూడా అలాటి చమత్కారమే వుంది. ముఖ్యమంత్రిగా మాత్రమే చూస్తే జ్యోతిబాసు, నవీన్ పట్నాయక్ వంటివారు ఆయనకంటే చాలా ఎక్కువ కాలం వున్నారు. ప్రధానిగా తీసుకుంటే జవహర్‌లాల్ నెహ్రూ(6175 రోజులు), ఇందిరాగాంధీ (5829 రోజులు), మన్మోహన్‌సింగ్(ఇప్పటికి) పదవీ కాలం ఎక్కువ. అయితే రెంటినీ కలిపితే మాత్రం మోడీనే ఎక్కువ. అందులోనూ ముఖ్యమంత్రులుగా వుండి ప్రధానులైన వారు చాలామంది వున్నారు. నేరుగా అక్కడ రాజీనామా చేసి ఇక్కడకు వచ్చిన వారూ వున్నారు. కాని వారి పదవీ కాలం చాలా తక్కువ. ఒక్క పివి నరసింహరావును మినహాయిస్తే వారెవరూ మూడో ఏట ప్రవేశించింది లేదు. ఆ విధంగా ఇది అరుదైన రికార్డు అనడంలో సందేహం లేదు. ఈ మొత్తం కాలంలో మోడీ పాలనా రికార్డు, రాజకీయ రికార్డు కూడా మరెవరికీ లేనంత ఏకపక్షంగానూ, ఊకపక్షంగానూ, వివాదాస్పదం గానూ వుండటం మరో వాస్తవం. పిపి (ప్రచారక్ ప్రధాని) గా మొదలైన ఆయన పిపిపి (పరివార్ ప్రైవేటు పార్టనర్ షిప్) అర్థమే మార్చివేసి దేశానికి కాషాయ కార్పొరేట్ కూటమి పాలన పరాకాష్ట ఎలా వుంటుందో చూపిస్తున్నారు. మోడీని బిసి నాయకుడిగా చూపడమంటే బిగ్‌కార్పొరేట్ అనే అర్థంలో తీసుకోవలసి వుంటుంది. ఇరవయ్యేళ్ల అధికార వేడుక జరిపే వేళ వెనక్కు తిరిగిచూస్తే మరెవరికీ జరగని రీతిలో మోడీనే దేశాధినేత కావడం ఎలా జరిగిందో అర్థమవుతుంది.

## గుజరాత్ కథ ఏమిటి?

గుజరాత్‌లోని ఒక ప్రాంతంలో ఆరెస్సెస్ ప్రచారక్‌గా వున్న మోడీ ఎమర్జన్సీ తర్వాత సంఘ్ చరిత్ర, పరిశోధన రచన విభాగంలో ప్రవేశించారు. ఎమర్జన్సీలో తమ పాత్ర రాసే బాధ్యత అప్పగించారు. (అందుకే మోడీ పదే పదే ఆ ఘట్టం గురించి చెబుతుంటారు.) తర్వాత తనను నెమ్మదిగా బిజెపి రాజకీయ బాధ్యతలు చూసేందుకు పంపించారు. ఆ క్రమంలో మొదట గుజరాత్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పట్టు పెంచుకున్నారు. ఎల్‌కె అద్వానీ రథయాత్ర గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి ప్రారంభమై అయోధ్య చేరేవరకూ బాధ్యతలు చూసింది మోడీనే. తర్వాత అధ్యక్షుడైన మురళీమనోహర్ జోషి కాశ్మీర్‌కు జరిపిన ఏకతాయాత్రలోనూ పని చేశారు. అద్వానీ హయాంలోనే జాతీయ కార్యదర్శులలో ఒకరుగా నియమితులైనారు. వాజ్‌పేయి ప్రధానిగా వుండగా ముఖ్యమంత్రి కేశూభాయ్ పటేల్, ఎంపి శంకర్ సింగ్ వఘేలా మధ్య వివాదంలో చిక్కిన గుజరాత్‌లో సయోధ్య కోసం మోడీని పంపించారు. వఘేలా కాంగ్రెస్‌లో చేరాక కేశూభాయ్ అనారోగ్యం, అసమర్థత కారణాలుగా చూపి మోడీకి పగ్గాలు అప్పగించారు. బిజెపిని వరుసగా ఎన్నుకున్న ఏకైక రాష్ట్రమైన గుజరాత్‌ను నిలబెట్టుకోవాలన్న తాపత్రయంతోనే అధిష్టానం ఆయనను ఎంపిక చేసింది. పాలనారంగంలో ఏ బాధ్యతలు అనుభవం లేకుండానే మోడీ ఎకాఎకిన ముఖ్యమంత్రి అయ్యారు.

## మారణహోమం.. మెచ్చిన పరివారం

2001 ఫిబ్రవరి 21న గోద్రాలో రైలు పెట్టె దహనంతో దావాలనంలా మతచిచ్చు రగిలింది. తర్వాత కొద్ది రోజులకు జరిగిన మతమారణకాండలో కనీసం రెండువేలమంది ముస్లిములు ప్రధానంగా ప్రాణాలు కోల్పోయారు. దేశవిభజన, సిక్కులపై వూచకోత తర్వాత ఎన్నడూ ఎరగని రీతిలో ఈ జాతి హత్యాకాండ జరుగుతుంటే ముఖ్యమంత్రి మోడీ ఉపేక్ష వహించారని, వాస్తవానికి ప్రేరేపించారని కూడా అనేక కథనాలు వచ్చాయి. ప్రపంచ వ్యాపితంగా నిరసన వ్యక్తమైంది. ఈ విమర్శల ధాటికి అప్పటి ప్రధాని వాజ్‌పేయి మోడీని ఆ పదవి నుంచి తప్పించాలని గోవాలో జరిగిన తమ జాతీయ

కార్యవర్గంలో ప్రతిపాదించారు. అయితే అప్పటికే సంఘ పరివార్ వ్యవస్థలోనే గాక రాజకీయ ఆర్థిక వర్గాలలో మోడీ ఎంతగా పాతుకుపోయారంటే వాజ్‌పేయి వెనక్కు తగ్గాల్సివచ్చింది. అద్వానీ శిబిరం పూర్తిగా మోడీనిమోసింది (ఆ అద్వానీ పరిస్థితి తర్వాత ఏమైందనేది అందరికీ తెలుసు). ఇరవయ్యేళ్లు పూర్తి చేసుకోవడంలో విస్మరించరాని ఘట్టాలివి. ఆ జాతి హత్యాకాండ సృష్టించిన కల్లోలం మధ్యనే అందరూ వ్యతిరేకిస్తున్నా పెడచెవిని పెట్టి మోడీ ముందస్తుగా 2002లో ఎన్నికలు జరిపి మరోసారి విజయం సాధించారు. ఇదే సంఘ పరివార్ దృష్టిలో మోడీ సమర్థత అయింది. మీడియాలో ప్రశ్నలు ఎదుర్కోలేని మోడీ టీవీ చర్చల నుంచి లేచిపోతుంటే గుజరాత్ ప్రభుత్వం ఆయన విజయాలను టముకు వేస్తూ వచ్చింది. 2004లో దేశం వెలిగిపోతోంది ప్రచారంతో హడావుడి చేసినా వాజ్‌పేయి ప్రభుత్వం ఓడిపోయి యుపిఎ1 అధికారం చేపట్టింది. ఆ సమయంలో మోడీ వారికి మరింత కీలకంగా మారారు. వారిని మెప్పించే విధంగా మతతత్వ రాజకీయం సాగిస్తూనే మోడీ 2007లో గెలిచిన తర్వాత కార్పొరేట్లను మెప్పించడంపై దృష్టి పెట్టారు. మామూలుగానే భారతదేశంలో పారిశ్రామిక రాజధానులుగా పేరొందిన మహారాష్ట్ర, గుజరాత్‌లలో వారికి ప్రత్యేక ఆసక్తి. మోడీ కార్పొరేట్లకు పూర్తిగా తాళాలు అప్పగించడంతో వారూ ఆయనను ఆకాశానికెత్తడం మొదలుపెట్టారు. ఇది చాలాక ఎన్ఆర్ఐ సదస్సులతో విదేశీ కంపెనీల ఆశీస్సులూ పొందగలిగారు. వైబ్రంట్ గుజరాత్ సదస్సులు అట్టహాసంగా తయారైనాయి. 2012 ఎన్నికలలో మోడీ అత్తెసరు మెజార్టితోనే గెలిచినా హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా బిజెపికి జాతీయప్రతీక అయ్యారు. ఈకాలంలో నిజంగా గుజరాత్ మానవాభివృద్ధి సూచికలన్నిటా వెనకబడి వున్నా ఏదో సాధించారనే హడావుడి దాన్ని మరుగుపర్చింది.

### జాతీయ యవనికపైకి అంబానీల ఆశీస్సులతో

2009లోనూ రెండవసారి ఓడిపోయాక, అద్వానీకి దేశాన్ని ఆకట్టుకునేంత ఆకర్షణ లేదని తేలడంతో మూడుసార్లు ముఖ్యమంత్రి గుజరాత్ వైభవ ప్రదాత మోడీని ప్రధానిఅభ్యర్థిగా ముందుకు తెస్తే కార్పొరేట్ మద్దతు వుంటుందని పరివార్ భావించింది. 2013 వైబ్రంట్ గుజరాత్ సదస్సులో అంబానీ సోదరులు అందుకు ఆధ్వర్యం వహించారు. మోడీ దార్శనికతను ముఖేశ్ అంబానీ ప్రస్తుతించారు. ఆయన తమ్ముడు అనిల్ అంబానీ మరో అడుగు ముందుకేసి మోడీని గాంధీతో పోల్చారు. అప్పటికే కామన్వెల్త్, 2జి తదితర కుంభకోణాలతో రోసిపోయిన యుపిఎ కాంగ్రెస్ పాలనకు ప్రత్యామ్నాయంగా ప్రజలను ఆకర్షించేందుకుమోడీని ముందుపెట్టుకోవాలన్న కార్పొరేట్ ఇండియా (ఇండియా ఇంక్ అంటుంటారు) ఉద్దేశానికి వారి మాటలు అద్దం పట్టాయి. ఆరెస్సెస్ బిజెపిలకు కూడా అంతకన్నా కావలసింది లేదు గనక ప్రధానిగా మోడీ ప్రచార ప్రక్రియ మొదలైంది. తన ప్రతి కదలిక ప్రతి ప్రవచనమూ ప్రచారాస్త్రాలైనాయి. ప్రశాంత్ కిశోర్ మార్కెటింగ్‌లో చాయ్‌వాలా సంఘ్‌వాలా కార్పొరేట్‌వాలా త్రిమూర్తిగా మోడీనే త్రీడీలో కనిపించాడు. మోడీతోపాటే ఎన్నికల తతంగం భారీ కార్పొరేట్ రంగు పులుముకుంది. మోడీగుజరాత్ ముఖ్యమంత్రి పదవి వదలిపెట్టి దేశసారథ్యం చేపట్టారు. పార్లమెంటు మట్టిని ముద్దాడటంతో మొదలుపెట్టారు

### కపట నాటకాలు.. కఠోర సత్యాలు

తొలిదశలో స్వచ్ఛ భారత్, మేకిన్ఇండియా వంటి నినాదాలతో జాతిని ఉత్తేజపర్చేనేతగా చూపించబడిన చాయ్‌వాలా గాయ్‌వాలా అయ్యారు. స్వచ్ఛభారత్ కక్ష భారత్‌గా మారింది. అసహన దాడులు నిత్యకృత్యమైనాయి. అధ్యక్షతరహాను మించేలా ఏకపక్ష పాలనకు పిఎంవో కేంద్రమైంది. న్యాయవ్యవస్థ ఎన్నికల వ్యవస్థ శాస్త్రసాంకేతిక సంస్థలు ఇవేవీ స్వతంత్రత నిలుపుకోలేని దురవస్థ. విశ్వవిద్యాలయాలపై విజ్ఞాన కేంద్రాలపై పత్యక్ష దాడి. ఒకేదేశం ఒకే రేషన్, ఒకేపన్ను, ఒకే ఎన్నిక, ఒకే నాయకుడు ఒకే మతం అన్నట్టు భిన్నత్వంలో ఏకత్వం తలకిందులైంది. ఇదంతా మోడీ వ్యక్తిగత ప్రచారం చాటునే. ఆరెస్సెస్ చెప్పే హిందూరాష్ట్ర ఏకీకృత నిరంకుశత్వ స్వభావానికి ఇది అచ్చంగా సరిపోయింది. సమాఖ్య విధానం కాస్త టీం ఇండియా అంటూ మోడీని కెప్టెన్‌ను చేసింది. పేద భారత ప్రతినిధినంటూనే అమెరికా అప్పటి అధ్యక్షుడు ఒబామా కూడా వ్యాఖ్యానించేంత జిలుగు వెలుగు దుస్తులు ధరించి బూట్‌సూట్‌వాలా అనిపించుకున్నారు. మారణహోమాలపై స్పందించలేదు గాని మయూరాలతో గడిపే మహర్షి చిత్రాలు విడుదల చేశారు. కేదారనాథ్ గుహలో తపోభంగిమలో దర్శనమిచ్చారు మాడిసన్ స్క్వేర్‌లోనూ వెలిగిపోయారు. ఇవన్నీ వ్యక్తిగత పోకడలుగానేగాక భిన్నతరగతులను ఆకర్షించే వ్యూహాలుగా చూడవలసి వుంటుంది. ఇన్ని విన్యాసాల మధ్యనా రెండు విషయాలు నిరంతరాయంగా సాగిస్తూ వస్తున్నారు. ఇరవయ్యవ వార్షికోత్సవంలో సేవ సమర్పణ అంటే ఆరెస్సెస్ సేవ, కార్పొరేట్‌కు సమర్పణ మాత్రమే! కరోనా తాకిడితో తల్లడిల్లిపోయిన వేళ కూడా మోడీ సర్కారు కార్మికులపట్ల ఉపేక్ష, కార్పొరేట్లకు చేయూత, తబ్లీగీ జమాయిత్ వంటి ప్రచారాలు సాగించిందని మర్చిపోరాదు. ఇదే సమయంలో దేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పూర్తిగా తాకట్టుపెట్టి

అమెరికా కూటమికి తోకగా మార్చారు. రాజకీయ అవసరాలకు గాను కుహనా దేశభక్తిని, సరిహద్దులలో కృత్రిమ ప్రజ్వలనలను సాకుగా ముందుకుతెచ్చారు. మరోవంక అన్నీ ఆయన వచ్చాకే జరిగాయనే అతిశయోక్తులు అసత్య ప్రచారాల కోసం అన్నిసాధనాలనూ వాడుకున్నారు. తన విజయానికి మీడియా సోషల్ మీడియాలే సోపానం చేసుకున్న మోడీ గెలిచిన తర్వాత ఒక్కసారి కూడా పూర్తిస్థాయిలో మీడియాతో మాట్లాడనేలేదు. ఇవన్నీ కపటత్వానికి మచ్చుతునకలు.

## డెమోక్రసీ.. ఎత్నోక్రసీ

స్వాతంత్ర అమృతోత్సవ వేళ వాషింగ్టన్‌లోని కాటో సంస్థ నివేదిక ప్రకారం ఈ దేశంలో స్వేచ్ఛాసూచిక 2013కన్నా చాలా దిగజారింది. 2013లో 75వ స్థానంలో వుంటే 2018 నాటికి అది 111కు చేరింది. మానవాభివృద్ధి (యుఎన్‌డిపి) నివేదికలో 129 నుంచి 131కి పడిపోయాము. ఆకలిసూచికలో 94వ స్థానంలో వున్నాము. పత్రికా స్వాతంత్రంలో రెండు స్థానాలు తగ్గి 142గా వున్నాము. కేంద్రమే నిర్వహించిన కుటుంబ ఆరోగ్య సర్వే1 ప్రకారం భారతీయుల పౌష్టికాహారం ఘోరంగా దిగజారింది. తాజా వెనకబాట్లు సంక్షోభాలు చెప్పకపోయినా దేశం అప్పు కోటికోట్ల రూపాయలు దాటింది. ఎయిర్ ఇండియా టాటాలకు కట్టబెడితే వారిది వారికే చేరినట్టు చిత్రిస్తున్న ఈ వ్యవస్థకు కావలసింది అదే. దేశంలో ప్రజాస్వామ్యం (డెమోక్రసీ) కాస్త ఎత్నోక్రసీ (జాతిమతస్వామ్యం) గా మారిపోయిందని విమర్శకులు ఆక్షేపిస్తున్న పరిస్థితి. హిందువులు ఎక్కువగా వున్నారు గనక ఆ మత భావాలు అమలు కావడం న్యాయమన్న వాదనలు ఇప్పుడు చదువుకున్నవారు కూడా చేస్తున్నారంటే ప్రజాస్వామ్య రాజ్యాంగ విలువలు ఎలా తలకిందులైనదీ తెలుస్తుంది. రాజ్యాంగంలో 14వ అధికరణం చట్టం ముందు సమానత్వం గురించి చెబుతుంది. మతం జాతి కులం లింగబేధం, పుట్టిన చోటు వంటి కారణాల వల్ల ఎవరినీ ఎలాటి వివక్షకు గురి చేయరాదని 15వ అధికరణం చెబుతుంది. ఉద్యోగావకాశాలలో గాని పదవులకు ఎన్నికలో గాని ఈ కారణాల వల్ల ఎలాటి తేడాలు చూపరాదని16వ అధికరణం సారాంశం. 19వ అధికరణం వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్రాలకు పూర్తి సమాన హక్కు నిస్తుంది. 25వ అధికరణం మత స్వాతంత్రం ఇస్తుంది. 29వ అధికరణం విద్యాసంస్కృతీ ప్రచారాల కోసం సంస్థలను స్థాపించుకునే హక్కునిస్తుంది. భారత దేశంలో భిన్న మతాలు జాతులు విశ్వాసాలు వున్నాయి గనకే రాజ్యాంగ నిర్మాతలు ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అంతేగాని కొన్ని దేశాలలో వలె దీన్ని మతైక రాజ్యంగా ప్రకటించలేదు. బిజెపి కూడా హిందూత్వ అనే సావర్కార్ సిద్ధాంతాన్ని తనదిగా ప్రకటించుకోవడానికి చాలాకాలం తటపటాయించింది. పైగా హిందూత్వ మౌలికంగా రాజకీయ సిద్ధాంతమే గాని హిందూమతం కాదు. మోడీ రెండు సార్లు విజయం సాధించేసరికి ఈ తేడా మరుగున పడిపోయి రెండూ ఒకటేనన్నట్టు మాట్లాడ్డం జరుగుతున్నది.

## సావర్కార్ హిందూత్వ - బిజెపి రాజకీయత్వ!

ప్రాచీన హిందూ మత గ్రంథాల్లో గాని ఆధ్యాత్మిక చర్చల్లోగాని హిందూత్వ అనే మాటే లేదు. ఒక బ్రిటిష్ అధికారి మొదటిసారి వాడినా ఎవరూ పట్టించుకోలేదు. గాడ్సే గురువైన వినాయక దామోదర సావర్కార్ మొదటిసారి 1923లో హిందూత్వ: ఎవరు నిజమైన హిందువు అనే పుస్తకంలో దీన్నివాడారు. అది కూడా తన జీవితం మలిదశలో మతతత్వం తలకెక్కించుకున్న తర్వాత. ఈ హిందూ హిందూత్వలను కలగాపులగం చేయరాదని ఆయనే హెచ్చరించారు. అంతకుముందు వివేకానందుడు, యోగి అరవిందుడు ఎవరూ ఆ పదాన్ని వాడలేదు. వైవిధ్యానికి భిన్న ఆచారాలకు నిలయం గనకే హిందూ విశ్వాసం ఇస్లాంను, క్రైస్తవాన్ని ఎదుర్కొలేకపోతున్నదని సావర్కార్ భావించారు, అందుకే హిందూత్వ అనే ఈ పదాన్ని ప్రవేశపెట్టారు. భిన్నత్వంలో ఏకత్వంగా పేరొందిన హిందూమతాన్ని ఏకరూపిగా చూపడం, తీవ్రతరహా ఇస్లాంలాగా మలచడం ఆయన ఉద్దేశం. 1909లో సావర్కార్ సిపాయిల పితూరి అన్న బ్రిటిష్ కథనానికి భిన్నంగా ప్రథమ భారత స్వాతంత్ర సంగ్రామం చరిత్ర రాసినప్పుడు కూడా హిందూత్వ అనే పదం వాడలేదు. ఆలస్యంగానే దాన్ని వినియోగంలోకి తెచ్చారు. తన హిందూ విశ్వాసం సావర్కాం వంటివారు చెప్పేది ఒకటి కాదని గాంధీజీ స్వయంగా ప్రకటించారు. జనసంఘం/ బిజెపి కూడా చాలా కాలం పాటు హిందూత్వ భావనను తీసుకోలేదు. జనసంఘం కాలంతో పోలిస్తే బిజెపి ఆవిర్భావం భిన్నమైనదని చెప్పిన వాజ్‌పేయి అయిదేళ్లలోనే రెండూ ఒకటేనన్నారు. మరో అయిదేళ్లకు సోమనాథ్ దేవాలయం నుంచి రథయాత్ర ప్రారంభించిన అద్వానీ రామమందిర సమస్య కన్నా ముఖ్యమైంది కుహనా లౌకిక వాదంపై హిందూత్వ పోరాటమన్నారు. అయినా సరే 1991 ఎన్నికల ప్రణాళికలో కూడా బిజెపి హిందూత్వ పదం వాడలేదు. 1996, 1998 ప్రణాళికల నాటికి ఆ మాట వచ్చి చేరింది..ఆఖరుకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జెఎస్ వర్మ హిందూత్వ ఒక జీవన విధానమే గాని మతం కాదని సూత్రీకరించారు. మతాన్ని మించిన మతతత్వం అని మోడీ హయాంలో గుజరాత్ నిరూపించినా మీడియా దానికి

ఆమోదయోగ్యత కల్పించింది. దాంతోపాటే సావర్కార్‌నూ పైకి తెచ్చారు. భగత్‌సింగ్ త్యాగం కన్నా సావర్కార్ తక్కువ కాదని వాజ్‌పేయి అన్నారు. 2002 మేలో గుజరాత్‌లో పోర్ట్ బ్లెయిర్ రేవుకు సావర్కార్ పేరు పెట్టిన సమయంలో హోంమంత్రిగా వున్న అద్వానీ హిందుత్వ అన్నది చాలా దుష్ప్రచారానికి గురైందని వాకృచ్చారు. రాహుల్‌గాంధీ చెబుతున్న గాడ్సే సావర్కార్ శిష్యుడు గనక బిజెపి వాజ్‌పేయి హయాంలో గురువును పైకి తెచ్చి మోడీ కాలానికి గాడ్సేనే బాహాటంగా సమర్థిస్తున్నది. గాంధీ స్థానాన్ని ఈ గురుశిష్యులకు ఇచ్చాక హిందుత్వ పవిత్రపదమై పోయింది. హిందూమతానికి బదులు ఆ మాటే వాడుకలోకి వచ్చేసింది. హిందుత్వ గురించి విమర్శనాత్మకంగా మాట్లాడితే దేశద్రోహమన్న స్థాయికి చేరాయి. బొమ్మ బొరుసులా మతతత్వం, మార్కెట్ తత్వం జంట సవాళ్లుగా దాపురించాయి. కార్పొరేట్ అనుకూల విధానాలను అంతర్జాతీయంగా అమెరికా అనుకూలతకు కూడా బిజెపి పరాకాష్ట గనక ఆ శక్తుల ప్రోత్సాహం వారికి లభించింది. స్వరరాగగంగా ప్రవాహమే అని జేసుదాసు పాడితే పరవశించిపోయిన ఈ దేశంలో శవగంగా ప్రవాహం చూశావా రాజా అని ప్రశ్నించే విషాదాన్ని చూశాం. కరోనా మలిదెబ్బకు కుటుంబాలకు కుటుంబాలే బలైపోతుంటే ప్రాణవాయువును అందించలేని ఘోర దురవస్థ పరికించాం. కరోనాతో మరణించిన వారి సంఖ్య 45 లక్షల పైమాటేనని ఇప్పుడు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. అదేస్థాయిలో దెబ్బతిన్న దేశం. ఆర్థికదురవస్థ నిరుద్యోగం రాష్ట్రాల అప్పులపాలు కథలువింటూనే వున్నాం. విశాఖ ఉక్కు నుంచి విశ్వవిఖ్యాతమైన ఎల్ఐసి వరకూ తెగనమ్మడం చూస్తున్నాం.

## అవకాశవాదం హానికరం

ఇందిరాగాంధీ రాజీవ్‌గాంధీలు వివిధ మతాలను వాడుకోవడానికి చేసిన ప్రయత్నం బిజెపి ఆరెస్సెస్‌లు ఇంతగా విస్తరించడానికి ఒక ప్రధాన కారణమని మర్చిపోరాదు. కాశ్మీర్‌లో ప్రభుత్వ కూల్చివేతలు, పంజాబ్‌లో సిక్కు ఉగ్రవాదానికి, అస్సాంలో వేర్పాటు వాదానికి ప్రోత్సాహం, షాబానూ బిల్లు, వివాదాస్పద అయోధ్యమందిరం తాళాలు తీయడం చెబుతూపోతే ఈ జాబితాకు అంతేలేదు. స్వతహాగా హిందుత్వ చాందస పార్టీఅయిన బిజెపి కాంగ్రెస్ మార్కు అవకాశవాద వ్యూహాన్ని ఆయుధంగా మార్చుకుని అధికారంలో తిష్టవేసింది. సైద్ధాంతికంగా ఎప్పుడైనా బిజెపి మతతత్వానికి విరుగుడు ప్రత్యామ్నాయం లౌకిక తత్వం మాత్రమే. కాంగ్రెస్‌ది అవకాశవాదం కాగా చాలా ప్రాంతీయ పార్టీలకు ఆ సమస్యే పట్టదు. లౌకిక పార్టీలైన టిడిపి, టిఆర్ఎస్, వైసీపీ వంటివి కూడా హిందుత్వ అనే పదాన్ని విచక్షణా రహితంగా ఉపయోగించడం మొదలెట్టాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ యజ్ఞయాగాలు యాదాద్రి నిర్మాణాలు చూస్తూనేవున్నాం. ఎపి ముఖ్యమంత్రి జగన్ కూడా తనపై పడిన క్రైస్తవ ముద్ర దృష్ట్యా మత విశ్వాసాలు మరింత బాహాటంగా ప్రదర్శించడానికి తాపత్రయపడుతున్నారు. ఇప్పుడు నివాసంలో గోరక్షణ శాల కూడా పెట్టుకున్నారట. ఈ నేపథ్యంలో వామపక్షాలు మాత్రమే సమగ్రమైన లౌకిక ప్రజాస్వామ్య సిద్ధాంతం అందిస్తాయి. అందుకే కమ్యూనిస్టులు తన సైద్ధాంతిక శత్రువులని బిజెపి నిరంతరం ప్రకటిస్తూనే వుంటుంది. కాంగ్రెస్ నుంచి అంత నిబద్ధత ఆశించలేము గాని మరీ హిందువులు రాజ్యమేలాలనే స్థాయికి రాహుల్‌గాంధీ చేరడం మాత్రం కొత్త పరిణామం. ఇటీవల కాంగ్రెస్ చింతన్ శిబిరంలో కూడా హిందుత్వాన్ని సూటిగా ఎదుర్కొవాలా లేక మెతకగా అదే మార్గాన్ని అనుసరించాలా అని మీమాంస జరిగింది. ఒక్కసారి వివిధ రంగాలను విషంలా ఆవరించిన విద్వేష రాజకీయాలను ఒక్కసారి పరిశీలించినా ఇలాటి సంధిగ్ధానికి అవకాశమే లేదని అర్థమవుతుంది.

## తాజ్‌నుంచి నర్మదదాకా విద్వేష విభజన

దేశ ప్రతిష్టకు చరిత్రకు కళాత్మక సంకేతంగా నిలిచిన తాజ్‌ను సందర్శించకపోతే విదేశీనేతలు తమ పర్యటన సంపూర్ణం కాదని భావిస్తారు. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు అని ప్రశ్నించి కొత్త కోణాన్ని ఆవిష్కరించిన మహాకవి శ్రీశ్రీ అన్నదాంట్లో కూడా అది ఈ దేశప్రజల సంపద అనే భావం. వందల ఏళ్ల చరిత్రలో అనేక మార్పులు మలుపులూ వుంటాయి గాని మానవాళి సృజించిన మహత్తర సాంస్కృతిక వారసత్వం అలా కొనసాగుతుంటుంది. దానికి కుల మతాలు వంశాలు వారసత్వాలు వంటి వివాదాలేమీ వుండవు. కాని ఇప్పుడు అలాటి తాజ్‌మహల్‌పై తగాదాలు పెంచాలని దేశాన్ని పాలించే బిజెపి నేతలు, వారివెనకవున్న సైద్ధాంతిక గురువు సంఘపరివార్ కంకణం కట్టుకున్నాయి. ఇందుకు ఏకంగా న్యాయస్థానాలనే ఆశ్రయించాయి. అయోధ్యలో బిజెపి మీడియా యువజన విభాగం బాధ్యుడుగా వున్న రజనీశ్ సింగ్ అలహాబాద్ హైకోర్టులో దీనిపై పిటిషన్ వేశారు. తాజ్‌లో 22 గదులకు తాళాలు వేసి వుంటాయని వాటిని తెరిచి ఏముందో ప్రజలకు వెల్లడించాలని ఆ పిటిషన్‌లో కోరారు. మీ పిటిషన్‌కు అసలు అధారమేమిటి? ఆ గదుల తాళాలు ఎందుకు వేశారో తెలియకుండా తీయమని ఎందుకు ఆదేశించాలి? అని హైకోర్టు న్యాయమూర్తులు ఉపాధ్యాయ, విద్యార్థి తీవ్రంగా

ప్రశ్నించారు. ప్రసిద్ధ పర్యాటక స్థలమైన తాజ్ చరిత్రతో చాలా రహస్యాలు ముడివడివున్నాయని వాటిని తెలుసుకునే హక్కు తనకున్నదని ఆయన వాదించారు. దీనిపై న్యాయమూర్తులు మరింత మండిపడ్డారు. రేపు మీరొచ్చి దేశాధినేతల గదుల తాళాలు తెరిపించాలంటారు. మా న్యాయమూర్తుల కార్యాలయాల తాళాలే తీయించాలంటారు. ఒప్పుకుని ఉత్తర్వులు ఇవ్వాలా? అని ఎదురు ప్రశ్నవేశారు. చరిత్రపై మీకంత ఆసక్తి వుంటే పిహెచ్‌డి చేసి తెలుసుకోండి. కోర్టు సమయం వృథాచేయకండి అని వెనక్కు గొట్టారు.

ఈకథ ఇక్కడితో అయిపోతే ఒక తీరు. హైకోర్టు ఈ పిటిషన్‌ను తోసివేసిందో లేదో బిజెపి ఎంపి దివ్య తాజ్‌మహల్ కట్టిన స్థలం మాదేనని ఒక వాదన లేవదీశారు. రాజస్థాన్ రాజవంశానికి చెందిన దివ్య తమ తాతముత్తాతల కాలం నాటి స్థలాన్ని మొగలాయిలు తీసుకున్నారనడానికి పత్రాలున్నాయంటూనే ఆధారాలు తర్వాత చూపిస్తానని దాటేశారు. వందల ఏళ్లలో ఎవరి స్థలాలు ఎవరు తీసుకున్నారనేదాన్ని బట్టి ఇప్పుడు పంచాయితీ పెట్టుకుంటారా అంటే వివాదాన్ని ఆరిపోకుండా చూసే ప్రయత్నమన్నమాట. గతంలోనూ పలుసార్లు బిజెపి ఆరెస్సెస్ పరివార్‌కు చెందిన వారు తాజ్‌మహల్‌ను లక్ష్యంగా చేసుకుని వివాదాలు లేవదీయడం జరుగుతూనే వుంది. అయితే ఇప్పుడు పరిస్థితి మరింత తీవ్రంగా వుందనేది వాస్తవం. దేశవ్యాపితంగా ఎక్కడికక్కడ ఏదో ఒక వివాదం రగిలించి విద్వేషం పెంచడం సర్వసాధారణమైపోయింది. నిజానికి అది మోడీ రెండవసారి ప్రధాని అయ్యాక మరింత తీవ్రరూపం తీసుకుంది. ఇప్పుడు ముస్లింలకు ఇళ్లు ఇవ్వకపోవడమే గాక బుల్డోజర్లతో కూల్చేస్తున్నారు.

## జ్ఞానవ్యాపి మసీదులోసర్వే

ఈ సమయంలోనే వారణాసిలోని జ్ఞానవ్యాపి మసీదులో సర్వే జరపాల్సిందిగా స్థానిక న్యాయస్థానం ఒక కమిషనర్‌ను నియమించింది. విశ్వేశ్వరాలయం పక్కనే వున్న ఈ జ్ఞానవ్యాపి మసీదుపై మొదటి నుంచి ఆరెస్సెస్ విహెచ్‌పి వంటి సంస్థలు వివాదం పెడుతూనేవున్నాయి. అయోధ్య కాశీ మధుర వారి వివాద త్రయం. యుపి ఎన్నికలకు కొంచెం ముందే మోడీ విశ్వేశ్వరాలయ క్యారిడర్ విస్తరణ కోసం పనులు ప్రారంభించడం గుర్తుండే వుంటుంది. ఈ నిర్మాణంలో ఆలయాలు కూడా అనేకం తొలగించబడతాయనే ఆందోళనలున్నాయి. కాని తద్వారా హిందూత్వ ఎజెండాను అమలు చేయాలనే వ్యూహం మోడీ, ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌లది. ఆ సమస్య అలా వుండగానే అయిదుగురు మహిళలపేరిట జ్ఞానవ్యాపి మసీదు పశ్చిమ గోడ అనుకుని తాము అమ్మవారి ప్రార్థనలు చేసుకోవడానికి అనుమతించాలని వారణాసి కోర్టులో పిటిషన్ వేశారు. చరిత్రలో వివాదాలుగా వున్నవాటిని పరిష్కరించడానికి ఎంత తతంగం అవసరమో, అయోధ్యపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకూడా ఎన్ని భిన్నాభిప్రాయాలకు దారితీసిందో చూశాం. కాని ఈ విషయంలో కోర్టు వెనువెంటనే స్పందించి ఏముందో సర్వేచేయించమని అసయ్ కుమార్ మిశ్రా అనే లాయర్‌తో కమిటీని వేసింది. ఈయన గతంలో తమకు వ్యతిరేకంగా పనిచేశారని, ఆయన స్థానంలో మరెవరినైనా పంపాలని మసీదు తరపున కమిటీ అభ్యంతరం చెప్పింది. దానికి ఒప్పుకోకపోగా మసీదులోపల పరిశీలన వీడియో తీయడానికి అనుమతించారు. ఈ కేసుతక్షణం తీసుకోవడానికి ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ అంగీకరించలేదు. మీరు హైకోర్టులో తేల్చుకోవాలన్నారు. అసలు అక్కడ ఏం జరిగిందో వాస్తవాలేమిటో తెలియకుండా నిలిపివేతకు ఎలా ఆదేశాలిస్తానని ఎదురు ప్రశ్న వేశారు. ఎట్టకేలకు ఈ కేసును వినడానికి మాత్రం అంగీకరించి జస్టిస్ డివై చంద్రచూడ్‌కు అప్పగించారు. ఈలోగా కింద జరిగేది జరిగిపోతుంటుందన్నమాట. మధుర కృష్ణ మందిరం వివాదం కూడా నాలుగు మాసాల్లో తేల్చేయాలని ఆదేశాలొచ్చాయి.

## ఆలయాలలో మతాతీత కళారాధన

కొద్దివారాల కిందట నుంచి కర్ణాటకలో సాగుతున్న మత రాజకీయ వివాదాలను తప్పక చెప్పుకోవాలి. కర్ణాటకలో హిజాబ్, హలాల్, ఆజాన్ వివాదగ్రస్తం కావడం దేశమంతటా చర్చనీయమైంది. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్‌విభండారి ధర్మాసనం కూడా దేశ ప్రజల వేషభాషలపై విద్వేషాలు రెచ్చగొట్టవద్దని హెచ్చరించారు. శ్రీరంగనాథదేవాలయంలో నాట్యకళాకారుడైన జకీర్ హుస్సేన్ ప్రవేశంపై రంగనాథన్ నరసింహన్ అనే మతవాది వివాదం లేవదీయడంపై న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి హుస్సేన్ గతంలో ఆ ఆలయ వేడుకలలో నాట్యం చేసిన కళాకారుడే! కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ సోమనాథ దేవాలయాన్ని సందర్శించినపుడు ఎపి ముఖ్యమంత్రి జగన్ తిరుపతి వెళ్లినపుడు కూడా మతపరంగా సంతకాలు చేశారా లేదా అనేది ఒక వివాదంగా తేవడం ఇక్కడ గుర్తు చేయాలి. ఇదే సమయంలో కర్ణాటక మంత్రి జెసి మధుస్వామి శాసనసభలో మాట్లాడుతూ హిందూ దేవాలయాల్లో అన్యమతస్తులు వ్యాపారాలు చేసుకోవడానికి

అనుమతించరాదని వ్యాఖ్యానించారు. 2021లో తమ ప్రభుత్వం చేసిన హిందూ ధార్మిక సంస్థల చట్టం12వ నిబంధనను ఇందుకు సాకుగా చూపారు. హిజాబ్ వివాదం వచ్చినపుడు ముస్లిం వ్యాపారుల సంఘం బంద్ పాటించింది గనక వారికి హిందూ ఆలయాల దగ్గర వ్యాపారాలు చేసుకునే అవకాశం వుండరాదని వాదించారు. కన్నడిగులు ఎక్కువగావచ్చే శ్రీశైలంలోనూ ఇదేతరహా తగాదా పెట్టడం గుర్తుండే వుంటుంది. దేశ వ్యాపితంగా ఎన్నో దేవాలయాల్లో ముస్లిం వాద్యకారులు పాల్గొంటారు పూలు, పూజాదికాలు సమకూరుస్తారు. ఇందుకు మతం అడ్డంకానేకాదు. భారత రత్న ఉస్తాద్ బిస్మిల్లా గంగాతీరంలో ఖాన్ షెహనాయి వాద్యం లేనిదే విశ్వేశ్వరుడు గాని ఇతర ఆలయాలు గాని మేలుకొనవని చెప్పుకునేవారు. గంగానదిపై రూపొందించిన డాక్యుమెంటరీలోనూ ఆయన గంగాజమున తెహజీబ్ అంటూ మతసామరస్య సందేశమే ఇస్తారు. షేక్ చినమౌలానా నాదస్వరం దక్షిణ భారత దేశంలో చాలా ఆలయాల్లో వీనులవిందు చేసేది. ఆయనకు పద్మశ్రీ అవార్డు కూడా ఇచ్చారు. గంగానదీ సంగీత పుత్రుడైన బిస్మిల్లా ఖాన్ ఉదంతం నుంచి మనం ప్రస్తుతం నర్మదానది దగ్గరకు వద్దాం. నర్మదా తీరంలో హిందూయేతరులు రాకను అక్కడి ఘాట్‌లలో వారు స్నానంచేయడాన్ని నిషేదించాలని మధ్యప్రదేశ్ విశ్వహిందూపరిషత్ నాయకుడుఅంటున్నారు. గతంలోనూ నర్మదా నది కాలుష్యంపై సాధుసంతులు ఆందోళన చేశారు. అప్పటి బిజెపి ప్రభుత్వంలో స్కాం జరిగిందని ఆరోపించారు. నర్మదా మహరాజ్, హరిహరానంద మహరాజ్, కంప్యూటర్ బాబావంటి అయిదుగురు సాధువులకు 2018లో ప్రభుత్వం సహాయమంత్రి హోదా ఇచ్చి పరిశీలన కమిటీగా నియమించింది. ఇప్పుడు మళ్లీఎన్నికలు వస్తాయి గనక నర్మద తగాదా అవసరమైందన్నమాట. నదీనదాలు ప్రకృతి స్థలాలుకూడా మతాలవారిచూసే ఈ ధోరణి మీడియాసోషల్ మీడియాల ద్వారా కాశ్మీర్‌ఫైల్స్‌వంటి చిత్రాలద్వారా దీన్నిబుర్రల్లోకి జొప్పిస్తుండడం వాస్తవం.

## గుళ్ల నుంచి పెళ్లిళ్లవరకూ...

ప్యార్ కియాతో డర్నా క్యా అని ప్రశ్నించిన ఈ దేశంలో లవ్‌జిహాద్ అనే కాన్సెప్ట్ తీసుకొచ్చి మతాంతర వివాహాలను నిషేదించే చట్టాలను చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ మధ్య అస్రీన్ అనే అమ్మాయిని పెళ్లాడిన నాగరాజును ఆమె తరపువాళ్లు దారుణంగా చంపితే మిగిలిన 79 దురహంకార హత్యల నుంచి విడదీసి మతకోణమే ముందుకు తెచ్చారు. ఆఖరుకు బిజెపి గవర్నర్ కూడా నివేదిక అడుగుతున్నారు! మనుషుల వివాహాల మాట అటుంచి సాక్షాత్తూ తిరుపతి వెంకన్న ఢిల్లీ సుల్తాన్ కుమార్తె బీబీ నాంచారిని చేపట్టినట్టు నమ్మకాలున్నాయి. ఆమె ఆలయం దేవుని కడపలో వుంది. తిరుమలలో వారి కుటుంబానికి ఒక పరంపరగా అవకాశమిస్తారు. కులీకుతుబ్‌షా కుమారుడైన బాగమతిని పెళ్లి చేసుకుని ఆమె పేరుతో భాగ్యనగరం కట్టించాడనే కథకు భిన్నంగా చార్మినార్‌లోనే భాగ్యలక్ష్మి ఆలయం స్థాపించి ఆ విధంగా ఆ పేరొచ్చిందంటున్నారు. ఇది గతంలోనుంచి చేస్తున్నారు గాని ప్రస్తుత బిజెపి అధ్యక్షుడు బండిసంజయ్ ప్రతి పని ఆ ఆలయం నుంచే మొదలెడుతున్నారు. ఎపిలోనైతే ఇస్లాం క్రైస్తవ కోణంలో విద్వేషాలు రగిలిస్తున్నారు. తిరణాలల నుంచి ఉరుసుల వరకూ మతాతీతంగా పాల్గొనే ఈ దేశంలో రామనవమి, హనుమాన్ జయంతి వంటి పండుగలను హింసాత్మకంగా మార్చేశారు. అది కూడా త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ఇటీవల ఈ పండుగల సందర్భంగానే డజన్లమంది చనిపోయారు. ఇలాటి ఉదాహరణలు ఉద్రిక్తతల గురించి ఎంతైనా చెప్పొచ్చు. అప్పుడు అయోధ్య నుంచి ఇప్పుడు జ్ఞానవ్యాపి మసీదు సమస్య వరకూ సుప్రీం కోర్టు ఈ విలువల పరిరక్షణకోసం గట్టిగా ముందుకు రాకుండా సాగదీయడం, సర్దుబాటు మాత్రమే జరుగుతున్నది. కాంగ్రెస్ అనేక ప్రాంతీయపార్టీల సన్నాయినొక్కులు, పోటాపోటీ పూజలు ఇందుకు సరిపోవు. ఒవైసీ సోదరులు ఇటీవల మహరాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఔరంగజేబ్ సమాధి దగ్గర ప్రార్థన చేస్తే శివసేన బిజెపిలతో సహా అందరూ ధ్వజమెత్తారు. ఆరెస్సెస్ నియమించిన ఒక కమిషన్ ఇటీవలనే గుజరాత్ పిలనిలో జరిగిన సమావేశంలో మతతత్వం పెరిగిపోతున్నదని విభజన ధోరణలు ఆందోళన కలిగిస్తున్నాయని విమర్శించింది. ఈ పూర్వరంగంలో కేవలం ఈ దేశ సంస్కృతి భిన్నత్వంలో ఏకత్వం రాగాలాపన మాత్రమే సరిపోదని మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ తాజాగా వ్యాసం రాశారు. చాపకింద నీరులా సమాజంలో ప్రతిరంగానికి పాకిన ఈ రాజకీయ మత విభజనను తీవ్రంగా ఎదుర్కొకపోతే ఈ దేశం మనుగడకూ లౌకిక ప్రజాస్వామిక జీవనానికి ముప్పు తప్పదు. 2024 మోడీ వన్స్‌మోర్ అంటున్నప్పుడు ఆ నినాదం వెనక వున్న ఈ వివాదాస్పద ఆందోళనకర అంశాలను విస్మరించడం కన్నా పెద్ద పొరబాటుండదు. ఈ కార్పొరేట్ కాషాయ కషాయాన్ని ఎదుర్కొవాలంటే రాజ్యాంగ ప్రజాస్వామిక లౌకిక విలువలను కాపాడుకోవడం తప్ప మరో మార్గం లేదు. ◆



# ఈ దేశాన్ని ప్రజలే కాపాడుకోవాలి

**- కొండుభట్ల రామచంద్రమూర్తి**, సీనియర్ జర్నలిస్టు

కేంద్ర ప్రభుత్వ పునఃపరిశీలన పూర్తయ్యేవరకూ రాజద్రోహం చట్టానికి విరామం (పాజ్) ఇవ్వాలని సుప్రీంకోర్టు నిర్ణయించడం పట్ల దేశ వ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులంతా హర్షం ప్రకటిస్తున్న సంతోష సందర్భంలో ఈ వ్యాసం రాస్తున్నాను. మొదట్లో రాజద్రోహం చట్టం ఉండవలసిందేనని పట్టుబట్టిన కేంద్ర ప్రభుత్వం మే10న ఈ చట్టాన్ని పునఃపరిశీలిస్తున్నట్టు సుప్రీంకోర్టుకు చెప్పింది. స్వాతంత్ర్య అమృతోత్సవం సందర్భంగా అమానుషమైన చట్టాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నదేమోనన్న ఆశాభావం వ్యక్తమైంది. అయితే, పునఃపరిశీలన పూర్తయ్యే వరకూ రాజద్రోహం చట్టాన్ని వినియోగించడం నిలిపివేయాలనీ, ఈ చట్టం కింద కొత్తగా ఎఫ్ఐఆర్ లు దాఖలు చేయరాదనీ, ఇప్పుడు జైళ్ళలో ఉన్నవారు బెయిల్ కోసం కోర్టులను ఆశ్రయించవచ్చుననీ సుప్రీంకోర్టు మే11న చరిత్రాత్మకమైన నిర్ణయం ప్రకటించింది. ఈ చట్టాన్ని దురుపయోగం చేస్తున్న మాట వాస్తవమేననీ, ఇందుకు తాజా ఉదాహరణ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాకరే నివాసం ఎదుట హనుమాన్ చాలీసా వల్లిస్తానంటూ ప్రకటించిన నాయకులపైన రాష్ట్ర ప్రభుత్వం రాజద్రోహం చట్టం కింద కేసు పెట్టడమేననీ రాజ్యాంగ ప్రవీణులు అంటున్నారు. ప్రభుత్వాన్నీ, ప్రధానినీ, ముఖ్యమంత్రులనీ విమర్శించడం కూడా దేశద్రోహం కింద జమకట్టి కేసులు పెడుతున్నారు, జైళ్ళలో పెడుతున్నారు, విచారణ లేకుండా సంవత్సరాల తరబడి జైళ్ళలోనే ఉంచుతున్నారు. ఈ లెక్కన ఆత్యయిక పరిస్థితిని 1975లో ఇందిరాగాంధీ ప్రకటించడానికి ముందు రోజుల్లో లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ప్రకటనలూ, జార్జి ఫెర్నాండెస్ చర్యలూ ఏ కోవలోకి వస్తాయి? పోలీసులను ప్రభుత్వంపై తిరగబడమనీ, ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేయమని ఉద్యోగులకూ, ప్రభుత్వాధికారులకూ బహిరంగ సభలో ఉపదేశించిన జేపీని ప్రధాని నరేంద్ర మోదీ అయినా, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) అయినా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అయినా, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అయినా ఏమి చేసి ఉండేవారు ఊహించుకోవచ్చు. జేపీ నివాసాన్ని కూల్చివేయడానికి బుల్డోజర్ పంపేవారు కాదా? రైల్వే ఉద్యోగుల చేత సమ్మె చేయించి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టిన సోషలిస్టు ఫైర్ బ్రాండ్ జార్జి ఫెర్నాండెజ్ ను మాత్రం ఉపేక్షించేవారా? ఇప్పటి నాయకులతో పోల్చుకుంటే ఇందిరాగాంధీ సహనం మూర్తీభవించిన పాలకురాలు అని చెప్పుకోవాలి.

''ప్రస్తుత పరిస్థితులలో రాజద్రోహం చట్టాన్ని ఉపయోగించవలసిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. పునఃపరిశీలన పూర్తయ్యే వరకూ ఈ చట్టాన్ని ఉపయోగించకపోవడం మంచిది. పునఃపరిశీలన పూర్తయ్యే వరకూ ఐపీసీ 124 ఎ కింద రాజద్రోహం నేరం మోపుతూ కొత్తగా ఎఫ్ఐఆర్ (ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్)లను కేంద్రం కానీ రాష్ట్రాల కానీ దాఖలు చేయబోవని ఆశిస్తున్నాం,'' అంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ వి రమణ అన్నారు. కొత్తగా కేసులు పెడితే బాధితులు కోర్టులకు వెళ్ళవచ్చు. ఈ చట్టాన్ని దుర్వినియోగం చేయరాదంటూ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశం జారీ చేయవచ్చునని కూడా ప్రదాన న్యాయమూర్తి సూచించారు.

చట్టాన్ని పునఃపరిశీలిస్తాం కానీ నిలుపుదల చేయడం సరికాదని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. "మనం పరస్పరం గౌరవించుకుంటాం. న్యాయవ్యవస్థ ప్రభుత్వాన్నీ, చట్టసభలనీ గౌరవించాలి. ప్రభుత్వం కూడా న్యాయస్థానాలను గౌరవించాలి. సరిహద్దు స్పష్టంగా ఉన్నది. లక్ష్మణరేఖను ఎవ్వరూ అధిగమించరాదు,'' అంటూ కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెణ్ రిజిజూ సుప్రీంకోర్టు నిర్ణయానికి ఘాటుగానే స్పందించారు.

ఐపీసీ 124 ఎ (దేశద్రోహం చట్టం) కింద ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారనే ఆరోపణపై ప్రభుత్వం ఎవరినైనా వారెంటు లేకుండా అరెస్టు చేసి జైల్లో పెట్టవచ్చు. నెలల తరబడి ఎఫ్ ఐ ఆర్ దాఖలు చేయకుండా జైల్లోనే ఉంచవచ్చు. ప్రస్తుతం ఈ సెక్షన్ కింద 800 కేసులు ఉన్నాయనీ, 13,000 మంది జైళ్ళలో మగ్గుతున్నారనీ ఈ చట్టాన్ని దుర్వినియోగం చేయడాన్ని ప్రశ్నిస్తూ పిటిషన్లు దాఖలు చేసినవారి తరఫున వాదిస్తున్న ప్రముఖ

న్యాయవాది, కేంద్ర మాజీ మంత్రి కపిల్ శిబ్బల్ వెల్లడించారు. ఈ కేసును తిరిగి మే 17వ తేదీన విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కోర్టు కానీ ప్రభుత్వం కానీ ఎటువంటి నిర్ణయం తీసుకున్నప్పటికీ ఇది దారుణమైన, అన్యాయమైన చట్టమనీ, ఇది దుర్వినియోగం అవుతోందనీ అనడంలో ఎవ్వరికీ ఎటువంటి సంశయమూ లేదు. నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా 2014లో బాధ్యతలు తీసుకుంటే 2015 నుంచి 2020 వరకూ ఈ చట్టం కింద 548 కేసులు పెట్టారు. అంటే లోగడకంటే 160 శాతం ఎక్కువ. మీసా, టాడా వంటి నల్ల చట్టాలు లోగడ కూడా ఉన్నాయి. కానీ ప్రధానమంత్రిని విమర్శించినా, ప్రభుత్వాన్ని తప్పుపట్టినా పట్టుకొని జైల్లో కుక్కడం మోదీ హయాంలో ఎక్కువయింది.

సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే చిన్న పని చేసినా ప్రజలు హర్షధ్వానాలు చేస్తున్నారు. ముఖ్యంగా నల్లచట్టాల వల్ల నష్టపోతున్నవారూ, జైళ్ళలో ఏళ్ళ తరబడి మగ్గుతున్నవారూ, వారి కుటుంబీకులూ, హితైషులూ విలవిలలాడిపోతున్నారు. ప్రముఖ కవి, విప్లవ రచయిత వరవరరావు, ప్రముఖ న్యాయవాది సుధాభరద్వాజ్ వంటి మేధావులు ముంబయ్ జైలులో సంవత్సరాల తరబడి ఉంటున్నారు. ఎనభయ్యో పడిలో వరవరరావు ప్రధాని హత్యకు కుట్ర చేశారంటే నవ్వాలా, ఏడవాలా? ప్రొఫెసర్ సాయిబాబా సంగతి సరేసరి. 90 శాతం అంగవైకల్యంతో వీల్ చైర్ కి పరిమితమై ఉన్న ప్రొఫెసర్ సాయిబాబా కుట్రలూ, కుహకాలూ చేశారని కేసు పెట్టి అమానుషంగా అండాసెల్ లో నిర్బంధిస్తే ఎవరికి చెప్పుకోవాలి? ఉమర్ ఖలీద్ అనే యువనాయకుడిని విచారణ లేకుండా 500ల రోజులకు పైగా బందిఖానాలో ఉంచారు. బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉమర్ ఖలీద్ ను ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు అడుగడుగునా తప్పుపట్టారు. ఇంక్విలాబ్ అన్నందుకూ, క్రాంతికారి అన్నందుకూ నేరం చేసినట్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానిస్తున్నారు. అతడి ఉపన్యాసంలో ఎక్కడా హింసాత్మకంగా తిరుగుబాటు చేయమని కానీ, విధ్వంసం సృష్టించమని కానీ అనలేదు. శాంతియుతంగా నిరసన తెలియజేయాలని మాత్రమే అన్నాడు.

వలసపాలకులు తయారు చేసిన నల్లచట్టాన్ని పట్టుకొని స్వాతంత్ర్య అమృతోత్సవం జరుపుకున్న సందర్భంలో కూడా పాకులాడాలని పాలకులు అనుకుంటే అన్యాయమని ఎలుగెత్తి చాటేవారితో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సైతం గొంతు కలపడం కొంత ఊరట కలిగిస్తుంది. లార్డ్ మెకాలే ఇండియన్ పీనల్ కోడ్ ను తయారు చేసినప్పుడే రాజద్రోహం చట్టం గురించి ఆలోచించాడు. 1860లో ఇండియన్ పీనల్ కోడ్ (భారత శిక్షాస్మృతి) చట్టం చేసినప్పుడు రాజద్రోహాన్ని కలపడం విస్మరించాడు. 1890లో రాజద్రోహాన్ని శిక్షాస్మృతిలో కలిపారు. ఆ రోజుల్లో రాజద్రోహం నేరానికి పాల్పడినవారికి శిక్ష ఏమిటంటే సముద్రాల ఆవలికి పంపి వారు మరణించేవరకూ అక్కడే ఉంచడం. దేశబహిష్కారం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1950లో దాన్ని జీవితఖైదు కిందికి మార్చారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో బాలగంగాధర్ తిలక్, అలీ సోదరులు (షౌకత్, మహమ్మద్), అనీబిసెంట్, మౌలానా ఆజాద్, మహాత్మాగాంధీ వంటి నాయకులపైన దేశద్రోహం చట్టాన్నిప్రయోగించారు. క్వీన్ ఎంప్రెస్ వర్సెస్ బాలగంగాధర్ తిలక్ కేసు విచారణ 1898లో జరిగింది. కేదార్ నాథ్ కేసులో అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగపీఠం దేశద్రోహం చట్టం రాజ్యాంగబద్ధమేనని తీర్పు చెబుతూ, ఏది రాజద్రోహమో, ఏది కాదో నిర్ణయించడానికి ఏడు మార్గదర్శక సూత్రాలు చెప్పింది. ఇటీవల ప్రముఖ జర్నలిస్టు వినోద్ దువా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఎఫ్ఐఆర్ ని కొట్టివేసింది. కోవిద్ సంక్షోభాన్ని నరేంద్రమోదీ ఎదుర్కొన్న విధానాన్ని విమర్శించినందుకు వినోద్ దువాపైన రాజద్రోహం కేసు పెట్టడం రాజ్యాంగవిరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

నిజానికి సుప్రీంకోర్టు చేయవలసిన పనులు చాలా ఉన్నాయి. మోదీ హయాంలో ప్రజాస్వామ్య వ్యవస్థలోని అన్ని అంగాలూ బలహీనపడినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈశాన్యంలో మంత్రివర్గాలు పార్టీ ఫిరాయించి బీజేపీలో చేరిపోవడం, ప్రతిపక్షంలో ఒకరిద్దరు నాయకుల చేత, వారి అనుచరుల చేత ఫిరాయింపు చేయించి ప్రభుత్వాలను పడగొట్టి బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం (కర్ణాటక, మధ్యప్రదేశ్), ప్రతిపక్ష సభ్యులను పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సహించడం వంటి అప్రజాస్వామిక చర్యలతో చట్టసభలకు బీజేపీ అధినాయకత్వం విఘాతం కలిగిస్తున్నది. అధికారగణం వెన్నెముక కోల్పోయి చాలాకాలం అయింది. ఒక్క బీజేపీ వచ్చిన తర్వాతనే కాదు, యూపీఏ హయాంలోనైనా, ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలోనూ అధికారపక్షంతో అంటకాగడం, అవినీతిలో భాగస్వాములు కావడం రివాజుగా మారింది. ఇటువంటి జాడ్యంలేని అధికారులు బహు తక్కువమంది. మీడియా సంగతి సరేసరి. ఆత్యయిక పరిస్థితిలో మీడియా గురించి నాటి జనసంఘ్ నేత లాల్ కృష్ణ అద్వాణీ చేసిన వ్యాఖ్య మరపురానిది. 'మిమ్మల్ని వంగమంటే మీరు నేతమీద పాకులాడటానికి సిద్ధపడ్డారు (When you were asked to bend, you preferred to crawl). అదే వ్యాఖ్య ఇప్పుడు కూడా వర్తిస్తుంది. మోదీ కరుణాకటాక్ష వీక్షణం కోసం మీడియా సంస్థల యజమానులూ, సంపాదకులూ, బ్యూరో

చీఫ్ లూ పడిగాపులు కాస్తున్నారు. పత్రికా స్వేచ్ఛ చూస్తే 2022 ప్రపంచ పత్రికాస్వేచ్ఛ సూచి ప్రకారం మొత్తం 180 దేశాలలో బారత్ 150 స్థానంలో నిలిచింది. మనకంటే పత్రికాస్వేచ్ఛ ఎక్కువ అనుభవిస్తున్న దేశాలు ఈ ప్రపంచంలో 149 ఉన్నాయి. మనకంటే అథమంగా ముప్పయ్ దేశాలు మాత్రమే ఉన్నాయి. పొట్ట చించుకుంటే కాళ్ళమీద పడుతుందనే సామెత ఈ రంగానికి వర్తిస్తుంది. ఇక మిగిలింది న్యాయవ్యవస్థ. మిగిలిన మూడే వ్యవస్థలూ బలహీనపడినప్పుడు అదొక్కడే బలంగా ఉండి, నిటారుగా నిలబడాలని అనుకోవడమే అత్యాస. జస్టిస్ గొగోయ్ మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు ఇచ్చి పదవీ విరమణ చేయగానే రాజ్యసభ సభ్యత్వం స్వీకరించారు. జస్టిస్ ఎన్ వి రమణ వ్యాఖ్యాలూ , కొన్ని నిర్ణయాలూ స్వతంత్రంగా ఉన్నట్టు కనిపిస్తున్నాయి. కానీ కొన్ని కీలకమైన కేసులు అపరిష్కృతంగానే మిగిల్చి ఆగస్టులో ఆయన పదవీ విరమణ చేయవలసి వస్తోంది. వాటిలో కొన్ని ముఖ్యమైన కేసులను ప్రస్తావించక తప్పదు.

1. పెగాసెస్ కేసు. ఇజ్రాయెల్ నుంచి స్పైవేర్ పెగాసెస్ ను కొనుగోలు చేసి, ప్రతిపక్ష నాయకులపైనా, కొందరు జర్నలిస్టులపైనా ఉపయోగించి రహస్య సమాచారం సేకరించినట్టు ఆరోపణలు వచ్చాయి. వాటిపైన దర్యాప్తు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆర్ వి రవీంద్రన్ ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించారు. ఆయనకు ఒక ఐపీఎస్ అధికారి సహకరిస్తారని చెప్పారు. జాతీయ భద్రతకు ముప్పు ఏర్పడుతుందనే కేంద్ర ప్రభుత్వ వాదనను జస్టిస్ రమణ తోసిపుచ్చారు. ప్రవీణులతో ఒక కమిటీని నియమించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనకు సైతం ప్రధాన న్యాయమూర్తి అంగీకరించలేదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి చాలా సమయం ఇచ్చామని చెబుతూ రవీంద్రన్ నాయకత్వంలో కమిటీని నియమించారు. సుప్రీంకోర్టు ప్రేక్షకపాత్ర పోషించజాలదని కూడా వ్యాఖ్యానించారు. టీడీపీ హయాంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెగాసెస్ స్పైవేర్ ను కొనుగోలు చేసిందని ఆరోపిస్తూ, ఆ విషయం దర్యాప్తు చేసేందుకు ఒక సభాసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

2. పెద్ద నోట్ల రద్దు కేసు: చలామణిలో ఉన్న డబ్బులో 80 శాతానికిపైగాపెద్దనోట్లను రద్దు చేసే అధికారం ఒక ప్రభుత్వానికి ఉన్నదా? నరేంద్రమోదీ మొదటి టరమ్ లో తీసుకున్న ఈ నిర్ణయం వల్ల చాలా వ్యాపారాలు మూతపడ్డాయి. చాలామంది ఉపాధి కోల్పోయారు. లక్షలమందికి ఆహారం, మందులు దొరకలేదు. కేసు అపరిష్కృతంగానే ఉంది.

3. ఎలక్టొరల్ బాండ్ల కేసు: కార్పొరేట్ సంస్థలు (నష్టాలలో నడుస్తున్నవాటితో సహా) రాజకీయపార్టీలకు రహస్యంగా, అపరిమితంగా విరాళాలు ఇవ్వడానికి వీలు కల్పించే చట్టాన్ని ప్రభుత్వం చేయవచ్చునా? ఇది కుహనా పెట్టుబడిదారులను (క్రోనీ కేపిటలిస్ట్స్) ప్రోత్సహించడం కాదా? ఇది పరోక్షంగా అవినీతిని ప్రోత్సహిస్తూ పాలకపక్షం విపరీతంగా లబ్ధిపొందడం కాదా?

4. లాక్ డౌన్: కోవిద్ –19 మహమ్మారి దాడి చేసిన కొత్తల్లో ప్రధాని నరేంద్రమోదీ ముందు నోటీసు లేకుండా తక్షణం అమలులోకి వచ్చే విధంగా లాక్ డౌన్ ప్రకటించడం రవాణా సౌకర్యం లేదు. చేతుల్లో డబ్బులు లేవు. ఆహారం లేదు. నీటివసతి లేదు. మందులు దొరకలేదు. ఈ కారణాల వల్ల ఎంతమంది నష్టపోయారు? ఎంత ప్రాణనష్టం జరిగింది? ముంబయ్ నుంచీ, బెంగుళూరు నుంచీ, దిల్లీ నుంచీ కాలినడకన సొంత ఊళ్ళకు బయలుదేరి దాహంతో, ఆకలితో, అలసటతో ఎంతమంది మార్గమధ్యంలో చనిపోయారు? అకస్మాత్తుగా లాక్ డౌన్ ప్రకటించడం మంచిదా, కాదా అనే విషయం తేల్చవలసిన కోర్టు ఇంతవరకూ కేసును పరిష్కరించలేదు. తీర్పు చెప్పలేదు.

5. రాజ్యాంగంలోని 370వ అధికరణ రద్దు: ఒకానొక ఒప్పందం చేసుకున్న తర్వాత భారత్ లో విలీనమైన రాష్ట్రానికి రాష్ట్రప్రతిపత్తి లేకుండా చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి రాజ్యాంగం ఇచ్చిందా? సదరు రాష్ట్ర ప్రజల ఆమోదం కానీ శాసనసభ ఆమోదం కానీ లేకుండా ఇటువంటి పని చేయవచ్చునా? సర్వోన్నత న్యాయస్థానం తీర్పుకోసం దేశప్రజలు ఎదురు చూస్తున్నారు.

6. బుల్డోజర్ సంస్కృతి: ఉత్తరప్రదేశ్ లో యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించిన బుల్డోజర్ సంస్కృతిని మధ్యప్రదేశ్ లో శివరాజ్ సింగ్ చౌహాన్ కొనసాగించారు. తాజాగా దిల్లీలో అమలు చేస్తున్నారు. దిల్లీలో ముందు జహంగీర్ పురాలో దుకాణాలు నేలమట్టం చేశారు. ఎక్కడ అల్లర్లు జరిగాయో అక్కడికే బుల్డోజర్ వెడుతుంది. అక్కడే దుకాణాలను ధ్వంసాయమానం చేస్తుంది. ఆ విధ్వంసాన్ని సుప్రీంకోర్టు అడ్డుకొని మళ్ళీ చెప్పేవరకూ బుల్డోజర్లను ఉపయోగించవద్దని ఆదేశించింది. సోమవారంనాడు (మే9) షహీన్ బాగ్ లో దుకాణాలు కూల్చడానికి సిద్ధమైన బుల్డోజర్లు కాంగ్రెస్, ఆప్ నాయకులు, కార్యకర్తలు అడ్డుతగలడంతో వెనక్కు తగ్గారు. అక్రమ కట్టడాలు కూల్చివేయడం అనేది ఒక మిష. ఏదైనా అల్లరి జరిగితే

అందులో ముస్లింలు నిందితులైతే వారి నివాసాలనూ, వారి వ్యాపార బడ్డీలనూ, బండ్లనూ ధ్వంసం చేయడం ప్రధానం. అందుకోసం బుల్డోజర్లు వేసుకొని దండోరాకి బయలుదేరడం ఎందుకు? ముస్లిం జనాభాలో ఆందోళక కలిగించడానికి. వారిలో అభద్రతాభావం పెంచడానికి. యూపీ ఎన్నికలలో బీజేపీ చిహ్నం కమలం అయినప్పటికీ రాజకీయంగా బుల్డోజర్ నే ఎక్కువగా వాడుకున్నారు. బీజేపీ బలానికి గుర్తుగా బుల్డోజర్ ని ఉపయోగిస్తున్నారు. నిజానికి అధికారులు వాడుతున్నది బుల్డోజర్ కాదు. అది హింసకూ, ఆధిక్యానికీ, దౌర్జన్యానికీ నిదర్శనం. వారు వాడుతున్నది మట్టి తవ్వి, ఎత్తిపోసే ఎస్కవేటర్ యంత్రాలను. చిన్న వ్యాపారులు వేసుకొనే రేకు షెడ్లనూ, తోపుడు బండ్లనూ, చిన్నచిన్న దుకాణాలనూ ధ్వంసం చేయడానికి అవి సరిపోతాయి.

బుల్డోజర్ ముస్లింలను అదుపులో ఉంచడానికి, వారికి 'గుణపాఠం' చెప్పడానికి ఒక సాధనం. మతప్రాతిపదికన సమాజాన్ని చీల్చి, హిందూ ఓట్లను సంఘటితం చేసుకునే ఉద్దేశంతో గత ఎనిమిది సంవత్సరాల నుంచి మోదీ, అమిత్ షాలు నడిపిస్తున్న మంత్రాంగం ఫలితంగా ఇప్పుడు ముస్లింలు సమాజంలో అట్టడుగుకు వెళ్ళిపోయారు. ఇంతకాలం పెక్కంతస్తుల వర్ణసౌధంలో అట్టడుగున ఉన్న దళితులను తమ వైపు తిప్పుకోవడానికి బీజేపీ రాజ్యాంగనిర్మాత అంబేద్కర్ నూ, ప్రథమ స్వాతంత్ర్య సమరంలో ఝాన్సీ లక్ష్మీబాయి సేనాని ఝుల్కారీబాయినీ, ఆ సమరంలోనే ముందు పీటీలో ఉండి పోరాడిన ఊదాదేవినీ స్మరిస్తారు. దళితులకోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తారు. వారితో సహపంక్తి భోజనాలు ఉంటాయి. పార్టీలో, ప్రభుత్వంలో వారికి స్థానం కల్పిస్తారు. కానీ వర్ణవ్యవస్థని చెక్కుచెదరనీయరు. దళితులు అడుగునే ఉంటారు. కానీ వారికంటే అడుక్కి ముస్లింలు వెడతారు. ఎన్ఎస్ఎస్ఓ సర్వే ప్రకారం 2017–18లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ముస్లింలు ముస్లిం జనాభాలో 14 శాతం ఉంటే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన దళితులు 18 శాతం, ఓబీసీలు 25శాతం, అగ్రవర్ణాలవారు 37శాతం మంది ఉన్నారు. సచార్ కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత ఈ దేశంలో ముస్లింల పరిస్థితి దళితులకంటే అన్యాయంగా ఉన్నదని విశ్లేషకులు వ్యాఖ్యానించారు.

అధికార పక్షం, ప్రభుత్వ శాఖలు సమాజాన్ని మత ప్రాతిపదికపై చీల్చడాన్ని నిరోధించే బాధ్యత పూర్తిగా న్యాయవ్యవస్థది కాదు. అంతిమంగా అది పౌరసమాజ బాధ్యత. మోదీని ప్రేమిస్తున్న ప్రజలు అధికసంఖ్యలో ఉన్నంత కాలం పరిస్థితులు మారే అవకాశం లేదు. మోదీ మాటల వల్ల, మౌన వల్ల, చేతల వల్ల దేశానికి జరిగే నష్టాన్ని ప్రజలు గ్రహించిన రోజునే ఈ దేశానికి రక్ష. నరేంద్రమోదీ, బీజేపీ విధానాలైన మారాలి లేదా అధికార పార్టీగా బీజేపీకి స్వస్తి చెప్పాలి. ఏదైనా ప్రజాస్వామ్యసంస్థలని పరిరక్షించుకోవడం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడుకోవడం ఈ దేశ ప్రజల బాధ్యత. వారి చేతిలో ఓటు అనే ఆయుధం ఉన్నంతకాలం, దాన్ని ఉపయోగించే స్వేచ్ఛ ప్రజలకు ఉన్నంత వరకూ దేశానికి ప్రమాదం లేదు. ప్రజల సామూహిక చైతన్యం, వివేకం లోగడ ఈ దేశాన్ని కాపాడాయి. భవిష్యత్తులో సైతం తమ దేశాన్ని తాము రక్షించుకునే శక్తి ప్రజలకు ఉన్నదనే నా అభిప్రాయం. ◆



# కశ్మీర్, గో రక్షణ, మూకదాడులు, మతాంతర వివాహాలపై గాంధీ అభిప్రాయాలేంటి?




**స్వతంత్ర, స్వావలంబన భారతదేశం గురించి మహాత్మా గాంధీ కలలు కన్నారు. ఎలాంటి సైద్ధాంతిక, తాత్విక పునాదులపైనా ఈ కల నిర్మితమవలేదు. ఇది ఒక ఆచరణాత్మక ప్రాజెక్టు లాంటిది.**

భారత్ అంటే ఇక్కడ భారత ప్రజలని అర్థం. అన్ని మతాలు, ప్రాంతాలు, భాషలు, కులాల సమూహం. సమానత్వం, సోదరభావం, మానవత్వం తదితర ఆదర్శాలతో పురుషులు, మహిళలు, పిల్లలతో ఈ దేశం రూపొందింది.

ఇలా ఒక లౌకిక భారత దేశం ఏర్పడింది. ప్రపంచానికి ఒక అద్భుతమైన ఉదాహరణగా ఈ దేశం ఉండాలి.

కానీ, ఇప్పుడు భారత్ ఎక్కడ ఉంది? ఈ రోజు గాంధీ మళ్లీ వచ్చి భారత్‌ను తన దృక్పథంతో పరిశీలిస్తే ఈ దేశానికి ఎన్ని మార్కులు వేసేవారు? భారత్ తనకు తాను ఎన్ని మార్కులు కేటాయించుకుంటుంది? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలే.

భారత్ బయటి సమస్యలపై ఐక్యంగా పోరడటానికి ముందు తన సమాజంలోని పలు రుగ్మతలు తనకు సమస్యలను సృష్టించాయి.

ఈ సమస్యలు రాజకీయ, ఆర్థిక, సామాజికపరమైనవిగా కనిపించినప్పటికీ, ఇవి సైద్ధాంతిక, అస్తిత్వ సంక్షోభంగా పరిణమించడం ప్రారంభించాయి.

## కశ్మీర్ వాస్తవ పాలకులు ఎవరు?

కశ్మీర్ అంతా ఇప్పుడు నిశ్శబ్దంగా ఉంది. ఈ బలవంతపు నిశ్శబ్దాన్ని భారత సమాజం శాంతిగా భావిస్తోంది. ఇప్పుడు కశ్మీరీలు సైన్యం నియంత్రణలో ఉన్నారు. మిగిలిన భారత దేశాన్ని మీడియా నియంత్రిస్తోంది.

ఇటువంటి పరిస్థితిలో గాంధీ ఉంటే ఏం చేసేవారో ఊహించటం కష్టం. దేశ విభజనప్పుడు ఒక సంతకంతో తనకు ఇష్టమైన దేశంలో విలీనమయ్యే అవకాశం కశ్మీర్ రాజుకు ఉన్న సమయంలో గాంధీ అక్కడ పర్యటించారు.

కశ్మీర్ తన రాజు కోసమో, భూమి కోసమో కాదు అక్కడి ప్రజల కోసం నిలబడుతుందని గాంధీ అన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో బ్రిటిష్ పాలకుల పునాదులను కదిలించిన గాంధీ, ప్రజల మనోభావాల గురించి ఆలోచించడం, వారి హృదయాలను గెలవడం చాలా ముఖ్యమైన అంశం అని అంటారు.

చరిత్రాత్మక కశ్మీర్ పర్యటనకు రెండు రోజుల ముందు, 1947 జులై 29న గాంధీ తన ప్రసగంలో ఇలా అన్నారు, "భారత్‌లోనే ఉండేలా కశ్మీర్‌ను ఒప్పించేందుకు నేను అక్కడికి వెళ్లడం లేదు. ఆ నిర్ణయం తీసుకోవాల్సింది కశ్మీర్ ప్రజలు.. అది నేను లేదా మహారాజా తీసుకునే నిర్ణయం కాదు. కశ్మీర్‌కు మహారాజా ఉన్నారు, పౌరులు ఉన్నారు. ఒకవేళ రేపు రాజు మరణించినా, ఆ ప్రజలు అక్కడే ఉంటారు. కశ్మీర్ భవితవ్యాన్ని నిర్ణయించేది వాళ్లే."

"మీరు ఈ వయసులో అంత క్లిష్టమైన ప్రయాణం చేయడం అవసరమా? మీరు మహారాజాకు లేఖ పంపితే సరిపోతుంది కదా" అని ఒకరు ఆనాడు గాంధీకి సలహా ఇచ్చారు. గాంధీ ఆయన కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తూ... "మీ లాజిక్ ప్రకారం, బంగ్లాదేశ్‌లోని నోవాఖలీకి కూడా నేను వెళ్లాల్సిన అవసరం లేదు. అక్కడికి కూడా నేను ఉత్తరం పంపేవాడిని కదా. కానీ మిత్రమా, అలా చేస్తే పనులు జరగవు" అని అన్నారు.

1947 అక్టోబర్ 26న కశ్మీర్‌పై పాక్ దాడి చేసిన విషయం వెలుగులోకి వచ్చినప్పుడు ఇరు దేశాలకు గాంధీ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు "ఈ రాచరిక రాజ్యానికి నిజమైన పాలకులు ప్రజలే. వాళ్లు పాకిస్తాన్‌తో వెళ్లాలని అనుకుంటే, వారిని ఏ శక్తీ అడ్డుకోలేదు. కానీ, ప్రజల అభిప్రాయాలను మీరెలా సేకరిస్తారు? ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు అనువైన పరిస్థితులను నెలకొల్పాలి. ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించేలా చూడాలి. వారిపై దాడి చేసి, వారి గ్రామాలను, ఇళ్లను తగలబెట్టడం ద్వారా మీరు వారి అంగీకారాన్ని పొందలేరు.

తాము ముస్లింలం అయినప్పటికీ భారతదేశంలోనే ఉండాలని కోరుకుంటున్నామని ఇక్కడి ప్రజలు చెబితే, వారిని ఏ శక్తీ ఆపలేదు. పాకిస్తానీయులు ఈ ప్రాంతంలోకి ప్రవేశిస్తే, వారు తమ పాలనను స్థాపించకుండా ఇక్కడి ప్రజలు అడ్డుకోవాలి. పాకిస్తాన్‌ను అడ్డుకోలేకపోతే, అప్పుడు వారు నిందల నుంచి తప్పించుకోలేరు" అని గాంధీ పేర్కొన్నారు.

## గాంధీ దృష్టిలో గో రక్షణ అంటే...

గాంధీ తనను తాను సనాతన హిందువుగా భావించారు. భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, దాని సంప్రదాయాల కోణం నుంచి ఆయన గోవుల ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నారు.

అయితే, భిన్నత్వంతో ఉండే భారత్‌లో... మూక హత్యలతో గో రక్షణ సాధ్యం కాదని గాంధీ అర్థం చేసుకున్నారు. గోవుల ఆరాధన పేరుతో మత కపటత్వం చూపే వారిని ఆయన గమనించారు. తమను తాము గో రక్షకులుగా ప్రకటించుకునేవారు వాస్తవానికి 'గో భక్షకులు' అని చెప్పడానికి కూడా ఆయన వెనకాడలేదు. వాస్తవానికి, గో రక్షణ అనే పదాన్ని గాంధీ ఉపయోగించడం మానేశారు. గో సంరక్షణ కావాలి కానీ, గో రక్షణ కాదని ఆయన చెప్పారు.

హిందూ మతం, గో రక్షణ మధ్య ఉన్న సంబంధంపై 1921 అక్టోబర్ 6న 'యంగ్ ఇండియా'లో గాంధీ ఇలా రాశారు... "హిందూ మతం పేరిట ఉన్న చాలా విషయాలు నాకు ఆమోదయోగ్యం కావు. ఒకవేళ, నేను నిజంగా అలాంటివి పాటించకపోతే హిందువును కాదు అని భావిస్తే నన్ను హిందువు అని పిలవాల్సిన అవసరం లేదు."

"ఒక ఆవును రక్షించడం కోసం ఒక మనిషిని చంపడం అనేది హిందూ ధర్మానికి, అహింసా సూత్రాలకు వ్యతిరేకం. తనను తాను ప్రక్షాళన చేసుకోవడం, ఆత్మత్యాగం అనేది హిందూ ధర్మ ఆచరణీయ మార్గం. కానీ, ఈ రోజుల్లో గో రక్షణ పేరిట ముస్లింలతో వివాదం కొనసాగుతోంది. గో రక్షణకు పిలుపునిచ్చిన మతం.. సాటి మనిషిని హింసించడాన్ని ఎలా సమర్థిస్తుంది?" అని ఆయన ప్రశ్నించారు.

"గో హత్యల నిరోధానికి చట్టం తీసుకొచ్చేలా నెహ్రూ లేదా పటేల్‌పై ఒత్తిడి తేవాలని నన్ను అడుగుతున్నారు. కానీ, నేను ఎప్పుడూ అలా చేయను" అని 1947 జులై 19న జరిగిన ఒక ప్రార్థన సమావేశంలో గాంధీ స్పష్టం చేశారు.

## మతాంతర, కులాంతర వివాహాలపై...

"ఒక ఇంగ్లిష్ కోడలినో, అల్లుడినో తీసుకొస్తే భారతీయ సమాజం దాని గురించి గొప్పగా చెప్పుకుంటుంది. కానీ, అదే భారతీయ సమాజం తమ మతం, కులం కాని వారిని పెళ్లి చేసుకుంటే వారిని బహిరంగంగా చెట్టుకు కట్టేసి ఉరితీస్తుంది. కన్నబిడ్డలపై ఇంతటి క్రూరంగా ప్రవర్తించే అనాగరికత ఎక్కడ నుంచి వస్తుంది? వాస్తవానికి, సమాజం కులం, మతం అనే సంకుచిత కోణాల నుంచి ప్రపంచాన్ని చూస్తుంది. భారత ఐక్యత, అభివృద్ధికి కులం, మతంలోని ఈ సంక్లిష్టతలు పెద్ద అవరోధాలుగా ఉన్నాయి" అని కులం, మతంపై గాంధీ తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

గాంధీ తొలినాళ్లలో కులాంతర వివాహాలను వ్యతిరేకించారు. అయితే, తర్వాత కాలంలో వధువు లేదా వరుడిలో ఎవరో ఒకరు దళితులు కాకపోతే అలాంటి వివాహాలకు తాను హాజరుకానని ప్రతిజ్ఞ చేశారు. తన ఆశ్రమంలో కూడా అలాంటి వివాహాలను జరిపించారు.

1946 జులై 7న హరిజన్ సంచికలో... "నాకు ఒక అవకాశం ఇస్తే, నా దగ్గర ఉన్న ఉన్నత కులాలకు చెందిన అమ్మాయిలందరూ యోగ్యులైన హరిజన యువకులను తమ భర్తలుగా ఎన్నుకోవాలని సలహా ఇస్తాను" అని గాంధీ రాశారు.

అదే విధంగా, 1942 మార్చి 8 నాటి హరిజన్ సంచికలో... "కాలం మారే కొద్దీ ఇలాంటి వివాహాలు సర్వసాధారణమవుతాయి. సమాజం వాటి నుంచి ప్రయోజనం పొందుతుంది. సహనం పెరిగినప్పుడు, అన్ని మతాల పట్ల గౌరవం పెరిగినప్పుడు ఇలాంటి వివాహాలు పెరుగుతాయి" అని పేర్కొన్నారు.

కానీ, ఇలాంటి వివాహాల ఆధారంగా మత మార్పిడులు చేయడాన్ని గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు.

"పెళ్లి పేరుతో స్త్రీ, పురుషులు మతాన్ని మార్చుకోవడాన్ని నేను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను. ఇష్టానుసారం మార్చడానికి మతం బెడ్‌షీట్, కండువా లాంటిది కాదు" అని గాంధీ అదే వ్యాసంలో రాశారు. ◆

# హిందూ రాజ్యం: హరిద్వార్ ధర్మ సంసద్

హరిద్వార్‌లో 20 డిసెంబర్ నుంచి 21 డిసెంబర్ వరకూ నిర్వహించిన 'ధర్మ సంసద్'లో హిందుత్వం గురించి సాధువులు, సన్యాసులు వివాదాస్పద ప్రసంగాలు చేశారు.

ఈ వీడియోల్లో మతాన్ని కాపాడుకోడానికి ఆయుధాలు చేపట్టాలని, ముస్లిం ప్రధానమంత్రి కాకుండా అడ్డుకోవాలని, ముస్లిం జనాభాను పెరగనివ్వకూడదని అంటుండడంతోపాటూ హిందూ మతం రక్షణ పేరుతో సాధువులు వివాదాస్పద ప్రసంగాలు చేశారు.

వీరిలో ఒక సన్యాసిని కూడా ఆయుధాలు చేపట్టాలని చెప్పడం చెప్పారు.



### కాషాయ రాజ్యాంగం

ఈ ధర్మ సంసద్లో బీజేపీ నేత అశ్వినీ ఉపాధ్యాయ్, జునా అఖాడ మహామండలేశ్వర్, గాజియాబాద్ సాధువు యతి నరసింహానంద్ సరస్వతి, జునా అఖాడా మహామండలేశ్వర్, రైట్ వింగ్ సంస్థ హిందూ రక్షాసేనకు చెందిన స్వామీ ప్రబోధానంద్, నిరంజనీ అఖాడా మహామండలేశ్వర్ మా అన్నపూర్ణ సహా ధర్మ సంసద్ నిర్వాహకులుపండిత్ అధీర్ కౌశిక్, మరో వెయ్యి మందికి పైగా మహామండలేశ్వర్, మహంత్, సాధువులు హాజరయ్యారు. జునా, నిరంజనీ, మహానిర్వాణీ సహా హరిద్వార్లోని అన్ని ప్రముఖ అఖాడాలూ ఇందులో పాల్గొన్నాయి.

అఖాడా పరిషత్ అధ్యక్షులు కూడా ధర్మ సంసద్ కార్యక్రమానికి హాజరయ్యారు.

ధర్మ సంసద్కు హాజరైన బీజేపీ నేత అశ్వినీ ఉపాధ్యాయ్ ఈ కార్యక్రమానికి కాషాయ రాజ్యాంగం తీసుకువచ్చారు.

"భారత్లో హిందీ భాషలో, కాషాయం రంగులో మనం రాజ్యాంగాన్ని ప్రత్యేకంగా ముద్రించుకోవాల్సి వస్తోంది, ఇది సిగ్గు పడాల్సిన విషయం" అన్నారు.

"హిదువులపై దాడులు పెరుగుతున్నాయి. హరిద్వార్లో ముస్లిం జనాభా ఆధిపత్యం పెరుగుతోంది. హిందువులపై ఎవరైనా దాడి చేస్తే, మేం ఆత్మరక్షణ కోసం ఆయుధాలు చేపట్టవచ్చు" అని చెప్పారు.

కానీ ఆయన తన వాదనలకు ఎలాంటి ఆధారాలూ అందించలేకపోయారు.

"ఎన్నికలతో మాకు ఎలాంటి సంబంధం లేదు. 2017లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత మేం హిందువుల రక్షణ కోసం ఉద్యమం ప్రారంభించాం. హరిద్వార్లోని మహాత్ములందరూ మాకు మద్దతు పలికారు" అని ప్రబోధానంద్ చెప్పారు.

"గత ఏడేళ్ల నుంచి ఇలాంటి ధర్మ సంసద్ నిర్వహిస్తున్నాం. ఇంతకు ముందు దిల్లీ, గాజియాబాద్లో కూడా ఇలాంటి ధర్మ సంసద్లు నిర్వహించాం. హిందూ దేశం ఏర్పాటు దిశగా సన్నాహాలు చేయడమే దీని లక్ష్యం.

దానికోసం ఆయుధాలు చేపట్టాల్సి వచ్చినా, చేపడతాం" అని హరిద్వార్లో ధర్మ సంసద్ స్థానిక నిర్వాహకులు, పరశురామ అఖాడే అధ్యక్షులు పండిత్ అధీర్ కౌశిక్ అన్నారు.

"హిందూ యువతను తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నారు. వారిని బెయిల్ మీద విడిపించడానికి, వారి కుటుంబాలకు తాము అన్ని రకాల సాయం అందిస్తాం. మనకు మాత్రం ఇద్దరు పిల్లల్నే కనాలని చెబుతారు. వారికి మాత్రం 12-20-40 మంది వరకూ పిల్లలు పుడతారు. జనాభా నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి" అని చెప్పారు.

మహామండలేశ్వర్ యతి నరసింహానంద్ గిరి మహరాజ్ ధర్మ సంసద్ తీర్మానం ప్రకటించారు.

"ఇక సనాతన వైదిక దేశం స్థాపనే ప్రతి హిందువు లక్ష్యం కావాలి. ప్రస్తుతం క్రైస్తవులకు 100కు పైగా దేశాలు ఉన్నాయి. ముస్లింలకు 57 దేశాలున్నాయి. బౌద్ధులకు కూడా 8 దేశాలు ఉన్నాయి. కేవలం 90 లక్షల మంది యూదులకు కూడా తమకంటూ ఇజ్రాయెల్ దేశం ఉంది. నా దేశం అని చెప్పుకోడానికి ఒక అంగుళం చోటు కూడా లేకపోవడం వంద కోట్ల మంది హిందువుల దౌర్భాగ్యం. ఇక హిందువులు తమ దేశం కోసం తమ మొత్తం జీవితాన్ని ఇవ్వాల్సి ఉంటుంది" అన్నారు. ◆



# మతం, మార్కెట్ కలిసిన రాజకీయం

**ప్రొ॥ అజయ్ గుడవర్తి,** ఢిల్లీ జేఎన్‌యూ అసోసియేట్ ప్రొఫెసర్



స్వేచ్ఛా మార్కెట్టు అనే భావనలో ఎటువంటి స్వేచ్ఛా లేదు. అది... మధ్యతరగతి వాళ్ళకు 'మేం మంచిగానే ఉన్నా'మనిపించే కొనుగోలు దారీతనపు మానసిక తృప్తినీ, పేద సాదలకు కేవలం నానా ఇబ్బందులూ పడి రోజువారీ బతుకు బత్తెం సంపాదించుకునే అవకాశాన్నీ ఇచ్చే నిర్మాణం మాత్రమే! ఇక్కడ విజయానికీ, ఓటమికీ పూర్తిగా బాధ్యులు వ్యక్తులే గానీ వ్యవస్థ కాదు. ఇక, అంతిమ సత్యాన్ని వ్యక్తి అర్థం చేసుకోవడానికి మతం ఒక దారి చూపుతుంది. ఫలితాల సాధనకు గానీ, సాధించలేని తనానికి గానీ సంపూర్ణ బాధ్యత సాధకులదే తప్ప మరొకరిది కాదు. ఈ రకంగా దేశంలో మతమూ, మార్కెట్టూ నడుమ భావనాత్మక ఐక్యత కుదిరింది. ఇప్పుడు మతం సామాజిక జీవితాన్ని నయా ఉదారవాద మార్కెట్‌కు అనుకూలంగా మార్చే పనిముట్టు మాత్రమే!

మతమూ, వ్యాపారమూ అనే జోడుగుర్రాల మీద నయా ఉ దారవాద హిందూత్వం సవారీ చేస్తూ, వ్యక్తి వాద ఆత్మ తృప్తిని గొప్ప విలువగా ప్రచారం చేస్తూ ఉంది. భారతీయ జనతా పార్టీ తనకు అనుకూలంగా ప్రజలను తిప్పుకునే కార్యక్రమంలో రెండు ప్రధాన అంశాలు ఉన్నాయి. ఒకటి మతాన్ని రాజకీయ పనిముట్టుగా మార్చడం అయితే, మరోటి ఉదారవాద మార్కెట్టును ఆయుధంగా మార్చడం. తీవ్రమైన నయా ఉదార వాదం... సాయుధమూ, హింసాత్మకమూ అయిన మత ప్రతీకలతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతోంది. ప్రభుత్వ రంగ వనరులను కుదువ బెట్టి డబ్బుచేసుకోవడం, ప్రజల వనరులను ప్రైవేటు రంగానికి అప్పచెప్పడం అనే ఆర్థిక కార్యక్రమం... ఆదే సమయంలో వ్యక్తిగత వ్యవహారంగా ఉండాల్సిన మతాన్ని బజారుకు ఈడ్వడం అనే వ్యూహం ఒకదానితో ఒకటి ముడి పడి ఉన్నాయి.

వాస్తవానికి స్వేచ్ఛా మార్కెట్టు అనే భావనలో ఎటువంటి స్వేచ్ఛా లేదు. అది మధ్యతరగతి వాళ్ళకు 'మేం మంచిగానే ఉన్నాం' అని అనిపించే కొనుగోలుదారీతనపు మానసిక తృప్తినీ, పేద సాదలకు కేవలం నానా ఇబ్బందులూ పడి రోజు వారీ బతుకు బత్తెం సంపా దించుకునే అవకాశాన్నీ ఇచ్చే నిర్మాణం మాత్రమే! ఇంకా ఇప్పుడు బజార్లలో మనకి కనిపిస్తున్న మతానికి ఆధ్యాత్మిక వికాసంతో ఎటువంటి సంబంధం లేదు. అది ఇప్పుడు అధిక సంఖ్యాకుల ఆధిపత్యాన్ని గట్టి పరిచే పనిముట్టు మాత్రమే. దోపిడీని స్వేచ్ఛ అని చూపే నయా ఉదార మార్కెట్టు, బజారుకెక్కి హింసాత్మక అధి పత్యాన్ని గట్టిపరిచే మతం... ఒకదానితో ఒకటి పెనవేసుకొన్న కొంగొత్త దృశ్యం ఇది!

భారతదేశంలో హిందుత్వ రాజకీయాలు... మార్కెట్టునూ, మతాన్నీ రెండింటినీ కలిపి జనాన్ని తన వైపు తిప్పుకోవడానికి వాడుకుంటున్న వైనం స్పష్టం. అంతిమ సత్యాన్ని వ్యక్తి అర్థం చేసుకోవడానికి మతం ఒక దారి చూపుతుంది. విశ్వాసపూరిత మత ప్రధాన ఆచరణ ద్వారానే అంతిమ సత్యం లేదా దైవం అనుభవం లోకి వస్తుందనేది మతం చెప్పే కీలక విషయం. దైవాన్ని లేదా అంతిమ సత్యాన్ని తెలుసుకోలేదు అంటే... అనుమానాలు, సందేహాలు లేని పూర్ణ విశ్వాసం లేకపోవడమే కారణం అనే తర్కాన్ని మతాలు వాడుతాయి అని కొంచం కొంచం పరిశీలించే వారికి తెలిసి పోతుంది.

అంటే విశ్వాసం లేకపోవడం వల్లనే విశ్వాసం ఇచ్చే అనుభవాన్ని పొందలేకపోవడానికి అడ్డంకి అనే విచిత్రమైన తర్కాన్ని

మతం ముందుకు తెస్తుంది. అంటే మతాన్ని పాటించాలి అంటే ఎటువంటి ప్రశ్నలు వేయకూడదు. రాబోయే ఫలితాలు ఎలా ఉంటాయో అన్న సంశయాత్మక దృష్టి కలిగి ఉండటం అంటేనే మతం పట్ల విశ్వాసం లేని స్థితి అవుతుంది. ఈ తర్కం నీకు అచంచల విశ్వాసం లేకుంటే (పూర్ణ విశ్వాసిగా) నీవు అనుకున్న ఫలితాలు సాధించలేవు అనే వైపునకు దారి తీస్తుంది. ఫలితాల సాధనకు గానీ, సాధించలేని తనానికి గానీ సంపూర్ణ బాధ్యత సాధకులదే తప్ప మరొకరిది కాదు అనే నిరంకుశ తర్కం ఇది.

ఇక్కడ నేటి భారత దేశంలో ఉపయోగిత ప్రధానమైన మార్కెట్ తర్కంతో మనం ఆత్మ నిర్భరత సాధించాలి అంటున్నాం. ఈ ఆత్మ నిర్భరత శిఖరాన్ని చేరుకోవాలంటే ఒక్కో అంచె ఎక్కడానికి మనం చాలా ప్రయాస పడాలి. ఒకవేళ ఆ అంచెను ఎక్కడంలో విఫలం అయితే దానికి వ్యక్తుల అసమర్థత మాత్రమే కారణం (దానికి వ్యవస్థాగత కారణాలు ఉండవు). ఎవరి విజయానికి వారే బాధ్యులు అని గుర్తు పెట్టుకోవాలి. ఈ రకమైన చట్రం నుండి చూస్తే ఇక్కడ భద్రత అన్నది ప్రధాన విలువ అని తెలుస్తుంది. స్వేచ్ఛ అనే దానికి ఇక్కడ చోటు లేదు. వ్యక్తుల సముదాయాలు తమ తమ వ్యక్తిగత బాధ్యతాయుత ప్రయత్నాల ద్వారా మాత్రమే భద్రతను సాధించుకోవాలి. నిర్భయస్థితికి చేరుకోవాలి! మొత్తంగా వ్యక్తిగత భద్రత లేక నిర్భయత్వం సాధించాలంటే స్వేచ్ఛను పక్కకు పెట్టి బాధ్యతగా పనిచేయడమే దిక్కు అనేది ఈ తర్కం చెప్పుతున్న విషయం. మన దేశంలో ఈ రకంగా మతమూ, మార్కెట్టూ రెండూ వ్యక్తి బాధ్యతకు అధిక ప్రాధా న్యతని ఇస్తూ ఉన్నాయి. అట్లా వాటి నడుమ భావనాత్మక ఐక్యత కుదిరింది.

గత రెండు దశాబ్దాలుగా సాగుతున్న ప్రైవేటీకరణా, నయా ఉదరవాద ఆర్థిక సంస్కరణలూ, వాటి ఫలితాల వల్ల… స్వాతంత్ర్యం తరువాత కాలంలో దేశంలో ప్రజలందరూ నిలబడిన జాతీయ విలువల సాధికారత నశించి పోయింది. ఇప్పుడు సంక్షేమం అంటే బుజ్జగింపో, లేక దానం పొందే అనుచరులను తయారు చేసుకునే వ్యవహారంగానో మారిపోయింది. హింసాత్మక నిరాకరణకు గురి కావడమో లేక పూర్తి విశ్వాస పూరిత విధేయత ప్రదర్శించడమో అనేవి మాత్రమే ఇప్పుడు సంక్షేమాన్ని ఆశించే వారి ముందున్న రెండు దారులుగా మారిపోయిన దుఃస్థితి ఉన్నది. అధికారానికి పూర్తిగా విధేయులుగా ఉన్నాం అని చెప్పుకునే దానికి ప్రమాణంగా 'పరాయి వారు'గా ముద్రితమైన ముస్లింలను దూరం పెట్టాలి అనే ఒత్తిడి ఎల్లెడలా ఉంది ఇప్పుడు. ఈ నిరాకరణ – విధేయత చట్రానికి బయట ఉండే వారు పూర్తిగా ఒంటరులు. అదృష్టం, అరకొర అవకాశాల కోసం ఎదురు చూసే నిస్సహాయులు! ఇదీ ఈ దేశంలో ప్రస్తుతం విపరీతంగా ఊపులో ఉన్న హిందూ ఏకీకరణకు అందుతున్న మద్దతుకు వెనుక ఉన్న వాస్తవం. పెచ్చు పెరిగిపోతున్న వ్యక్తివాదం పక్కనే ఈ హిందూత్వ సాముదాయిక ఏకీకరణ కూడా జరుగుతోంది. ఇది ఒక విషాద వైపరీత్యం.

వాస్తవానికి ఇది మతాన్ని సాయుధంగా మార్చి మార్కెట్ విస్తరణను నిరంతరాయంగా కొనసాగించే వ్యవహారం. ఇప్పుడు మన దేశంలో రాజ్య యంత్రానికి ఈ వ్యవస్థీకృత దుర్మార్గాన్ని, చట్టబద్ధ పాలన నుండి తప్పించే కొత్త బాధ్యత ఏర్పడింది. చట్టం అమలును పక్కన పెట్టివేయడం ఇప్పుడు నిత్య కృత్యం అయిపోయింది. ఢిల్లీ మత కల్లోలాల సందర్భంలో తప్పుడు కేసులు పెట్టడం, జహంగీర్ పురిలో కూల్చివేతలు… ఈ నూతన రాజ్య ప్రవర్తనకు ఉదాహరణలు. చట్ట బద్ధ పాలన అనేది మెజారిటీ ప్రజల భద్రతకు అవరోధం అనే భావం బాగా ప్రచారం అవుతున్నది. చట్టబద్ధ పాలన, రాజ్యాంగ బద్ధ ప్రవర్తన అనే మాటలకు – 'మైనారిటీలను బుజ్జగించడం' అనే విపరీ తార్థాలు తీస్తున్నారు.

మన నడుమ ఇప్పుడు మతంగా ఉన్నది సామాజిక జీవితాన్ని మొత్తంగా నయా ఉదారవాద మార్కెట్‌కు అనుకూలంగా మార్చే ప్రక్రియకి పనికి వచ్చే పెద్ద పనిముట్టు మాత్రమే. వ్యక్తివాదం, హద్దూ అదుపూ లేని ప్రైవేటు లాభాపేక్షను పెంచే నయా ఉదారవాద మార్కెట్ అనే నేలలో ఈనాటి మతోన్మాద మూలాలు ఉన్నాయన్నది గమనించాల్సిన వాస్తవం. పండుగలు ఇప్పుడు ఉత్సాహాన్నీ, ఆనం దాన్నీ పంచుకునే సందర్భాలు కావు. అవి హింసాత్మక శక్తి ప్రదర్శన లుగా మారిపోయాయి. ఈ దుర్భర పరిస్థితిని ఎదుర్కోవడానికి మన దేశంలో అంతర్గతంగా చాలా ప్రయత్నాలు జరగాలి. బయటి నుండి వచ్చి ఎవరూ మనలను కాపాడే స్థితి లేదు. తక్కువలో తక్కువ ప్రయ త్నంగా, ముందుగా ఎట్టి పరిస్థితిలోనూ హింసకు ఆమోదం తెలప కుండా, మెజారిటీ ప్రజలకు ఉన్న అభద్రత ఏమిటి? దాని కారకాలు ఏమిటి? అన్న అంశాలను పట్టించుకోవాలి. మీ మంచికీ, చెడుకూ మీరే కారణం అని చెప్పే మార్కెట్ ఆధారిత స్వచ్ఛందతా ఉప దేశాలను వెనక్కు నెట్టేసి… నియమ బద్ధమూ, వ్యవస్థీకృతమూ అయిన సంక్షేమాన్ని ముందుకు తేవాలి. విషపూరిత మత వాదానికి… మెజారిటీ, మైనారిటీ మతస్థులు ఎవరు పాల్పడినా ఎటువంటి మిన హాయింపు ఇవ్వకుండా దాన్ని ఎండగట్టి, తీవ్ర విమర్శకు నిలపడం ఇప్పుడు జరగాలి. దేశంలో నిండి పోతున్న విషాలకు ఇప్పుడు విరుగుడు కావాలి. అది దేశం లోపటినుండే రావాల్సి ఉంది. ◆



# విధానాలు సంఘ్ పరివార్ వి- అమలు మోదీది

- **ఆర్వీ రామారావు** , విశాలాంధ్ర సంపాదకులు

నరేంద్ర మోదీ చాలా అట్టహాసంగా జాతీయ రంగం మీదకు వచ్చారు. ఉపాధి అవకాశాలు పెంచుతామని, సర్వత్రా అభివృద్ధి సాధిస్తామని, సాచివేత ధోరణికి స్వస్తి చెప్తామని వాగ్దానాలు గుప్పించారు. 2014లో మళ్లీ 2019లో ఆయన సార్వత్రిక ఎన్నికలలో విజయ పరంపర కొనసాగించినప్పుడు ఆర్థిక సంస్కరణలు ఊపందుకుంటాయని, జన జీవితం శోభాయమానమవుతుందని ప్రజలు విశ్వసించారు. కానీ గత ఎనిమిదేళ్ల కాలంలో ఆయన ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాలు మొత్తం ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేశాయి. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు కరోనా మహమ్మారి ఆర్థిక వ్యవస్థను మరింత కుంగదీసింది.

2025 కల్లా భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్న ఆయన వాగ్దానం పగటి కలగానే మిగిలిపోయింది. కరోనా మహమ్మారి ఊసు కూడా లేనప్పుడు స్వతంత్ర ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం 2025 కల్లా మన ఆర్థిక వ్యవస్థ మహా అయితే 3 ట్రిలియన్ డాలర్లకు మించదని రూఢి అయిపోయింది. కరోనా కారణంగా ఆర్థిక వ్యవస్థలో 200 నుంచి 300 బిలియన్ డాలర్ల మేర నష్టపోయింది. ద్రవ్యోల్బణం అనూహ్యంగా పెరుగుతోంది. మరో వేపు స్థూల జాతీయ ఉత్పత్తి (జి.డి.పి.) మందకొడిగా ఉంది.

మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు స్థూల జాతీయోత్పత్తి 7.8 శాతం ఉండేది. అది కాస్తా 2019-20 నాటికి 3.1 శాతానికి పడిపోయింది. దశాబ్ద కాలంలో భారత జి.డి.పి. ఇంత హీన స్థాయిలో ఎన్నడూ లేదు. 2016లో పెద్ద నోట్ల రద్దు వినాశకరంగా మారింది. చెలామణిలో ఉన్న 86 శాతం కరెన్సీ హుష్ కాకి అయిపోయింది. తొందరపడి తీసుకొచ్చిన వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి.) వ్యాపార, వాణిజ్యాలను కుదేలు చేసింది. నిరుద్యోగం విలయ తాండవం చేస్తోంది. 2017-18 నాటికి నిరుద్యోగం గత 45 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 6.1 శాతానికి ఎగబాకింది. మరీ విచిత్రం ఏమిటంటే ఆ తరవాత నిరుద్యోగం రెట్టింపు అయింది. ఇవన్నీ ప్రభుత్వ లెక్కలు అంటే సి.ఎం.ఐ.ఇ. చెప్తున్న వాస్తవాలే. కానీ అధికారిక సమాచారాన్నే మోదీ ప్రభుత్వం గంప కింద కమ్మేసింది. 2021 నుంచి రెండున్నర కోట్ల మంది ఉన్న ఉపాధి కోల్పోయారు. ఏడున్నర కోట్ల మంది పేదరికంలో కూరుకు పోయారు. దేశ జనాభాలోని మూడోవంతుగా ఉన్న మధ్యతరగతి ప్రజల జీవితాలు ఛిద్రమైపోయాయి. అంతకు ముందు దశాబ్దం పాటు సాధించిన అభివృద్ధి అమాంతం మాయమై పోయిందని ప్యూ రిసర్చ్ సంస్థ అంచనా వేసింది. నిజానికి 2011-12 నుంచే పెట్టుబడులు కాళ్లీడ్వడం మొదలైంది. 2016 నుంచి పెద్ద నోట్ల రద్దు, జి.ఎస్.టి., కరోనా కారణంగా లాక్ డౌన్లు ఉపాధి అవకాశాలను కొల్లగొట్టాయి. ప్రతి ఏటా రెండు కోట్ల మందికి కొత్తగా ఉపాధి అవసరం ఉండగా కేవలం 43 లక్షల మందికి మాత్రమే మోదీ ప్రభుత్వం ఉపాధి కల్పించగలిగింది.

మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా లాంటి అందమైన నినాదాలు సృష్టించడంలో మోదీ దిట్ట అనిపించుకున్నా ఆచరణలో చేసింది శూన్యమే. మేక్ ఇన్ ఇండియా ఆధారంగా భారత్ వస్తూత్పత్తి కేంద్రంగా మారుతుందని ఆశించారు. దీనికోసం ప్రభుత్వం నుంచి ఎదురయ్యే సాచివేత సంకెళ్లను తెంచేస్తామని మఓదీ చెప్పిన మాటలు ప్రగల్భాల కింద మిగిలిపోయాయి. పెట్టుబడులు అపారంగా సమకూరుతాయన్న ఆశలు కూడా గాలిలో కలిసి పోయాయి. వస్తూత్పత్తి రంగమే జి.డి.పి.లో 25 శాతం సమకూరుస్తుందని మునగ చెట్టెక్కిస్తే అది 15 శాతం దగ్గరే చతికిలపడి పోయిందని సెంటర్ ఫర్ ఎకనామిక్ డేటా అండ్ అనాలిసిస్ అధ్యయనంలో తేలింది. దశాబ్ద కాలంగా ఎగుమతులు 300 బిలియన్ డాలర్లు దాటడం లేదు. ఇందులో ఎనిమిది సంవత్సరాలు అధికారంలో ఉన్నది మఓదీ ప్రభుత్వమేనని గమనిస్తే ఆర్థిక రంగంలో మోదీ నిర్వాకం ఏమిటో తేటతెల్లం అవుతోంది. ఎగుమతుల్లో బంలా దేశ్ లాంటి చిన్నా చితకా దేశాలు మనను వెనకకు నెట్టేసి ముందుకు దూసుకుపోతున్నాయి. ఆ దేశాల్లో శ్రామిక శక్తిని సద్వినియోగం చేసే విధానాలు అనుసరించడంవల్ల ఎగుమతులు పెరుగుతున్నాయి. ఆత్మ నిర్భరత (స్వావలంబన) అన్న మోదీ నినాదం ఎంత

ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ ఎగుమతులు పెరగకపోవడానికి ప్రధాన కారణం సుంకాలు పెంచడమే.

***

మోదీ అమలు చేయదలుచుకున్న ఆర్థిక విధానాల స్వరూపాన్ని అర్థం చేసుకుంటే తప్ప ఆర్థిక వ్యవస్థ దుస్సహంగా తయారు కావడానికి కారణం తెలియడంతో పాటు మోదీనామిక్స్ పేరుతో చెలామణి అవుతున్న ఆర్థిక విధానాల వెనక ఉన్న సైద్ధాంతిక పునాది ఏమిటో అర్థం కాదు. పాట మాటలకు కొత్త రంగు పులమడంలో మోదీ దిట్ట. స్వావలంబన అన్న మాట చాలా కాలం నుంచి మనం వింటున్నదే. నిజానికి ఏ దేశమైనా స్వావలంబన కఒసమే తపిస్తుంది. పరాధీనంగా ఉండాలని ఏ దేశమూ అనుకోదు. కానీ మోదీ మాత్రం "ఆత్మ నిర్భరత" అన్న మాటను ఉధృతంగా చెలామణిలోకి తెచ్చారు. ఇది అక్షరాలా ఆర్.ఎస్.ఎస్. సంకల్పించిన "హిందూ ఆర్థిక వ్యవస్థే"

ఆత్మ నిర్భర్ భారత్ అన్న నినాదం మోదీ నోట 2020 మే 12వ తేదీన వెలువడింది. దీనికోసం ఆయన 20 లక్షల కఒట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించారు. అంటే ఇది జి.డి.పి.లో 10 శాతం. కరోనా కష్ట కాలాన్ని అధిగమించడానికి ఈ ఆత్మ నిర్భర్ పథకాన్ని తెరమీదకు తెచ్చారు. లాక్ డౌన్ విధించిన 49వ రోజున మోదీ ఈ నినాదం ఇచ్చారు. లాక్ డౌన్ విధించే ముందు మోదీ జనానికి నాలుగు గంటల వ్యవధి అయినా ఇవ్వలేదు కానీ కరోనా సమయంలో ఆయన తరచుగా దేశ ప్రజలకు సందేశాల రూపంలో హితబోధ చేస్తూనే ఉన్నారు. 21వ శతాబ్దం భారత్ దే అన్న లక్ష్యాన్ని సాధించవలసిన బాధ్యత ప్రజల మీద మోపడంలోనే ఆయన చాకచక్యం ఇమిడి ఉంది. దీనికి కరోనా కష్టకాలమే మంచి అదును అని సెలవిచ్చారు. ఆ రోజు ప్రసంగంలో దాదాపు 33 నిముషాల పాటు ఈ ఆత్మనిర్భరత డోలు వాయిస్తూనే గడిపారు. అసలు ఆత్మ నిర్భర భారత్ అన్నది మన ప్రాచీన సంస్కృతిలో భాగమని అది మన సంస్కారం, స్వాభావం అని, దీని మూలాలు మన పవిత్ర వేద శాస్త్రాలలో ఉన్నాయని గంభీరంగా ప్రకటించారు. తాను ప్రవచిస్తున్నది సరికొత్త సిద్ధాంతమని, అది మన ఆర్థిక వ్యవస్థకు సంజీవని లాంటిదని దాని మూలాలు మన సంస్కృతిలోనే ఉన్నాయని నొక్కి చెప్పడానికి అనేక శ్లోకాలు వల్లించి పాండిత్య ప్రకర్షకు తాను తక్కువేమీ కాదని నిరూపించడానికి "మాతా భూమి: పుత్రో అహం పృథివ్యా" లాంటి శోకాలు చదివి తంటాలు పడ్డారు. భారత్ స్వయం సమృద్ధమవుతే ప్రపంచం దానంతట అదే అభ్యున్నతి చెందుతుందని చెప్పారు. నిజానికి ఈ ఆత్మ నిర్భర్ అంటే వస్తూత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం.

నిజానికి ఈ మాటలు మోదీ మదిలో జనించినవి ఏమీ కావు. అంతకు చాలా ముందే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేతలు ఈ మాటలే చెప్తూ వచ్చారు. మోదీ నోట ఆత్మ నిర్భర్ అన్న మాట వెలువడడానికి పక్షం రోజుల ముందే మే ఆరవ తేదీన ఆర్.ఎస్.ఎస్. సహ సర్ కార్యవాహ్ (సం యుక్త ప్రధాన కార్యదర్శి) దత్తాత్రేయ హొసబలే విదేశీ పత్రికా రచయితలతో మాట్లాడుతూ నూతన సామాజిక-ఆర్థిక నమూనా స్వావలంబన మీదే ఊనిక పెట్టారు. అదే స్వదేశీ భావన అని ఆయన వాక్రుచ్చారు.

అయితే అంతకు ముందే ఈ విషయం ప్రస్తావించింది ఏప్రిల్ 26న ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్. "ప్రస్తుత పరిస్థితి-మన పాత్ర" అన్న అంశం మీద ఏప్రిల్ 26న భగవత్ ప్రసంగిస్తూ "నూతన అభివృద్ధి పంథా" కావాలన్నారు. దానికి స్వావలంబన (మోదీ భాషలో ఆత్మనిర్భరత) ఆధారంగా ఉండాలన్నారు. మోదీ ఆత్మ నిర్భరతకు, హొసబలే, మోహన్ భగవత్ స్వావలంబనకు మూలాలు ఎక్కడున్నాయో అన్వేషించడం కష్టం కాదు. దత్తు పంత్ ఠేంగ్డీ "తృతీయ మార్గం" అన్న గ్రంథంలో దీనికి ఆధారాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఠేంగ్డీ బీజేపీకి అనుబంధంగా ఉన్న భారతీయ మజ్దూర్ సంఘ్, స్వదేశీ జాగరణ్ మంచ్, భారతీయ కిసాన్ సభ లాంటి సంస్థల వ్యవస్థాపకుడు. ఆయన ఈ తృతీయ పంథా గ్రంథం ప్రచురించడానికీ నేపథ్యం ఉంది. సోవియట్ యూనియన్ పతనమైన నాలుగేళ్లకు 1995లో ఈ గ్రంథం వెలువరించారు. కమ్యూనిజం పతనం అయిన తరవాత మానవాళిని పరిరక్షించడానికి, ఆర్థిక వ్యవస్థకు, సమాజానికి "హిందూ విధానమే" శరణ్యం అని ఠేంగ్డీ ప్రతిపాదించారు. పైగా "పెట్టుబడిదారీ విధానం క్షీణించిన తరవాత" ఇదే శరణ్యం అని ఆ గ్రంథంలో రాశారు. ఠేగ్డీ ప్రవచించిన తృతీయ పంథా హిందూ మతాధిపత్యానికి ప్రతి రూపమైన ఆర్.ఎస్.ఎస్. సిద్ధాంతానికి అనుగుణమైందే. దీనినే "హిందూ ఆర్థికసాస్త్రం" అని కూడా అంటారు. ఈ గ్రంథంలోనే స్వేదేశీ న్యాయవ్యవస్థ కూడా ఉండాలని చెప్పారు. అదే "మన రాజ్యాంగం" అని కూడా అన్నారు. దీని మూలాలు వేదాలు, స్మృతులు, శాస్త్రాల్లో ఉన్నాయన్నారు. ధరల నిర్ణయం, పారిశ్రామిక సంబంధాలు, సాంఘిక సంక్షేమం లాంటి రంగాలలో విధానాల రూపకల్పనకు వేద శాస్త్రాల నుంచి అనేక శ్లోకాలను ఠేంగ్డీ ఉదహరించారు. వీటిని ప్రాచీన హిందూ పాలకులు ఎంత బాగా అమలు చేశారో చెప్పారు.

ఠేంగ్డి అక్కడితో ఆగలేదు. స్వాతంత్ర్యానంతరం మన దేశంలో అనుసరించిన ఆర్థిక విధానాలు పశ్చిమ దేశాలవనీ అందువల్ల ఇవి అరాచకానికి దారి తీస్తాయని కూడా వింగడించారు. అంతర్జాతీయతను ఆయన బద్ధ వ్యతిరేకి. దానివల్లే భారత్ సమస్యల్లో

చిక్కుకుంటోందంటారు. మన్మోహన్ సింగ్ అమలు చేఇన ఈ పశ్చిమ దేశాల విధానాలు "అంతర్జాతీయ వాదాన్ని" అమలు చేయడం వినాశకరమైందన్నారు. అంతర్జాతీయ భావాలను అనుసరించడంవల్ల కులం లాంటి మన సామాజిక వ్యవస్థలు ధ్వంసం అయినాయని ఆయన తెగేసి చెప్పారు. దానివల్లే జన జీవనం నుంచి మతం మాయమైందటారు. సమస్యలన్నింటికీ మతం దూరం కావడమేనట! మోదీ చెప్తున్న ఆత్మ నిర్భర్ భారత్ అక్షరాలా ఠేంగ్డీ ప్రవచనాల సారమే. హిందూ ఆర్థిక వ్యవస్థ అంటే పారిశ్రామిక అంశాలలో ప్రభుత్వానికి సంబంధం ఉండకపోవడం. ప్రైవేటీకరణతో ఆగకుండా ప్రభుత్వ రంగ సంస్థలను పనిగట్టుకుని నాశనం చేయడంలో %ఎశీఖఎఅఱఅఎఱ% అంత పట్టుదల ఎందుకో ఈ మూలాల్లోకి వెళ్తే సులభంగా అర్థం అవుతుంది. అందుకే 23 ప్రభుత్వ రంగ సంస్థలను మఒదీ అప్పనంగా అమ్మేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్ వాణిజ్యపరంగా గనులు తవ్వే విధానాన్ని ప్రకటించడం ఠేంగ్డీ విధానాల ప్రభావంతోనే అని అర్థం చేసుకుంటే వినాశనానికి మూలం ఎక్కడుందో తేలిపోతుంది. తదనుగుణంగానే 2020 జూన్ 18న మోదీ 41 బొగ్గు క్షేత్రాల వేలానికి శ్రీకారం చుట్టారు. దీనివల్ల బొగ్గు రంగం సుదీర్ఘ లాక్ డౌన్ నుంచి విముక్తమ అయిందన్నారు. ప్రైవేటు రంగ ఆసాములు సహజంగానే దీన్ని ఆహ్వానించారు. కానీ గనుల తవ్వకం మీద ప్రభుత్వ రంగ నియంత్రణ అంతమైంది. అంటే దేశ సహజ వనరులు ప్రైవేటు రంగానికి కారు చౌకగా కట్టబెట్టడం మొదలైంది.

ఠేంగ్డీ చెప్పినట్టుగా, ఆర్.ఎస్.ఎస్. అనుసరిస్తున్నట్టుగా, సంస్కరణ అని moadii భ్రమ పెట్టున్నట్టుగా పార్లమెంటు కేవలం సమన్వయానికే పరిమితం కావాలన్న మాట. ఠేంగ్డీ లెక్క ప్రకారం పారిశ్రామిక వ్యవస్థను సామాన్యులు డబ్బు సమకూర్చాలి, వినియోగదార్లు వినియోగించుకోవాలి, పార్లమెంటు సమన్వయం చేయాలి, రాజ్య వ్యవస్థ సహాయ కారిగా ఉండాలి. ఇదంతా ధరం ప్రకారం నడవాలి. ధర్మం అంటే ఆర్.ఎస్.ఎస్. దృష్టిలో హిందూ మతం అని ప్రత్యకెంగా చెప్పనక్కర్లేదు.

"మా దృష్టిలో సంస్కరణలు అంటే ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవడం, వాటిని తుదకంటా అమలు చేయడం. అది దివాలా స్మృతి కావచ్చు, జి.ఎస్.టి. కావొచ్చు, ఆదాయపు పన్ను కావచ్చు. నేను ఎర్రకోట మీంచి ఎప్పుడో చెప్పాను. ప్రజా జీవితం లో ప్రభుత్వ ప్రమేయం ఎంత తక్కువ ఉంటే అంత మంచిది" అని మోదీ చెప్పడానికి మూలం ఆర్.ఎస్.ఎస్. ఆర్థిక విధానాలేనని రుజువు అవుతోంది.

మోదీ ప్రచారం చేస్తున్న ఆత్మనిర్భర్ విధానాన్ని ఆచరణలో పెట్టడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం "ఆత్మ నిర్భర్ ఉత్తరప్రదేశ్ రోజ్గారు యోజన" అమలు చేస్తోంది. విశ్వకర్మ శ్రమ సమ్మాన్ యోజన దీనికి తోడు. దీని ప్రకారం సాంప్రదాయ వృత్తులు అనుసరించే వారికి ప్రభుత్వం ఊతకర్ర అందిస్తుంది. ఈ పథకం కింద ప్రయోజనం పొందాలంటే సాంప్రదాయిక వృత్తులు అనుసరించే వారే అయి ఉండాలి. అంటే కులవృత్తులు చేసే వారికి ఆసరాగా ఉండడంద్వారా కులవ్యవస్థను మరింత పదిలం చేస్తున్నారు. ఈ సాంప్రదాయిక వృత్తులన్నీ కుల వృత్తులే. "ఉత్పత్తి పద్ధతులు మార్చేసినందువల్ల దాదాపు 3,000 పై చిలుకు సాంప్రదాయిక వృత్తులు గిట్టుబాటు కాకుండా, పనికి రాకుండా పోయాయి. ఇది కుల వ్యవస్థను ధ్వంసం చేసింది. వృత్తి ఆధారంగా సంఘాలు ఉండాలి" అని చెప్పింది ఠేంగ్డీ అని గుర్తిస్తే మోదీ ఆర్థిక విధానాల మూలాలు బయటపడ్తాయి. ఇంకా కొంచెం లోతుగా పరిశీలిస్తే తన భావాలకు ప్రేరణ ఆర్.ఎస్.ఎస్. రెండవ అధిపతి ఎం.ఎస్. గోల్వాల్కర్ అని ఠేంగ్డీ నిర్మొహమాటంగానే చెప్పారు. తృతీయ పంథా గ్రంథాన్ని గోల్వర్కర్ కే అంకితం ఇచ్చారు.

మోదీ ప్రతిపాదించిన "స్కిల్ ఇండియా", "ముద్ర యోజన" మొదలైనవన్నీ ఠేంగ్డీ అడుగుజాడలే. ఠేంగ్డీ ప్రవచించిన విధానాలకు మఒదీ నడుస్తున్న మార్గానికి భేదం కనిపెట్టడం కష్టమే.

బడా పారిశ్రామికవేత్తలకు రాయితీలు, సామాన్యులకు ఏటా రూ. ఆరు వేల పంపిణీ, కరోనా కాలమంతా ఉచితంగా అయిదేసి కిలాల ఆహార ధాన్యాలు మొదలైనవన్నీ జన సంక్షేమ కార్యక్రమాల రూపంలో ఉన్న ఎన్నికల తంత్రంలో భాగమైన ఛద్మవేష ధారణే. గుజరాత్ నమూనా గురించి ఇప్పుడు బీజేపీ, సంఘ్ పరివార్ ప్రస్తావించడమే మానేశాయి. అది కేవలం మోదీ జాతీయ స్థాయిలో అడుగిడడానికి వేసిన పాచిక మాత్రమే. మోదీ కూడా అచ్ఛే దిన్ పేరే ఎత్తడం లేదు. మోదీ చూపిన అభివృద్ధి పంథా కేవలం ఎండమావి అని పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం, వమ్ము అవుతున్న వాగ్దానాలు, సిథిలమవుతున్న కలలు నిరూపిస్తున్నాయి. మోదీనామిక్స్ కేవలం ముసుగే. లోపల ఉన్నది సంఘ్ ఆర్థిక విధానమే. దీన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే కరోనా కాలంలో అదానీ, అంబానీ లాభాలు ఎలా పెరిగాయో, జనం ఎలా కష్టాలు పడ్డారో అర్థం అవుతుంది.

బతుకీడ్వడమే జనాభాలో అత్యధికులకు దుర్భరం అయినప్పుడు ఆరోగ్యం, విద్య, భద్రత, గౌరవప్రదమైన జీవితం, ఆర్థిక స్థాయి, కనీస అవసరాల వంటివాటి గురించి మాట్లాడడం ప్రజలను అవమానించడమే. ◆



# అద్దెకు జాతీయ వనరులు!

- మాడభూషి శ్రీధర్, డీన్ స్కూల్ ఆఫ్ లా, మహేంద్ర యూనివర్సిటీ




**జా**తి సంపద కొందరి గుప్పిట్లో ఇరుక్కుపోకుండా పాలన సాగించాలని, వనరులపై గుత్తాధిపత్యం ఉండకూడదని మన సంవిధానం చాలా స్పష్టంగా ఆదేశిక సూత్రాల్లో వివరించింది. ఈ సూత్రాలు కోర్టుల్లో అమలు చేయడానికి వీలుకాదని అధికరణ 37 చెప్పినప్పటికీ, పాలనా విధానాల రూపకల్పనలో అవి విధిగా పాటించవలసిన మౌలిక సూత్రాలని కూడా స్పష్టం చేసింది. ప్రాథమిక హక్కులవలె కోర్టుల్లో సవాలు చేయడానికి వీల్లేదు కనుక ఆదేశిక సూత్రాలు పాటించనవసరం లేదన్నట్టు ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. ఎన్డిఎ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి ఆదేశిక సూత్రాలకు పూర్తి భిన్నంగా, రాజ్యాంగంతో మాకేమిటి అనే ధోరణిలో జాతీయ సంపదను, వనరులను ప్రభుత్వేతర ప్రయివేటు సంపన్న వాణిజ్యవేత్తలు కొందరికి మాత్రమే కట్టబెట్టడం దారుణం. సంవిధాన విలువలను విస్మరించి, సమపాలనా విధానాన్ని తొక్కిపెట్టి, కొందరిని మాత్రమే సంపన్నులను చేస్తూ వందల కోట్ల జనం మీద లక్షల కోట్ల రూపాయల ఆర్థిక భారాన్ని మోపే దుష్పరిపాలనకు 'నేషనల్ మానిటైజేషన్' ఒక తాజా ఉదాహరణ.

రైల్వే, పవర్ గ్రిడ్, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కేంద్రాలు, విమానాశ్రయాలు, రేవులు... ఇవన్నీ మన జాతి సంపద. దేశం సొమ్ము. తమను నమ్ముకున్న జనానికి ప్రభుత్వం ఇచ్చే కొత్త సందేశం – 'మీ సొమ్ము' (వనరులు) అమ్మేస్తాం లేదా అద్దెకిస్తాం' అని. వంద లక్షల కోట్ల రూపాయల కొత్త మౌలిక వనరులు సృష్టించడానికిగాను ఆరులక్షల కోట్ల రూపాయలను సేకరించాలని, అందుకోసం నాలుగేళ్లపాటు జాతీయ మౌలిక వనరులు అద్దెకు ఇవ్వడం ఒక్కటే మార్గమని నీతి ఆయోగ్ అభిప్రాయం. రోడ్లు, విద్యుచ్ఛక్తి, విమానాశ్రయాలు, ఓడరేవులు, టెలికాం, ఆప్టికల్ ఫైబర్, రైలు పట్టాలు, రైల్వే స్టేషన్లుబీ స్పోర్ట్స్ ఆడిటోరియంలు, పెట్రోలియం సరఫరా సంస్థలు వంటి 15 రంగాలను కేంద్రం అద్దెకు ఇవ్వడానికి గుర్తించింది. కేంద్రం కొంత సంపదను అద్దెకిస్తూ, మిగిలినవి రాష్ట్రాలు ఇదే రీతిలో అద్దెకు ఇచ్చేందుకు ప్రోత్సహిస్తోంది. అందుకుగాను రాష్ట్రాలకు ప్రోత్సాహకాలను ఇస్తుందట. మరిన్ని మౌలిక వనరులు కల్పించడానికే అద్దెకి ఇచ్చేందుకు సిద్ధపడ్డామని ప్రభుత్వం ప్రకటించింది.

దీని పేరు నగదీకరణ. అమ్మడం కాదు. కాని అమ్మివేయనందుకు సంతోషపడేదేమీ లేదు. వ్యక్తిగత వ్యాపారులకో సంస్థలకో ఆ మౌలిక వనరుల పైన నిర్వహణ ఆధిపత్యం ఇవ్వడంపైన భయాందోళనలు ఉన్నాయి. ప్రయివేటైజేషన్ అంటే పూర్తిగా అమ్ముకోవడం. పెట్టుబడులు ఉపసంహరించడం. సంస్థపైన పూర్తి ఆధిపత్యం వదులుకోవడం. కాని మానిటైజేషన్లో అమ్మివేయడం ఉండదు. ఉదాహరణకు రహదారుల నగదీకరణ

అంటే, ఆ రహదారిపై వచ్చివెళ్లే వారినుంచి ఫీజులు, పన్నులు సేవల ఖరీదులు వసూలు చేయడం. ఇది టోల్ పన్ను మాదిరిగానే ఉంటుంది. రోడ్డు నిర్మించిన కాంట్రాక్టరు ఖర్చుచేసిన డబ్బుతోపాటు లాభం వచ్చేవరకు కొంతకాలం పాటు టోల్ వసూలు చేసుకుంటారు. కాని ఇక్కడ ముందే వేలం పాడినట్టు పాడి ఆ రహదారి భాగం మీద సర్వహక్కులు ఆ కాంట్రాక్టరు చేతిలో పెడతారు. టోల్ ఎంత వేయాలో, వినియోగదారుల నుంచి ఎంత డబ్బు వసూలు చేయాలో అతని ఇష్టమే. వీరిపైన అదుపు చేసే వారెవరైనా ఉంటారా? టోల్ వసూళ్లు కాంట్రాక్టర్ పెట్టుబడులు కొంత లాభంతో సమకూరిన తరువాత ఆగుతాయి. కాని అద్దెకు తీసుకున్నవాడు కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం 20 ఏళ్లో 30 ఏళ్లో వసూళ్లు కొనసాగిస్తాడు.

నిజానికి ఈ పని ప్రభుత్వం ఇదివరకే మొదలు పెట్టింది. 'Infrastructure investment trust' (InvIT) అనే ఒక మౌలికవనరుల పెట్టుబడుల ట్రస్టును ఏర్పాటు చేసి పవర్ గ్రిడ్ కార్పొరేషన్లోని విద్యుత్ సరఫరా లైన్లు, నెట్వర్కును వాడుకుని నగదును సంపాదించే ప్రయత్నం చేసింది. అదే విధంగా జాతీయ రహదారులు, గ్యాస్ పైపు లైన్లు, రైల్వేట్రాక్ల విషయంలో కూడా చేద్దామని ఆలోచిస్తున్నారు. ఈ వనరులతో పాటు భూమాతను కూడా 'టైటిలింగ్ ఆఫ్ ల్యాండ్'ను కూడా మానిటైజేషన్ చేయాలనుకుంటున్నారు. ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం ప్రతిపాదనలను కొనసాగిస్తూనే అదనంగా ఈ సంవత్సరం అద్దెకి ఇవ్వడం (ఎన్ఎంపి) ద్వారా రూ.88 వేల కోట్లు సంపాదించాలని నిర్ణయం. బడ్జెట్లో పేర్కొన్న విధంగా లక్షా 75 వేల కోట్ల రూపాయల కోసం ఎయిర్ ఇండియా, భారత్ పెట్రోలియం వంటి ప్రభుత్వరంగ సంస్థలను విక్రయించడం కూడా ఆగదనీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఆరులక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను 'అద్దెకిస్తా పథకం' ద్వారా నాలుగేళ్లలో సాధిస్తామంటున్నారు. మొత్తం 111 లక్షల కోట్లతో కొత్త వనరులు కల్పించి, దేశాన్ని ఆర్థిక అగ్రరాజ్యంగా నిలబెడతామని బంగారు కలలు చూపిస్తున్నారు. నిజంగానే నాలుగేళ్లలో ఇంత డబ్బు వస్తుందా?

ఇంత పెట్టుబడి పెట్టిన వాడు ఆ డబ్బు మళ్లీ జనం నుంచి గోళ్లూడగొట్టి వసూలు చేసుకోడా? రెట్టింపు లాభం తీసుకోడా? అంటే నాలుగేళ్లలో ఎన్డిఎ ప్రభుత్వం మన జనం నెత్తిన 12 లక్షల కోట్ల రూపాయల అదనపు ధరల భారం మోపబోతున్నదన్నమాట. ఏళ్లతరబడి ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు సంస్థలకు కట్టబెడితే రోడ్లమీద, రేవుల్లో, ఎయిర్ పోర్టుల్లో, పవర్ గ్రిడ్లో గ్యాస్ పైపుల విషయంలో పెరిగే ధరలకు సామాన్యులు బలికావలసిందేనా? ఇదీ సమస్య. పనీ పాటూ లేకుండా, అనుభవం లేకుండా, ముందు కాంట్రాక్టులు సాధించి, తరువాత బాంకులనుంచి అప్పులు తెచ్చుకుని, లాభాలకోసం జనాన్ని పెంచిన ధరలతో పీడించడమనే దారుణాలు ఈ అందమైన నగదీకరణ వెనుక ఉండే పచ్చినిజాలు. ఈ దారుణాలు ఆపడానికి, జనాన్ని ఆదుకోవడానికి ఏదైనా చట్టబద్ధమైన వ్యవస్థను తయారుచేసారా అంటే అదీ లేదు. చట్టం లేదు, విధానం లేదు, ప్రజా ప్రయోజనాలను రక్షించే నియమాలు లేవు. అంతే కాదు, ప్రభుత్వ వనరులపైన ఆరు లక్షల కోట్లు పెట్టుబడి పెట్టడమంటే అంత డబ్బు ప్రయివేట్ రంగంలో పెట్టుబడులు తగ్గినట్టే కదా?

రహదారి, రైల్వే, విమాన, నౌకా, విద్యుచ్ఛక్తి వనరులన్నీ ప్రభుత్వ సేవా సంస్థలు. ఈ సేవలు సరిగ్గా నిర్వహించడమే పాలన. జనాన్ని ప్రయివేటు వ్యక్తుల అధీనంలోకి పంపడమంటే ఇవి పాలననుంచి జారిపోవడం అని అర్థం. ఇదా ప్రభుత్వం అంటే? రహదారులు (రోడ్లు) మనదేశంలో లక్షా 32 వేల కిలోమీటర్ల పొడవున్నాయి. 640 కిమీ రోడ్లు నాలుగు లేన్లవైతే, 620 కిమీ రోడ్లు ఆరు లేన్ లవి. వీటి నిర్వహణను ఏ విధంగా ఇస్తారు? వీటిలో ఏ రోడ్లు, ఎంత మేరకు ఇస్తారు? ఎంతకివ్వాలి? 60వేల మెగావాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసే వనరులు కేంద్ర ప్రభుత్వ అధ్వర్యంలో ఉన్నాయి. 137 విమానాశ్రయాలు ఉన్నాయి. 12 పెద్ద ఓడరేవులు ఉన్నాయి. 69 వేల టెలి టవర్లు ఉన్నాయి. 5.2 లక్షల కిలోమీటర్ ఆప్టిక్ ఫైబర్ ఉంది. 7300 రైల్వే స్టేషన్లున్నాయి. వీటిని ఏవిధంగా అద్దెకిస్తారు. వీటి నిర్వహణపై అధికారాలను, అదుపును ఏవిధంగా ఇవ్వాలో వివరాలు ఇంకా రూపొందించవలసి ఉంది. ఉదాహరణకు రైల్వే స్టేషన్లలో 350 మాత్రమే ఆదాయాన్నిచ్చేవి. రాబోయే 30 ఏళ్లలో ఈ స్టేషన్లనుంచి 78వేల కోట్లరూపాయల ఆదాయం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. లాభాలు రాని, నష్టాలు మాత్రమే వచ్చే రైల్వే స్టేషన్లు రైల్వే విభాగానికి మిగిల్చి, లాభాలు పండించే స్టేషన్లను ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తే అసమానతలు పెరిగిపోవా? కొన్నిస్టేషన్లో సేవలకు అధిక ధరలు, ఇతర స్టేషన్లలో తక్కువ ధరలు ఉండవచ్చా. కొన్ని స్టేషన్ లలో ప్లాట్ ఫాం టిక్కెట్తో మొదలై ప్రయాణికుల టిక్కెట్ల ఛార్జీలు విపరీతంగా పెంచుకోవచ్చా?

అమ్మేద్దామా అద్దెకిద్దామా అనే తాజా బృహత్ప్రణాళికలో అనేక అనుమానాలు భయాలు తలెత్తుతున్నాయి. మొదటి భయం –ధరలు విపరీతంగా పెరగడం, జనం సంక్షేమం తరగడంబీ రెండో

(తరువాయి 44 వ పేజీలో....)



# మోడీ పాలనలో : ఆర్థిక వృద్ధి కంటే మత విభజనకే పెద్ద పీట !

**- ఎం. కోటేశ్వరరావు**

జాతిపిత మహాత్మాగాంధీని హతమార్చిన గాడ్సే మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌ను ఒక గౌరవ ప్రదమైనదిగా జనం చేత ఆమోదింప చేసేందుకు, జాతీయ వాదం పేరుతో సమాజంలో చీలికలు తెచ్చేందుకు నరేంద్రమోడీ, ఇతర పాలకపెద్దలు కేంద్రీకరించిన తీరును ఎనిమిదేండ్లలో చూశాం. దీనిలో వందో వంతైనా సరైన ఆర్థిక విధానాలపట్ల చూపితే ఎనిమిదేండ్ల తరువాత నరేంద్రమోడీ సర్కార్ వైఫల్యాల గురించి జనం చర్చించుకోవాల్సిన అవసరం ఉండేది కాదన్నది ఒక అభిప్రాయం. ఎనిమిదేండ్ల నరేంద్రమోడీ పాలన ఆర్థికలక్ష్యాల సాధనలో వైఫల్యం చెందినట్లు బిజెపి నేత సుబ్రమణ్య స్వామి స్వయంగా చెప్పారు. 2016 నుంచి వృద్ధి రేటు దిగజారిందన్నారు. మీరెందుకు నరేంద్రమోడీకి సలహా ఇవ్వటం లేదన్న ప్రశ్నకు స్వామి చెప్పిన సమాధానం మోడీని అభిశంచించటమే." పూర్వకాలపు రుషుల ఉద్బోధనల ప్రకారం వినే శ్రద్ధ ఉన్నవారితో మాత్రమే విజ్ఞానాన్ని పంచుకోవాలి" అన్నారు. నరేంద్రమోడీకి సరైన ప్రత్నామ్నాయం లేదని అభిమానులు చెబుతున్నారు కదా అన్నపుడు " తాము దేశం వదలిపెట్టిన తరువాత భారత్ పతనం అవుతుందని బ్రిటీష్ సామ్రాజ్యవాదులు కూడా చెప్పారు, జరిగిందా అని స్వామి ఎదురు ప్రశ్నించారు. మరోసారి రాజ్యసభకు పంపే అవకాశం లేదని తెలుసుకొని స్వామి ఇలా మాట్లాడుతున్నారని కొందరు చిత్రించవచ్చు గాని వాస్తవం ఏమిటో వారు నోరు విప్పలేరు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక రంగానికి సంబంధించి కొన్ని ముఖ్య అంశాలను చూద్దాం.

2022 నాటికి దేశ జిడిపిలో పారిశ్రామిక ఉత్పత్తి రంగం వాటాను 25శాతానికి పెంచే విధంగా మేక్ ఇన్ ఇండియా పధకాన్ని 2014లో ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. దీనికి గాను ఏటా 12-14శాతం చొప్పున ఈ రంగంలో వృద్ధి రేటు సాధిస్తామని చెప్పారు. ఎనిమిదేండ్ల తరువాత చూస్తే ఇరవై ఐదుశాతానికి పెంచే లక్ష్యాన్ని 2025కు చేరనున్నట్లు కేంద్ర ప్రకటించింది. దీనికోసం నడిపించిన ప్రహసనాలు ఎన్నో. తొలి రోజుల్లో నరేంద్రమోడీ ఎడతెరిపిలేకుండా విదేశాలు చుట్టి రావటం గురించి విమర్శ వస్తే దేశంలో పెట్టుబడులు సాధించేందుకు, విదేశాల్లో అడుగంటిన ప్రతిష్టను తిరిగి నెలకొల్పేందుకే పర్యటనలని అధికారపక్షం బుకాయించింది. ప్రపంచబాంకు సులభతర వాణిజ్య సూచికలో మన స్థానం 2014లో 134 ఉండగా 2019 నాటికి 63వ స్థానానికి నరేంద్రమోడీ తీసుకుపోయారు. అంతిమంగా సాధించిందేమిటి అంటే డబ్బాకొట్టుకొనేందుకు రాంకు పనికి వచ్చింది తప్ప జరిగిందేమీ లేదు. జిడిపిలో పారిశ్రామిక ఉత్పత్తి వాటా 25శాతానికి చేరే సంగతి అటుంచి మోడీ ఏలుబడిలోకి వచ్చేనాటికి ఉన్న 16.3శాతం కాస్తా 2020-21నాటికి 14.3శాతానికి దిగజారింది. కరోనా కారణంగా దిగజారింది అని ఎవరైనా బుకాయించవచ్చు, అసలు అంతకు ముందు పెరిగిందేమైనా ఉంటే కదా ? అందువలన 2025 నాటికి కనీసం 2014నాటి స్థితికైనా చేరతామా అన్నది ప్రశ్న.

ఈ దుస్థితికి కారణమెవరు? రెండు ఇంజన్ల పేరుతో కేంద్రంలో సుస్థిరమైన ప్రభుత్వం, మెజారిటీ రాష్ట్రాల్లో బిజెపి, దాని మిత్రపక్షాలే అధికారంలో ఉన్నందున దిగజారుతున్న ఆర్థిక దుస్థితికి వారే బాధ్యులు. ప్రతిదానికీ చైనాతో పోల్చుకుంటున్న మనం కరోనా వచ్చిన కారణంగా చైనాలో వృద్ధి రేటు తగ్గింది తప్ప మన మాదిరి తిరోగమనంలో లేదు. చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలన్నట్లు ప్రాణాంతకం కాకున్నా పరిమితంగా కేసులు నమోదైనప్పటికీ తాజాగా షాంఘై వంటి పట్టణాల్లో లాక్‌డౌన్ అమలు జరిపింది చైనా. మన దేశంలో అలాంటి పరిస్థితి లేకున్నా కరోనాకు ముందున్న ఆర్థిక వృద్ధి స్థాయికి ఇంకా చేరుకోలేదు. ఎప్పటికి చేరుకుంటుందో కూడా చెప్పలేము.

దేశంలో పారిశ్రామిక రంగం దిగజారటం లేదా స్థిరంగా ఉంటున్న ధోరణి తప్ప పెరుగుదల కనిపించటం లేదు. 2006 నుంచి 2012వరకు పారిశ్రామిక కార్మికులు ఏటా 9.5శాతం పెరిగితే తరువాత ఆరు సంవత్సరాల్లో అది 7.4శాతానికి దిగజారింది. నిజవేతనాల పతనం కారణంగా కరోనాకు ముందే వినియోగం కూడా తగ్గింది. 2019లో వార్షిక ప్రాతిపదికన నిజవేతనాలు 2.8శాతం తగ్గగా 2020 జనవరి-మార్చి నెలల్లో తగ్గుదల 5.3శాతం ఉంది. సిఇడిఏ-సిఎంఐఇ సమాచారం ప్రకారం 2017-2021

మధ్య ఉత్పాదక రంగంలో కార్మికుల సంఖ్య ఐదు నుంచి 2.9కోట్లకు తగ్గింది. స్టాక్‌మార్కెట్లో నమోదైన కంపెనీల వేతన బిల్లు 2018 సెప్టెంబరులో రు.53వేల కోట్లుండగా 2020జూన్ నాటికి రు.48,500 కోట్లకు తగ్గింది.2021 సెప్టెంబరులో రు.60వేల కోట్లుగా ఉంది.ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే నిజవేతనాలు తగ్గినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. పారిశ్రామిక రంగంలో ఉపాధి తగ్గటంతో పాటు నిజవేతనాల పతనం కారణంగా గత దశాబ్దిలో గృహస్తుల రుణాలు రెట్టింపైనట్లు ఎస్‌బిఐ నివేదిక వెల్లడించింది.2018 భారత రుణ-పెట్టుబడి నివేదిక ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 84శాతం రుణభారం పెరగ్గా పట్టణాల్లో 42శాతం ఉంది.

మేకిన్ ఇండియా పథకాన్ని ఉపాధి పెంపుదల, విదేశాలకు వస్తు ఎగుమతులు, మన దిగుమతులు తగ్గించే లక్ష్యంతో ప్రకటించారు. మన దిగుమతుల బిల్లు తగ్గిన దాఖలాలుగానీ, ఎగుమతులు పెరిగిన ఆనవాలు గానీ కనిపించటం లేదు.2021-22 బడ్జెట్‌లో ఆత్మనిర్భర పేరుతో ఉత్పాదకతతో ముడిపడిన ప్రోత్సహకాల కోసం కేంద్ర ప్రభుత్వం రు.1.97లక్షల కోట్లు కేటాయించింది. చిత్రం ఏమిటంటే ఈ పథకం కింద లబ్ది పొందేందుకు పరుగులు పెట్టాల్సిన కంపెనీలు మన దేశం నుంచి వెళ్లిపోతున్నాయి. ఎగుమతుల కోసం విద్యుత్ వాహనాలను తయారు చేసేది లేదని, మీ ప్రోత్సాహం అవసరం లేదని ఫోర్డ్ కంపెనీ 2022 మే 12న ప్రకటించింది. ఇక్కడున్న ఉత్పాదక సౌకర్యాలను వేరే దేశాలకు తరలించనున్నట్లుగా తెలిపింది. దిగుమతి పన్నులు ఎక్కువగా ఉన్న కారణంగా అమెరికా, చైనాల్లో తయారైన విద్యుత్ వాహనాలను మన దేశంలో విక్రయించరాదని మరుసటి రోజే టెస్లా నిర్ణయించింది. ఫోర్డ్ కంపెనీ మూత కారణంగా నాలుగువేల ఉద్యోగాలు ప్రత్యక్షంగానూ, దేశమంతటా దాని డీలర్లు పరోక్షంగా సృష్టించిన మరికొన్నివేల ఉద్యోగాలు వరోక్షంగా హరీమంటున్నాయి.2017తరువాత జనరల్ మోటార్స్, మాన్ ట్రక్స్, హార్లేడేవిడ్సన్,యునైటెట్ మోటార్స్ మూతపడిన కారణంగా డీలర్ల పెట్టుబడి రు.2,485 కోట్లు హరీ మన్నదని, 64వేల మందికి ఉపాధి నష్టం జరిగిందని డీలర్స్ సంఘం పేర్కొన్నది.

విదేశాల్లో మన ప్రతిష్ట పెంచామని, పెట్టుబడులను ఆకర్షించినట్లు, సులభతర వాణిజ్య పరిస్థితిని కల్పించినట్లు నరేంద్రమోడీ అండ్ కో చెబుతున్నదానిలో ఆర్భాటం-వాస్తవమెంతో ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. రాష్ట్రాల్లో వివిధ రకాల పన్నులు విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు చికాకు తెప్పిస్తున్నట్లు, వాటి బదులు ఏక రూప పన్నును అమలు చేస్తే ఉత్సాహంగా పెట్టుబడులు పెడతారంటూ జిఎస్‌టిని తెచ్చారు. అది కొన్ని రంగాలను దెబ్బతీసింది తప్ప పరిస్థితిని చక్కదిద్దలేదన్నది తెలిసిందే. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ వార్షిక నివేదికల ప్రకారం 2014-2021 కాలంలో నమోదైన విదేశీ కంపెనీల పెరుగుదల 2016లో 3.9శాతం ఉండగా 2021లో అది 1.5శాతానికి తగ్గింది.(216 నుంచి 63కు తగ్గాయి) ఇక చురుకుగా ఉండే కంపెనీలు ఇదే కాలంలో 80 నుంచి 66శాతానికి తగ్గాయి. ప్రపంచ ఉత్పాదక కేంద్రంగా చైనాను పక్కకు నెట్టేసి మన దేశం ఆవిర్భంచనుందని ఎనిమిదేండ్ల క్రితం ఊదరగొట్టారు. గతేడాది చైనా నుంచి పెద్ద సంఖ్యలో కంపెనీలు మన దేశానికి రానున్నాయని స్వయంగా ప్రధాని నరేంద్రమోడీ సిఎంల సమావేశంలో చెప్పారు. పత్రికలు 1000 అని రాశాయి. నిజమే అనుకొని కొందరు సిఎంలు సదరు కంపెనీలకు ఎర్రతివాచీలు పరిచేందుకు సిద్ధం అన్నారు. దీని ప్రహసనం 2021పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికలో వెల్లడైంది.”కరోనా అనంతర ఆర్ధిక రంగంలో పెట్టుబడుల ఆకర్షణ:భారత్‌కు సవాళ్లు,అవకాశాలు “ అనే శీర్షిక కింద చైనా నుంచి వస్తున్నట్లు చెప్పిన కంపెనీల గురించి ఏం చెప్పారో చూడండి.’” మీడియాల వార్తల ద్వారా తెలుసుకున్నదేమంటే ఈ కంపెనీల్లో అత్యధికం తమ సంస్థలను వియత్నాం, థాయిలాండ్, తైవాన్ తదితర దేశాలకు తరలించాయి తప్ప భారత్‌కు వచ్చింది కొన్ని మాత్రమే.” అసలు పార్లమెంటరీ కమిటీ పత్రికా వార్తల మీద ఆధారపడటం ఏమిటి ? ప్రభుత్వం తగ్గర సమాచారం లేదా ? ఉంటే అలా రాసి ఉండేవారు కాదు. చైనా నుంచి కంపెనీలు వెలుపలికి రావటం, విదేశాల నుంచి వెళ్లి అక్కడ కంపెనీలు పెట్టటం కొత్త కాదు. జపాన్ నొమురా బాంకు 2018 ఏప్రిల్ నుంచి 2019 ఆగస్టు వరకు చైనా నుంచి 56 కంపెనీలు వెలుపలికి తరలితే భారత్‌కు వచ్చింది కేవలం మూడే అని తెలిపింది. దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి సూచిక(ఐఐపి) 2013 నుంచి 2022 వరకు వార్షిక పెరుగుదల సగటు 2.9శాతం, కాగా ఇదే కాలంలో జిడిపి సగటు 5.5శాతం ఉంది. అంతకు ముందు 2006 నుంచి 2012వరకు సగటు ఐఐపి 9శాతం ఉంది. సామర్థ్య వినియోగం 2015 నుంచి 2022 వరకు 70.9శాతం ఉంది, అది పదేండ్ల క్రితం 80శాతం. అంటే ఉన్నదాన్ని కూడా వినియోగించుకోలేకపోతున్నాము. ఇదంతా మేకిన్ ఇండి పిలుపు తరువాత జరిగిందే సుమా !

తాను వస్తే జనాలకు మంచి రోజులు తెస్తామని మోడీ చెప్పారు. వాటికి వేతనాలు కీలకం. దేశంలో నిజవేతనాల రేటు పెరుగుదల ఎలా ఉందో చూద్దాం. (అంకెలు శాతాలని

గమనించాలి.) మొత్తంగా చూసినపుడు 2011-12కు ముందు ఉన్న పెరుగుదలతో పోల్చితే తరువాత కాలంలో గణనీయంగా తగ్గింది. రెగ్యులర్ సిబ్బందికి పెరగకపోగా తగ్గిపోవటాన్ని చూడవచ్చు.(ఆధారం ఇనిస్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్, వర్కింగ్ పేపర్ 01-2020)

2004-05 నుంచి 2011-12 ×××××××× 2011-12 నుంచి 2017-18

తరగతి ××× మొత్తం ×× కాజువల్ ×× రెగ్యులర్న్‌మొత్తం ×× కాజువల్ ×× రెగ్యులర్

గ్రామీణ ××× 6.10 ×× 8.04 ×× 3.02 ××× 2.91 ×× 2.34 ×× -0.22

పట్టణ ××× 4.55 ×× 6.42 ×× 4.10 ××× -1.49 ×× 1.10 ×× -2.05

పురుష ××× 4.77 ×× 7.08 ×× 3.78 ××× 0.75 ××× 2.23 ×× -1.75

మహిళ ××× 7.92 ×× 8.24 ×× 4.87 ××× 2.31 ×× 1.34 ×× -1.38

మొత్తం ××× 5.52 ×× 7.75 ×× 3.91 ××× 1.05 ×× 2.26 ×× -1.76

రైతాంగానికి 2022 నాటికి వారి ఆదాయాలను రెట్టింపు చేస్తామన్నది ప్రధాని నరేంద్రమోడీ చేసిన వాగ్దానాలలో ఒకటి. అది నెరవేర్చకపోగా వారికి మొత్తంగా ఎసరు పెట్టి కార్పొరేట్లకు అప్పగించేందుకు మూడు సాగు చట్టాలను రుద్దేందుకు పూనుకున్న అంశం తెలిసిందే. ఏడాది పాటు చారిత్రాత్మకంగా జరిపిన పోరు నేపథ్యంలో క్షమాపణలు చెప్పి మరీ వాటిని రద్దు చేశారు. కనీస మద్దతు ధరకు చట్టబద్దత కల్పించే అంశం గురించి ఒక కమిటీని వేస్తామని ప్రకటించి ఆరునెలలు దాటినా దాని ఊసే లేదు.

2015-16ను ప్రాతిపదికగా చేసుకొని 2022 నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని చెప్పారు. దీనికి గాను ఏటా 10.4శాతం వార్షిక వృద్ధి రేటు అవసరమని అంచనా. దీనికి సంబంధించి ప్రభుత్వం వద్ద ఇంతవరకు సమగ్ర సమాచారమే లేదు.వ్యవసాయ కుటుంబాలకు సంబంధించి అందుబాటులో ఉన్న తాజా సమాచారంగా 2019 జనవరి-డిసెంబరు మధ్య సేకరించిన 77వ దఫా ఎన్ఎస్ఎస్ఓ వివరాలే ఉన్నాయి. దాని ప్రకారం 2012-13లో రైతు కుటుంబ నెలవారీ ఆదాయం సగటున రు.6,426 ఉండగా 2019నాటికి రు.10,218కి పెరిగింది. అంటే నరేంద్రమోడీ ప్రకటనతో నిమిత్తం లేకుండానే ఇది జరిగిందని గమనించాలి. అందువలన ఎలాగూ ఎంతో కొంత పెరుగుతుంది గనుక దాన్ని తన ఖాతాలో వేసుకోవచ్చన్న ఆలోచన బిజెపికి వచ్చిందా అన్న ప్రశ్న తలెత్తుతున్నది. 2019నాటి పెరుగుదల వివరాలను గమనిస్తే అసలు కథ తెలుస్తుంది. రైతులు తమ పొలంలో సాగుతో పాటు వేతన కూలీలుగా, కోళ్లు, పాడిపశువుల పెంపకం వంటి ఉప వృత్తుల ద్వారా కూడా ఆదాయాన్ని పొందుతారు.రైతుల ఆదాయవనరులు, వాటి తీరు తెన్నులు ఇలా ఉన్నాయి.నెలవారీ ఆదాయం రూపాయల్లో ఉంది.

వనరు ××××× 2012-13 ×××× 2018-19

వేతనం ××××× 2,071 ×××× 4,043

పంటలు ××××× 3,081 ×××× 3,798

పశుపాలన ×××× 763 ×××× 1,582

ఇతరం ××××× 511 ×××× 795

మొత్తం ××××× 6,426 ×××× 10,218

పై వివరాలను గమనించినపుడు వేతన, పశుపాలన ఆదాయం పెరుగుదల దాదాపు రెట్టింపు ఉంది.పంటల ఆదాయం ఆమేరకు లేదు. ఇతరంగా వచ్చే ఆదాయం అంటే కౌలు ద్వారా ఇతర అవసరాలకు భూమిని ఇవ్వటం ద్వారా పొందేది. 2020-21 ఆర్థిక సర్వేలో వెల్లడించిన వివరాల ప్రకారం 2014-2021 సంవత్సరాల్లో పరిస్థితి అంచనా సర్వే(ఎస్ఏఎస్) ప్రకారం రైతులకు వచ్చే ఆదాయంలో పంటల నుంచి వచ్చే మొత్తం 48 నుంచి 37శాతానికి తగ్గింది.వేతనం ద్వారా వచ్చే మొత్తం 32 నుంచి 40శాతానికి, పశుపాలన ద్వారా వచ్చేది 12 నుంచి 16శాతానికి పెరిగింది. దీన్ని బట్టి పంటలకు తగినంతగా మద్దతు ధర కల్పించకపోవటం, లేదా మార్కెట్ శక్తుల దోపిడీ కారణంగా రావాల్సినంత రాకపోవటంగానీ జరుగుతున్నది. ఈ కారణంగానే కనీస మద్దతు ధరల విధానాన్ని ఎత్తివేసేందుకు దారి తీసే మూడు సాగు చట్టాల రద్దుకు రైతాంగం తీవ్రంగా పోరాడిందని, దానికి చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేసినట్లు భావించవచ్చు.ఆదాయంలో వేతనం ద్వారా పెరిగింది ఎక్కువగా ఉండటాన్ని బట్టి రైతులు కూలి మీద ఎక్కువ ఆధారపడుతున్నట్లుగా చెప్పవచ్చు.

రైతాంగ ఆదాయం రు.10,218 అన్నది దేశ సగటు. రాష్ట్రాల వారీ ఎగుడుదిగుడులు ఉన్నాయి.పద్దెనిమిది వేలు అంతకు మించి పొందున్నవారు మేఘాలయ, పంజాబ్, హర్యానా, అరుణాచల్

ప్రదేశ్, జమ్ము-కాశ్మీరుల్లో ఉండగా ఎనిమిదివేలకు తక్కువ వచ్చే వారు ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, ఒడిషా, ఝార్కండ్‌లో ఉన్నారు. సాగు చట్టాలపై దేశమంతటా రైతులు ఒకే విధంగా స్పందించకపోవటానికి ఇది కూడా కారణం కావచ్చు, ఎక్కువ ఆదాయం పొందుతున్నవారిలో ఉన్న ఆందోళన తక్కువ పొందే వారిలో ఉండకపోవటం సహజం.

పంటల దిగుబడి పెంచటం ద్వారా రైతాంగ ఆదాయం పెంచవచ్చని కొందరు చెబుతారు. అది అనేక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. సాగు ఖర్చులు స్థిరంగా ఉంటే దిగుబడి పెరిగితే రాబడి పెరుగుతుంది. కానీ దేశంలో ఆ పరిస్థితి ఉందా ? పెరుగుతున్న ఎరువులు, పురుగుమందులు ధరలు, వేతన, యంత్రాల వినియోగ ఖర్చు పెరుగుదల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నపుడు ఆదాయం ఖర్చులు ఎక్కువగా పెరుగుతున్నాయి. అందుకే సాగు గిట్టుబాటు కావటం లేదన్న అభిప్రాయంతో అనేక మంది సాగుమాని కౌలుకు ఇవ్వటం వంటి వాటికి మరలుతున్నారు. ఎనిమిది సంవత్సరాల క్రితంతో పోల్చితే 2013-14లో ఉన్న ఆహార ధాన్యాల ఉత్పత్తి 265.05మిలియన్ టన్నుల నుంచి 2021-22లో 305.43మి.టన్నులకు పెరిగిందని అంచనా. ఇదే కాలంలో వరి,గోధుమల కనీస మద్దతు ధరలు రెట్టింపు కాలేదు. వరి ధర రు.1,310 నుంచి 1,940, గోధుమలకు రు.1,400 నుంచి 2,015కు పెరిగింది. కేవలం 14శాతం మంది రైతులు మాత్రమే కనీస మద్దతు ధరల వలన లబ్దిపొందుతున్నట్లు అంచనా.కనీస మద్దతు, గిట్టుబాటు ధరలను కల్పించే బాధ్యతను తీసుకొనేందుకు మొరాయిస్తున్న పాలకులు రైతాంగానికి గిట్టుబాటు కల్పించే పేరుతో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నారు. దీని వలన వ్యవసాయకార్మికుల ఉపాధికి ముప్పు ఏర్పడుతున్నది. మేకిన్ ఇండియా మాదిరిగానే రైతుల ఆదాయాల రెట్టింపు అన్నది ఒక కలగానే ఉంది.

2025 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను ఐదు లక్షల కోట్ల డాలర్లకు తీసుకుపోయి, ప్రపంచంలో మూడో స్థానంలో నిలబెడతానని 2019లో నరేంద్రమోడీ ప్రకటించారు. ఇప్పుడున్న పరిస్థితిని బట్టి 2028 నాటికి 4.92లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని ఐదు లక్షల కోట్లు కావాలంటే 2029లోనే సాధ్యమని ఐఎంఎఫ్ తాజాగా ప్రకటించింది. అప్పటికి నరేంద్రమోడీ అధికారంలో ఉంటారో లేదో కూడా తెలియదు.2028నాటికి రూపాయి విలువ 2022లో 77.7 నుంచి 94.4కు పతనం కానుందని కూడా ఐఎంఎఫ్ పేర్కొన్నది. మరోవైపు మన అధికారులు మాత్రం 2025-26 లేదా మరుసటి ఆర్థిక సంవత్సరానికి ఐదులక్షల డాలర్లకు చేరతామని అంటున్నారు. ఇక్కడ సమస్య ఎంతకు, ఎప్పుడు చేరుతుందని కాదు, జనానికి ఒరిగేదేమిటి ? ఉపాధి రహిత, వేతన పెంపుదల లేని ఆర్థిక వ్యవస్థలో సంపదలు పోగుపడితే చెప్పుకోవటానికి గొప్పగా ఉండవచ్చు, కుహనా జాతీయ వాదులను సంతృప్తి పరచవచ్చు తప్ప సామాన్యులకు ఒరిగేదేమీ ఉండదు. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం 2020 నుంచి 2027వరకు తలసరి జిడిపి డాలర్లలో ఇలా ఉండనుంది.

దేశం ××× 2020×× 2021×× 2022×× 2023×× 2024×× 2025×× 2026×× 2027

భారత్ ×× 1,935 ××2, 185××2, 342××2, 527××2, 720××2, 929×× 3, 138××3,350

బంగ్లాదేశ్ × 1,962 ××2,147××2,363 ××2, 588××2, 814××3, 056××3, 315××3, 587

చైనా ×× 10,525 ××12, 359××14, 029××15, 486××16, 740××17, 991××19, 312××20743

తొలిసారి 2020లో భారత తలసరి జిడిపి బంగ్లాదేశ్ కంటే వెనుక బడిందని చెప్పటాన్ని కూడా బిజెపి నేతలు దేశద్రోహం అన్నట్లు చిత్రించారు. కావాలంటే బంగ్లాదేశ్‌కు వెళ్లమని చెప్పారు. ఐఎంఎఫ్ చెప్పినదాని ప్రకారం 2021 మినహా 2027వరకు మనకంటే బంగ్లాదేశ్ తలసరి ఆదా ఎక్కువగా ఉండనుంది. ఇదేమైనా అంకెల గారడీనా ? కరోనా కారణమా ? కానేకాదు.2014లో బంగ్లాదేశ్ తలసరి జిడిపి 1,119 మన దేశంలో 1,574 డాలర్లు ఉంది. మనదేశం ఇతర చోట్ల నుంచి పత్తి దిగుమతి చేసుకొని బంగ్లా పాలకులు దుస్తుల ఎగుమతుల మీద కేంద్రీకరిస్తే మన పాలకులు వాటి బదులు వస్త్రధారణ వివాదాల మీద కేంద్రీకరించటమే అసలు కారణం అని చెప్పవచ్చు. సిఇఐసి సమాచారం ప్రకారం కార్మికశక్తి భాగస్వామ్యం 2021లో మన దేశంలో 45.6శాతం ఉంటే బంగ్లాదేశ్‌లో 57, చైనాలో 68.1శాతం ఉంది.పాకిస్తాన్‌లో 50.1శాతం ఉంది. సిఎంఐఇ సమాచారం ప్రకారం 2022 మార్చినెలలో మన దేశంలో కార్మిక భాగస్వామ్యం 39.5శాతం ఉంది. 2018లో నిరుద్యోగం నాలుగుదశాబ్దాల గరిష్ట స్థాయికి చేరితే తరువాత పెరగటమే తప్ప తగ్గింది లేదు. పని చేసే అవకాశాలు, చేసే వారు పెరగకుండా జిడిపి పెరగదు కదా ! గ్రామీణ ప్రాంతాల్లో పని తగ్గిపోతున్న కారణంగా 2013లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసిన వారితో పోల్చితే తాజాగా లెక్కల ప్రకారం నాలుగు రెట్లు పెరిగారు. కరోనా కాలంలో ఎనభై కోట్ల మందికి నెలకు తాము ఆరుకిలోల ఆహార ధాన్యాలను ఉచితంగా ఇచ్చామని బిజెపి నేతలు ఒక ఘనతగా చెప్పుకుంటారు.

దాన్ని తిరగేసి చూస్తే జనాన్ని ఎంతగా దరిద్రంలో ఉంచారన్నది వెల్లడిస్తున్నది.

నల్లధనాన్ని వెలికి తీసేందుకు ప్రపంచంలో ఇంతవరకు నరేంద్రమోడీ తప్ప ఏ పాలకుడూ కరెన్సీని రద్దు చేయలేదు. పోనీ ఇంత చేసి సాధించిందేమైనా ఉందా అంటే కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదు. జనానికి ఇబ్బందులు, ఆర్థిక రంగాన్ని కుదేలు చేయటం తప్ప జరిగిందేమీ లేదు. మొత్తం నోట్లలో 99.3శాతం బాంకులకు తిరిగి వచ్చాయి, మిగిలినవి కూడా అనేక మందికి తెలియక డిపాజిట్ చేయకపోవటం వంటి కారణాలు తప్ప మరొకటి కాదు. ఈ తప్పిదానికి మన్నించమని నరేంద్రమోడీ జనాన్ని కోరలేదు, అసలు ఉలుకూపలుకు లేదు. దేశంలో నల్లధనం ఎప్పటి మాదిరే తనవని తాను చేసుకుపోతున్నదని అందరికీ తెలిసిందే. 2016నవంబరు ఎనిమిదవ తేదీ సాయంత్రం జరిగే కాబినెట్ సమావేశానికి మంత్రులెవరూ సెల్‌ఫోన్లు తీసుకురావద్దని చెప్పినట్లు వార్తలు వచ్చాయి, కానీ కొందరు ఆశ్రితులకు ముందే ఈ సమాచారాన్ని చేరవేశారని, వారంతా జాగ్రత్త పడినట్లు తరువాత వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

నరేంద్రమోడీ వాగ్దానం చేసిన అచ్చేదిన్ (మంచి రోజులు)కు అర్థం ఏమిటో ఇంతవరకు తెలియదు. అమెరికా సంస్థ పూ అంచనా ప్రకారం 2021 నుంచి ఇప్పటికి రెండున్నర కోట్ల మంది ఉపాధి కోల్పోయారు, ఏడున్నర కోట్ల మంది దారిద్ర్యంలోకి దిగజారారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని నరేంద్రమోడీ వాగ్దానం చేసినప్పటికీ గత దశాబ్దకాలంలో ఏటా 43లక్షలకు మించలేదు. ఎనిమిదేండ్ల నాటి ధరల పెరుగుల రికార్డులను ఏక్షణంలోనైనా బద్దలు కొట్టే అవకాశం ఉంది. అంటే జనాలకు చచ్చే రోజులు తప్ప అచ్చేదిన్ కనుచూపు మేరలో కనిపించటం లేదు. ఉపాధి, గౌరవ ప్రదమైన, కనీస అవసరాలు తీరే వేతనాలు, సరసమైన ధరల స్థితి ఉంటే రోజులు మంచిగా ఉన్నట్లు భావిస్తారు. ఇప్పుడు ఆ స్థితి ఉందా ? అందుకే అసలు ఆ పదాన్ని పురాతన భాండాగారంలో పెట్టాలని, అసలు మర్చిపోవాలని జనాలు జోకులు పేలుస్తున్నారు. చిల్లర ద్రవ్యోల్బణం ఎనిమిదేండ్ల గరిష్టానికి 7.79శాతానికి చేరింది. నాలుగుశాతం వద్ద అదుపులో ఉంచాలన్నది ఆర్‌బిఐ నిర్దేశిత లక్ష్యం కాగా దానికి రెట్టింపు ఉంది. జిడిపి వృద్ధి రేట్లలో మన దేశంలో ఒక నిలకడ లేదు. 1997 నుంచి ఉత్థాన పతనాలు నమోదవుతున్నాయి. కరోనాకు ముందు మూడు మాసాల్లో 42 సంవత్సరాల కనిష్ట వృద్ధి రేటు నమోదైంది. వార్షిక వృద్ధి రేటు 2014లో ఎనిమిదిశాతం ఉండగా 2020 మార్చినాటికి నాలుగుశాతానికి పడిపోయింది. తరువాత కరోనా వచ్చి నరేంద్రమోడీ వైఫల్యాల గురించి చర్చకు అవకాశం లేకుండా చేసింది. కరోనా ప్రభావం తొలగి సాధారణ స్థితికి వచ్చింది. కానీ ఆర్థిక రంగంలో అలాంటి మార్పు కనిపించటం లేదు. దిగజారిన ఆర్థిక వ్యవస్థ గణాంకాలను ప్రాతిపాదికగా చేసుకొని 2022లో ఎనిమిదిశాతం వృద్ధి రేటు ఉంటుందని ఊదరగొడుతున్నారు. అది జరిగినా కరోనాతో ముందు పరిస్థితితో పోల్చితే వాస్తవ వృద్ధి ఒకటి రెండుశాతం మాత్రమే ఉంటుందన్నది ఒక అభిప్రాయం. అందువలన తరువాత వృద్ధి అంకెలు అచ్చేదిన్ అసలు బండారాన్ని వెల్లడిస్తాయి. ప్రస్తుతం పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ప్రయివేటు పెట్టుబడుల లేకపోవటం వంటి అంశాలు ప్రతికూలతను వెల్లడిస్తున్నాయి.

గత పది సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం వివిధ బాంకుల వద్ద పేరుకు పోయిన బకాయిలను నిరర్ధక ఆస్తుల పేరుతో రు.11,68,095 కోట్లను రద్దు చేసింది. వాటిని తిరిగి వసూలు చేస్తామని చెబుతున్నప్పటికీ ఎంత శాతం అన్నది ప్రశ్న. 2021మార్చినెలతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రద్దు చేసిన మొత్తం రు.2,02,781 కోట్లు ఉంది. నరేంద్రమోడీ అధికారానికి వచ్చిన తరువాత గత ఏడు సంవత్సరాల్లో రద్దు చేసిన మొత్తం రు.10.7లక్షల కోట్లు ఉంది. ఇంతవరకు రుణాలు ఎగవేసిన పెద్దల పేర్లు వెల్లడించేందుకు బాంకులు నిరాకరిస్తున్నాయి. రద్దు చేసిన మొత్తాలలో ప్రభుత్వరంగ బాంకుల వాటా 75శాతం ఉంది. నిరర్ధక ఆస్తులను ఖాతాల నుంచి తొలగిస్తే బాంకులకు పన్ను భారం తగ్గుతుందని చెప్పారు. వసూలు అవకాశాలన్నీ మూసుకుపోయిన తరువాతే రద్దు చేస్తారు. తన పాలన అంతా సజావుగా ఉందని చెబుతున్న నరేంద్రమోడీ సర్కార్ ఏలుబడిలో బకాయిలు పేరుకు పోవటం అంటే కావాలని ఎగవేతకు పాల్పడటమే. ప్రజల సొమ్ము ప్రతిపైసాకు జవాబుదారీ అని చౌకీదారునని చెప్పుకున్న మోడీ అలాంటి వారి పట్ల ఎందుకు కఠినంగా వ్యవహరించటం లేదన్న ప్రశ్నకు జవాబు లేదు. రద్దు చేసిన బకాయిల్లో వసూలవుతున్న మొత్తం 15-20శాతానికి మించి ఉండటం లేదు.

నరేంద్రమోడీ అధికారానికి వచ్చినపుడు స్వదేశీ ఉత్పత్తిని పెంచి చమురు దిగుమతులు తగ్గిస్తామని చెప్పారు. గత ఎనిమిది సంవత్సరాల్లో అంతకు ముందున్న స్థితి కంటే దేశీయ ఉత్పత్తి తగ్గింది. ఎనిమిది సంవత్సరాల క్రితం రూపాయి విలువ డాలరుకు 58 ఉండేది, ఇప్పుడు అది 77.56కు పడిపోయింది. రూపాయి విలువ పతనం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ముఖ్యమంత్రిగా

ఉండగా నరేంద్రమోడీ, ఇతర బిజెపి నేతలు ధ్వజమెత్తారు. ఈ అసమర్ధతను నెహ్రూ మీద నెడతారా ? 2014లో పీపా ముడిచమురు ధర 110వద్ద ఉండగా మోడీ అధికారానికి వచ్చారు. తరువాత తగ్గటం తప్ప పెరిగింది లేదు. ఆ మేరకు జనానికి ధర తగ్గించాల్సిన మోడీ సర్కార్ తప్పుడు కారణాలు చూపి పెట్రోలు, డీజిలు మీద భారీగా సెస్‌లను పెంచి సొమ్ము చేసుకుంది. రూపాయి విలువను కాపాడలేని మోడీ సర్కార్ అసమర్ధతకు జనం మూల్యం చెల్లించాల్సి వస్తున్నది. 2013-14లో మన దేశం దిగుమతి చేసుకున్న ముడి చమురు పీపా సగటు ధర 105.52 డాలర్లు. నరేంద్రమోడీ అధికారానికి వచ్చిన తరువాత గత ఎనిమిది సంవత్సరాలలో ఇలా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పిపిఏసి సమాచారం మేరకు వర్తమాన ఆర్ధిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో సగటు ధర 103.10 డాలర్లు ఉంది.

సంవత్సరం ×××× డాలర్లలో ధర

2014-15 ××× 84.16

2015-16 ××× 46.17

2016-17 ××× 47.56

2017-18 ××× 56.43

2018-19 ××× 69.88

2019-20 ××× 60.47

2020-21 ××× 44.82

2021-22 ××× 79.18

పైన పేర్కొన్న వివరాలను చూసినపుడు మన్మోహన్ సింగ్ ఏలుబడి చివరి సంవత్సరంలో ఉన్న స్థాయి కంటే ఇప్పటికీ తక్కువగానే ఉన్నా సరే నరేంద్రమోడీ సర్కార్ అంతర్జాతీయంగా తగ్గిన మేరకు జనాలకు ధరలను తగ్గించలేదు. భారీ ఎత్తున సుంకాలు పెంచి ఆ మొత్తాలను కార్పొరేట్లకు రాయితీలకు మళ్లించటం, ఇతర అంశాలే దీనికి కారణం. వాటికి తోడు రూపాయి విలువ పతనం కూడా తోడైంది. మన్మోహన్ సింగ్ సర్కార్ మన కరెన్సీ విలువ పతనాన్ని అరికట్టటంలో విఫలమైందని నరేంద్రమోడీ సహా అనేక మంది బిజెపి నేతలు గతంలో విమర్శించారు. అందువలన ఇప్పుడు వారి నిర్వాకం కూడా జనాలకు శాపంగా మారింది.

రుణభారాన్ని అదుపు చేసుకోవాలని మోడీ సర్కార్ రాష్ట్రాలను కోరుతున్నది. కానీ తాను చేసిన అప్పుల గురించి ప్రస్తావించటం లేదు. 2021 సెప్టెంబరులో రిజర్వుబాంకు విడుదల చేసిన వివరాల ప్రకారం నరేంద్రమోడీ అధికారం చేపట్టే నాటికి అంటే 2014 మార్చి ఆఖరుకు కేంద్ర ప్రభుత్వానికి ఉన్న దేశీయ రుణం రు.54,84,848కోట్లు, విదేశీ అప్పు రు.3,74,483 కోట్లు మొత్తం రు.58,59,331 కోట్లు. 2022-23 బడ్జెట్‌లో పేర్కొన్నదాని ప్రకారం 2023 మార్చినాటికి దేశీయ రుణం రు.147, 48,875 కోట్లు, విదేశీ అప్పు రు.4,69,034 కోట్లు మొత్తం రు.152,17,910 కోట్లు అవుతుందని అంచనా. ద్రవ్యోల్బణం పెరుగుదల, విదేశీ అప్పులు డాలర్లలో చెల్లించాలి గనుక రూపాయి విలువ రికార్డు పతనం కొనసాగితే ఇంకా పెరిగినా ఆశ్చర్యలేదు. ఈ ఎనిమిది సంవత్సరాల్లో ప్రభుత్వరంగ కంపెనీలను తెగనమ్మి పొందిన సొమ్ము, చమురుపై విధించిన భారీ సెస్సుల ఆదాయమంతా ఎటుపోయినట్లు, తెచ్చిన దాదాపు వందలక్షల కోట్లను ఏమి చేసినట్లు ? చివరికి చూసుకుంటే రికార్డు స్థాయి నిరుద్యోగం, వృద్ధి రేటు పతనం, కనుచూపు మేరలో లేని అచ్చేదిన్ ! కొనుగోలు శక్తి పడిపోతోంది. ఇప్పటికే ఉన్న పారిశ్రామిక సామర్ధ్యాన్ని పూర్తిగా వినియోగించలేని స్థితిలో కొత్తగా పెట్టుబడులు పెడితే తమకు వచ్చేదేమిటని ప్రయివేటురంగం ప్రశ్నిస్తోంది. ఆత్మనిర్భర్, కరోనా పేరుతో పొందిన రాయితీలతో లబ్దిపొందుతోంది.

ఎనిమిదేండ్ల క్రితం నరేంద్రమోడీ ఎన్నికల ప్రచారంలో ముందుకు తెచ్చిన అంశాలను చూసినపుడు బలమైన ఆర్ధిక పునాదులు వేస్తామన్నదే వాటి సారాంశం. కానీ తరువాత గత ఎనిమిదేండ్లలో అటు కేంద్రంలో, ఇటు మెజారిటీ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బిజెపి కేంద్రీకరణ ఆర్ధిక వృద్ధి కంటే మతపరమైన రాజకీయలక్ష్యాలకే తొలి ప్రాధాన్య ఇచ్చారన్నది స్పష్టం. ఒక ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా కట్టుబడిన మోడీ ఆర్‌ఎస్‌ఎస్ అజెండా అమలుకు అగ్రాసనం వేశారు. దేశాన్ని ప్రామాణిక హిందూ మూలాల్లోకి తీసుకుపోతామని చెబుతున్నారు. గతంలో అలాంటి భావజాలం, మతం దేశాన్ని పారిశ్రామిక విప్లవానికి దూరం చేసింది. తిరిగి అదే స్థితికి తీసుకుపోతామని చెబుతున్నారు. దానికిగాను హిందూమతానికి సంబంధం లేని హిందూత్వను ఆయుధంగా చేసుకొని మధ్య యుగాలనాటి మతవిద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. ఇది దేశాన్ని ఆర్థికంగా దిగజారుస్తుందే తప్ప మంచి రోజుల వైపు తీసుకుపోదు. ఒక ఆర్ధిక వ్యవస్థను ఎలా నాశనం చేయవచ్చు అని ఎవరైనా అధ్యయం చేయదలిస్తే ఎనిమిదేండ్ల నరేంద్రమోడీ పాలనను ఎంచుకోవచ్చని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో విఫల నేత అని కొందరు చెప్పవచ్చు. నరేంద్రమోడీ వైఫల్యం, బూటకం గురించి చెప్పింది వాస్తవమే కదా ! ◆



# పర్యావరణానికి హాని చేస్తున్న మోడీ ప్రభుత్వం

**- డా. పి.నారాయణ రావు,** సంపాదకులు, ఎన్విరాన్మెంట్ అండ్ పీపుల్

**2014** ఎన్నికల తరుణంలో బిజెపి తన పార్టీ ప్రణాళికలో వాతావరణ మార్పుల గురించి ప్రత్యేకంగా పేర్కొంది. పార్టీ అధికారంలోకి వస్తే వాతావరణ మార్పుల ఉపశమన కార్యక్రమాలను తీవ్రంగా తీసుకుంటామని, ఈ విషయంలో ప్రపంచ సమాజంతో, సంస్థలతో కలిసి పని చేస్తామని స్పష్టంగా చెప్పారు. అలాగే సహజ వనరులైన బొగ్గు తదితర ఖనిజాల యజమాన్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు .

ఆ నాడే గుజరాత్ తరహా పాలన గూర్చి పర్యావరణ వేత్తలు విమర్శించారు . మోడీ పాలనలో 2010 లో గుజరాత్ అత్యంత కలుషితమైన రాష్ట్రంగా , 2012లో మూడు గుజరాతి నదులు అత్యంత కలుషితమైనవి గా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యాపార నిర్ణయాలను వేగవంతం చేస్తామని, పెట్టుబడులకు అడ్డంకులు తొలగిస్తామని హామీ ఇవ్వడంతో పర్యావరణం పై దాడి మొదలుపెట్టాడు.

2014 జూన్ లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 8 క్లిష్టంగా నున్న కలుషితమైన పారిశ్రామిక ప్రాంతాలలో ఫ్యాక్టరీల ఏర్పాటుపై నిషేధాన్ని తొలగించింది. పర్యావరణ సున్నిత ప్రాంతాల నుండి 5 కిలోమీటర్ల పరిధిలో మధ్యరకం కాలుష్య పరిశ్రమలు పని చేయడానికి వీలు గా అనుమతులు సడలించ బడ్డాయి. అంతకు ముందున్న పరిమితి 10 కిలోమీటర్లు. అంతేగాక బొగ్గు తారు ప్రాసెసింగ్ ,ఇసుక తవ్వకం, కాగితపు గుజ్జు పరిశ్రమల నిబంధనలను కూడా సడలించారు 2014 ఆగస్టులో జాతీయ జీవ వైవిధ్య వన్యప్రాణుల సంస్థలో నియమించబడే స్వతంత్ర సభ్యుల సంఖ్య 15 నుండి 3 కి కుదించారు . దాని ఫలితంగా ప్రభుత్వ ప్రభావం పెరిగి ఆ ప్రాంతాల్లో నెలకొల్పబోయే అన్ని పారిశ్రామిక ప్రాజెక్టులకు 99% అనుమతులు ఇవ్వబడ్డాయి. అంతకు ముందున్న ప్రభుత్వం లో 80 శాతం ప్రాజెక్టులు మాత్రమే అనుమతించబడ్డాయి. 2017 డిసెంబర్ లో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గతంలో ఈ ప్రభుత్వం నిర్దేశించిన పరిమితులను ఉల్లంఘించి కాలుష్య కారకాలను విడుదల చేయడాన్ని మరో ఐదేళ్ల దాకా అనుమతిస్తూ 420 థర్మల్ విద్యుత్ కేంద్రాలకు లేఖ రాసింది.

2017 జూలై లోనే భారత దేశ పర్యావరణ పరిరక్షణ సంస్థ అయిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (%చీ+ు%) స్వతంత్ర ప్రతిపత్తిని నీరుగార్చడానికి తీవ్రమైన ప్రయత్నం చేసింది. గతంలో NGT పర్యావరణ వ్యతిరేక ప్రాజెక్టులపై అనేక తీర్పులనిచ్చింది. ప్రభుత్వాన్ని అనేక విషయాలపై నిలదీసింది. %చీ+ు% కి మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి లేదా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మాత్రమే నేతృత్వం వహించగలరు. కానీ మోడీ ప్రభుత్వం ఆ నిబంధనలను సవరించి ఐదుగురు సభ్యుల కమిటీని అనుమతించి అందులో ప్రభుత్వం నుండి నలుగురు సభ్యులు చైర్పర్సన్ ను ఎన్నుకుంటారు. ఈ సవరణ ప్రకారం చైర్పర్సన్ 25ఏళ్ల అనుభవం ఉంటే చాలు, NGT కి నేతృత్వం వహించవచ్చు. అదృష్టవశాత్తు ఈ చర్యపై సుప్రీంకోర్టు స్టే విధించింది.

మోడీ ప్రభుత్వం ఉప్పు కోటారులను చిత్తడి నేలలుగా ప్రకటించింది. ఈ చర్య బొంబాయి సమీపంలోని విస్తారమైన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లాభం చేకూర్చే హౌసింగ్ ప్రాజెక్టుల కోసం ఉద్దేశించబడింది. బిజెపి పాలిత గోవాలో కొబ్బరి చెట్లను గడ్డిగా వర్గీకరించి రియల్ ఎస్టేట్ రంగానికి తెరలేపే ప్రయత్నం చేసింది . అదృష్టవశాత్తు ఈ నిర్ణయం కూడా రద్దు చేయబడింది.

2018లో పర్యావరణ మంత్రిత్వశాఖ జాతీయ అటవీ విధానానికి పెద్ద మార్పులను ప్రతిపాదించింది. సముద్ర తీర నియంత్రణ జూన్ (CRZ) ముసాయిదా నోటిఫికేషన్ను ప్రకటించింది. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కోసం నిబంధనలను రూపొందించింది. పరిశ్రమలకు ప్రయోజనం చేకూర్చే ఈ మూడు చర్యలను పర్యావరణ కార్యకర్తలు విమర్శించారు.

మధ్యప్రదేశ్లో ప్రతిపాదిత కెన్ బెట్వా నదిని అనుసంధానించే ప్రాజెక్టు నాలుగు వేల హెక్టార్లకు పైగా ఉన్న పన్నా టైగర్ రిజర్వ్ ను నాశనం చేసే ప్రమాదం ఉంది.

ఉత్తరాఖండ్ లో హిందూ దేవాలయాల సందర్శనకు నిర్మించబడిన హైవేల కోసం 25,000 చెట్లను నరికి వేశారు.

ఛత్తీస్ ఘడ్ లో బొగ్గు తవ్వకాల కు అనుమతి ఇచ్చి నందున

భారతదేశంలోని అత్యంత ప్రాచీనమైన దట్టమైన అడవులలో ఒకటి నిర్మూలించబడబోతుంది.

2018 నాటికి ప్రపంచంలోని అత్యంత కలుషితమైన 20 నగరాల్లో 15 భారతదేశంలోనే ఉండటం ,అలాగే ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ ఇండెక్స్ లో భారత దేశం 180 దేశాలలో 177 వ స్థాయికి పడిపోవడం ఈ విధానాల పర్యవసానమే.

2019 బిజెపి ఎన్నికల ప్రణాళికలో అటవీ పర్యావరణ విభాగం కింద అనుమతుల జారీ వేగాన్ని పెంచుతామని పేర్కొన్నారు . ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరిట పారిశ్రామికవేత్తలకు పెద్ద పీట వేసే ప్రణాళికలో భాగమే ఇది.

రెండవ సారి తిరిగి ఎన్నికైన 50 రోజుల్లోనే భారతదేశాన్ని 2024 – 25 నాటికి 5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చెంద వలయునని మోడీ లక్ష్యంగా పెట్టుకున్నాడు.

దానికి అనుకూలంగా "ముందు అన్ని అనుమతులు ఇవ్వు పర్యవసానాలు తర్వాత చూసుకుందాం'' అనే వైఖరిని అవలంభించాడు.

2019 ఆగస్టులో వన్యప్రాణుల అభయారణ్యాలు, జాతీయ పార్కులకు 10 కిలోమీటర్ల పరిధిలో ప్రాజెక్టు క్లియరెన్సు ల నిబంధనలను సడలించారు. సెప్టెంబర్ లో అడవి అనే దాని నిర్వచనాన్ని మార్చుకోవడానికి రాష్ట్రాలకు అటవీ సలహా కమిటీ అనుమతించింది.

2020 జనవరి లో విడుదల చేసిన భారతదేశ అటవీ పరిస్థితి రిపోర్టు ప్రకారం అటవీ ప్రాంతం అని చెప్పబడే ప్రాంతంలో 30 శాతం చెట్లు లేకుండా పోయాయి. 2015 లో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన అయిదు సంవత్సరాలలో 409 చదరపు కిలోమీటర్ల మేర వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి ధారాదత్తం చేయబడింది.

మోడీ ప్రభుత్వం పర్యావరణ చట్టాలను నీరుగార్చే క్రమంలో పరాకాష్టగా పేరుగాంచినది పర్యావరణ ప్రభావ అంచనా EIA—2020 నోటిఫికేషన్ అని పేర్కొనవచ్చు.

భూపాల్ గ్యాస్ లీకేజీ విషాద ఘటన అనంతరం తీసుకురాబడ్డ పర్యావరణ పరిరక్షణ చట్టం EPA— 1986 నకు

అనుగుణంగా తీసుకురాబడ్డ పర్యావరణ ప్రభావ అంచనా EIA – 1994 ను సవరించి యూపీఏ ప్రభుత్వం EIA -2006 ను తీసుకు వచ్చింది . ఈ నోటిఫికేషన్ లోనున్న ప్రధాన అంశాలు ప్రజలను సంప్రదించడం, ప్రాజెక్టు స్థాపించే ముందు క్లియరెన్స్ లు ఇవ్వడం వగైరాలను పూర్తిగా మార్చివేస్తూ EIA –2020 ను మోడీ ప్రభుత్వం కోవిడ్ మహమ్మారి ప్రబలిన రోజుల్లో విధించిన లాక్ డౌన్ సందర్భంలో తీసుకు వచ్చింది. నోటిఫికేషన్ కు వ్యతిరేకంగా పెల్లుబికిన నిరసనల నేపధ్యంలో దానినీ తాత్కాలికంగా నిలిపివేసింది . అయినప్పటికీ ఇటీవల EIA -2006 నోటిఫికేషన్ కి సవరణల పేర దేశ రక్షణ, భద్రత , వ్యూహాత్మక ప్రాధాన్యత గల ప్రాజెక్టులన్నింటికీ క్లియరెన్సు లు ఇవ్వాలని నిర్ణయించింది. తద్వారా రాష్ట్రాలకున్న అధికారాలు సైతం తమ చేతుల్లోకి తీసుకుంది.

ఈ విధంగా నేటి ప్రభుత్వం నిబంధనలు, పరిమితులు లేకుండా సహజవనరులను, పర్యావరణాన్ని దోపిడీ చేయడానికి కార్పొరేట్లకు సులువైన మార్గాన్ని సుగమం చేస్తుంది.

ఈ విధంగా దోపిడీ చేస్తున్న కార్పొరేట్ ల లో ప్రముఖుడు, మోడీకి అత్యంత ఆప్తుడు అయిన గౌతమ్ అదాని అనే విషయాన్ని చెప్పాలి . అతని సామ్రాజ్యం దేశ విదేశాలకు విస్తరించింది. అనతికాలంలోనే ప్రపంచ అత్యంత సంపన్నుల్లో ఐదవవాడు గా

పేరొందిన గౌతమ్ అదాని కి పర్యావరణ విధ్వంసకుల్లో కూడా అగ్ర స్థానం లభిస్తుందని చెప్పుకోవాలి.

ఇటీవల ఆదాని ని నిలువరించాలి (StopAdani ) అనే నినాదంతో ఆస్ట్రేలియా వేదికగా ప్రజా ఉద్యమం నడుపబడుతోంది.

ఆ ఉద్యమకారులు అధాని ని ఎందుకు నిలువరించాలి అనేదానికి ఐదు కారణాలను పేర్కొన్నారు.

1. అదాని యొక్క గని , రైలు, ఓడరేవు ప్రాజెక్టు ఈ ప్రాంత ప్రజల పూర్వీకుల భూములను, జలాలను సంస్కృతులను నాశనం చేస్తుంది
2. బొగ్గును కాల్చడం వల్ల వచ్చే కాలుష్యం ప్రమాదకరమైన గ్లోబల్ వార్మింగ్( భూతాపం )కు దోహదం చేస్తుంది. బొగ్గు తవ్వకం మన నీటి సరఫరాను హరించి కలుషితం చేస్తుంది. తద్వారా మన ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది
3 . అక్రమ లావాదేవీలు, లంచం, పర్యావరణ సామాజిక విధ్వంసం మరియు అవినీతి, మోసం, మనీ లాండరింగ్ ఆరోపణలతో దేశవిదేశాలలో అదానీ గ్రూపు కంపెనీలు భయంకరమైన రికార్డు కలిగి ఉన్నాయి.
4. మనం కాలుష్యాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది కాబట్టి బొగ్గును కాల్చడం వలన తీవ్రమైన వాతావరణ మార్పులు

చోటుచేసుకోవడంతో పాటు సముద్రంలోని పగడపు దిబ్బలు పాలిపోతాయి.

5. అధాని కంపెనీ విలువైన బేసిన్ ల నుండి బిలియన్ల కొద్దీ లీటర్ల నీటిని ఉచితంగా తీసుకుంటుంది. ఇది మన రైతులను, భూగర్భజలాలను హరిస్తుంది.

భారతదేశంలో కూడా jharkhand రాష్ట్రంలో గొడ్డ పట్టణంలో ఆస్ట్రేలియాలోని కార్మైకెల్ గని నుండి తన బొగ్గును తీసుకొచ్చి కొత్త బొగ్గు ఆధారిత పవర్ స్టేషన్ ను నిర్మించడాన్ని నిరసిస్తూ వేలాది మంది స్థానిక ప్రజలు పోరాటాలు నిర్వహిస్తున్నారు. ఆ ప్రజలు అదానీ గ్రూపు తమ భూమిని కైవసం చేసుకున్నారని , వారి పంటలను నాశనం చేశారని, పోలీసులు చేత కొట్టించారు అని తమ బాధలను వ్యక్తపరుస్తున్నారు. ఆస్ట్రేలియాలో, భారతదేశంలో కూడా అదానీ బొగ్గు ప్రణాళికలు ఆదివాసీల భూమి హక్కులను కాలరాస్తున్నాయని, తమ పవిత్ర జలాలను కలుషితం చేస్తున్నాయని, అటవీ వృక్ష జాతులను నాశనం చేస్తున్నాయనీ తమ గోడును వినిపిస్తున్నారు.

2018లో జాతీయ ఎన్నికలకు ముందు మోడీ ప్రభుత్వం అదానీ గొడ్డ పవర్ స్టేషన్ కు ప్రత్యేక ఆర్థిక మండలి (SEZ) హోదాను ఇచ్చింది. ఈ నిర్ణయం వలన ఇతర ప్రయోజనాలతో పాటు, మూడు వందల ఇరవై కోట్ల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించకుండా మినహాయింపు ఇవ్వబడింది. దీనికితోడు భారతదేశ పన్ను చెల్లింపుదారుల సొమ్మును పవర్ ఫైనాన్స్ కంపెనీ (PFC) రూరల్ ఎలక్ట్రికిఫికేషన్ కార్పొరేషన్ ( REC) నుండి పెద్దమొత్తం లో 10 వేల కోట్ల రూపాయలు రుణ సదుపాయం కల్పించబడింది. ఇంత పెద్ద మొత్తంలో రుణ సహాయం తీసుకుని ఉత్పత్తి చేసిన విద్యుత్ ఒక్క యూనిట్ ని కూడా భారతదేశంలో ఒక్క ఇంటికి కూడా సరఫరా చేయబడదు. అంతా బంగ్లాదేశ్ ప్రజలకు అధిక ధరలకు అమ్మ పడుతుంది.

స్థానిక ఆదివాసీల సమ్మతి లేకుండా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును వ్యతిరేకించిన నాయకులను, ప్రజలను జైల్లో నిర్బంధించారు.

మోడీ ప్రభుత్వం పర్యావరణ ఉద్యమాలను అణిచివేయడం లోనూ , ఉద్యమకారులను వేధించడం లోనూ ముందంజలో ఉందంటే అతిశయోక్తి కాదు.

దానికి ఉదాహరణగా ఒరిస్సాలోని నియాంగిరి అటవీ ప్రాంతంలో కొండల కింద అపారమైన బాక్సైట్ నిల్వల తవ్వకం పై కన్నేసిన వేదాంత కంపెనీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వేలాది గిరిజనులకు నాయకత్వం వహిస్తున్న వారిని మావోయిస్టులు గా ముద్ర వేసి అరెస్టు చేసి జైలులో నిర్బంధించారు.

అలాగే తమిళనాడులో తూత్తుకుడి పట్టణంలో వేదాంత కంపెనీ యాజమాన్యంలో నడుస్తున్న Sterlite కాపర్ ఫ్యాక్టరీ తమ భూములను,నీటిని,గాలిని కలుషితం చేస్తోందని , దాని ఫలితంగా తాము శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్నామని, దానిని వెంటనే మూసివేయాలని ఆ యా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేయడంతో వారిని నడిరోడ్డుపై కాల్చిన ఘటన ఈ ప్రభుత్వ హయాంలోనే జరిగింది.

పై రెండు ఉద్యమాల్లోనూ అంతిమంగా ప్రజలే విజయం సాధించారు.

ఇక పర్యావరణ ఉద్యమకారిణి, ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ సంస్థాపకురాలు దిశ రవి పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్ EIA – 2020 ను ఎదుర్కొని తన తోటి యువత సహాయం తో పెద్ద ఎత్తున ప్రభుత్వ పర్యావరణ శాఖపై ఈమెయిల్ దాడి నిర్వహించి ఆ నోటిఫికేషన్ ను నిలుపు చేసిన నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమ సందర్భంలో దేశద్రోహ నేరం కింద అరెస్టు చేసి నిర్బంధించారు.

అలాగే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్యావరణ సంస్థ అయిన గ్రీన్ పీస్ ఇండియా శాఖకు పనిచేస్తున్న ప్రియా పిళ్లై అంతర్జాతీయ వేదికలపై మోడీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఉందని ఆ విమర్శల వలన విదేశీ పెట్టుబడులకు నష్టం వస్తుందని కావున జాతి వ్యతిరేక కార్యకలాపాలకు గాను ఆమెను విదేశాలకు వెళ్ళనీయకుండా నిరోధించారు. దీనికి నిజమైన కారణం hindalco కంపెనీతో కలిసి ఎస్సార్ ఎనర్జీ కంపెనీ మధ్యప్రదేశ్ లోని సాల్ ఫారెస్ట్ ఏరియాలో చేపడుతున్న బొగ్గు తవ్వకాలను ఆమె అడ్డుకోవడమే.

పై అన్ని సందర్భాల్లోనూ అదృష్టవశాత్తూ కోర్టులు ప్రభుత్వ వైఖరిని ఎండగట్టి ప్రజలకు కొంతమేర న్యాయం చేయడం జరిగింది.

కానీ మోడీ ప్రభుత్వం తగిన గుణపాఠాలు నేర్చుకోక పోగా పర్యావరణ ఉద్యమకారులను వేధిస్తూనే ఉంది .

ఈ నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ నిర్లిప్త వైఖరిని విడనాడి మోడీ ప్రభుత్వ పర్యావరణ,ప్రజా వ్యతిరేక చర్యలను ప్రశ్నిస్తారని, పౌర సమాజం భయాన్ని వీడి ఇంకా ఎక్కువగా స్పందించి రాబోయే కాలంలో పర్యావరణ పరిరక్షణ కై బాహాటంగా ప్రతిధ్వనిస్తుందని కోరుకుందాం. ◆



# భారత రాజ్యాంగ పీఠిక ఒక జాతీయ గీతం

- ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ , స్కూల్ ఆఫ్ లా డీన్, మహీంద్రా యూనివర్సిటీ

**భా**రత రాజ్యాంగ పీఠిక ఒక జాతీయ గీతం వలె కనిపిస్తుంది, వినిపిస్తుంది. కవీంద్ర రవీంద్రుడు రాసిన జాతీయ గీతం 'జనగణ మన అధినాయక జయహే' ఒక దేశభక్తి గీతం. సందేహం లేదు. ఒక గౌరవ వందన గీతం. ఈ పీఠిక పాట కాదు, ఒక పాఠం. ఒక ప్రతిజ్ఞ. ఒక ప్రకటన. ఒక లక్ష్య వాగ్దానం! ఇందులో నిరంతరం గుర్తుంచుకోవలసిన మంత్రాక్షరాలున్నాయి. దిశా నిర్దేశనం నియంత్రణ చేసే ఒక ఆదేశ పత్రం. ప్రజాసార్వభౌములు జారీ చేసిన ఒక రిట్. అనుల్లంఘనీయ శాసనం. కానీ రక్షిస్తామన్నవారూ, పాటిస్తామన్నవారూ, చదవవలసిన వారూ, అర్థం చేసు కోవలసిన వారూ అందరూ మరిచిపోయారు!!


THE CONSTITUTION OF INDIA

WE, THE PEOPLE OF INDIA, having solemnly resolved to constitute India into a SOVEREIGN DEMOCRATIC REPUBLIC and to secure to all its citizens:

JUSTICE, social, economic and political;

LIBERTY of thought, expression, belief, faith and worship;

EQUALITY of status and of opportunity;

and to promote among them all

FRATERNITY assuring the dignity of the individual and the unity of the Nation;

IN OUR CONSTITUENT ASSEMBLY this twenty-sixth day of November, 1949, do HEREBY ADOPT, ENACT AND GIVE TO OURSELVES THIS CONSTITUTION.

ఈ పీఠిక చదవడం ప్రభువులకు కోపకారణం అయింది! పోలీసులు లాఠీలెత్తారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని విమర్శిస్తూ ప్రసంగించినందుకూ, పీఠిక చదివి నందుకూ, రాజ్యాంగాన్ని జనానికి చూపినందుకూ చంద్రశేఖర్ ఆజాద్‌పై క్రిమినల్ కేసులు పెట్టారు. పీఠికను గుర్తు చేయడం తరాజులకు నచ్చడం లేదు. యూఏపీఏ చట్టం కింద బెయిల్ రాని సెక్షన్లతో కొడుతున్నారు. తిడుతున్నారు. రాజు దైవమై పోతున్నాడు. కోర్టులు బెయిల్ ఇవ్వడం దైవాధీనంగా మారిపోయింది. చివరకు ఢిల్లీ కోర్టు న్యాయాధికారి కామినీ లావ్ "ధర్నా చేస్తే తప్పేమిటి, నిరసన చేయడం నేరమా? అది రాజ్యాంగం ఇచ్చిన హక్కు కదా? మీరు అసలు రాజ్యాంగం చదివారా?" అని పోలీసులను అడిగారు. న్యాయమూర్తులకూ, న్యాయాధికారులకూ, రాజ్యాంగం కింద నియుక్తులైన అధికారులకూ... అందరికీ రాజ్యాంగం పవిత్ర పత్రమైనపుడూ, ఆ రాజ్యాంగం సరైనదైనపుడూ, చదివితే నేరమా? ఎంత మాత్రం కాదని ఆ కోర్టు తీర్పు చెప్పవలసి వచ్చింది. పీఠిక రాజ్యాంగాన్ని పరిచయం చేస్తుంది. రాజ్యాంగ లక్ష్యం, సూత్రాలు, మౌలిక తత్వం వివరించిన పీఠం అది. పీఠిక చదివితే అరెస్టు చేయరాదని కోర్టు చెప్పిన తరువాత గానీ బెయిల్ దొరకలేదు. విడుదలైన వెంటనే పీఠిక చదివాడాయన, కరతాళ ధ్వనుల మధ్య!

ప్రభుత్వ రాజ్యాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకించడానికి ఉపయోగించే నిరసనోద్యమ దీప్తిగా పీఠికా పఠనం మారిపోయింది. తరువాత కొన్ని నెలలకు భారత ప్రభుత్వం పీఠికా పఠనాన్ని అధికారిక కార్యక్రమంగా నిర్దేశించింది. 75 సంవత్సరాల అజాదీ అమృతోత్సవంలో తప్పనిసరిగా కేంద్ర మంత్రిత్వశాఖలు తమ కార్యాల యాల్లో గోడలమీద ప్రవేశిక లిఖించి పెట్టాలని ఆదేశించింది. రాష్ట్రపతి స్వయంగా పీఠికను అందరితోపాటు చదివే కార్యక్రమాన్ని 2020లో అధికారికంగా ఆరంభించారు. 2015లో ప్రధాని నరేంద్రమోదీ పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో పీఠిక చదివారు. న్యాయ, పర్యావరణ శాఖామాత్యులు తన మంత్రిత్వ భవనంలో ప్రియాంబుల్ గోడను ఆవిష్కరించారు. మధ్యప్రదేశ్, కేరళ వంటి అనేక రాష్ట్ర ప్రభుత్వాలు పీఠికను అన్ని పాఠశాలల్లో తప్పని సరిగా చదవాలని ఆదేశం జారీ చేశాయి. ఇదీ మన పీఠిక! దీన్ని అవతారిక అనీ అంటారు. ఇంగ్లీషులో ప్రియాంబుల్ అన్నారు.

భారత ప్రజలమైన మనం, మన భారతదేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్య వ్యవస్థగా నిర్మించేందుకు పవిత్ర దీక్షతో తీర్మానించి, మన దేశ పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాలనుబీ ఆలోచనా, భావ

ప్రకటనా, మత విశ్వాస ఆరాధనా స్వేచ్ఛనుబీ హోదాల్లోనూ, అవకాశా ల్లోనూ సమానత్వాన్ని సాధించేందుకుబీ వ్యక్తి గౌరవాన్నీ, జాతి ఐక్యత%--% సమగ్రతను కల్పించే సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలనీబీ మన రాజ్యాంగ పరిషత్తులో 1949 నవంబర్ 26వ తేదీన ఈ రాజ్యాంగాన్ని స్వీకరించి, శాసనీ కరించి, ఆమోదించి, మనకు మనము సమర్పించు కున్నాం.

మొదట్లో భారత్‌ను సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా పేర్కొన్నారు. అయితే 42వ రాజ్యాంగ సవరణలో భాగంగా ఇది సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మారింది. (చదవండి: 'అడిగే హక్కే' అన్నిటికీ ఆధారం)

1776లో అమెరికన్ రాజ్యాంగ పీఠిక అమెరికా స్వతంత్ర ప్రకటనలో కీలకమైన భాగం. రాజ్యాంగానికి పీఠిక గుర్తింపు కార్డు వంటిదని శంకరీ ప్రసాద్ కేసులో (1952) జస్టిస్ హిదయతుల్లా పేర్కొన్నారు. విచిత్రమేమంటే పీఠిక మన రాజ్యాంగంలో అంతర్భాగమా లేక బయట ఉన్న ఒక పేజీయా అని పేచీ వచ్చింది. ఈ అంశాన్ని బాగా విచారించి, సుదీర్ఘమైన వాదోపవాదాలు విన్న తరువాత న్యాయమూర్తుల ధర్మాసనం కేశవానంద భారతి కేసులో పీఠిక రాజ్యాంగంలోని అంతర్భాగమేనోయీ అని తీర్పు చెప్పింది. అంతకు ముందు సుప్రీంకోర్టు వారు పీఠిక అంతర్భాగం కాదన్నారు. విచిత్రమేమంటే పీఠికలో ఉన్న హక్కులకు భంగకరమైన నియమాలు, లక్ష్యాలను అడ్డుకునే నియ మాలు కొన్ని మొదటినుంచీ ఉండటంబీ మరెన్నో తరువాత కాలంలో వచ్చి చేరుతూ ఉండటం గమనించవలసి ఉంది.

భారత ప్రజలు చేసుకున్న సామాజిక ఒప్పందమే ఈ పీఠిక. ఇందులో విలువలను కాపాడటానికి మనం దీక్షాబద్ధులం కావాలి. పౌరుడిని చైతన్యవంతమైన, సహేతుకమైన, స్వేచ్ఛాయుతుడైన వ్యక్తిగా తీర్చిదిద్దడానికి ప్రతిజ్ఞ చేయాలి. మనం ఇంకా కులమతాల చట్రాలలోంచీ, చట్టాల లోంచీ బయటకు రాలేదు. మన ఎన్నికలన్నీ కులమతాలకు చెందిన ఓటర్లను ప్రేరేపించడంతోనే మొదలై, ముగుస్తున్నాయి. 75 ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత కూడా మనం సామాజిక అభివృద్ధి, ప్రజాస్వామ్య విలువల వంటి వాటిని చూడడం లేదు. తాతల నాటి కట్టడాలు తమ ఘన కార్యక్రమం అన్నట్టు చూపి, సంస్కృతిని బూచిగా మార్చి, మతాన్నీ, కులాన్నీ నిత్యం వల్లిస్తూ ఎన్నికల్లో గెలవటం కోసం ప్రయత్నించడం చూస్తూనే ఉన్నాం. మత్తు పుచ్చుకుని ఇచ్చుకుంటున్నాం. ◆

---

**(33 వ పేజీ తరువాయి...)**

భయం – అస్మదీయులకోసం జాతి సంపదను తక్కువ వెలకడతారని తద్వారా క్విడ్ ప్రోకోలు కోకొల్లలుగా ఉంటాయేమోనని. మరో భయం – ఈ మొత్తం ప్రక్రియ పారదర్శకత లోపం వల్ల జాతిని మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసే అతి గొప్ప స్కామ్ కాకుండా కాపాడగలరా అని.

కొవిడ్ వచ్చినపుడు విమానయాన వ్యవహారాల్లో ప్రభుత్వం వైద్య పరీక్షలు రోగనిర్ధారణ చేసుకోవాలనే నిబంధనలు, ప్రయాణాలపై పరిమితులు, ఆంక్షలు, ఆరోగ్య రక్షణ కోసం అనేక షరతులు విధించారు. లాభాలకు ఆశపడే ప్రయివేటు వారికి జనం శ్రేయస్సు వంటపడ్తుందా?

డిమానిటైజేషన్ వలే మానిటైజేషన్ గురించి ఎన్నికల మానిఫెస్టోలో బిజెపి, ఎన్డిఎ భాగస్వాములు చెప్పలేదు. కనీసం పార్లమెంటులో కూడా ఈ సరికొత్త ఆశ్చర్యకర విధానాన్ని చర్చించలేదు. నీతీ ఆయోగ్ సమర్థింపు తప్ప వేరే ఎవరినీ సంప్రదించలేదు. ఈ గొప్ప ఐడియా ఎక్కడినుంచి వచ్చిందో చెప్పలేదు. అధికారపార్టీల ఎంపీలతో సహా చాలామందికి అసలు తెలియదు. ప్రతిపక్షాలు, మీడియా, పౌరసమాజం ప్రశ్నించాల్సిన పాలసీ. ఇది రాజ్యాంగవ్యతిరేకం అనడానికి ఇవి కారణాలు:

మౌలిక వనరులను కొన్ని కంపెనీలు, కొందరు వ్యక్తులకు మాత్రమే అద్దెకిస్తే, జాతి సంపద కొందరి గుప్పిట్లోకి వెళ్తుంది. పారదర్శకత లేకపోతే చాటుమాటున అస్మదీయులకు వనరులను కట్టబెట్టే అవకాశాలు ఉంటాయి.

ఆ విధంగా అద్దెకిచ్చిన చోట ప్రయివేటు వర్తకులు జన హితాన్ని పట్టించుకునే అవకాశాలు తక్కువ కనుక లాభాలకోసం వారు సామాన్యవినియోగదారుల మీద విపరీతంగా ఛార్జీలు వసూలు చేస్తారు. మిగతా చోట్ల ఇదివరకటి ధరలే కొనసాగవచ్చు. మొత్తం వనరులను అనేక వర్తకులకు కట్టబెడితే వారంతా వారికి తోచిన విధంగా చార్జీలు నిర్ణయిస్తే అసమానతలు విపరీతంగా పెరుగుతాయి.

అద్దె నిర్ణయించడానికిగాను వనరుల విలువ నిర్ధారణ చేయడంలో నిష్పాక్షిక, పారదర్శక విధానాన్ని అనుసరించకపోతే జాతి తీవ్రంగా ఆర్థిక నష్టాలకు గురవుతుంది. ఆమేరకు ప్రయివేటు వ్యక్తులకు లాభం జరుగుతుంది.

వేలంలో ఎక్కువ ధర పలికిందని, విచక్షణారహితంగా వనరులను ధార పోస్తే జాతీయ భద్రత సమస్యలు రావచ్చు. ◆

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...)**



# బహుళత్వమే కదా, భారతీయ ఆత్మ!

**కె. శ్రీనివాస్,** సంపాదకులు,ఆంధ్రజ్యోతి

'ప్రజలు అంటే ఉమ్మడి ప్రేమలు



కలిగి ఉండే జనబాహుళ్యం" అన్న వాక్యాన్ని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఈ ఏడాది జనవరిలో తన ప్రమాణస్వీకార ప్రసంగంలో ఉటంకించారు. అయిదో శతాబ్దంలో రోమ్ నగర పతనం నేపథ్యంలో, సెయింట్ అగస్టీన్ రాసిన 'సిటీ ఆఫ్ గాడ్' లోని వాక్యం అది. మనలోని అతిహీన సహజాతాలకు, అత్యుత్తమ నైతిక వైఖరులకు నడుమ అమెరికా అంతరాత్మ కోసం పోరాటం సాగుతున్నదని బైడెన్ వ్యాఖ్యానించారు. ఈ మాటలు గుర్తువచ్చినప్పుడు, భారతదేశపు ఆత్మ గురించిన ప్రశ్న రావడం సహజం. "ప్రజలు అంటే ఉమ్మడి ద్వేషాలు కలిగి ఉండే జనబాహుళ్యం" అని నిర్వచించుకుని, ఆ రకంగా ద్వేషనిర్మాణం కోసం ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు, అతిహీన సహజాతాలను, సజ్జన నైతికతను మనదేశంలో ఎట్లా గుర్తించాలని చర్చించవలసి ఉంటుంది.

బయటి ప్రపంచానికి అమెరికా సామ్రాజ్యవాది కావచ్చును కానీ, అంతర్గతంగా అది ప్రజాస్వామ్యాన్ని మెరుగుగా ఆచరించే దేశం. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మనల్ని మనం ప్రశంసించుకుంటాము, ఇతరులు కూడా ముఖస్తుతులు చేస్తుంటారు కానీ, పోలిక అంటూ తెస్తే అమెరికాయే అనేక విషయాలలో నయం. అందులో ఒకటి, 'జాతీయత'ను అది నిర్మించుకోవడానికి చేసిన ప్రయత్నం. ఐరోపా అర్థంలో జాతీయత, జాతి అన్న మాటలు భారత్‌కు, అమెరికాకు కూడా వర్తించేవి కావు. తెగ, నరవర్గం, భాష, రంగు మొదలైన అనేక ప్రాతిపదికలపై జాతి దేశాలు ఏర్పడ్డాయి కానీ, అనేక తెగల, నరవర్గాల, రంగుల, భాషల, మతాల, కులాల ప్రజలతో భారతదేశం ఏర్పడింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో పోరాడుతున్నప్పుడు, భారత జాతీయతను నిర్మించే ప్రయత్నం మొదలయింది. అమెరికా ప్రవాసుల దేశం. దేశీయ ప్రజానీకం మీద ఐరోపా వలసవాదులు అమలుజరిపిన అతి దారుణమయిన నిర్మూలన అనంతరం అమెరికా రూపుదిద్దుకున్నది. ఆఫ్రికా నుంచి వేటాడి తరలించిన నల్లజాతి బానిసల దగ్గరి నుంచి, తరలివచ్చిన అనేక ఐరోపా తదితర ఖండాల ప్రజలు, అమెరికా కోరి రప్పించుకున్న దేశదేశాల భౌతిక, బౌద్ధిక కార్మికులు, మేధావులు– అందరూ కలిస్తే అమెరికా అయింది. తెల్లవారి ఆధిక్యం, యూదుల ప్రాబల్యం.. ఇంకా అనేక అంశాలు అమెరికా స్వభావాన్ని తీర్చిదిద్ది ఉంటాయి. కానీ, ఇంత కలగూరగంప ప్రజానీకాన్ని ఒక దేశప్రజగా తీర్చిదిద్దడంలో అంతర్యుద్ధమూ, అనంతర ప్రజాస్వామ్యం మంచి పాత్ర వహించాయి. అక్కడి సమాజంలోను రంగువివక్ష, స్త్రీలపై హింస మొదలైనవన్నీ ఉన్నాయి, అమెరికన్ గర్వం అన్నది ఇప్పటికీ దాని దాష్టీకం మీద కూడా ఆధారపడి ఉన్న మాట నిజం. అయినప్పటికీ, ఆ దేశంలో జాతీయతను సంకుచితంగా, ద్వేషపూరితంగా నిర్వచించడానికి గట్టి ప్రతిఘటన ఎదురయింది. ట్రంప్ తీసుకువచ్చిన విభజనలకు, కేపిటల్ హిల్‌పై జరిపించిన దాడితో సహా ఆయన చేసిన దౌర్జన్యాలకు, అమెరికన్ సమాజం చెప్పుకునే సంస్కారానికి పొంతన కుదరలేదు. కార్మిక వలసలకు, మైనారిటీ మతాలకు, ప్రజల హక్కులకు, ఉదారవిలువలకు పచ్చి వ్యతిరేకిగా పరిణమించిన రిపబ్లికన్ ఉగ్రవాదమే బైడెన్ చెప్పిన అతిహీన సహజాత శక్తి.

వాషింగ్టన్‌కు చెందిన 'ప్యూ రీసర్చి సెంటర్' అనేక సమస్యలు, వైఖరులు, ధోరణులపై తటస్థ అధ్యయనాలను, పరిశోధనలను చేస్తుంది. ఇటీవలి కాలంలో ఆ సంస్థ అమెరికాలో జరిపిన ఒక

సర్వేలో, 2010 తరువాత జరిగిన వివాహాలలో 39 శాతం మతాంతర వివాహాలు అని తేలింది. అరవై ఏళ్ల కిందట ఇది కేవలం 19 శాతంగా మాత్రమే ఉండేది. వివాహం విషయంలో మతం అన్నది క్రమంగా అప్రధానమైపోతున్నదని ఈ అంకెలు చెబుతున్నాయి. కానీ, నూటికి 55మంది తల్లిదండ్రులు తమ పిల్లలు పెళ్లిచేసుకునేవారి కుటుంబం రిపబ్లికనా, డెమొక్రాటా అన్న విషయంలో పట్టింపుతో ఉన్నారట. అరవై ఏళ్ల కిందట 72 శాతం తల్లిదండ్రులు తమ పిల్లలు ఏ పార్టీ వారిని చేసుకున్నా పట్టించుకోబోమని చెప్పారు. ఇది అమెరికన్ సమాజంలో పెరుగుతున్న సెక్యులర్ ధోరణిని తెలియజేస్తుందా, లేక, ఒకప్పుడు మత విశ్వాసాలు అందించే గాఢమైన ఉద్వేగాలను ఇప్పుడు రాజకీయపార్టీలే అందిస్తున్నాయా? అన్న సందేహం కలుగుతుంది. ఇదే 'ప్యూ' సంస్థ తాజాగా భారతదేశంలో జరిపిన అభిప్రాయసేకరణలో వెల్లడైన అభిప్రాయాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. నూటికి అరవైఏడు మంది హిందువులు, తమ ఆడపిల్లలు మతాంతర వివాహాలు చేసుకోగూడదని గట్టిగా భావిస్తున్నారు. తమ మగపిల్లలు ఇతరమతస్థుల అమ్మాయిలను చేసుకోవడం విషయంలో నూటికి అరవై ఐదు మంది వ్యతిరేకంగా ఉన్నారు. మరొక ఆసక్తికరమైన పరిశీలన– భారతీయ జనతాపార్టీకి ఓటు వేసిన హిందువుల్లో ఈ ధోరణి మరింత హెచ్చుగా ఉన్నది. నూటికి 87 మంది మతాంతర వివాహాలను నిరోధించాలన్న అభిప్రాయంలో ఉన్నారు. రాజకీయ సామాజిక భావాల కంటె మతభావాలే మన దేశస్థులను ఎక్కువ ప్రభావితం చేస్తున్నాయనుకోవాలా? మతభావాల ప్రభావం ఒక పార్టీ ఓటర్లలో అత్యధికంగాను, ఆ పార్టీ ప్రభావం వ్యాపించిన సమాజంలో అధికంగానూ ఉంటే, రాజకీయ సామాజిక భావాలు, మతతత్వభావాలూ కలగలసిపోయాయనుకోవాలా?

'ప్యూ' అధ్యయనం తేల్చిన మరొక పచ్చి నిజం ఏమిటంటే, హిందువుగా ఉండడమే భారతీయతకు అసలైన గుర్తుగా నూటికి 67 శాతం మంది భావిస్తున్నారట. మతానికీ జాతీయతకు హద్దులు పూర్తిగా చెరిగిపోతున్న వాస్తవాన్ని ఈ పరిశీలనలో చూడవచ్చు. అయితే, దాదాపుగా అంతమందీ, భారతదేశంలో మతవైవిధ్యం ఉండాలని, అన్ని మతాలకు ఆదరణ లభించాలని భావిస్తున్నారట. అంటే, హిందువు నికార్సయిన భారతీయుడుగా భావిస్తూనే, ఇతరులు తక్కువ భారతీయత కలిగి ఉన్నప్పటికీ, వారిపై సహిష్ణుత కలిగి ఉండాలని అనుకుంటున్నారన్నమాట. ఈ వ్యత్యాసమే, ప్రథమశ్రేణి పౌరసత్వం, ద్వితీయశ్రేణి పౌరసత్వంగా పరిణమిస్తున్నదా? జాతీయోద్యమ కాలంలోనూ మతభావనల వినియోగం విస్తృతంగానే జరిగింది. కానీ, మతానికి నిమిత్తంలేని లౌకిక భావనలతో భారత జాతీయతను నిర్మించాలన్న ఆదర్శం కూడా నాడు ఉన్నది. స్వాతంత్ర్యపు తొలినాళ్లలో అటువంటి ప్రయత్నం కూడా ఎంతో కొంత జరిగింది. 1980 దశకం నుంచి మతజాతీయత క్రమంగా బలపడడం మొదలయింది. దేశసమగ్రత, సమైక్యతకు ప్రమాదం వచ్చిందన్న నినాదం, మైనారిటీ మతస్థుల ప్రాబల్యం ఉన్న రాష్ట్రాలలోని సమస్యలతో బలపడింది. దేశసమగ్రతను, వైవిధ్యాన్ని ప్రజానుకూల అర్థంలో ప్రచారం చేయడంలో పార్లమెంటరీ కమ్యూనిస్టులు ఘోరంగా విఫలం కావడమే కాక, సరిహద్దుల దేశభక్తిని వారు కూడా తలకెత్తుకున్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ రంగాలంకరణ చేసి వేదిక సిద్ధం చేసిన తరువాత, భారతీయ జనతాపార్టీకి గాంధీయ సోషలిజం వంటి లక్ష్యాలతో నిమిత్తం లేకపోయింది. భారతీయ అంతరాత్మ వైవిధ్యం కాదు, మెజారిటీ ధర్మమే అన్న భావం బలపడుతూ పోయింది.

జాతి దేశం కాదు, దేశపు జాతి ఏర్పడాలని కొందరు మేధావులు సూచిస్తున్నారు. భారతీయులంతా ఒక జాతి అన్న భావన పెరగాలని, భారతీయులలోని బహుళత్వాన్ని అప్పుడది స్వీకరిస్తుందన్నది దాని ప్రతిపాదకుల ఉద్దేశ్యం. కానీ, దేశంలో అతిహీన సహజాత దుష్టశక్తులు పూర్తిగా ఇంకా ఏ రూపూ దిద్దుకోని దేశంలో ఒక జాతిని, ఉమ్మడి ప్రేమ మీద కాకుండా, ఉమ్మడి ద్వేషం మీద ఆధారపడి నిర్మించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రగతిశీల సంగీతకారుడు టి.ఎం కృష్ణ ఈ మధ్య ప్రచురించిన "ది స్పిరిట్ ఆఫ్ ఎంక్వైరీ: నోట్స్ ఆఫ్ డిస్సెంట్" అన్న పుస్తకంలో ఎవరో ఏ ప్రయోజనాల కోసమో, రాజీల కోసమో గీసుకున్న గీతల మధ్య జాతీయతలు బందీ కావడమేమిటి అని ప్రశ్నించారు. దేశాల మధ్యనే కాదు, రాష్ట్రాల మధ్య, జిల్లాల మధ్య విభజన గీతలు అంతర్గత సాధికారత కోసం కాకుండా అదుపు చేయడం కోసమే ఉపయోగపడుతున్నాయని అన్నారు. ద్వేషజాతీయత స్థానంలో దేశజాతీయతను నిర్మించాలంటే ఏమి చేయాలన్నదే ప్రశ్న. ఉమ్మడి ప్రేమలను గుర్తించడం, సృష్టించడం ఒక మార్గం. సజ్జన శక్తులను ఉద్దీపింపజేయడం మరొక మార్గం.

వందేళ్ల తరువాత కూడా మళ్లీ గుర్తుచేయవలసి వచ్చే వాక్యం 'దేశమంటే మనుషులోయ్'. ఈ దేశం తనదేనా, ఈ దేశపు తనానికి ఇచ్చే నిర్వచనం తనకు వర్తిస్తుందా, మరెవరో తనకంటె హెచ్చు దేశస్తుడా అన్న భయసందేహాలు ఎవరికీ రాకూడదు. తన పుటకే తనను దేశభక్తుడిని చేస్తుందని, మరొకరి పుటక వారిని దేశద్రోహిని చేస్తుందని అనుకునే చోట, హిట్లర్ రాజ్యమే చిరస్థాయి అవుతుంది. అట్లా జరగకుండా ఏమి చేయగలమన్నదే ఇప్పుడు సజ్జన నైతికశక్తుల ముందున్న ప్రశ్న. ◆



# భారత చరిత్రపై సంఘ పరివారపు చేతబడి

**- ఇర్ఫాన్ హబీబ్,** ప్రముఖ చరిత్రకారులు

సంఘ్ పరివార్ నాయకత్వంలో విపరీతంగా జరుగుతున్న భారత చరిత్ర వక్రీకరణకు సంబంధించిన అసంగతాలనూ, మౌలిక విషయాలనూ చర్చిస్తున్నారు ఇర్ఫాన్ హబీబ్

(న్యూ సోషలిస్ట్ ఇనిషియేటివ్ (ఎన్ ఎస్ ఐ) నిర్వహిస్తున్న డెమొక్రసీ డైలాగ్స్ అనే ఉపన్యాస పరంపరలో సుప్రసిద్ధ చరిత్రకారుడు ప్రొ. ఇర్ఫాన్ హబీబ్ జనవరి 30, 2022న చేసిన ఉపన్యాసం 'డాక్టర్డ్ హిస్టరీ ఫ్రం ఏన్షియెంట్ టైమ్స్ టిల్ టుడే' కు ఎం కె సుధీర్ (ఎన్ ఎస్ ఐ కర్నాటక) రూపొందించిన అక్షర రూపానికి అనువాదం. ఇర్ఫాన్ హబీబ్ ఉపన్యాసాన్ని https://www.youtube.com/watch?v=jxUNXT-WpaQ మీద వినవచ్చు)

భారతదేశంలో చారిత్రక సంప్రదాయం చాల పాతది. సంస్కృతంలోని హర్ష చరిత్ర, రాజతరంగిణిల నుంచి పర్షియన్ లోని వృత్తాంతాలూ, సమాచార నమోదులూ, ఐన్ ఇ అక్బరీ లాంటి పాలన మీద పుస్తకాలూ, ఆ తర్వాత వలస కాలంలోనూ కూడా ఇది కొనసాగింది. ప్రధానంగా కచ్చితత్వం పట్ల, యథార్థమైన వాస్తవాల పట్ల పట్టింపుతో వాటిని అధ్యయనం చేయడం జరిగింది. ఆ కాలపు భారత చరిత్రను పునర్నిర్మించడానికి మనం ఆ వాచకాలను ఉపయోగించవచ్చు. కాని ఇప్పుడు జరుగుతున్నదాన్ని చరిత్ర వక్రీకరణ, చరిత్రమీద చేతబడి అనడం సబబు. ఇది వాస్తవాలలో ఎటువంటి ప్రాతిపదిక లేని చరిత్ర.

నేను జాతి సిద్ధాంతం అనే అంశంతో మొదలుపెడతాను. దాన్ని ప్రపంచమంతటా వదిలేశారు. కాని అధికారిక భారత చరిత్ర రచనకు సంబంధించినంతవరకు అదే చలామణీలో ఉన్న సిద్ధాంతంగా ఉంది. ఉదాహరణకు బాచిలర్ కోర్సు కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) తయారు చేసిన చరిత్ర పాఠ్యాంశాలు చూడవచ్చు.

1920లలో ఆర్ ఎస్ ఎస్ ను స్థాపించినప్పుడు దాన్ని మత కల్లోలాలలో ఒక రకమైన శక్తిగా తయారు చేశారు. కాని 1938లో గోల్వాల్కర్ ఒక పుస్తకం రాయడానికి నిర్ణయించుకున్నాడు. ఆ పుస్తకాన్ని ఆర్ ఎస్ ఎస్ అన్ని రకాలుగానూ తన బైబిల్ గా భావిస్తుంది. ఆ పుస్తకంలో తాను ఇతర హిందుత్వ రచయితల నుంచి గ్రహిస్తున్నానని గోల్వాల్కరే స్వయంగా చెప్పుకున్నాడు. ఆ పుస్తకం లో జాతి గురించి అడాల్ఫ్ హిట్లర్ కు సరైన దృక్పథం ఉందని, అది యూదుల పట్ల వైఖరిలో వ్యక్తమయిందని గోల్వాల్కర్ చేసిన ప్రశంసాత్మకమైన ప్రకటన ఉంది. 1938 నాటికి ఇంగ్లండ్, ఫ్రాన్స్ రెండూ కూడా రష్యా మీద దాడి కోసం హిట్లర్ ను ప్రోత్సహిస్తున్నాయి. అందువల్ల హిట్లర్ ను ఎంత ప్రశంసించినా బ్రిటిష్ వారికి కోపం వచ్చే ప్రసక్తి లేదు. మరి హిట్లర్ కు ఉండిన జాతి సిద్ధాంతం అంటే ఆర్య భావన మీద మోజు తప్ప మరేమీ కాదు.

గోల్వాల్కర్ కూడా స్వయంగా ఆర్యులే వాస్తవికంగా పూర్తిగా భారతీయులని, భారత జాతి వారికి మాత్రమే చెందినదని భావించాడు. ఇతరులకు భారతదేశంలో ఎటువంటి హక్కులు ఉండగూడదని అన్నాడు. ఆ మాట అంటున్నప్పుడు ఆయన ముస్లింలను ఉద్దేశించాడు. వాళ్లసలు పౌరులే కాజాలరన్నాడు. హిందువుల మత స్థలాలన్నీ భారతదేశంలోనే ఉన్నాయి గనుక వారు మాత్రమే భారతదేశపు నిజమైన దేశభక్తులని అన్నాడు. వాజపాయి పాలనా కాలంలో, 1999 నుంచి 2004 వరకూ ఈ మాట ఎన్ సి ఇ ఆర్ టి లో పదే పదే వినబడే ఇతివృత్తంగా ఉండేది. కాని సమస్య ఏమంటే ఈ మత స్థలాల జాబితాలో మొట్టమొదటి పేరైన కైలాస్ భారతదేశంలో లేదు. చైనాలో ఉంది. ఇప్పటివరకూ అయితే అది మనదే అని అనడం లేదు. కాని ఈ పరికల్పనను అంగీకరిస్తే ప్రపంచంలోని 99 శాతం దేశాలను దేశాలని పిలవడానికే వీలు లేదు. క్రైస్తవుల మత స్థలాలు పాలస్తీనాలో ఉన్నాయి. కాథలిక్కుల మత స్థలాలు రోమ్ లో ఉన్నాయి. దీన్ని అన్వయిస్తే భారతదేశంలో హిందూ జాతి తప్ప మరే జాతీ ఉండడానికి వీలు లేదు. దేశంలో హిందువులు తప్ప మరెవరూ లేనట్టుగానే ఈ మాటనే పదే పదే పునరుక్తిగా చెపుతున్నారు. కాని మనం చరిత్రలో కొంత వెనక్కి వెళ్లాలి.

ఆర్య సిద్ధాంతం గురించి చెప్పాలంటే, భాషా శాస్త్రవేత్తలు

నిర్ధారించిన ప్రకారం, ఆర్య లేదా ఆరియ అనే శబ్దం భారతదేశానికీ, ఇరాన్ కూ సంబంధించినది. అది ఇండో యూరపియన్ భాషల సముదాయానికి చెందినది. ఆ భాషలలోనే రుగ్వేదమూ, అవెస్తా ఉన్నాయి. తొలి సంస్కృత వాచకాల్లో ఆర్య అంటే గౌరవనీయమైన అని అర్థం. దాన్ని ధర్మశాస్త్రాల్లో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య అనే మూడు వర్ణాలకు అన్వయించారు. ఉత్తములు, శిష్టులు అనే అర్థం కూడ ఉంది. ఆరియ కు బహువచనంగా వాడిన ఆర్యావర్త అనే పదం భారతదేశాన్నీ, ఇరాన్ నూ రెంటినీ సూచిస్తుంది. అలా చూసినప్పటికీ, ఆ మాటలో ప్రత్యేకంగా భారతీయమైనదేమీ లేదు. మూల ఆర్యులం తామేనని చెప్పుకోవడానికి మనం చేసినంత ఇరాన్ కూడా సులభంగా చేసి ఉండవచ్చు.

కాని ఆర్యులు కావడంలో అంత ఆకర్షణీయమైనది ఏముంది? మనం గనుక యుజిసి పాఠ్యాంశాలు, రచనలు, పాఠ్యపుస్తకాలు చూస్తే, ఆర్యులు బైటి నుంచి వచ్చి ఉండవచ్చుననే సూచన పట్లనే తీవ్రమైన ఆగ్రహం కనబడుతుంది. వాళ్లు భారతదేశంలోనే మొదలై, ఇతర ప్రాంతాలకు వ్యాపించారని అనాలి. కాని మానవులందరూ ఆఫ్రికా నుంచి ప్రపంచానికి వ్యాపించారని మానవ శాస్త్ర (ఆంత్రొపాలజీ) చాల కాలంగా స్థిరపరిచింది. దాన్ని పురావస్తు ఆధారాలు నిర్దిష్టం చేశాయి. ఇప్పుడిక మానవ జన్యువుల ఆధారాలు కూడా దాన్నే బలపరుస్తున్నాయి. కాని మన పాఠ్యపుస్తకాల్లో దీన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. దాని బదులు, భారతదేశమే ఆర్యులకు జన్మనిచ్చిందనీ, వారు యావత్ ప్రపంచాన్నీ నాగరికం చేశారనీ చెపుతున్నారు. మనం ఆఫ్రికా నుంచి వచ్చామనే మాటను తిరస్కరించాలని లోలోపలి ఉద్దేశం. యుజిసి పాఠ్యాంశాలలో చరిత్ర పూర్వ యుగం గురించి ఎంతో కొంత ఉంది గాని మానవ వలసల గురించి మాట మాత్రం కూడా లేదు.

సంస్కృతం, ఇరానియన్ భాషల నుంచి తలెత్తిన ఇండో యూరపియన్ భాషల సముదాయం ఒకటుందని భాషా శాస్త్రం ఎంతో కాలం కిందనే నిర్ధారించింది. ఆ రెండు భాషలూ ఇండో యూరపియన్ భాషల పూర్వదశ నుంచి ఎంతో దూరమైనవి. ఆ తర్వాత పురావస్తుశాస్త్ర ఆధారాలు దొరికాయి. గుర్రం ఆధారం దొరికింది. గుర్రాలు మధ్య ఆసియాలోని దక్షిణ భాగాన ఉన్న కజకిస్తాన్ నుంచీ, రష్యన్ గడ్డి మైదానాల నుంచీ ఆఫ్ఘనిస్తాన్ కూ, ఇరాన్ కూ, ఇండియాకూ వలస వచ్చాయి. పురావస్తు తవ్వకాల్లో దొరికిన గుర్రపు ఎముకల ఆధారాల నుంచీ, ఆయా ప్రాంతాల్లో గుర్రాల చిత్రలేఖనాల ఆధారాల నుంచీ ఇది గుర్తించవచ్చు. అదంతా ఇరవై ఏళ్ల కిందనే నిస్సందేహంగా నిర్ధారణ అయింది. ఇప్పుడు అదే విషయం జన్యు ఆధారాల ద్వారా నిరూపితమైంది. క్రీ.పూ. 2000–1500 మధ్య ప్రధానంగా పురుషుల వలసలతో ఇది జరిగిందని జన్యు పరిశోధనలు చూపుతున్నాయి. జన్యుశాస్త్రం చూపుతున్న ఈ కాలక్రమాన్నే పురావస్తుశాస్త్రం కూడా నిర్ధారించింది.

సరే, ఇండో ఆర్యన్ భాషలు మాట్లాడుతుండిన మలిదశ ఇండో ఆర్యన్లు మధ్య ఆసియాలోని ఉత్తర భాగాల నుంచి ఇండియాలో ప్రవేశించారని అంటే వచ్చిన నష్టం ఏముంది? అయ్యో, ఏమీ నష్టం లేదు. ప్రపంచంలో ఏ ప్రాంతమైనా మరొక ప్రాంతం లాంటిదే. కాని చరిత్రమీద చేతబడి చేస్తున్న ఆర్ ఎస్ ఎస్ కల్పనా కర్తలకు అది మహా భయానకం. వాళ్లిక ఆర్యుల దురాక్రమణ అనే మిథ్యా సిద్ధాంతాన్ని తుత్తునియలు చేయడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. మొట్టమొదట గుర్తించవలసింది, ఆర్యులు అనే వారు ఒక రాజ్యంగా ఇండియా మీద దురాక్రమణ చేయలేదు. మనం ఇక్కడ దురాక్రమణల గురించీ, దాడుల గురించీ కాదు, వలసల గురించి మాట్లాడుతున్నాం. మనం ఇక్కడ తెగల గురించి మాట్లాడుతున్నాం. ఆ తెగల ఉనికి గురించి రుగ్వేద సూక్తాలు ధృవీకరిస్తున్నాయి. తప్పనిసరిగా చలనం ఉండింది. అలాగే ఇండియాలో ప్రత్యేకంగా ఇండో ఆర్యన్ భాషల మీద కనబడుతున్న ద్రావిడ భాషల ప్రభావం ఇరాన్ లో ఎంతమాత్రం కనబడడం లేదు. ద్రావిడ పూర్వ భాషల్లో ఉండిన మూర్ధన్య ధ్వని (నాలుక కొసను అంగిలికి తగిలించి హల్లును పలికే అలవాటు) ఇండియాకు వలస వచ్చినవారిలో సాధారణంగా ఉంటుంది. అందువల్ల భాషాశాస్త్ర నిర్ధారణలు సంపూర్ణంగా రుజువయ్యాయి. చాల ఆసక్తికరమైన విషయమేమంటే, ఇప్పుడు ద్రావిడ ప్రభావాలకు వ్యతిరేకంగా విరుచుకుపడుతున్నారు గాని ద్రావిడులు కూడా భారతీయులే కదా, రుగ్వేదంలో ద్రావిడ ప్రభావం ఉన్నదంటే ప్రమాదమేమిటి?

ఇక సింధు నాగరికత విషయానికి వచ్చినప్పుడు ఈ జాతి వివక్షా సిద్ధాంతపు సంపూర్ణ రూపాన్ని మనం చూడగలం. ఆర్ ఎస్ ఎస్ చేతబడి చరిత్రకారులకు సింధు నాగరికత అనే మాట వింటే గంగవెర్రులెత్తుతుంది. సింధు నాగరికతకు లిఖిత చరిత్ర ఉందనీ, గణేశుడికి ఏనుగు తలను అతికించడం జరిగింది గనుక మనకు అప్పటికే ప్లాస్టిక్ సర్జరీ తెలుసుననీ మన ప్రధాన మంత్రి అన్నాడు.

కాని అశోకుడి శాసనాల వరకూ మనకు రాత తెలుసుననే ఆధారాలు లేవు. అంతకు ముందు లిపి ఆధారాలు ఉన్నాయంటే అవి దక్షిణ భారతదేశంలోనూ, శ్రీలంకలోనూ మాత్రమే ఉన్నాయి. సింధు నాగరికత రాసుకున్న దాన్ని మనం చదవలేము గనుక, అది కచ్చితంగా సంస్కృతం కాదు గనుక సింధు నాగరికత

ఇబ్బందికరమైనది. వారు పూజించిన దేవతలు ఆకారాలతో ఉన్నవారే గాని మానవ ఆకారాలతో ఉన్నవారు కాదు. అంటే వారి ఆరాధన జంతువుల మీద ఆధారపడింది గాని, మానవ రూపాల మీద కాదు. శివుడితో కలిపి చూపిన జంతువులు వన్యమృగాలే తప్ప పశువులు కావు. అందువల్ల, సింధు నాగరికత కచ్చితంగా ఆర్యులకు పూర్వపుదని పురావస్తు శాస్త్రవేత్తలు సుదీర్ఘకాలం కిందనే నిర్ధారించారు. సింధు నాగరికతలో కనిపించిన చిత్రాక్షరాలకూ సంస్కృతానికీ ఎటువంటి సంబంధమూ ఉండే అవకాశం లేదు. పైగా, సింధు నాగరికతకూ ద్రావిడ పూర్వ దశకూ రెండు ప్రధానమైన సంబంధాలున్నాయి. అవి ఒకటి చేప గుర్తు, రెండోది బాణం గుర్తు. ద్రావిడపూర్వ దశలో చేప గుర్తుకు చేప అనీ, నక్షత్రాలనీ అర్థాలతో పాటు ఇతర అర్థాలు కూడా ఉన్నాయి. సింధు నాగరికతలో కూడా చేప గుర్తు చాల తరచుగా కనబడడాన్ని ఇది వివరిస్తుంది. అలాగే, సింధు వాచకాల్లో బాణం గుర్తు ఉన్న స్థలాలు ద్రావిడ, ద్రావిడపూర్వ భాషలకు వర్తించేట్టు కనబడుతున్నాయి. ఈ రెండు ఆధారాలూ చాలా ముఖ్యమైనవి.

సింధు నాగరికతకు ద్రావిడ సంబంధం ఉన్నదని తేలితే మనం ఎందుకు విచారపడాలి? ద్రావిడులేమీ ఇరానియన్ లో, ఆఫ్ఘన్లో కారు. వారు కూడా భారతీయులే. చేతబడి జరిగిన భారత చరిత్రలో ప్రధానమైన సమస్య ఇది. వాళ్లు ఒక అభూత కల్పనల కాలక్రమాన్ని స్థిరపరచడానికి ప్రయత్నించదలిచారు. ఆర్ ఎస్ ఎస్ కు చెందిన పురావస్తు శాస్త్రవేత్త వాకాంకర్ రుగ్వేదకాలాన్ని క్రీ.పూ. 8000 గా నిర్ధారించారు. రుగ్వేదంలో వ్యవసాయం ఉంది. వరి, బార్లీ పంటలు పండించడం ఉంది. గుర్రాలను మచ్చిక చేసుకోవడం ఉంది. మరి క్రీ.పూ. 8000లో ఇవేవీ లేనప్పుడు, రుగ్వేదం ఆ కాలానికి చెందినది ఎలా అవుతుంది? ఆ తర్వాత ఆర్కియలాజికల్ సర్వేకు డైరెక్టర్ జనరల్ గా పని చేసిన బి బి లాల్ ఉన్నారు. ఆయన ఖగోళ సమాచారానికి అభూతకల్పనల వ్యాఖ్యానం ఇవ్వడం ద్వారా శతపథ బ్రాహ్మణం రచన క్రీ.పూ. 4500లో జరిగిందని, అందువల్ల రుగ్వేదం దానికన్న నాలుగు వేల సంవత్సరాలు ముందుది అయి ఉండాలని అన్నారు. పురావస్తు శాస్త్రవేత్తలుగా ఎంతో కొంత పేరు ఉన్న వారే ఇటువంటి అభూత కల్పనలు మాట్లాడుతున్నారు. వేదానంతర వాచకాలను క్రీ.పూ. 4000 లో పెడుతున్నారు. అప్పటికి పత్తి లేదు, గుర్రాలు లేవు, గోధుమలూ, బార్లీ లేవు. అంటే రుగ్వేదాన్ని సింధు నాగరికత కన్నా ముందుకు జరిపే ప్రయత్నం, ఒక చరిత్ర పునర్నిర్మాణ ప్రయత్నం జరుగుతున్నది. ఇవన్నీ ఉద్ఘాటనలు మాత్రమే గనుక, వాటికి సాక్ష్యాధారాలు చూపించవలసిన అవసరం కూడ ఏమీ లేదు.

ఇక పదజాలం సమస్య కూడా చాల ముఖ్యమైనదే అనుకోండి. వీలర్ రోజులనుంచి కూడా ఆర్కియలాజికల్ సర్వే సింధు నాగరికతను హరప్పా నాగరికత అని పిలుస్తున్నది. ఆ నాగరికతకు సంబంధించి మొట్టమొదట తవ్వకాలు జరిగిన ప్రాంతం హరప్పా కావడమే అందుకు కారణం. మరి ఇప్పుడు హరప్పా పాకిస్తాన్ కు పోయింది. అంతే కాదు, అది అక్కడి పంజాబ్ రాష్ట్రంలో కూడా లేదు. ఇక చివరి ఇబ్బంది, హరప్పా సరస్వతీ తీరంలో లేదు. సింధు నాగరికతను గనుక "సరస్వతీ నాగరికత" అని పిలవాలంటే దాన్ని ఆర్యీకరించాలి, హైందవీకరించాలి. నిజానికి రుగ్వేదం ప్రకారం సరస్వతి అంటే నదీ దేవత. పవిత్రమైన సరస్వతీ నది థానేశ్వర్ గుండా ప్రవహిస్తుంది. అది చాల చిన్న సెలయేరు. ఎండిపోయి ఉంది. అందువల్ల సరస్వతిని అంత ముఖ్యమైన నది అని వాదించడం చాల కష్టం.

సరస్వతిని స్తుతిస్తూ ఉన్న రుగ్వేద సూక్తాలు నదీ దేవతా స్తోత్రాలనేది మరిచిపోయిన చిన్న సంగతి. ఆ సూక్తాలు ఈ నిర్దిష్ట నది గురించినవి కావు. సాధారణంగా నదీ దేవతలు పెద్ద నదులకే ఉంటారు. ఈ కీలకమైన విషయాన్ని విస్మరించి సింధు నాగరికతను సరస్వతీ నాగరికత అని పిలుస్తున్నారు. సింధు నాగరికతలో గుర్రం ఉన్నదనే ఆధారాలు లేవు గనుక, రుగ్వేదమేమో గుర్రాలే ముఖ్యమైన సమూహం గురించి మాట్లాడుతుంది గనుక స్పష్టంగా ఈ చేతబడి చరిత్ర, చరిత్రను తలకిందులుగా మార్చేస్తున్నది. ఏమాత్రం గంభీరమైన చరిత్రకారులకైనా ఇటువంటి జోక్యం అంగీకారయోగ్యం కాదు.

ఇక్కడి నుంచి నేను కుల వ్యవస్థ పట్ల వాళ్ల వైఖరి విషయానికి వస్తాను. గాంధీజీకి జవాబు అంబేడ్కర్ అని వాళ్లు తమకే తెలిసిన ఏదో కారణం వల్ల భావిస్తున్నారు. కాని కులం పట్ల వాళ్ల సొంత చిత్రణ ఏమిటి? యుజిసి పాఠ్యాంశాలలో కుల వ్యవస్థను మధ్య యుగాల ఉత్పత్తిగా చిత్రించారని వింటే మీరు ఆశ్చర్యపోతారు. ముస్లింలు రాగానే, హిందువులు తమలో తాము కులాలుగా విభజించుకున్నారట. వాళ్లు రాసిన ప్రాచీన భారతదేశంలో కులం అనే దాన్ని ఎక్కడా ప్రస్తావించ లేదు. ప్రాచీన కాలంలో క్రీ.శ. 600 సమయంలో రాజపుత్ర కులం ఎదుగుదల గురించి మాత్రం ప్రస్తావించారు. మరి రాజపుత్రులు ఒక కులమేననేది ఎవరూ నిరాకరించడానికి వీలులేని అంశం. వాళ్లకు తమ మూలాలు ఎప్పటి నుంచి ఉన్నాయో తెలుసుకోవాలని కోరిక ఉంది గాని మొత్తంగా కుల వ్యవస్థ గురించి వచ్చినప్పుడు మాత్రం, దాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. వాళ్లు కుల వ్యవస్థను పొగుడుతారు గాని కులం మాత్రం లేదన్నట్టు మరోవైపు చూస్తారు.

వాస్తవానికి గంగా మైదానం మధ్య భాగంలో కుల వ్యవస్థ పుట్టుక గురించీ, అది మౌర్య సామ్రాజ్యం లోకీ, దక్షిణ భారతదేశం వైపూ వ్యాపించడం గురించీ అధ్యయనం చేయడం చరిత్రకారులకు చాల ఆసక్తికరమైన ఇతివృత్తం. కుల వ్యవస్థ ఎలా విస్తరించింది? ఇప్పుడు పాకిస్తాన్ గా ఉన్న సింధు లోయ ప్రాంతంలోకి అలెగ్జాండర్ వచ్చినప్పుడు బ్రాహ్మణులు ఉన్నారని గుర్తించాడు. కాని కుల వ్యవస్థను చూడలేదు. కుల వ్యవస్థ క్రమంగా బీహార్ నుంచి తూర్పు ఉత్తరప్రదేశ్ లోకి ఎట్లా వ్యాపించిందో శాసనాలను నిశితంగా అధ్యయనం చేస్తే చూడవచ్చు. ఇది చరిత్రకారులకు చాల ఆసక్తికరమైన అంశం. కాని యుజిసి పాఠ్యాంశాల రూపకర్తలకు, ఆర్ ఎస్ ఎస్ తరహా చరిత్ర రచయితలకు మాత్రం కంటగింపు. కులవ్యవస్థను వారు వివరించలేకపోతున్నారు గనుక దాన్ని తమ పాఠ్యాంశాల నుంచి తొలగించారు. శూద్రుల గురించి పుస్తకం రాసినందుకు, బహుశా చండాలుల గురించి పుస్తకం రాసినందుకు ఆర్ ఎస్ శర్మను శత్రువుగా భావిస్తున్నారు. వేదానంతర సమాజంలో అటవీ ప్రాంతాల్లో వ్యవసాయం వ్యాపింపజేయడానికి తెగలను ఎట్లా సమీకరించారో, వారిని ఎట్లా అస్పృశ్యులుగా మార్చారో ఒక ఆసక్తికరమైన అంశం.

అదే వరుసలో మరొక ఆసక్తికరమైన అంశం మతం. ధర్మం అంటే నీతి, బ్రాహ్మణుల పట్ల విధేయత. కాని వాస్తవంగా వారికి మతం అనే మాట లేదు. సహిష్ణుత గురించిన అశోకుడి శాసనం మత సహనం గురించి మాట్లాడుతూ "పాషండులు" అనే మాట వాడింది. ఆ మాటను బ్రాహ్మణులు బౌద్ధుల గురించీ, బౌద్ధులు బ్రాహ్మణుల గురించీ వాడారు. ఉదాహరణకు అశోకుడు కుల వ్యవస్థ గురించి ఎందుకు ప్రస్తావించలేదనేది ఉపయోగకరమైన చర్చ. కాని చేతబడుల చరిత్ర కథనంలో ఇటువంటి ఆసక్తికరమైన అంశాలన్నీ అనవసరమైనవి అయిపోతాయి. నిజం చెప్పాలంటే అశోకుడినే అంతకంతకూ ఎక్కువగా అనవసరమని భావిస్తున్నారు. భారత చరిత్ర సంస్కృతి సంఘం అనేది స్థాపించినప్పటినుంచీ, 1970ల నుంచీ, "భారత చరిత్ర రచనలో దురభిప్రాయాలు" అనే పుస్తకం విడుదల చేసినప్పటినుంచీ ఎన్నెన్నో కొత్త అన్వేషణలు చేశారు. పురుషోత్తముడిని అలెగ్జాండర్ జయించలేదనీ, అలెగ్జాండరే ఓడిపోయాడనీ వి ఎన్ సూరి రాశాడు. సరస్వతి క్రీ. పూ. 2200 లో ఎండిపోయింది గనుక ఋగ్వేదం అంతకు చాల ముందుది కావాలని మరొక చరిత్రకారుడు అన్నాడు. ఈ వాదనను ప్రొఫెసర్ రొమిలా థాపర్ అంగీకరించలేదు. ఆ రెంటికీ మధ్య సంబంధం ఏమిటో ఎవరికీ తెలియదు.

వారు రాసిన ప్రాచీన భారత చరిత్ర వివాదాలకు దారితీసింది. హిందూ, ముస్లిం మతోన్మాద చరిత్రకారులిద్దరూ తమ తమ వైఖరులు ప్రకటించారు. మొదట ముస్లిం చరిత్రకారుల సంగతి చెపుతాను. ఇస్లాం ఒక సమానత్వ మతం అని ఒక ఆధునిక అభిప్రాయం ఉంది. కాని ఇస్లాంను చారిత్రక దృష్టితో చూస్తే ఈ లక్షణం పరిమితమైనదే అని తేలుతుంది. ఇస్లాం బానిసత్వాన్ని అనుమతించింది. ఉంపుడుగత్తెల పద్ధతిని అనుమతించింది. స్వయంగా ముస్లిం మతతత్వవేత్తలకు బానిసలుండేవారు. చివరికి సూఫీలకు కూడా బానిసలున్నారు. అందువల్ల ఇస్లాం ఒక సమానత్వ సమాజం అనడాన్ని అంగీకరించలేం. ముస్లింలు ఇక్కడికి సమానత్వాన్ని వ్యాపింపజేయడానికే వచ్చారన్నట్టుగా ముస్లిం చరిత్రకారులు రాశారు. ఇస్లాంలో కుల వ్యవస్థను ఆమోదించడం కష్టం గనుక వాళ్లు దాన్ని ఆమోదించలేరు. కాని వాళ్లు దాన్ని వాడుకున్నారు.

కుల వ్యవస్థ బ్రాహ్మణులకు గాని, మరే ఇతర కులానికి గాని లాభం చేకూర్చలేదని నేను ఇదివరకే వాదించాను. అది ప్రభుత్వానికి, రాజ్యానికి, లేదా ఏ దోపిడీ వర్గానికైనా లాభం చేకూర్చింది. అది ఒక పెద్ద భూమిహీన శ్రామికవర్గాన్ని, లేదా అస్పృశ్యులను సృష్టించింది. రైతులను విభజించింది. అది ప్రాచీన భారత పాలకులను సంపన్నులను చేసింది. అది వలస ప్రభుత్వానికి లాభం చేకూర్చింది. అందుకే వాళ్లు 'మనం దాన్ని చెదరగొట్టగూడదు' అనుకున్నారు. కులవ్యవస్థ బ్రిటిష్ వారికి ఎంత ఉపయోగకరంగా ఉండిందో, సుల్తాన్లకు కూడా అంతే ఉపయోగకరంగా ఉండింది. కనుక, ఇస్లాం ఒక సమానత్వ మతం అని అనడం పూర్తిగా అచారిత్రికం. ఒక ఆధునిక భావనను దానిమీద ఆపాదించడమే.

అదే విధంగా దాన్ని విదేశీ పాలన అనడం పిచ్చితనం. ఎందుకంటే విదేశీపాలన అన్నప్పుడు ఒక దేశాన్ని మరొక దేశం తరఫున పాలించడం ఉండాలి. మొఘల్ లు విదేశీయులు కారు. హుమాయూన్ తర్వాత ఏ ఒక్క మొఘల్ చక్రవర్తి కూడా దేశం బైట పుట్టలేదు. భారతదేశం 1200 సంవత్సరాలు విదేశీ పాలన కింద ఉండిందని మోడీ అనడం అసంబద్ధం.

ఇక మనం జాతీయోద్యమం గురించి మాట్లాడినప్పుడల్లా, వాళ్లు మహారాణా ప్రతాప్ గురించి మాట్లాడడం మొదలుపెడతారు, ఆయనేదో భారతీయ జనతా పార్టీ సభ్యుడైనట్టు! ఆర్ సి మజుందార్ హిందూ మహాసభకు చెందినవాడైనప్పటికీ, ఆయన కూడ ఆర్ ఎస్ ఎస్ వాళ్లు వెళ్లినంత అతికి వెళ్లలేదు. ఉదాహరణకు, ముస్లిం పాలనలు ఏవైనా సాంస్కృతిక విజయాలను మిగిల్చాయంటే ఆర్ ఎస్ ఎస్ కు కంపరమెత్తుతుంది. అందువల్లనే ప్రతి మొఘల్ కట్టడమూ వాస్తవంగా అంతకుముందు హిందువులు

నిర్మించినదేనని, పి ఎన్ ఓక్ తదితరులు 1960ల లోనే రాయడం ప్రారంభించారు. అది ఎర్రకోట గాని, తాజ్ మహల్ గాని, మాన్ సింగ్ మహల్ గాని. దానితో ఆర్ సి మజుందార్ ఆర్ ఎస్ ఎస్ పత్రిక ఆర్గనైజర్ తో తన సంబంధాలన్నిటినీ తెంచుకున్నారు. మొఘల్ కాలంలో ఎటువంటి సాంస్కృతిక విజయం సాధించలేదని అనడం, దాన్ని ప్రచారం చేస్తూ ఉండడం పిచ్చితనం తప్ప మరేమీ కాదు.

ఇక ఆధునిక చరిత్ర విషయానికి వస్తే, వాజపాయి పాలనా కాలంలో ఎన్ సి ఇ ఆర్ టి ప్రచురించిన, హరి ఓం రాసిన 'మాడర్న్ ఇండియా' పుస్తకం చూడవచ్చు. పునరుజ్జీవన ఘనతను ఇంగ్లిష్ విద్యను ప్రోత్సహించిన రామమోహన్ రాయ్ కీ, కేశవచంద్ర సేన్ కూ, జస్టిస్ రానడేకూ, సయ్యద్ అహ్మద్ ఖాన్ కూ ఇవ్వడం ఆర్ ఎస్ ఎస్ కు ఇష్టం లేదు. వీరిలో రామమోహన్ రాయ్ ప్రత్యేకంగా ఒక అద్భుతం. శాశ్వత శిస్తు పద్ధతిని జమీందార్లతో కాక రైతులతో చేయాలని 1839లోనే అన్నాడంటే ఆ మనిషి దూరదృష్టి ఎంత గొప్పదో నేను ఊహించనుకూడలేను. కేశవచంద్ర సేన్ స్త్రీపురుష సమానత్వం గురించి మాట్లాడాడు. వీళ్లందరినీ ఆ పుస్తకం బహిష్కరించింది. రామమోహన్ రాయ్ తనను తాను ఏకేశ్వరోపాసకుడినని చెప్పుకున్నాడు గనుక, ఇంగ్లిష్ లో ఎంత ప్రజ్ఞ ఉండేదో, పర్షియన్, అరబిక్ లలో కూడా అంతా ప్రజ్ఞ ఉండేది గనుక ఆయనను బహిష్కరించారు.

ఇప్పుడిక నాయకులు దయానంద సరస్వతి, బంకించంద్ర ఛటర్జీ, స్వామి వివేకానంద, అరవింద ఘోష్. వారు ఏ రకంగా సంస్కర్తలు? వారు మత వ్యక్తులు. జాతీయోద్యమంలో వారి పాత్ర ఏమిటి?

ఈ పుస్తకం చిట్టచివరికి తేల్చేదేమంటే, జాతీయోద్యమం నిజమైన ఉద్యమం కాదని, దాని స్థానంలో సాంస్కృతిక జాతీయవాదమే ముఖ్యమని. బ్రిటిష్ పాలకులు ఈ సాంస్కృతిక జాతీయవాదం తమకు ప్రమాదకరమని ఎంతమాత్రం భావించలేదు. అంతే కాదు, పాలకులు ఏమి చెపితే అది ఆర్ ఎస్ ఎస్ చేసింది కూడ.

అంతే కాదు, అంబేద్కర్ ను తలకిందులుగా వాడుకోవడం. బహిష్కృత, అణగారిన వర్గాల కోసం నడిపిన ఉద్యమం వరకు అంబేద్కర్ కానుకలు మహత్తరమైనవి. కాని జాతీయోద్యమం విషయానికి వస్తే ఆయనను జాతీయోద్యమ నాయకులతో పోల్చడానికి వీలులేదు. జాతీయోద్యమము నుంచి గాంధీ నెహ్రూలను తొలగించడానికి ఎంత ప్రయత్నం జరిగిందంటే హరి ఓం చివరికి గాంధీజీ హత్య గురించి ఒక్క ముక్క కూడా రాయలేదు. అసలు ఆ ఘటనకు చరిత్రలో నమోదు కాదగిన అర్హతే లేదన్నట్టుగా. మనకు నిజంగా స్వాతంత్ర్యం తెచ్చిన జాతీయ వ్యక్తులను పూర్తిగా చిన్నబుచ్చడం చేతబడి చరిత్రలో జరిగిందని నేనిక్కడ చెప్పదలచాను. అలాగే వాళ్లు ఆర్ ఎస్ ఎస్ మీద పటేల్ విమర్శలను ఎప్పుడూ ఉటంకించరు. పటేల్ ను నెహ్రూకు వ్యతిరేకంగా నిలబెట్టడం మరొక పిచ్చితనం. జాతీయోద్యమాన్ని పూర్తిగా వక్రీకరించడం వారు చేస్తున్న అత్యంత విషపూరితమైన, దుర్మార్గమైన చర్య.

చివరిగా, స్వాతంత్ర్యానంతర దశలోని చరిత్రమీద వాళ్లు చేసిన చేతబడి గురించి చెప్పి ముగిస్తాను. మామూలుగానే వాళ్లు చేసేది ప్రమాదకరమైనది కాగా, ఇది అత్యంత ప్రమాదకరమైనది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నా వయసు 16 సంవత్సరాలు. ఆగ్రా వంటి ప్రాంతంలో 1952 ఎన్నికల సమయంలో నేను కమ్యూనిస్టు పార్టీ తరఫున పనిచేశాను. ఆ ఎన్నికలలో ఇతర విషయాలతో పాటు, హిందూ కోడ్ సంస్కరణలు, స్త్రీల హక్కులు ప్రధానాంశాలుగా ఉండినాయి. హిందూ కోడ్ సంస్కరణలను వ్యతిరేకించడానికి జనసంఘ్, రామరాజ్య పరిషద్, హిందూ మహాసభ ఒక కూటమిగా ఏర్పడ్డాయి. వాళ్లు చిత్తుగా ఓడిపోయారు. కమ్యూనిస్టు పార్టీ దగ్గరికి కొందరు వస్తుండేవారు. ఆ కూటమి దగ్గరికి ఎవరూ వెళ్తుండేవారు కాదు. 'మాకు ఏమీ దక్కలేదు, కాని ఈ చట్టం వస్తే కనీసం మా కూతుళ్లకైనా ఎంతో కొంత దక్కుతుంది' అని జనం అంటుండేవాళ్లు.

దేశపు జ్ఞాపకాలలో అదంతా తుడిచిపెట్టుకుపోయినట్టు కనిపిస్తున్నది. ఆర్ ఎస్ ఎస్ ప్రాతినిధ్యం వహించే చేతబడి చరిత్రలోకి మనం చేరుకుంటున్నట్టున్నది. 1955-56ల్లో హిందూ కోడ్ వచ్చినప్పుడు, అది రెండువేల సంవత్సరాల ధర్మశాస్త్రాలను పూర్తిగా కూలదోసింది. యాభై సంవత్సరాల తర్వాత, మళ్లీ ఒక కాంగ్రెస్ ప్రభుత్వం కిందనే స్త్రీలు సంపూర్ణంగా సమానహక్కులు సాధించారు. ఇంకా మిగిలిపోయిన చిన్న చిన్న తేడాలు కూడ పూర్తిగా తుడిచివేయబడ్డాయి. కాని అదంతా జరిగింది కాంగ్రెస్ ప్రభుత్వం కిందనే. కనుక ఇప్పుడు మోడీ, షా అంటున్నట్టుగా స్వాతంత్ర్యం తర్వాత ఏమీ జరగలేదని అనడం తెలివితక్కువతనం.

తర్వాత, రైతులకు భూమి. 1946లో తాత్కాలిక ప్రభుత్వాల నుంచి, చట్టసభలు జమీందారీ రద్దు కోసం చట్టాలు ఆమోదించడం ప్రారంభించాయి. షేక్ అబ్దుల్లా నాయకత్వంలో కశ్మీర్ లో బహుశా అత్యంత విప్లవాత్మకమైన భూసంస్కరణలు అమలయ్యాయి. ఆ షేక్ అబ్దుల్లాను ఆర్ ఎస్ ఎస్ తీవ్రంగా ఖండిస్తుంది. ఆయన వల్లనే

కశ్మీర్ లోని రైతులకు భూములు దక్కాయి. ఉత్తరప్రదేశ్ లోనూ, అన్ని రాష్ట్రాలలోనూ రైతులకు భూమి దక్కింది, జమీందారీ రద్దయింది. అదంతా ఏమీ జరగనట్టేనా?

ఆ తర్వాత భూగరిష్ట పరిమితి చట్టాలు వచ్చాయి. అణగారిన ప్రజలు భూమి పొందారు. అదంతా ఏమీ జరగనట్టేనా?

తర్వాత, నెహ్రూ కాలంలోనే, బీమా కంపెనీల జాతీయీకరణ జరిగి, బీమా సురక్షితమై సాధారణ ప్రజానీకానికి గొప్ప ఉపశమనాన్ని ఇచ్చింది. బ్యాంకుల జాతీయీకరణ మరింత రక్షణను ఇచ్చింది. ఇవన్నీ ప్రభుత్వ రంగాన్ని నిర్మించడంలో, భారతదేశాన్ని పారిశ్రామికీకరించడంలో చాల ముఖ్యమైన పరిణామాలు. దేశాన్ని పారిశ్రామికీకరించడానికి అది ఒకటే మార్గమని అంటూ రెండో పంచవర్ష ప్రణాళికను చివరికి జి డి బిర్లా కూడ సమర్థించారు. అదంతా ఏమీ జరగనట్టేనా?

ఇరవయో శతాబ్ది రెండో అర్ధ భాగంలో తలసరి వినియోగం పెరిగిందని, ఆ తర్వాత అది తగ్గిపోతున్నదని ప్రముఖ అర్థశాస్త్రవేత్తలెందరో చూపారు. అదంతా ఏమీ జరగనట్టేనా?

అంటే మొత్తం మీద స్వాతంత్ర్యానంతర భారతదేశాన్ని పూర్తిగా తప్పుగా చూపడం భారత చరిత్ర మీద చేతబడిలో ఒక ముఖ్యమైన భాగం. దాన్ని ప్రతిఘటించవలసి ఉంది. ఏమి జరిగిందో సక్రమంగా, సరిగ్గా వర్ణించాలి. భారత చరిత్రలోని మహత్తరమైన వ్యక్తులను తొలగించి, వారి స్థానంలో మనం తయారు చేసిన కొందరు వ్యక్తులను స్థాపించడం కుదరదు. అలాగే అది పౌర చట్టం గాని, జమిందారీ రద్దు గాని, భూగరిష్ట పరిమితి గాని, భూ పంపిణీ గాని, ప్రభుత్వ రంగ నిర్మాణం గాని, పారిశ్రామికీకరణ గాని అటువంటి మహత్తర సంఘటనలను మన ఇష్టం వచ్చినట్టుగా విస్మరించలేము.

షా, మోడీలు దాచిపెట్టదలచిన ఈ విజయాలు మహత్తరమైనవి. ఆ విషయం భారత ప్రజలకు చేరవేయడం చరిత్రకారుల బాధ్యత.

## అనువాదం : ఎన్ వేణుగోపాల్

(అనువాదకుడి వ్యాఖ్య: ఈ ఉపన్యాసంలో కొన్ని అభిప్రాయాలతో, ముఖ్యంగా వలస వ్యతిరేక ఉద్యమం చరిత్రపై, వలసానంతర భారత చరిత్రపై ఇర్ఫాన్ హబీబ్ అభిప్రాయాలతో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రస్తుత సంఘ్ పరివార్ వక్రీకరణల నేపథ్యంలో ఈ మొత్తం చరిత్రాంశాలు తప్పనిసరిగా చర్చకు రావాలనీ, ఇవి తెలుగు ఆలోచనాపరులకు తెలియాలనీ అనువదించాను. ఉపన్యాసానికి అక్షరరూపం ఇవ్వడంలో కొన్ని అంశాలు తొలగిపోయినట్టున్నాయి, అలాగే ఉపన్యాసం తర్వాత మంచి చర్చ కూడ జరిగింది. కనుక వీలైనవాళ్లు యూట్యూబ్ మీద చూడండి.)◆

**(వీక్షణం మాసపత్రిక సౌజన్యంతో...)**





# హేతువాదం Vs HATE వాదం

- డాక్టర్ దేవరాజు మహారాజు కేంద్ర సాహిత్య, అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

*ఈ మధ్యన ఎటు చూసిన ఎన్నెన్నో చోద్యమ్ములు*
*విద్యాధిక వర్గంలో వింత వింత దృశ్యములు*
*టెంకాయల లంచంతో దేవునికి పిటీషన్లు*
*తలనీలా లిస్తామని తిరుగులేని అగ్రిమెంట్లు*

**- గజ్జెల మల్లారెడ్డి**

కొబ్బరికాయ కొనేప్పుడు అందులో నీళ్ళున్నాయో లేదో అని చెవి దగ్గర కాయను ఊపి, ఊపి, నీళ్ళ శబ్దం వినడానికి ఇక ప్రయత్నిస్తారు. అదేం చిత్రమో కానీ – ఆ కొబ్బరికాయ కొట్టే దేవుడు ఆ విగ్రహంలో ఉన్నాడో లేదో అని మాత్రం తేల్చుకోరు. ఏ నిర్ధారణ, నిరూపణ లేకుండానే నమ్మేస్తారు. మనువాదుల కుట్రకు బలై ఆ భావజాలాన్ని స్వీకరిస్తారు. అంతేకాదు దేవుడనే వాడు విగ్రహంలోనే కాదు ఎక్కడైనా ఉంటాడు – అనే అంధ విశ్వాసంతో కూరుకుపోతారు. "ఇందుగల డందులేడని సందేహము వలదు" అనే నమ్మకంలో కొట్టుకుపోతుంటారు.

'రాముడు దేవుడు కాదు' – అని ప్రకటించారు బీహార్ మాజీ ముఖ్యమంత్రి జితిన్ రాం మాఝీ. ఆ పేరు కేవలం ఒక కల్పిత పాత్రది మాత్రమేనని, ఆ పాత్రను సృష్టించుకున్న వాల్మీకి, తులసీదాస్ వంటి కవులు కావ్యాలు రాశారు తప్ప, నిజానికి శ్రీరామ చంద్రుడనే వాడు ఎప్పుడూ, ఏ కాలంలోనూ – ఏ ప్రాంతంలోనూ బతికి లేడని ఆయన వివరణ ఇచ్చారు. కవులుగా వారిని గౌరవించుకోవచ్చు. కాల్పనిక రచనలుగా వారి రచనల్ని విశ్లేషించుకోవచ్చు. అంతేగాని ఒక కల్పిత పాత్రను గౌరవించడమేమిటి? పూజించడమేమిటి? ఉత్సవాలు – పండుగలు జరుపుకోవడమేమిటి? అని ఆయన ప్రశ్నించారు. పైగా మరో మాట కూడా అన్నారు. మన ముందు తరం వారికి మనకి ఉన్నన్ని అవకాశాలు లేవు. మనం సాధించినంత ప్రగతి సాధించలేకపోయారు. అది అలా వదిలేసి, మన తరం కొత్తగా, హేతుబద్ధంగా ఆలోచించాలి. కదా? ముందు తరం వారికి మెదడు పని చేయకపోతే పోయింది. ఇప్పుడు ఈ కాలం మనుషులకు ఏమైందీ? అదే మూఢత్వం కొనసాగిస్తూ ఇప్పుడు ఈ కాలం మనుషులకు ఏమైందీ? అదే మూఢత్వం కొనసాగిస్తూ ఉంటారా? అని, ఆ మాజీ ముఖ్యమంత్రి తీవ్రంగా మండిపడ్డాడు.

సమాజంలోని అన్ని రంగాలలో తమ ఆధిపత్యం ఎలాగైనా కొనసాగుతూ ఉండాలని మనువాదులు కుట్రలు పన్నుతుంటారు. ఏవేవో పుకార్లు పుట్టిస్తుంటారు. ఇటీవల ఓ సన్నాసీ బాబా గురువు తన భక్తులకు ఒక మంత్రోపదేశం చేశాడు. అదేమిటంటే – 'ఏ మందు బిళ్ళయినా (టాబ్లెట్) వేసుకునే ముందు మహా మృత్యుంజయ మంత్రం రెండుసార్లు చదివితే – మందుబిళ్ళ బాగా పనిచేసి, రోగం సత్వరమే తగ్గిపోతుందని' – అదే నిజమైతే – ఆసుపత్రుల ముందు – మెడికల్ షాపుల ముందు, ఫారామ కంపనీల ముందు అదే మాట రాసి బోరుడలు పెట్టాలి. జనం బుద్ధిగా దాన్ని పాటిస్తారా? లేక పాత చెప్పులు వెతికి తీసుకొస్తారా? చూడాలి. ఆధునిక వైద్య శాస్త్రానిక్కూడా మీ పైత్యం అంటగట్టకండిరా బాబూ – కావాలంటే నమ్మకం ఉన్నవాళ్ళు టాబ్లెట్ల వాడకం మానేసి మహా మృత్యుంజయ మంత్రమే చదువుకుంటూ తమ వ్యాధులు నయం చేసుకోవచ్చు కదా? ఎవరు కాదన్నారూ? ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది టాబ్లెట్లు వాడి డబ్బులు తగ్గించుకుంటున్నారు. లేదా అదుపులో ఉంచుకుంటున్నారు. పిచ్చి నమ్మకాలున్న వారికీ నోరు అదుపులో ఉండడం లేదు. అదీ మన భారతదేశంలోనే – ఇతర దేశాల్లో ఎవరూ మహామృత్యుంజయ మంత్రం పేరు కూడా విని ఉండరు. మన దేశంలో కొందరు విన్నా ఆ మంత్రమేమిటో ఎవరికీ తెలియదు. అది పని చేస్తుందనడం ఒక అబద్ధం. అది నిరూపించగల వాళ్ళుంటే నిరూపించాలి. మనదేశ ఆరోగ్య రంగానికి గొప్ప మేలు జరుగుతుంది. నిరూపించడం చేతగాకే మానసిక బలహీనుల మీద ప్రభావం చూపే పుకార్లు అన్ని మాధ్యమాలలో వ్యాప్తి చేస్తున్నారు.

అడవిలో ఎన్నికలు జరుగుతుంటే చెట్లన్నీ గొడ్డలికి ఓటు వేశాయట–కారణమేమంటే 'గొడ్డలికి ఉన్న కర్ర తమ కులానికి చెందిందే' అని. ఇందులో ఏమైనా అర్థముందా? గొడ్డలి కర్రను గెలిపించుకుంటే ఏమవుతుంది? గొడ్డలి చెట్లన్నింటిని నరికేస్తుంది కదా? అమాయక జనం, మూర్ఖజనం అందరూ కలిసి ప్రస్తుత

కేంద్ర ప్రభుత్వాన్ని రెండోసారి అధికారంలోకి తెచ్చారు. ఫలితం అనుభవిస్తున్నాం. అధికార పార్టీ విధానాల వల్ల ఎనిమిదేళ్ళలో 60–70 శాతం ధరలు పెరిగాయి. 2014–15 లలో పెట్రోలు, డిజిల్, ధరలు 71–55 రూ/– కాగా ఈ సంవత్సరం (2022)లో అది 120–106కి పెరిగింది. వంట గ్యాస్ 414 రూ. ల నుండి 1002 రూ. లకు పెరిగింది. ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోతూ ఉంది. ఇది ఇలాగే కొనసాగితే మన దేశం కూడా శ్రీలంక లాగా అయిపోయినా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. ఇవన్నీ లోతుగా అధ్యయనం చేసిన జస్టిస్ మార్కండేయ కట్జూ, నిర్మొహమాటంగా ఓ మాట చెప్పారు. 'తొంభయి శాతం భారతీయులు మూర్ఖులు' – అని అన్నారు. 'ఓటు వేసే వారంతా కులం, మతం, ప్రాంతం ప్రాతిపదికన ఓటు వేస్తున్నారు. కానీ, అభ్యర్థి, గుణగణాలు, శక్తి సామర్థ్యాలు చూడడం లేదు. సమాజంలో ఉన్న పేదరికం, ఆరోగ్య సదుపాయాలు, పోషకాహార లోపం అన్నింటినీ మించి నిరుద్యోగం, వంటి వాటిని ప్రజలు ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు' – కాబట్టి, తన మాటలో తప్పేమీ లేదని ఆయన తనను తాను పూర్తిగా సమర్థించుకున్నారు. "90 శాతం భారతీయులు మూర్ఖులు"– అనే తన మాటను తప్పని నిరూపించదలిస్తే – దేశంలోని ఏ ప్రాంతపు ప్రజలనైనా ఉదాహరణగా చూపాలి! అని సవాల్ విసిరారు. జస్టిస్‌గారు చెప్పింది తప్పని.. చెప్పడానికి ఆస్కారమే లేకపాయే!

రెండోసారి బిజెపిని ఎన్నుకున్నందుకు ఉద్యోగులకు గొప్పబహుమతి లభించింది. ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్ వడ్డీ రేట్లు 8.1 శాతానికి తగ్గిపోయింది. ఇది ఎన్నడూ లేనంత కనిష్టస్థాయి. కోట్లాది మంది ప్రభుత్వ ప్రయివేటు ఉద్యోగుల మీద తీవ్ర ప్రభావం పడింది. గొడ్డలి కర్రకు ఓట్టేస్తే వేటు పడేది పచ్చని చెట్ల మీదే కదా? ఇది ఇలా ఉంటే అఖిల భాతర ఆర్.ఎస్.ఎస్ అత్యున్నత ప్రతినిధి సభ 11మార్చ్ 2022 న గుజరాత్‌లోని అహ్మదాబాదులో ప్రారంభమైంది. సంఘ్ చాలక్, సంఘ్ కార్యవాహ్ మొదలైన వారితో పాటు సుమారు 1200 కీలక నాయకులు పాల్గొన్నారు. రెండేళ్ళలో దేశమంతటా – మండలస్థాయి నుండి తమ శాఖలు ఏర్పాటు చేసుకోవాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. నిశ్శబ్దంగా ప్రమాద ఘంటికలు మోగుతున్న చప్పుడు దేశమంతా ప్రతిధ్వనిస్తోంది. ప్రతిపక్షాలేవీ ఎక్కడా? దేశ ప్రజలారా! మీ ప్రభుత్వాన్నుంచి మిమ్మల్ని మీరే కాపాడుకోవాలి! జాగ్‌తే రహో!!

విద్యా సంస్థల కాషాయీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం కుట్రలు సాగిస్తూనే ఉంది. వ్యవస్థలన్నింటికీ కాషాయం పులిమే పని విజయవంతంగా కొనసాగిస్తూ ఉంది. అందులో భాగంగానే యుపిఎస్సి ఛైర్మన్ పదవిలో తమకు సన్నిహితుడైన మనోజ్ సోనిని నియమించింది. మోడి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ సోని ఆయనకు ఉపన్యాసాలు రాసిచ్చేవాడు. ఆ సాన్నిహిత్యం వృధా పోలేదు. వదోదర యం.యస్. యూనివర్శిటీ వైస్‌ఛాన్సిలర్ అయ్యాడు. ఆరెస్సెస్‌కు, బిజెపికి సన్నిహితుడు కావడం వల్లనే ఇప్పుడు మళ్ళీ యుపిఎస్సికి ఛైర్మన్ అయ్యాడు. ఈ మనోజ్ సోనీది గతంలో ముంబైలో అగరొత్తులు అమ్ముకున్న స్థాయి 12వ తరగతిలో సైన్స్‌లో పరీక్ష తప్పేంత మేధస్సు. అయినా కూడా, మోడీ లింక్ దొరికింది గనక ఉన్నత పదవులు అందుకోగలుగుతున్నాడు.'సైన్స్‌లో ఫెయిల్ అయ్యాడు గనక ఆర్ట్స్ చదవాల్సి వచ్చింది. చదివితే తప్పులేదు కానీ, రీజనింగ్ లేని విషయాలన్నింటినీ ప్రమోట్ చేస్తున్నాడు. పది పాస్ కాలేనివాడు ఓ యం.ఎ.డిగ్రీ కొనుక్కుని ప్రధాని కాలేదా? అక్రమ మార్గంలో పై కొచ్చినవాడు అలాంటి వారినే కదా చేరదీస్తాడూ? 'మోడికి ఎక్కాలురావు. ఆర్థిక రంగం గురించి ఏం తెలుస్తుందీ' అని వారి బిజెపి, యం.పి సుబ్రహ్మణ్య స్వామియే బాహాటంగా ప్రకటించాడు. అందులో రహస్య మేమీలేదు. న్యాయశాస్త్ర కోవిదుడైన మన తెలుగువాడే సమాచార హక్కు చట్ట (RTI) కింద ప్రధాని విద్యార్హతలేమిటి? అని అడిగితే "అది రహస్యంగా ఉంచవల్సిన విషయం" అని ప్రధాని కార్యాలయం బదులిచ్చింది. మోడి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జాతీయ 'టెలివిజన్ ఛానల్లో కరన్‌థాపర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయనే స్వయంగా హైస్కూలు వరకు చదువుకున్నానని వినయంగా చెప్పుకున్నాడు. ఆ ప్రసారం నేను చూశాను కూడా!

అంబేద్కర్ జయంతి సందర్భంగా 14 ఏప్రిల్ 2022 న కర్నాటక కాంగ్రెస్ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి పరమేశ్వర్ స్వయంగా తన అనుభవాలు పంచుకున్నారు. "ఈ దేశంలో కుల వ్యవస్థ వేళ్ళూనుకుని ఉందని, ఎన్ని ఉన్నత పదవులలో ఉన్నా కులవివక్షను ఎదుర్కొంటూనే ఉన్నానని'' చెప్పుకున్నారు. ప్రపంచంలో మరే ఇతర దేశంలోనూ ఇలాంటి పరిస్థితి లేదని వాపోయ్యారు. ఈ పరిస్థితులు చూసి ఒక ఉర్దూ కవి ఇలా అన్నాడు. "ఆసిఫ్ –ఫ్యాస్ లగీతో, మజిద్ గురుద్వారా, చర్చ్, హోటల్ మె చలే జానా – బస్ మందిర్‌మే మత్ జానా మెరే భాయ:ు – మందిర్ ఆజో కల్ భగవాన్ క నహీం – సంఘ్ పరివార్ క ఘర్ హై – చదువుల్లేవు – ఇంగిత జ్ఞానం లేదు – మతం పేరుతో కనిపించని దేవుడి పేరుతో, హనుమాన్ చాలీసా పేరుతో – శోభాయాత్రల పేరుతో మత విద్వేషాలు రగిలించి, జనాన్ని హేట్ నాూజు వాదంలోకి దింపే ప్రయత్నం ముమ్మరంగా చేస్తున్న కేంద్ర

**(తరువాయి 58 వ పేజీలో....)**



# "హిందూ రాజ్యం" హిందువుల బాగు కోసం కాదు

**- ప్రభాత్ పట్నాయక్,** ప్రఖ్యాత ఆర్థిక వేత్త

భారతీయ జనతా పార్టీ (బీజేపీ), మనకు తెలిసిన విధంగా హిందూమత ఆధిపత్య పార్టీ. ఇది, హిందూ రాజ్య స్థాపన పై విశ్వాసం ఉన్న ఫాసిస్ట్ సంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) కు అనుబంధ రాజకీయ పార్టీ. తాను రాజ్యాంగంలోని నాలుగు స్తంభాల పరిధిలో ఉండాల్సిన అవసరం ఉంది కాబట్టి, బీజేపీ ఆ లక్ష్యానికి బహిరంగంగా మద్దతు ఇవ్వకపోయినప్పటికీ, దానిని నిజం చేసేందుకు అది శాయశక్తులా ప్రయత్నం చేస్తుంది.

కానీ వాస్తవానికి, హిందూ రాజ్యం అంటే అర్థం ఏమిటి?ఇది,లౌకిక తత్వ భావనను ధ్వంసం చేయడం, ముస్లిం మైనార్టీలను రెండవ తరగతి పౌరులుగా తగ్గించడం వాస్తవమైన విషయం. కానీ, హిందూ రాజ్యానికి నిజమైన అర్థం హిందువుల ప్రభుత్వం కాబట్టి, హిందూ ప్రభుత్వం అనేది హిందువుల ప్రయోజనాల కోసం ఏర్పడిందని చాలా మంది విశ్వసిస్తున్నారు.

ప్రాథమికంగా ఇది ప్రజల తప్పుడు భావన. వాస్తవానికి హిందూ రాజ్యం అనేది ఒక నిరంకుశ రాజ్యం. అది హిందువులను, ముస్లిం లను సమానంగా అణచివేస్తుంది.వారి యొక్క ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తుంది,భారత ప్రభుత్వం యొక్క సమాఖ్య నిర్మాణాన్ని ధ్వంసం చేస్తుంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, దేశీయ కార్పోరేట్-ద్రవ్య సంస్థ లాంటి అల్ప సంఖ్యాకుల ఆధిపత్యం తో హిందూ ముస్లింలనే తేడా లేకుండా దోపిడీ చేపిస్తుంది హిందూ నిరంకుశ రాజ్యం.ఒక్కమాటలో చెప్పాలంటే హిందూ రాజ్యం అంటే హిందువుల ఆధిపత్యం ఉండే రాజ్యం కాదు.ఇది గుత్తపెట్టుబడి ఆధిపత్యం ఉండే రాజ్యం. ఇది,హిందువులు ఇంతకు మునుపు కంటే మెరుగ్గా ఉండే రాజ్యం కాకపోగా, దానికి భిన్నంగా గుత్త పెట్టుబడి చర్యలతో ముస్లింల వలె హిందువులు కూడా నిరవధికంగా పేదలుగా మారిపోతారు.

కానీ చాలా కాలంగా గుత్తపెట్టుబడి అధికార ప్రాబల్యాన్ని అనుభవిస్తూ ఉంది.అలాంటప్పుడు భారతీయ సమాజంపై, ప్రభుత్వం పైన పట్టు బిగించడానికి హిందూ ఆధిపత్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం దానికి ఎందుకు? అనే వాదన ఉంది.

దేశ ఆర్థిక వ్యవస్థ ద్వారా డబ్బును సంపన్న వర్గాల నుండి పేదలకు పంచి వృద్ధి రేటు పెంచుతామని చాలా కాలం క్రితం చేసిన వాగ్దానం నిజం కాదు. పన్నుల విధానం ద్వారా భారీగా వనరులను సమీకరించి, పేదల కోసం ఖర్చు చేస్తుందని 11 వ పంచవర్ష ప్రణాళిక పత్రాల్లో ఆశలు రేపి, ప్రభుత్వం చేసిన వాగ్దానం నిజం కాదని రుజువు అయింది.వాస్తవంగా,అప్పటి నుండే ఆదాయం, సంపదల అసమానతలు ఆకాశాన్నంటుతున్నాయి.

ఈ క్రమంలో,ఈ సంక్షోభం కారణంగా కరోనా మహమ్మారికి ముందే నిరుద్యోగం, గత ఐదు దశాబ్దాల కాలంలో ఏనాడూ పెరగనంత స్థాయికి పెరిగింది. గ్రామీణ భారతదేశంలో ప్రజల బాధలు మరింత పెరిగాయి, ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం, వినియోగదారుల ఖర్చు పై నేషనల్ సాంపుల్ సర్వే చేసిన సర్వే గణాంకాలను బయటకు రాకుండా తొక్కి పెట్టింది. ఇది, 2011-12 మరియు 2017-18 మధ్య కాలంలో, గ్రామీణ భారతదేశంలో తలసరి వినియోగదారుని ఖర్చు 9% కి పడిపోయింది.దేశ ప్రజలను గతంలో ఇంత తీవ్రంగా పీల్చి పిప్పి చేసిన సందర్భం ఏదీ లేదు.

నయా ఉదారవాద పాలనలో ఆర్థిక వ్యవస్థను మింగేసిన సంక్షోభానికి పరిష్కారం లేదు,సహజం అయినప్పటికీ ద్రవ్య పెట్టుబడి ఈ వాస్తవాన్ని గుర్తించదు.నయా ఉదారవాద పాలనలో సృష్టించబడిన సంక్షోభానికి ద్రవ్య పెట్టుబడి ప్రతిస్పందన ఏమంటే నయా ఉదారవాదాన్ని మరింతగా పెంచి పోషించే విధంగా ఒత్తిడి చేయడం.దీని కోసం, నయా ఉదారవాద పాలక వర్గం కార్మిక సంఘాల రద్దును సమర్థించడం, గిరిజనుల భూములను గుంజుకోవడం, ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులను భారీగా ప్రైవేటీకరించడం, ప్రభుత్వ డబ్బును పెద్ద పెట్టుబడిదారులకు బదిలీ చేసే చర్యలను చేపట్టడం కోసం బీజేపీ నాయకత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిత్యం శ్రమిస్తుంది.

అలాంటి చర్యలకు ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కనీస పరిజ్ఞానం ఉన్న ప్రభుత్వం కొంత అనుకూలంగా ఉంటే, ప్రభుత్వం ప్రశ్నించే వీలులేని విధంగా ద్రవ్య పెట్టుబడి ఆజ్ఞలను

నెరవేర్చుతుంది. అదే విధంగా తన వెనుక ప్రజల మద్దతును కూడా ఆ ప్రభుత్వం కూడగట్టుకుంటుంది. ఈ అవసరాలను తీర్చేందుకు బీజేపీ ప్రభుత్వం సరిగ్గా సరిపోతుంది. దీనికి ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఏ పరిజ్ఞానం లేదు,అందువల్ల స్వాభావికంగా ద్రవ్య పెట్టుబడిని "సంపద సృష్టికర్తలు" అని పిలుచుకునే ఈ ప్రభుత్వం ,అది ఎలా ఆదేశిస్తే అలా నడుచుకుంటుంది. అదే సమయంలో,ఈ ప్రభుత్వం తన హిందూత్వ ఎజెండా ద్వారా ద్రవ్య పెట్టుబడి ఆజ్ఞలను నెరవేర్చే యంత్రాంగాన్ని సమకూర్చుతుంది.

లిహిందూత్వ ఎవరి కడుపును నింప లేదు, కానీ దేశ ప్రజల దృష్టిని మళ్ళించేందుకు అయోధ్యలో మందిర నిర్మాణానికి "భూమి పూజ" ను నిర్వహించారు, అదే సమయంలో ద్రవ్య పెట్టుబడికి భారీగా రాయితీలను ఇచ్చారనే విషయాన్ని గమనించాలి. ఈ వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాలి. గత కొన్ని వారాలకు పైగా, అంతర్జాతీయ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని ఉల్లంఘిస్తూ,కార్మికులకు 12 గంటల పనిని విధించారు. కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన పర్యావరణ అంచనా నిబంధనలను ప్రాధాన్యత లేని విషయాలుగా పరిగణించారు .

1.45 లక్షల కోట్ల రూపాయలను పెట్టుబడిదారులకు బదిలీ చేశారు. ప్రైవేటీకరణను బొగ్గు లాంటి సహజ వనరులకు (వలసవాద వ్యతిరేక పోరాట వాగ్దానాన్ని ఉల్లంఘిస్తూ) కూడా విస్తరించేట్లు చేశారు,ఇప్పుడు రైల్వేల పరిస్థితి కూడా అలాగే ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గిరిజనులతో పాటు కార్మికులు పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారు. ఈ సంక్షోభం నుంచి ఉపశమనం కలిగించడానికి మోడీ ప్రభుత్వం యొక్క పెట్టుబడిదారీ అనుకూల చర్యలేవీ ఏమీ చేయక పోగా, దానికి భిన్నంగా ఆ సంక్షోభాన్ని ఆ చర్యలు మరింత తీవ్రతరం చేస్తాయి.

లిపెట్టుబడిదారులకు కోశ సంబంధమైన బదిలీలు అంటే కార్మికవర్గ ప్రజానీకం నుండి పెట్టుబడిదారులకు ఆదాయ పంపిణీని మార్చడం అని అర్థం. ఇది మొత్తం డిమాండ్ ను(కార్మికులు, బదిలీ అయిన ఒక రూపాయి నుండి పెట్టుబడిదారుల కన్నా ఎక్కువగా వినియోగిస్తారు కాబట్టి) తగ్గిస్తుంది. సరిగ్గా ఇలాంటి ఇతర చర్యల గురించి కూడా చెప్పవచ్చు. సారం రీత్యా చూస్తే, ఇవన్నీ కార్మికవర్గ ప్రజానీకం నుండి పెట్టుబడిదారులకు ఆదాయాన్ని బదిలీ చేసే చర్యలు. ఈ చర్యలన్నీ అనివార్యంగా సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తాయి. ప్రస్తుత ఈ సంక్షోభానికి నయా ఉదారవాద చట్రంలో ఎటువంటి పరిష్కారం లేదనే నిర్ణయానికి ఈ చర్యలు మనను తీసుకొని వెళ్తాయి.

ఖచ్చితంగా ఈ కారణంగానే, ప్రజల మధ్య రాజకీయ అసంతృప్తి, అవిశ్వాసాలు బాగా పెరిగిపోతాయి, ఈ అసంతృప్తి, అవిశ్వాసాలను నిరోధించాలంటే, అణచివేతను ప్రయోగిస్తారు. రామ మందిర నిర్మాణం, రామ మందిర నిర్మాణానికి శంకుస్థాపనల లాంటి ప్రజల దృష్టిని మళ్ళించే కార్యక్రమాలను చేపడతారు.

ఒక్కమాటలో చెప్పాలంటే హిందూత్వ పై చేసే వక్కాణింపు అలాంటి దృష్టి మళ్ళించే చర్యలను సృష్టిస్తుంది. ఇది అణగారిన వర్గాల ప్రజలను విభజించడమే కాకుండా, మెజారిటీ మతానికి చెందిన ప్రజలతో పాటుగా కార్మికవర్గ ప్రజానీకం మధ్య అసంతృప్తి, అవిశ్వాసాలు ఉన్నప్పటికీ, భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉ ండడానికి అవసరమైన ఓట్లను పొందే హామీనిస్తుంది. ద్రవ్య పెట్టుబడి పెంచి పోషించడానికి హిందూమత ఆధిపత్యం ఒక సౌకర్యవంతమైన సిద్ధాంతం. తన ఆధిపత్యాన్ని, అధికారానికి ముప్పు కలిగించే ఆర్థిక సంక్షోభ సమయంలో ద్రవ్య పెట్టుబడి, హిందూత్వ శక్తులతో స్నేహం చేస్తుంది.

హిందూమత ఆధిపత్యం, హిందూ రాజ్యం లాంటివి హిందువులకు ప్రయోజనాలు కలిగించేవి కావు, అవి ద్రవ్య పెట్టుబడికి ప్రయోజనాలు కలిగించేందుకు మాత్రమే ఉపయోగపడతాయి. అందుకే ద్రవ్య పెట్టుబడి,ఏ మాత్రం అవకాశం ఉన్నా హిందూత్వ శక్తులను సమర్థిస్తుంది. కానీ ఉద్యోగాలు,ఇతర ప్రయోజనాల నుండి ముస్లింలను మినహాయిస్తే, హిందువులకు ఎక్కువ భాగస్వామ్యం దక్కుతుంది కాబట్టి హిందూ ఆధిపత్యం, హిందువులకు ప్రయోజనం కలిగించదని ఎలా అంటాం? అనే ప్రశ్న అప్పుడు ఉత్పన్నమవ్వవచ్చు.

ఆ పరిస్థితుల్లో మన వాదనకు ప్రతివాదన చేయడం సందర్భోచితంగా ఉండొచ్చు. జనాభాలో వారి భాగస్వామ్యానికి తగిన రీతిలో విద్యా సంస్థలలో, ఉద్యోగాలలో ఇవ్వాల్సిన భాగాన్ని ఇవ్వకుండా మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని, ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కానీ,లక్ష్యం చేయబడిన మైనార్టీలు భారతదేశంలో వలె మినహాయింపబడిన సమూహంలో ఉన్న పరిస్థితుల్లో, విద్య మరియు ఉద్యోగాల విషయంలో సగటు హిందువుల కంటే సగటు ముస్లింలు చాలా ఘోరమైన పరిస్థితుల్లో అలా ఒక మైనార్టీ మతస్థులను లక్ష్యం చేసే పద్ధతి, హిందువులకు ఏ విధమైన ప్రయోజనాన్ని చేకూర్చదు.

ఒక్కమాటలో చెప్పాలంటే,హిందూ రాజ్యస్థాపన దిశగా సాగే చర్య,హిందూ,ముస్లిం కార్మిక వర్గాల ప్రజలను లక్ష్యంగా చేసుకుంది. హిందూ ప్రజలకే ప్రయోజనం చేకూరుతుందనేది తప్పుడు భావన. ఈ తప్పుడు భావన ఎంత త్వరగా తొలగిపోతే అంత మంచిది. ◆

స్వేచ్ఛానుసరణ : **బోడపట్ల రవీందర్, 98484 12451**



# ఇండియా @75

- కొప్పర్తి వెంకటరమణమూర్తి

**భా**రత స్వాతంత్ర్య అమృతోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆగస్ట్ 15, 2022 నాటికి భారత స్వాతంత్ర్యం 75 యేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దానికి ముందు 75 వారాల పాటు ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. తొంభై యేళ్ల క్రితం బ్రిటిష్ ప్రభుత్వం చేసిన ఉప్పు శాసనాలను ఉల్లంఘించడానికి గాంధీ నాయకత్వం లో జరిగిన దండి యాత్రను స్ఫురణకు తెస్తూ అదే దారిలో సాగే ఫ్రీడం మార్చ్ ను మార్చి 12 న ప్రధాని అహమ్మదాబాద్ నుంచి ప్రారంభించడం ఇందులో తొలిఘట్టం. ఈ సందర్భంగానే ఉత్సవాలకు ఉద్యమం, ఆశయాలు, విజయాలు, చర్యలు, తీర్మానాలు అనే ఐదు లక్ష్యాలను ఆయన ప్రకటించారు. సామాజిక, సాంస్కృతిక, శాస్త్ర సాంకేతిక రంగాలలో స్వాతంత్ర్యానంతరం దేశం సాగించిన ప్రయాణాన్ని ప్రదర్శించడం కూడా కార్యక్రమంలో ఉంది. అయితే విలువలనూ, ఆశయాలనూ ఒకవైపు పడగొడుతూ మళ్లీ వాటినే నిలబెట్టడం కోసం ఉత్సవాలు జరపడమే ఇక్కడున్న వైరుధ్యం.

నిజానికి మహాత్మా గాంధీ తన అనుచరులతో 1930, మార్చి 12 న మొదలుపెట్టి ఏప్రిల్ 5 న దండి చేరుకుని మరుసటి రోజు ఉప్పు శాసనాన్ని ఉల్లంఘించిన ఘటన లో ఉప్పు ఒక సంకేతం మాత్రమే. ప్రభుత్వం నుంచి సంస్కరణలు కోరుతూ అప్పుడు చేసిన పదకొండు డిమాండ్లలో ఉప్పు చివరిది. మిగిలిన అంశాల్లో రాజకీయ ఖైదీల విడుదల, సైనిక శాఖ ఖర్చుల తగ్గింపు, సీఐడీ విభాగం లో సంస్కరణలు, సంపూర్ణ మద్య నిషేధం, రూపాయి– స్టెర్లింగ్ ల మధ్య అంతరం తగ్గించడం, భూమిశిస్తు సగం చెయ్యడం వంటివి ఉన్నాయి. ఒకవైపు ప్రశ్నిస్తే చాలు–మేధావుల్ని ఖైదు చేస్తూ, రక్షణ శాఖ ఖర్చును పెంచేసి నిరంతరం యుద్ధ సన్నద్ధంగా ఉంటూ, రైతుల్నీ, కార్మికుల్నీ కార్పొరేట్ శక్తుల పరం చేస్తూ ఫ్రీడం మార్చ్ చేయడం పెద్ద స్వీయ ఖండనం. ఆ మహాప్రస్థానం చెయ్యాల్సింది దేశ వ్యాపితంగా మేధావులు, పౌర సమాజం కదా, డిల్లీ సరిహద్దుల్లో రైతులు కదా, విశాఖ ఉక్కు కార్మికులు కదా ! మరి ప్రభుత్వమే ఎదురు చేస్తున్నదేమిటీ ? యాంటీ క్లైమాక్సా ?

స్వాతంత్ర్య ఉద్యమం ఇచ్చిన విలువల్ని తానే ప్రశ్నార్థకం చేస్తూ తానే ఎలుగెత్తి చాటడం ఇండియా ఏ75 లోని నరేంద్ర జాలం. భారత స్వాతంత్ర్య సమరం ఒక మహత్తర సంఘటన. ఎందుకంటే అన్ని స్వాతంత్ర్య సమరాలూ జాతీయోద్యమాలు కావు. అన్ని జాతీయోద్యమాలూ స్వాతంత్ర్య సమరాలు కావు. కానీ భారత స్వాతంత్ర్య సమరం ఒక జాతీయోద్యమం. అన్ని వర్గాల, వర్ణాల, మతాల, ప్రాంతాల ప్రజలు పాల్గొన్న ప్రజా ఉద్యమం. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరిగినట్టు ఈ ప్రజలు తమలో తాము సంఘర్షిస్తూ, రాజీపడుతూ, విడిపోతూ, విలీనమౌతూ, మహా శక్తివంతమైన బ్రిటీష్ సారభౌమత్వానికి ఎదురొడ్డారు. ఈ క్రమం లో చారిత్రక సాంస్కృతిక వాస్తవిక ఆచరణాత్మక అవగాహన లో నుంచీ, ఇచ్చి పుచ్చుకోవడం లో నుంచీ ప్రజస్వామిక, లౌకిక, సామ్యవాద విలువల్ని సంతరించుకున్నారు. ఆత్మనిష్ఠం చేసుకున్నారు. రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగ రచనకు పూనుకున్నపుడు ఈ భావనలు ఆకాశం నుంచి ఊడిపడలేదు. ప్రజలు నాయకులను, నాయకులు ప్రజలను పరస్పరం ప్రభావితం చేసుకున్న నేపథ్యంలో ప్రజల చైతన్యమూ ఆకాంక్షలే రాజ్యాంగంలో ప్రతిఫలించాయి. రాజ్యాంగం ఆ ఉద్యమ ఫలం. అది మన జీవ ఫలం. జీవఫలం చేదు విషమూ, చేదు విషం జీవఫలమూ అయితే ఎట్లా ?

దేశం లో పౌరహక్కులకు తీవ్ర విఘాతం కలిగి అంతర్జాతీయ సంస్థలు ఇండియాని పూర్తి స్వేచ్ఛ కలిగిన దేశాల జాబితా లోనుంచి తొలగించి పాక్షిక స్వేచ్ఛ కలిగిన దేశంగానూ, డెమోక్రటిక్ స్టేటస్ నుంచి దించి ఎలొక్టొరల్ అటోక్రసీ గానూ పరిగణిస్తున్న దశలో అసలు స్వాతంత్ర్య ఉద్యమమే మౌలికంగా పౌరహక్కుల ఉద్యమమని గుర్తు చేయవలసి వస్తున్నది. స్వాతంత్ర్యం కోల్పోవడం లో ఇమిడి ఉన్నది జీవించే హక్కు, మాట్లాడే హక్కులను కోల్పోవడమే కదా ! మన దేశం లో మనం ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడబడడమే కదా ! తిలక్, గాంధీలు మొదలుకుని గాడిచర్ల, గరిమెళ్ల దాకా జైళ్ల కెళ్లింది మాట్లాడేహక్కు, రాసే హక్కు ల కోసమే. మహాత్మా గాంధీ ఏమన్నారో తెలుసా? పౌరహక్కులు జీవితానికి నీళ్ల వంటివి అన్నారు. నీళ్లు పలచ బడడం తానెప్పుడూ వినలేదనీ అన్నారు. పౌరహక్కులు

నిరపేక్షమైన విలువలనీ ఎట్టి పరిస్థితుల్లోనూ అవి తగ్గించబడరాదని కూడా అన్నారు. మరి ఒక వైపు పౌర హక్కుల్ని కాలరాస్తూ మరో వైపు స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నిలబెట్టుకోవడం సాధ్యపడుతుందా ?

## ఎవరెన్ని చెప్పినా స్వాతంత్ర్యోద్యమం లో ముఖ్య

భూమిక వహించిన సంస్థ భారత జాతీయ కాంగ్రెస్సే. దాని మొదటి అధ్యక్షుడు ఉమేశ్ చంద్ర బెనర్జీ హిందువు. రెండవ అధ్యక్షుడు దాదాభాయ్ నౌరోజీ పార్శీ. మూడవ, నాల్గవ అధ్యక్షులైన బద్రుద్దీన్ త్యాబ్జీ, జార్జి యూల్ లు వరుసగా ముస్లిం, క్రైస్తవులు. ఇక ఐదు కూడా క్రైస్తవుడే. ఆరు పార్శీ కాగా ఏడు ఎనిమిదులు హిందువులు. తొమ్మిది మళ్లీ పార్శీ, పది క్రిస్టియన్. అదీ సంగతి. కాంగ్రెస్ ఎప్పుడూ ఏ మతసమస్య మీద పోరాడలేదనీ, క్రైస్తవులు కాబట్టి బ్రిటీష్ వారు దేశం విడిచిపెట్టి వెళ్లాలని అనలేదంటారు ప్రొఫెసర్ బిపన్ చంద్ర. రాజ్యాన్ని మతం నుంచి వేరు చేసే ఈ ధోరణే మతతత్వం దేశాన్ని రెండు ముక్కలుగా చీల్చినా ఇక్కడ మాత్రం లౌకికత్వం నిలదొక్కుకునేటట్లు చేసింది. లౌకికత్వం అంటే రాజ్యం అన్ని మతాల్నీ సమానంగా చూడడం, మతాన్ని ప్రచారం చేసుకునే హక్కు కల్పించడం లాంటి సాధారణ అంశాలు కాదు. రాజ్యానికి మతం లేకపోవడం అసలు లౌకికత్వం. కోవిడ్ నివారణా మార్గాల్ని గాయత్రీ మంత్రంలో చూసే ప్రభుత్వానికి మతం ఉన్నట్లే అనిపిస్తుంది ! ఒక వేళ నిజంగా మంత్రంలో మహత్తు ఉంటే, మిగిలిన మతస్థులకు, నాస్తికులకు డోసు ఎలా ఇస్తారో చూడాలి. ఇక ఆహార అలవాట్ల కారణంగా కొన్ని మతాలు, కొన్ని సమూహాలూ దాడులకు గురి కావడం, మతం కారణంగా కొందరికి పౌరసత్వాన్ని నిరాకరించడం ఏ స్వాతంత్ర్యోద్యమ విలువల్ని కాపాడడం ?

రైతుల పట్ల ఇంత నిర్దయగా ప్రవర్తిస్తున్న వారికి పటేల్ ఆదర్శపురుషుడూ వికాస పురుషుడు ఎట్లా అయ్యాడో ఆశ్చర్యం వేస్తుంది. పటేల్ సారథ్యం లో రైతులు చేసిన బార్డోలీ సత్యాగ్రహం వీళ్లకు తెలియకుండా ఎట్లాఉంటుందీ అనుకున్నా – బొంబాయి ప్రెసిడెన్సీ లో భూస్వాములనూ, వడ్డీ వ్యాపారులనూ నియంత్రించే చట్టాల రూపకల్పనలో పటేల్ పాత్ర ఖచ్చితంగా తెలియకపోయి ఉండాలి. ఇక 1936 లో ప్రారంభించిన అఖిల భారత రైతు సంస్థకు పటేల్ తొలి అధ్యక్షుడని గుర్తు చెయ్యడానికి ఏం చెయ్యాలో తెలీదు. ఒకవైపు ఆకాశమంత పటేల్ విగ్రహం. మరోవైపు సముద్రమంత రైతుల ఆగ్రహం. మధ్యలో ఆజాదీ కా అమృతోత్సవం !

మిశ్రమ ఆర్థిక వ్యవస్థ లో ప్రభుత్వ రంగ సంస్థలు పెట్టుబడిదారీ సామ్యవాద వ్యవస్థల మధ్య తుల్యత సాధించడానికి ఉపయోగపడతాయి. సామాన్యులకు, అణగారిన వర్గాలకు ప్రాతినిథ్యం వహిస్తూ దేశం మొత్తం పెట్టుబడిగా మారకుండా నిరోధిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్ శక్తుల పరం చెయ్యడం రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడ మౌతుందా? దేశాన్ని సామ్యవాదం దిశగా నడిపించడమౌతుందా? స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశీయ పెట్టుబడిదారీ వర్గం విదేశీ పెట్టుబడిదారీ వర్గానికి ద్వితీయశ్రేణి భాగస్వామిగా కాకుండా స్వతంత్ర ప్రతిపత్తి కల వర్గంగా ఎదగడానికి ప్రయత్నించింది. సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోవడంలో వెనుకంజ వెయ్యకుండానే వర్గ ప్రయోజనాలను కాపాడుకుంటూ స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వామి అయ్యింది. బ్రిటీష్ ప్రభుత్వం ఈ వర్గం పట్ల వలపక్షం చూపించినప్పటికీ మొత్తం మీద స్వాతంత్ర్యం సిద్ధించేనాటికి ఇది స్వతంత్ర వర్గం గా నిలదొక్కుకుంది. ఒకనాటి యూరోపియన్, ఇండియన్ కాపిటలిస్ట్ వర్గాల మధ్య నెలకొన్న వివక్షే ఇప్పుడు దేశంలో కార్పొరేట్ శక్తులకూ ప్రభుత్వ రంగ సంస్థలకూ మధ్య నెలకొని ఉంది. ఈ దశలో స్వాతంత్ర్య స్ఫూర్తిని నిలబెట్టడమంటే ప్రభుత్వ రంగ సంస్థల పక్షం వహించడం కదా ! మరి జరుగుతున్న దేమిటీ ?

ఇదంతా మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కడం కాదా !? ◆

---

**(54వ తరువాయి... )**

ప్రభుత్వ విధానాల్ని దేశ ప్రజలు నిశితంగా అర్థం చేసుకోవాల్సి ఉంది. గుడికి నువ్వు లక్ష రూపాయల విరాళమిచ్చినా నిన్ను అక్కడ కేవలం భక్తుడిగానే గుర్తిస్తారు. అదే డబ్బు బయట పేదవారికి పంచి చూడు వారు నిన్ను "దేవుణ్ణి" చేస్తారు. దేవుడు అంటే నిజంగా ఇక్కడ దేవుడు ఉన్నాడని కాదు. అత్యున్నతమైన గౌరవ భావంతో చూడడం. మనుషులుగా మనుషులకు పనికొచ్చే పని చేద్దామా? మనుషులమన్నది మరిచి పేదల ఇండ్లపైకి బుల్‌డోజర్లు పంపి కూల్చేద్దామా? ఏది మానవత్వం? హనుమాన్ ఎవరు? రామాయణ కావ్యంలలో రాముడి పాత్రకు బానిసగా బతికిన పాత్ర ఆ బానిసకు సంబంధించిన చాలీసా పఠిస్తూ, శోభాయాత్రలు తీస్తూ బానిసకు బానిసలుగా బతకడమే జీవిత ధ్యేయమా? "ఇందులేదందు లేదని సందేహము వలదు! ఎందెందు వెదకి చూసిన – అందందే లేడు చక్రి!" అనేది వాస్తవం. ◆



# దేశ ప్రజలకు ఆనంద్ తేల్తుంబ్డే లేఖ

**- ఆనంద్ తేల్తుంబ్డే**

***ఏప్రిల్ 14 బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి. కరోనావైరస్ వల్ల బహిరంగంగా జయంతి ఉత్సవాలు జరిగే అవకాశం లేకపోయినా, ఎవరికి వారు బాబాసాహెబ్ ను తలచుకుంటున్న సమయానికి బాబాసాహెబ్ మనవడు (మనవరాలు రమ సహచరుడు), బహుగ్రంథ రచయిత, ప్రజా మేధావి ప్రొ. ఆనంద్ తేల్తుంబ్డే అబద్ధపు సాక్ష్యాధారాల మీద ఆధారపడిన ఒక తప్పుడు కేసులో నిందితుడిగా కోర్టులో సరెండర్ కానున్నాడు. జైలుకు వెళ్లడానికి కొద్ది గంటల ముందు దేశప్రజలను ఉద్దేశించి ఆనంద్ ఒక బహిరంగ లేఖ రాశాడు. ఇంటర్నెట్ మీద పెట్టిన ఆ ఇంగ్లిష్ లేఖకు తెలుగు అనువాదం చూడండి:***

## జైలుకు వెళ్లేముందు ఆనంద్ తేల్తుంబ్డే రాసిన లేఖ

బిజెపి – ఆర్ ఎస్ ఎస్ కూటమి, దానికి ఊడిగం చేస్తున్న ప్రచారసాధనాలు సాగిస్తున్న ఉద్దేశపూర్వక రణగొణధ్వనిలో నా ఈ లేఖ పూర్తిగా మునిగిపోతుందని నాకు తెలుసు. అయినా నాకు మరొక అవకాశం దొరుకుతుందో లేదో తెలియని స్థితిలో మీతో మాట్లాడడం అవసరమనే అనుకుంటున్నాను.

ఆగస్ట్ 2018లో గోవా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ అధ్యాపకుల గృహసముదాయంలో ఉన్న నా ఇంటి మీద పోలీసులు దాడి చేసినప్పటి నుంచి నా ప్రపంచం పూర్తిగా తలకిందులైపోయింది. నా జీవితంలో ఇటువంటి ఘటనలు జరుగుతాయని నేను నా అతి ఘోరమైన పీడకలలో కూడ ఊహించలేదు. నా ప్రసంగాల నిర్వాహకులను, ముఖ్యంగా విశ్వవిద్యాలయాలను, పోలీసులు ప్రశ్నిస్తున్నారని, నాగురించి దర్యాప్తు చేస్తూ బెదిరిస్తున్నారని నాకు అప్పటికే తెలిసినప్పటికీ, వాళ్లు నా సోదరుడి గురించి వెతుకుతూ పొరపాటున నా వెంట పడుతున్నారని అనుకున్నాను. నా సోదరుడు ఎన్నో సంవత్సరాల కిందనే మా కుటుంబం వదిలి వెళ్లిపోయాడు. నేను ఖరగ్ పూర్ ఐఐటి లో అధ్యాపకుడిగా ఉన్నప్పుడు ఒక బిఎస్ఎన్ఎల్ అధికారి నాకు ఫోన్ చేసి నా అభిమానిననీ, శ్రేయోభిలాషిననీ పరిచయం చేసుకుని, నా ఫోన్ మీద నిఘా ఉందని తెలియజేశాడు. నేనాయనకు కృతజ్ఞతలు చెప్పాను గాని దాని గురించి ఏమీ చేయలేదు. చివరికి నా సిమ్ కార్డ్ కూడ మార్చలేదు. ఈ చొరబాట్ల గురించి నేను ఆందోళనపడ్డాను గాని ఎన్ని దర్యాప్తులు చేసుకున్నా నేను ఒక సాధారణ వ్యక్తిననీ, నా ప్రవర్తనలో చట్టవ్యతిరేకత ఏమీ లేదనీ పోలీసులే అర్థం చేసుకుంటారని అనుకుని ఊరుకున్నాను. పౌరహక్కుల కార్యకర్తలు పోలీసులను ప్రశ్నిస్తారు గనుక సాధారణంగాపౌరహక్కుల కార్యకర్తల పట్ల పోలీసులు కన్నెర్ర వహిస్తారని, నేను కూడ ఎంతో కొంత పౌరహక్కుల కృషిలో ఉన్నందువల్ల పోలీసులు ఇలా చేస్తున్నారని నేననుకున్నాను. అయితే నా ఉద్యోగ విధుల్లోనే కాలమంతా కరిగిపోతుండడం వల్ల నేను ఆ పౌరహక్కుల పని కూడ సరిగ్గా చేయడం లేదని పోలీసులు తెలుసుకుంటారులే అనుకుని సంతృప్తి పడ్డాను.

కాని ఒకరోజు పొద్దున్నే మా ఇన్ స్టిట్యూట్ డైరెక్టర్ నాకు ఫోన్ చేసి పోలీసులు క్యాంపస్ మీద దాడి చేశారని, నాకోసం వెతుకుతున్నారని చెప్పినప్పుడు కొన్ని క్షణాలపాటు నేను అవాక్కయ్యాను. కొద్ది గంటల కిందనే అధికారిక కార్యక్రమం మీదనే నేను ముంబాయి వచ్చాను. నా భార్య అంతకుముందే ముంబాయి వచ్చి ఉంది. ఆ రోజే కొందరు వ్యక్తుల ఇళ్ల మీద దాడులు జరిగాయని, వారిని అరెస్టు చేశారని నాకు తెలిసినప్పుడు, నేను వెంట్రుక వాసిలో అరెస్టు తప్పించుకున్నానని తెలిసి వణికిపోయాను. పోలీసులకు నేను ఎక్కడున్నానో తెలుసు, నన్ను కూడ అరెస్టు చేయగలిగి ఉండేవారే, కాని కారణాలేమిటో వాళ్లకే తెలియాలి గాని ఆ పని చేయలేదు. పోలీసులు మా యూనివర్సిటీ సెక్యూరిటీ గార్డ్ దగ్గరినుంచి బలవంతాన డుప్లికేట్ తాళం చెవి తీసుకుని మా ఇల్లు తెరిచారు. లోపల వీడియో రికార్డ్ చేసి మళ్లీ తాళం వేశామంటున్నారు. ఇక అప్పటినుంచి మా ఇక్కట్లు మొదలయ్యాయి.

మా న్యాయవాదుల సలహా మేరకు, నా భార్య వెంటనే గోవా వెళ్లి మేం ఇంట్లో లేని సమయంలో పోలీసులు మా ఇంటి తాళం తెరిచి లోపలికి వెళ్లారని, వారు లోపల ఏవైనా వస్తువులు పెట్టి ఉంటే మేము బాధ్యత వహించబోమని గోవాలోని బిచోలిం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు దాఖలు చేసింది. పోలీసులు దర్యాప్తు జరపదలచుకుంటే మాకు ఫోన్ చేయవచ్చునని మా ఫోన్ నంబర్లు ఇచ్చి వచ్చింది.

ఆశ్చర్యకరంగా, పోలీసులు ఆ వెంటనే పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసి, మావోయిస్టులతో సంబంధాల కథలు చెప్పడం మొదలుపెట్టారు. తాము చెప్పిందల్లా రాసే, వినిపించే ప్రచార సాధనాల సహాయంతో నాకూ, ఇతర నిర్బంధితులకూ వ్యతిరేకంగా ప్రజల్లో దుష్ప్రచారం సాగించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారనేది స్పష్టమయింది. 2018 ఆగస్ట్ 31న అటువంటి ఒక పత్రికా సమావేశంలో ఒక పోలీసు అధికారి ఒక ఉత్తరం చదివి వినిపించాడు. అది అంతకు ముందు నిర్బంధించినవారిలో ఒకరి కంప్యూటర్ లో దొరికిందని అన్నారు. ఆ ఉత్తరాన్ని నా మీద సాక్ష్యంగా చెప్పారు. అడ్డగోలుగా రాయబడిన ఆ ఉత్తరంలో నేను హాజరైన ఒక అంతర్జాతీయ విద్యాసంబంధమైన సదస్సు ప్రస్తావన ఉంది. అమెరికన్ యూనివర్సిటీ ఆఫ్ పారిస్ వెబ్ సైట్ మీద ఆ సదస్సు సమాచారమంతా ఉంటుంది. ఆ తప్పుడు ఆరోపణ విని మొదట నేను నవ్వేశాను. కాని ఆ తర్వాత ఆ పోలీసు అధికారి మీద సివిల్, క్రిమినల్ పరువు నష్టం దావా వేయడానికి నిర్ణయించుకుని, ఆ దావా వేయడానికి అనుమతించవలసిందిగా 2018 సెప్టెంబర్ 5న మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నాను. అది చట్టబద్ధ పద్ధతి. కాని ఇవాళ్టివరకూ ప్రభుత్వం నుంచి నాకు జవాబే రాలేదు. అయితే ఈలోగా హైకోర్టు పోలీసులను అభిశంసించడంతో పత్రికా సమావేశాలు ఆగిపోయాయి.

ఈ మొత్తం వ్యవహారంలో ఆర్ఎస్ఎస్ హస్తం బహిరంగంగానే ఉంది. ఆర్ఎస్ఎస్ నాయకులలో ఒకరైన రమేశ్ పతంగే, వారి అధికారపత్రిక పాంచజన్యలో 2015 ఏప్రిల్ లోనే నేరుగా నన్ను లక్ష్యంగా చేసుకుని ఒక వ్యాసం రాశాడని నా మరాఠీ మిత్రులు చెప్పారు. ఆ వ్యాసంలో ఆయన నన్ను అరుంధతీ రాయ్, గెయిల్ ఆంవెడ్ట్ లతో కలిపి 'మాయావి అంబేద్కర్ వాది' అని ప్రస్తావించాడు. హిందూ పురాణాలలో మాయావి అంటే చంపవలసిన రాక్షసుడు. నేను సుప్రీంకోర్టు రక్షణలో ఉన్నప్పటికీ నన్ను చట్టవ్యతిరేకంగా పుణె పోలీసులు అరెస్టు చేసినప్పుడు హిందుత్వ సైబర్ ముఠా నా వికీమీడియా పేజిలో చొరబడి దాన్ని ధ్వంసం చేసింది. అది బహిరంగంగా అందరికీ అందుబాటులో ఉండే పేజి. అది ఉందని కూడ ఎన్నో సంవత్సరాలు నాకు తెలియదు. ఈ మూక మొదట ఆ పేజిలో ఉండే సమాచారాన్నంతా తొలగించి "ఇతను ఒక మావోయిస్టుకు సోదరుడు%ాా%. ఇతని ఇంటిని పోలీసులు సోదాచేశారు%ాా% మావోయిస్టులతో సంబంధాలున్నాయని ఇతణ్ని అరెస్టు చేశారు" వగైరా వాక్యాలు అక్కడ రాసిపెట్టారు. ఈ రాతలను తొలగించి అసలు పేజిని పునరుద్ధరించడానికి ఎన్నిసార్లు ప్రయత్నించినా, ఆ మూక వెంటనే చొరబడి, అసలు పేజిని తొలగించి, ఈ నిందాపూర్వకమైన మాటలతో నింపారని నా విద్యార్థులు ఆ తర్వాత చెప్పారు. చివరికి వికీమీడియా యాజమాన్యం జోక్యంతో పేజిని స్థిరీకరించడం జరిగింది గాని ఇప్పటికీ వారు పెట్టిన వ్యతిరేక సమాచారం అలాగే ఉంది.

మరొకవైపు నక్సల్ వ్యవహారాల నిపుణులు అనబడే ఆర్ఎస్ఎస్ వారి ద్వారా అనేక అబద్ధాలను ప్రచారసాధనాలలో హోరెత్తించారు. ఆ ఛానళ్ల మీద నా ఫిర్యాదులకూ, చివరికి ఇండియా బ్రాడ్ కాస్టింగ్ ఫౌండేషన్ కు చేసిన ఫిర్యాదులకూ ఎటువంటి జవాబూ లేదు. ఆ తర్వాత నాతో సహా, ఎంతో మంది ఫోన్లలో ప్రభుత్వమే ప్రమాదకరమైన స్పైవేర్ ను ప్రవేశపెట్టిందని పెగాసస్ కథనం 2019 అక్టోబర్ లో బైటపడింది. పత్రికలలో కొద్ది రోజులపాటు గగ్గోలు వినబడింది గాని అంత తీవ్రమైన విషయం కూడ అర్ధాంతరంగా ముగిసి పోయింది.

నేనొక మామూలు మనిషిని. తన భుక్తి తాను నిజాయితీగా సంపాదించుకునే మనిషిని. తన జ్ఞానంతో రచనల ద్వారా ప్రజలకు వీలైనంతవరకు సహాయం చేయాలనుకునే మనిషిని. కార్పొరేట్ ప్రపంచంలో, అధ్యాపకుడిగా, పౌరహక్కుల కార్యకర్తగా, ప్రజా మేధావిగా అనేక రకాలుగా ఈ దేశానికి దాదాపు ఐదు దశాబ్దాలుగా సేవ చేస్తున్న మచ్చలేని చరిత్ర ఉన్న వ్యక్తిని. ముప్పైకి పైగా పుస్తకాలు, అంతర్జాతీయంగా అచ్చయిన లెక్కలేనన్ని పత్రాలు, వ్యాసాలు, వ్యాఖ్యలు, శీర్షికలు, ఇంటర్వ్యూలు కలిసిన నా అపారమైన రచనలలో హింసనూ, ఏదైనా విధ్వంసక ఉద్యమాన్నీ సమర్థించే ఒక్క సూచనైనా దొరకదు. కాని నా జీవితపు చివరి రోజుల్లో నామీద భయానకమైన యుఎపిఎ చట్టం కింద ఘోరమైన నేరాలు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వమూ, దానికి విధేయంగా ఉన్న ప్రచారసాధనాలూ చేసే ఉధృత ప్రచారాన్ని నా వంటి వ్యక్తి ఎదిరించడం సాధ్యం కాదు. ఈ కేసు వివరాలు ఇంటర్నెట్ మీద ఎక్కడైనా దొరుకుతాయి. అది ఒక గందరగోళపు, హింసాతత్వపు కల్పన అని ఎవరికైనా

అర్థమవుతుంది. ఆ కేసు గురించి సంక్షిప్త వివరణ ఆల్ ఇండియా ఫోరం ఫర్ రైట్ టు ఎడ్యుకేషన్ వెబ్ సైట్ మీద ఉంది. దాని సారాంశం ఇక్కడ ఇస్తాను:

ఈ కేసులో అరెస్టయిన ఇద్దరు వ్యక్తుల కంప్యూటర్లలో దొరికాయని పోలీసులు చెపుతున్న 13 ఉత్తరాల్లో ఐదు ఉత్తరాల ఆధారంగా నన్ను ఈ కేసులో ఇరికించారు. నా దగ్గర దొరికిన ఆధారమేదీ లేదు. ఆ ఉత్తరంలో "ఆనంద్" అనే పేరు ఉంది. భారతదేశంలో ఆ పేరు అతి సాధారణమైన పేరు. కాని పోలీసులు మాత్రం ఎటువంటి సందేహాలు లేకుండా అది నాదే అంటున్నారు. ఆ ఉత్తరాలను ఇప్పటికే ఎందరో నిపుణులు, చివరికి ఒక సుప్రీం కోర్టు న్యాయమూర్తి కూడ కొట్టివేశారు. మొత్తం న్యాయవ్యవస్థలో ఇప్పటివరకూ సాక్ష్యాధారాల స్వభావం గురించి మాట్లాడిన ఏకైక న్యాయమూర్తి ఆయనే. సరే, ఆ ఉత్తరాల రూపమూ సారమూ ఎలా ఉన్నప్పటికీ, వాటిలో ఉన్న విషయాలేవీ కూడ అతి మామూలు నేరం అనబడేదానికి సుదూరంగా కూడ రావు. కాని ఒక వ్యక్తికి ఎటువంటి రక్షణ కల్పించని, నిస్సహాయుడిగా మార్చే యుఎపిఎ చట్టంలోని అతి భయంకరమైన నిబంధనల సహాయంతో నన్ను జైలు పాలు చేస్తున్నారు.

మీకు సులభంగా అర్థం అయ్యేందుకు ఈ కేసును వివరిస్తాను: హఠాత్తుగా ఒక పోలీసు బలగం మీ ఇంటి మీద పడుతుంది. ఎటువంటి వారంట్ చూపకుండానే మీ ఇంటిని చిందర వందర చేస్తారు. చివరికి మిమ్మల్ని అరెస్టు చేసి ఒక లాకప్ లో పడేస్తారు. తర్వాత, ఫలానా స్థలంలో ఒక దొంగతనం కేసునో, మరేదో ఫిర్యాదునో పరిశోధిస్తున్నప్పుడు పోలీసులకు ఫలానా వ్యక్తి దగ్గర ఒక పెన్ డ్రైవో, కంప్యూటరో దొరికిందనీ, దానిలో ఏదో ఒక నిషిద్ధ సంస్థకు చెందినవాడని భావించబడుతున్న ఫలానా వ్యక్తి రాసిన ఉత్తరాలు దొరికాయనీ, అందులో ఫలానా వ్యక్తి పేరు ఉందనీ, ఆ ఫలానా వ్యక్తి మీరేననీ పోలీసులు కోర్టుకు చెపుతారు. ఒక బ్రహ్మాండమైన కుట్రలో ఒకానొక భాగంగా మిమ్మల్ని చూపుతారు. హఠాత్తుగా మీ ప్రపంచమంతా తలకిందులైపోతుంది. మీ ఉద్యోగం పోతుంది. కుటుంబానికి నిలువనీడ పోతుంది. ప్రచారసాధనాలలో మీ మీద దుష్ప్రచారం సాగుతుంది. మీరు వాటికి జవాబు చెప్పుకునే అవకాశం కూడ ఉండదు. మీమీద ప్రాథమిక సాక్ష్యాధారా లున్నాయనీ, అందువల్ల మిమ్మల్ని కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించవలసి ఉన్నదనీ జడ్జిలను ఒప్పించడానికి పోలీసులు "సీల్డ్ కవర్లు" సమర్పిస్తారు. అసలు సాక్ష్యాధారాలే లేవనీ, ఉన్నవి కల్పితమైనవనీ మీరు వాదించినా జడ్జిలు ఆ మాట వినరు. అదంతా విచారణ సమయంలో చూడవచ్చునంటారు. కస్టడీలో ఇంటరాగేషన్ తర్వాత మిమ్మల్ని జైలుకు పంపుతారు. మీరు బెయిల్ కోరుతూ దరఖాస్తుల మీద దరఖాస్తులు పెట్టుకుంటారు. కాని కోర్టులు వాటిని నిరాకరిస్తాయి. ఇటువంటి నిందితులకు బెయిల్ రావడానికో, కేసు కొట్టుడుబోయి బైటికి రావడానికో సగటున 4 నుంచి 10 సంవత్సరాలు పడుతుందని ఇప్పటికి ఉన్న సమాచారం. ఇది అక్షరాలా ఎవరి విషయంలోనైనా జరగగల వ్యవహారం.

అమాయకమైన వ్యక్తుల స్వేచ్ఛలను, రాజ్యాంగ హక్కులను ఈ రకంగా కొల్లగొట్టే భయానకమైన చట్టాలను 'దేశం' పేరు మీద రాజ్యాంగ బద్ధమైనవిగా తీసుకువస్తున్నారు. భిన్నాభిప్రాయాన్ని ధ్వంసం చేయడానికి, ప్రజలను చీల్చడానికి రాజకీయ వర్గం దేశం, దేశభక్తి అనే పదాలను దురహంకారపూరిత ఆయుధాలుగా వాడుకుంటున్నది. ఈ మూక మనస్తత్వం హేతుబద్ధ ఆలోచనను సంపూర్ణంగా రద్దు చేసింది. సాధారణ పదాల అర్థాలను తలకిందులుగా మార్చివేసింది. ఇప్పుడిక దేశాన్ని ధ్వంసం చేస్తున్నవాళ్లు దేశభక్తులుగా పిలవబడుతున్నారు. నిస్వార్థమైన ప్రజా సేవకులు దేశద్రోహులుగా పిలవబడుతున్నారు. నా భారతదేశం ఇలా విధ్వంసం పాలవుతుండగా చూస్తున్న నేను ఈ విచారకర సమయాన ఒక బలహీనమైన ఆశతో మీకీ ఉత్తరం రాస్తున్నాను. సరే, నేనిక నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ కస్టడీకి వెళుతున్నాను. ఎప్పటికి మళ్లీ మీతో మాట్లాడగలనో తెలియదు. కాని, మీ వంతు రాకముందే మీరు మాట్లాడతారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.

**అనువాదం : ఎన్. వేణుగోపాల్**

**(వీక్షణం మాసపత్రిక సౌజన్యంతో....**



# సమైక్య స్ఫూర్తిగా బాపు, బాబాసాహెబ్



**- రామచంద్ర గుహ,** వ్యాసకర్త చరిత్రకారుడు



**న్యూ**ఢిల్లీలో విద్యార్థుల నిరసనలలో అంబేద్కర్, గాంధీ పోస్టర్లను కలిసికట్టుగా ప్రదర్శించడాన్ని చూసినప్పుడు దేవనూర్ మహదేవ మాటలను నేను గుర్తు చేసుకున్నాను. బాపు, బాబాసాహెబ్ చిత్రాలను పక్కపక్కనే ప్రదర్శించడం ఇదే మొదటిసారి కానప్పటికీ చాలా అరుదైన విషయం. గతంలో గాంధీ అభిమానులు, ఈ ఇరువురినీ పరస్పర ప్రత్యర్థులుగా చూసేవారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్న హిందుత్వ శక్తులను ఓడించేందుకు అంబేద్కర్, గాంధీ ఒకే పక్షాన ఉండవలసిన అవసరమున్నది.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ పరస్పర ప్రత్యర్థులూ, విరోధులా? ఇరవయ్యో శతాబ్ది మహోన్నత భారతీయులైన ఆ ఇరువురినీ అలా భావించవద్దని ప్రజాస్వామిక వాదులకు దేవనూర్ మహదేవ (కన్నడ రచయిత, సామాజిక క్రియాశీలి) విజ్ఞప్తి చేశారు. నిజమైన సమానత్వ సాధనా ప్రస్థానంలో సహ యాత్రికులుగా వారిని చూడాలని ఆయన అన్నారు. 'నిద్రాణ స్థితిలో వున్న దళితులను అంబేద్కర్ మేలుకొలిపారు. ఆ జాగృతితో సమానత్వ వెలుగుల దిశగా జాతి పయనమయింది. కుల మతాల సంకుచితత్వంలో వున్న హిందువులను మానవతా వెలుగుల వైపు నడిపించడానికి గాంధీ మహా ప్రయత్నం చేశారు. అంబేద్కర్ ఉనికి లేకపోయినట్టయితే, బహుశా, గాంధీ తన లక్ష్య సాధనలో అంతగా ముందుకు వెళ్ళగలిగివుండేవారు కాదేమో?! అదే విధంగా హిందువులలో గాంధీ ఉదారవాద, సహనశీల వైఖరులను పెంపొందించి వుండక పోయినట్టయితే అంబేద్కర్‌ను ఈ క్రూర సవర్ణ సమాజం అంతగా సహించి, గౌరవించి వుండేది కాదు' అని కూడా మహదేవ వ్యాఖ్యానించారు. ఆయన ఇంకా ఇలా అన్నారు:

'భారత్ తననుతాను కుల శృంఖలాల నుంచి విముక్త పరచుకోవాలంటే సవర్ణులు మారవలసిన అవసరమున్నది. ఇందుకు గాంధీ అవసరం. దళితుల పౌర హక్కుల పోరాటానికి అంబేద్కర్ తప్పనిసరి. అందుకే వారిరువురినీ ఒకే పక్షానికి తీసుకురావాలని నేను అంటున్నాను'. మహదేవ తన అభి ప్రాయాలను మరింత విపులంగా వెల్లడిస్తూ ఇలా అన్నారు: "అస్పృశ్యతను గాంధీ ఒక 'పాపం'గా పేర్కొనగా, అంబేద్కర్ ఒక 'నేరం'గా అభివర్ణించారు. ఆ రెండిటినీ మనం పరస్పర వ్యతిరేకమైనవిగా ఎందుకు చూస్తున్నాం? అస్పృశ్యత దురాచార నిర్మూలనకు ఆ రెండు భావనలు తప్పనిసరి అని అర్థం చేసుకోవడమే విజ్ఞత అవుతుంది".

న్యూఢిల్లీలో విద్యార్థుల నిరసనలలో అంబేద్కర్, గాంధీ పోస్టర్లను కలిసికట్టుగా ప్రదర్శించడాన్ని చూసినప్పుడు దేవనూర్ మహదేవ మాటలను నేను గుర్తు చేసుకున్నాను. బాపు, బాబాసాహెబ్ చిత్రాలను పక్కపక్కనే ప్రదర్శించడం ఇదే మొదటిసారి కానప్పటికీ చాలా అరుదైన విషయం. గతంలో గాంధీ అభిమానులు, ఈ మహోన్నత భారతీయులు ఇరువురినీ పరస్పర ప్రత్యర్థులుగా చూసేవారు. 1930, 40 దశకాలలో అంబేద్కర్ తరచు గాంధీ, ఆయన భావాలపై వివాదాత్మక భాషలో విమర్శలు చేస్తుండేవారు. కాంగ్రెస్ వాదులకు అవి తీవ్ర ఆగ్రహావేశాలు తెప్పించేవి. తమ ప్రియతమ బాపును ?అలా విమర్శించడాన్ని వారు సహించేవారు

కాదు. బ్రిటిష్ వలసపాలనకు అంబేద్కర్ ఒక సంజాయిషీదారు అని వారు ప్రతి విమర్శలు చేస్తుండేవారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో వైస్రాయ్ కార్యనిర్వాహక వర్గంలో అంబేద్కర్ చేరడాన్ని గాంధీ అనుయాయులు తీవ్రంగా ఆక్షేపించేవారు.

ఇటీవలి దశాబ్దాలలో అంబేద్కర్ వాదులు మరింత తరచుగా గాంధీని విమర్శిస్తున్నారు. కుల వ్యవస్థను సంస్కరించడంలో ఆయన కృషి చిత్తశుద్ధితో చేసినది కాదని కొట్టివేస్తున్నారు. పూణే ఒడంబడిక సందర్భంలోనూ, ఆ తరువాత తమ ప్రియతమ నాయకుడి పట్ల గాంధీ వైఖరిని వారు తప్పుపడుతున్నారు. అలాగే గాంధీ రాజకీయ వారసుడు జవహర్ లాల్ నెహ్రూ , అంబేద్కర్ ప్రతిభాపాటవాలను సరైన విధంగా వినియోగించుకోకపోవడాన్ని దుయ్యబడుతున్నారు (నెహ్రూ కేబినెట్‌లో అంబేద్కర్ రెండు సంవత్సరాల పాటు న్యాయశాఖ మంత్రిగా వున్నారు). ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలో గాంధీపై దళిత మేధావులు తీవ్ర విమర్శలు చేస్తుంటారు. అయితే కర్ణాటకలో నిమ్న శ్రేణుల రచయితలు గాంధీని ఒక విశాల దృష్టితో చూస్తున్నారు. అంబేద్కర్, గాంధీల కృషిని పరస్పర పూరకమైనదిగా చూడాలని కీర్తిశేషుడు డి. ఆర్.నాగరాజ్ తన ప్రశస్త పుస్తకం 'ది ఫ్లేమింగ్ ఫీట్'లో మనకు విజ్ఞప్తి చేశారు.

జమియా మిలియా ఇస్లామియా విద్యార్థులకు, షాహీన్ బాగ్ మహిళలకు డి.ఆర్. నాగరాజ్, దేవనూర్ మహదేవ మేధో కృషి గురించి బహుశ, తెలిసివుండకపోవచ్చు. ఆ కన్నడ మేధావులు విశాల దృక్పథంతో గాంధీ గురించి చేసిన విశ్లేషణను జమియా విద్యార్థులు, షాహీన్ బాగ్ మహిళా ఉద్యమకారులు ధ్రువీకరించారు. కర్ణాటక చింతనాపరుల వలే అంబేద్కర్,– గాంధీలను పరస్పర విరోధులుగా చూడవద్దని ఆ సాహసోపేత ఢిల్లీ నిరసనకారులు మనకు విజ్ఞప్తి చేశారు. ఆ ఇరువురు మహోన్నతులను ఒక సమున్నత లక్ష్య సాధనలో సహచరులుగా చూడాలని వారు కోరారు. మరింత మెరుగైన ప్రజాస్వామ్యానికి, బహుత్వ వాద సంస్కృతికై జరుగుతున్న పోరాటంలో అంబేద్కర్, గాంధీ మేధో కృషి, మానవతావాద కార్యాచరణల వారసత్వాలను సమ్మిళితం చేయవలసిన అవసరమున్నదని జమియా విద్యార్థులు, షాహీన్ బాగ్ మహిళలు మనకు విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీ రచయిత ఒమైర్ అహ్మద్ ఇటీవల షాహీన్ బాగ్‌ను సందర్శించిన తరువాత ట్విటర్‌లో ఒక ఆసక్తికరమైన వ్యాఖ్య పోస్ట్ చేశారు. ఆ నిరసన ప్రదర్శనలలో గాంధీ చిత్రాల కంటే అంబేద్కర్ చిత్రాలే ఎక్కువగా ప్రదర్శితమవడం పట్ల ఆయన ఇలా వ్యాఖ్యానించారు: 'తమకు స్వాతంత్ర్యం సాధించిన నాయకుడికి ధన్యవాదాలు తెలిపే సంప్రదాయం నుంచి, స్వేచ్ఛాయుత పౌరులుగా తమ సొంత హక్కుల గురించి నిశ్చితంగా మాట్లాడేందుకుఅవసరమైన రాజ్యాంగ ఉపకరణాలనిచ్చిన నాయకుకి ధన్యవాదాలు చెప్పే ఆనవాయితీకి ప్రజలు మారారు'. అహ్మద్ ట్వీట్‌కు నేనిలా ప్రతిస్పందించాను: 'మీతో నేను ఒక షరతుపై అంగీకరిస్తున్నాను. హిందూ–ముస్లిం సమైక్యతను పటిష్ఠం చేయడంలో గాంధీతో సరి సమానులైన నాయకులు మరెవ్వరూ లేరు (నెహ్రూ సైతం ఇందుకు మినహాయింపు కాదు). ఇది మరింత వివరంగా చర్చించాల్సిన విషయం. ఏమైనా అంబేద్కర్, గాంధీలను సమష్టిగా ఆవాహన చేసుకోవడానికి ప్రయత్నించడం చాలా ముదావహమైన విషయం'. దేశ వ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్టాని(సిఏఏ)కి వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న నిరసనలు పలు విధాల ఉత్తేజపరుస్తున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొనడం, ఆ నిరసనలకు మహిళలు నాయకత్వం వహించడం ఒక గాఢానుభూతిని కలిగిస్తున్నాయి. మహిళలను ప్రోత్సహించే విషయమై కూడా అంబేద్కర్, గాంధీలను సమష్టిగా ప్రస్తావించడం సముచితంగా ఉంటుంది.

జెండర్ సమానత్వానికి అంబేద్కర్, ఎటువంటి మినహాయింపులు లేకుండా సంపూర్ణంగా నిబద్ధుడైన విశాల హృదయుడు. ఆ నిబద్ధత రాజ్యాంగ రచనలో నిండుగా ప్రతిబింబించింది. హిందూ మత చట్టాలను సంస్కరించేందుకు ఆయన సలిపిన రాజీలేని కృషి కూడా ఆ నిబద్ధతకు ఒక తిరుగులేని తార్కాణమే. గాంధీ తన వ్యక్తిగత జీవితంలో పితృస్వామ్య సంప్రదాయాలు, ఆచారాలనే పాటించినప్పటికీ ప్రజా జీవితంలో మాత్రం మహిళా సాధికారతకు పరిపూర్ణంగా కృషి చేశారు. 1925లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా సరోజినీ నాయుడు ఎన్నికవ్వడానికి గాంధీయే ప్రధాన కారకుడు. ఆ కాలంలో అమెరికా, బ్రిటన్ మొదలైన పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాలలోని ఏ ప్రధాన రాజకీయ పార్టీకీ ఒక మహిళ అధినేత్రి కావడమనేది పూర్తిగా అనూహ్య విషయం మరి.

'బోధించు, సంఘటితపరచు, ఉద్యమించు'అని అణగారిన భారతీయులకు అంబేద్కర్ పిలుపునిచ్చారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా విద్యార్థులు, మహిళలు మొక్కవోని దీక్షతో నిర్వహిస్తున్న నిరసనలు పూర్తిగా అంబేద్కర్ స్ఫూర్తిదాయక పిలుపునకు అనుగుణంగా వున్నాయి. హిందూ అధిక సంఖ్యాకవాద ధోరణులను నిలువరించి ప్రజాస్వామ్యాన్ని, బహుత్వ వాదాన్ని

సంరక్షించుకోవడానికి జరుగుతోన్న చైతన్యశీల కృషిలో అంతర్–మత సామరస్యం కోసం గాంధీ జీవితాంతం చేసిన పోరాటం ప్రతిధ్వనిస్తోంది.

హిందూత్వ శక్తులతో ఎదురవుతున్న ముప్పును ఎదుర్కోవడానికి అంబేద్కర్, గాంధీలను సమష్టిగా ఆవాహన చేసుకోవాలని దేవనూర్ మహాదేవ నొక్కి చెప్పారు. ఆయన ఇలా అన్నారు: "వారణాసికి చెందిన పదహారేళ్ళ బాలుడు ఒకరు అన్న మాటలను మనం విని తీరాలి'. 'గాడ్సే దేశంలో నేను గాంధీతో నిలబడతాను' అని ఆ చిరుప్రాయుడు అన్నాడు. అలా నిలబడనిపక్షంలో ఏ ఛాందసవాదమైనా సరే తొలుత మీ కళ్ళను పెరికి వేసి మిమ్ములను అంధులను చేస్తుంది. ఆ తరువాత మీ మెదడును చితగ్గొట్టి, హేతుయుక్తంగా ఆలోచించలేకుండా చేస్తుంది. పిదప మీ గుండెను పగుల గొట్టి మిమ్ములను రాక్షసుడిగా చేస్తుంది. అంతిమంగా ఒక త్యాగం చేయమని మిమ్ములను అడుగుతుంది. ఈ ధోరణి నేడు పెచ్చరిల్లి పోతోంది. మనం మన బిడ్డల నయనాలను, వారి హృదయాలను, వారి మస్తిష్కాలను ఛాందసవాద కోరల నుంచి తక్షణమే కాపాడుకోవాలి. ఇటువంటి చైతన్యశీలతను సంతరించుకోకపోతే దళితులకు మరింత మహా ముప్పు వాటిల్ల గలదని నేను ఆందోళన చెందుతున్నాను'.

అంబేద్కర్ గానీ, గాంధీ గానీ మానవాతీతులు కారనడంలో సందేహమేమీ లేదు. ఇరువురూ మహా తప్పులు చేశారు. ఆ మహోన్నతులిరువురినీ యాంత్రికంగా ఆవాహన చేసుకోకూడదుబీ గుడ్డిగా అనుకరించకూడదు. వారు ఈ భూమిపై నడయాడిన కాలానికి సంపూర్ణంగా భిన్నమైన ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. 21 వ శతాబ్ది మూడో దశాబ్ది రాజకీయ, సాంకేతికతా సవాళ్లు 20వ శతాబ్ది మధ్యనాళ్ళ రాజకీయ, సాంకేతికతా సవాళ్లకు పూర్తిగా భిన్నమైనవి. అప్పటికీ, ఇప్పటికీ నైతిక, సామాజిక సవాళ్లు మాత్రం ఒకే విధంగా వున్నాయి. కుల నిర్మూలన, జెండర్ సమానత్వ పోరాటాలు ముగియలేదు. అంతర్–మత సామరస్య సాధన అత్యావశ్యక, అతి ప్రధాన కర్తవ్యంగా మిగిలిపోయింది. సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్న హిందూత్వ శక్తులను ఓడించేందుకు అంబేద్కర్, గాంధీ ఒకే పక్షాన ఉండవలసిన అవసరమున్నది. ◆





# ప్రత్యామ్నాయ పొలిటికల్ శక్తిగా రైతుల ఉద్యమం

- డా॥ బి. రమేష్ చంద్రబాబు

రైతులు, వ్యవసాయ కార్మికులు ఢిల్లీకి వెళ్ళే అనేక మార్గాలను దిగ్బంధించారు. సుదూరప్రాంతాల నుంచి ట్రాక్టర్లపై, బస్సులపై, నడచీ దేశరాజధానికి చేరుకుని సెప్టెంబరు నెలలో పార్లమెంటు నిర్ణయించిన మూడు వ్యవసాయక చట్టాలనూ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆహార ధాన్యాలు పండించే పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో స్థానికంగా పెద్ద నిరసనోద్యమాల తర్వాత ఈ చర్యకు దిగారు. నిరసనకారులు అనేక ప్రతిఘటనలు కోవిడ్-19 కాలంలో ఎదుర్కొనాల్సి వచ్చింది. అనేకమంది చలి కారణంగా మరణించారు. పోలీసు చర్యలను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ వారి కోర్కెలు నెరవేరేవరకూ నిరసన కొనసాగించాలని ప్రతిజ్ఞ పూనారు. ప్రభుత్వం నిరసనకారులను తిరిగి యిళ్ళకు వెళ్ళిపొమ్మని కోరినా, అనేక చర్చల సమావేశాలు జరిగినప్పటికీ వారిమధ్య ఒప్పందం కుదరక నిరసన కొనసాగించారు.

భారతదేశంలో వ్యవసాయరంగం దేశశ్రమశక్తిలో సగంపైగా వినియోగించుకుంటున్నా, దశాబ్దాలుగా సంక్షోభంలో

ఉంది. ఇది గ్రామీణ జీవనంపై ప్రభావం చూపిస్తోంది. 1990 సంవత్సరం నుంచి 3 లక్షలకుపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇటీవలి గణాంకాల ప్రకారం భారతదేశంలో వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారిలో రోజుకు 28మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కొనసాగుతున్న వ్యవసాయ సంక్షోభం మూలాలు 1990సంవత్సరంలో భారతదేశ రాజకీయ ఆర్థిక రంగాన్ని రూపుదిద్దిన నయా ఉదారవాద సంస్కరణలలోనూ, అంతకుముందు హరిత విప్లవంలోనూ ఉన్నాయి. ఈ సంస్కరణల వల్ల వ్యవసాయ రంగంలో ప్రభుత్వ తోడ్పాటు తగ్గి, ఉత్పత్తి ఖర్చులు పెరిగాయి. దాంతో ఆదాయం తగ్గి, రైతులు అప్పులపాలవుతున్నారు. దీని వల్ల మెజారిటీ రైతులు వ్యవసాయ భూములు కోల్పోవడం లేదా చిన్న కమతాలు మాత్రమే కలిగి ఉండడం జరుగుతోంది. ఇప్పుడు 85 శాతం రైతులు రెండు హెక్టారుల లోపు భూమిని మాత్రమే కలిగి ఉన్నారు. ఈ పోకడలు 1990 నుంచి ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయ రంగంలో ఊహించని సంక్షోభానికి దారితీసింది.

2014 సంవత్సరంలో నరేంద్రమోడీ రైతులకు ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50శాతం వచ్చేటట్లు చేస్తానని, వ్యవసాయ బీమా మరియు యితర విధానాలతో పాటు జాతీయ భూమి వినియోగం విధానం చేపడతానని వాగ్దానం చేసి, రైతుల, వ్యవసాయ కూలీల మద్దతు పొందారు. మోదీ వాగ్దానాలు నెరవేరక పోవడంతో మోదీ విజయం తర్వాత ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) వివిధ సంఘాలను, రాజకీయ పార్టీలను, సామాజిక సంస్థలను సమావేశపరిచింది. 2015 సంవత్సరంలో ఈ గ్రూపులు మోదీకి వ్యతిరేకంగా పెద్ద ప్రదర్శన 2013 సంవత్సరం లాండ్ ఎక్విజిషన్ చట్టానికి వ్యతిరేకంగా జరిపాయి.

మధ్యప్రదేశ్‌లో జూన్ 6, 2017న రైతులపై కాల్పులు జరపడంతో ఆరుగురు మరణించారు. అంతకుముందు మహారాష్ట్రలో రైతులు కూరగాయలు, పాలు రోడ్లపై పోసి అప్పుల నుంచి ఉపశమనం కలిగించాలని, తమ ఉత్పత్తులకు సరైన ధరలు కావాలని డిమాండ్ చేశారు. రైతులపై కాల్పుల తర్వాత సుమారు 150 రైతు సంఘాలు కలిసి ఆల్ యిండియా కిసాన్ సంఘర్ష్ కో-ఆర్డినేషన్ కమిటీ (ఎఐకెఎస్‌సిసి) ని ఏర్పాటు చేసుకుని భారతదేశంలోని 200లకు పైగా రైతు సంఘాలను తమ గొడుగు క్రింద చేర్చుకుని పనిచేయాలని నిర్ణయించుకున్నాయి. నవంబరు 2018లో ఈ కమిటీ వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులను తెచ్చి వ్యవసాయ సంక్షోభంపై చర్చకు ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటుచేయాలనే డిమాండ్‌తో పార్లమెంటుకు వెళ్ళాలనుకున్నాయి. అప్పుల రద్దు,

ఉత్పత్తులను అధిక ధరలు కావాలనేవి వీరి ప్రధాన డిమాండ్లు.

అదే సమయంలో వ్యవసాయేతర, మధ్యతరగతి ప్రజల మద్దతు పొందడానికి ఢిల్లీ చలో ప్రచారం ప్రారంభించారు. దీని ఫలితంగా వివిధ గ్రూపులు, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు నుంచి రైతులకు, వారి డిమాండ్లకు మద్దతు లభించింది. ఒక నెల పాటు ఎఐకెఎస్‌సిసి వివిధ రాష్ట్రాలలోనూ, రాజధానిలోనూ వివిధ గ్రూపులను, విద్యార్థులను, లాయర్లను, కళాకారులను, జర్నలిస్టులను తమతో సంఘటితం కావాలని అనేక కార్యక్రమాలు చేపట్టింది.

ఈ సమావేశాలు ప్రతి రాష్ట్రంలోనూ, తమ ప్రత్యేకతలు ఉన్నప్పటికీ రైతులు ఐక్యం కావాలని, అంతర సంబంధాలు పెంచుకోవాలని అన్ని ప్రాంతాలలో అన్ని గ్రూపులలో కలిగించాయి. అన్నిటికంటే బలంగా యిటీవల 2020 సంవత్సరంలో నూతన వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో కనపడింది. నూతన చట్టాలు వ్యవసాయ రంగంలో మరిన్ని సడలింపులను తీసుకొస్తాయని , వాటివల్ల రైతులు తమ ఉత్పత్తులను ఎక్కడైనా అమ్ముకోవచ్చు. అలాగే వాల్‌మార్ట్ వంటి పెద్ద రిటైల్ వ్యాపారులకు, ప్రైవేటు కొనుగోలుదారులతో సహా ఎవరికైనా అమ్ముకోవచ్చు అని ప్రభుత్వం ప్రచారం చేసింది . ఇది రెండు హెక్టారుల లోపు కమతాలు గల 85 శాతం రైతులను ప్రైవేటు కంపెనీలు, పెద్ద కార్పొరేట్‌ల దయాదాక్షిణ్యాలకు వదలివేయడమే. పైగా నూతన చట్టాలు కనీస మద్దతు ధర తొలగించడం ద్వారా రైతులను గాలికి వదలి వేయడమేనని రైతులు భావించారు . వరి, గోధుమ వంటివి ప్రభుత్వ ఆధానంలోని హెూల్‌సేల్ మార్కెట్‌లో ఈ కనీస మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. చాలాకాలంగా కనీస మద్దతు ధర పేదరైతులను మార్కెట్ ఆటుపోట్లకు వ్యతిరేకంగా ఆదుకుంటోంది. ఈ నియంత్రణ లేకపోతే సరైన ధరకోసం బేరమాడే

శక్తి కోల్పోతామని చాలామంది రైతులు భయపడుతున్నారు. ఇది వారి జీవన పరిస్థితులను మరింత దిగజారుస్తుంది. ఇది ముఖ్యంగా ఉత్తర భారతదేశంలోని పంజాబ్, హర్యానాలకు వర్తిస్తుంది. ఆ రైతులు ఈ నిరసనలలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

పెద్దఎత్తున ప్రైవేట్ రంగం వ్యవసాయంలో పెట్టుబడి పెట్టడానికి భూమిని ఏకీకృతం చేయడానికి ముందుకు తీసుకు వెళ్ళాలని ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడింది. నరేంద్ర మోడీ ఈ సంస్కరణలు రైతు ప్రయోజనాల కోసం తీసుకున్నవని నమ్మపలుకుతున్నారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలు వీటిపై పుకార్లు, అసత్యాలు ప్రచారం చేస్తున్నట్లు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర కొనసాగిస్తుందని, గ్యారంటీ ధరకు ఇప్పుడు కూడా కొనుగోలు చేస్తుందని చెబుతున్నారు. ఐనా ఈ హామీలను లక్షల మంది రైతులను ఒప్పించలేకపోయాయి .

. రైతులు తమ డిమాండ్లపై ఎటువంటి రాజీకి అంగీకరించబోమని ప్రకటించారు

నిరసనకారులు "మేము ప్రపంచాన్ని పోషిస్తున్నాం" 'రైతు లేనిచో ఆహారం లేదు" అనే ప్లకార్డులను ప్రదర్శించారు . 1920లో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్, అతని అనుచరులు ప్రచారం చేసిన విప్లవ నినాదం ''ఇంక్విలాబ్ జిందాబాద్" నినదించడం ద్వారా.

భగత్‌సింగ్ చిత్రపటాలను అనేక చోట్ల ప్రదర్శించడం ద్వారా రైతులు భారత విప్లవ వారసత్వానికి నివాళులర్పిస్తున్నారు. రైతులు తమ నిరసన ప్రాంతాలలో వంటలు చేసుకుని, కలసితింటూ, సాధ్యమైనంత ఎక్కువ మందికి ఆహారం అందించారు. ప్రదర్శనలలో పురుషులు ఎక్కువమంది పాల్గొన్నప్పటికీ . మహిళలు భుజం భుజం కలిపి ఈ నిరసనకు వెన్నెముకగా నిలిచారు. ఉమ్మడి వంటల దగ్గర నుంచి, ఆహారాన్ని పంచడంతోపాటు, ప్రదర్శనల్లో ప్రసంగాల వరకూ పాలుపంచుకుంటున్నారు. ఈ మహిళల్లో చాలామంది ఆత్మహత్యలు చేసుకున్న రైతుల భార్యలు. గ్రామీణ పరిస్థితులు క్షీణించడంతో ఆత్మహత్యలు చేసుకునే స్త్రీల సంఖ్య కూడా పెరుగుతోంది. వ్యవసాయరంగంలో స్త్రీల పాత్ర విశిష్టంగా ఉన్నప్పటికీ భూమి యాజమాన్యం కేవలం 12 శాతానికి మాత్రమే ఉంది. వీరు కార్పొరేట్లు దోపిడీకి వీరు మరింత తేలికగా గురవుతారు.

ప్రదర్శన ప్రాంతాలలో ఐక్యతాభావం ప్రస్ఫుటంగా కనిపించింది . వ్యక్తిగత వలంటీర్లు, సానుభూతిగల గ్రూపులు, రైతులతో కలిపి వారికి ప్రదర్శనల్లో సహాయ, సహకారాలందించారు . కొందరు తమ యిళ్ళలో వారికి ఆశ్రయమిచ్చారు . కొందరు భోజనం, దుప్పట్లు, గుడారాలు అందించారు . 2018లో ప్రారంభమయిన ఢిల్లీ చలో ప్రచారం రైతులకు మద్దతు పెరగడానికి ఉపయోగపడింది. రైతు సంఘాలే కాక, యూనియన్‌ల విభాగాలు, వివిధ కమ్యూనిస్టు పార్టీలు, విద్యార్థి సంఘాలు, కార్మికసంఘాలు అనేక విధాలుగా రైతులకు తోడ్పాటు నిచ్చాయి .

ఈ ప్రతిఘటన లో భారతదేశంలో రైతులు సంఘటితం కావడం యథాతథ స్థితిని ప్రతిఘటించడం కన్పడుతోంది. రైతులు భారతదేశంలో అత్యంత సంఘటిత గ్రూపుగా ఏర్పడి పెద్దరైతులు, చిన్నరైతులు, వ్యవసాయ కూలీలు, ఆదివాసీలు, దళితులు, వివిధ కమతాల వారు, మహిళా రైతులు ఉమ్మడిగా పెద్దగ్రూపుగా ఏర్పడ్డారు. వారి ఉద్యమం , పౌరసమాజ గ్రూపులు, కార్మికులు, విద్యార్థులు ప్రతిపక్ష రాజకీయ పార్టీలతో కలిసి సాగుతున్నాయి. భారతదేశ వ్యవసాయ సంక్షోభం చిల్లర సంస్కరణలతోనో, కొన్ని ఉపశమన చట్టాల మార్పులతోనో పరిష్కారమయ్యేది కాదు. ధనిక మైనారిటీకి ప్రయోజనకరంగా

ఉన్న భారతదేశ నయా ఉదారవాద విధానాలు మానవీయ ప్రజాహిత విధానాలుగా మారాలి . రైతుల ప్రతిఘటన ను మరింత సంఘటిత పరిచి, సామాజిక న్యాయాన్ని సాధించేది కావాలి ఈ ప్రత్యామ్నాయ హెజిమనీ సాధనలో భాగంగా అదొక సామాజిక శక్తి గా ఎదగాలి. ◆



# బీజేపీ ఆధిపత్యంపై పోరాటం
# తెలుసుకోవలసిన నాలుగు సత్యాలు !

**- యోగేంద్ర యాదవ్**

ఉత్తర ప్రదేశ్ శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పుడు నాకు వచ్చిన సందేశాల్లో 'ఇదొక చావు దెబ్బలా అనిపిస్తోంది' అనేది ఒకటి. నిర్లక్ష్యాన్ని వదిలించుకుని, తాజాగా పునరాలోచన చేయడానికి బహుశా మనకీ దెబ్బ అవసరమే అనుకుంటున్నాను. ఉత్తరప్రదేశ్ , మరో నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు చర్చించడానికి ఏ విధమైన అవకాశాన్నీ మనకు మిగల్చలేదు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు, రైతాంగ ఉద్యమం మనకు ఊపిరి తీసుకునే అవకాశాన్ని తెచ్చాయి. కానీ ఇప్పుడది మనకు మిగల్లేదు. 2024 ఎన్నికలకు వెళ్ళే దారి కష్టభూయిష్టమైనదే! కానీ రాష్ట్రాల శాసనసభల ఎన్నికల ఫలితాలు దానిని మరింత కఠినతరం చేసాయి. ఒక నిరాశాజనకమైన భవిషత్తు మనముందు కనిపిస్తున్నది.

మన భవిష్యత్ ప్రయాణం నాలుగు కఠిన సత్యాల దగ్గర మొదలవుతుంది. ఈ ఎన్నికల్లో ఓడిపోయింది కేవలం పోటీ చేసిన రాజకీయ పార్టీలు మాత్రమే కాదనేది మొదటి కఠోరసత్యం. తప్పనిసరిగా గెలుచుకోవాల్సిన ఎన్నికల్లో ఓటమి పాలయిన సమాజవాదీ పార్టీ, తగిన పోటీ కూడా ఇవ్వలేకపోయిన కాంగ్రెస్‌పార్టీ, క్రమేపీ క్రుంగి నశించి పోతున్న బహుజన సమాజ్ పార్టీ, పంజాబ్‌లో వినాశనానికి అర్హమైన రాజకీయ పెత్తందారీ వ్యవస్థ మాత్రమే ఓడిపోలేదు. మనందరికీ సంబంధించిన అభిప్రాయాలు కూడా ఓడిపోయాయి. ప్రజాస్వామ్య రిపబ్లిక్ భావనలను విశ్వసించే మనలాంటి వారందరూ ఓడిపోయాం. భారతరాజ్యాంగ పీఠికకు అనుగుణంగా జీవించే వాళ్ళందరం ఓడిపోయాం. బాపూ, భగత్‌సింగ్, బాబాసాహెబ్ అంబేద్కర్, లను ఆరాధించే మనం అందరం ఓడిపోయాం.

ఎన్నికల్లో అక్రమాలు జరిగాయనో, ఈవిఎంల రిగ్గింగు జరిగిందనో సాకులు చెప్పి మనం తప్పించుకోలేం! ఈవిఎం ల రిగ్గింగు నిజమే అనుకున్నప్పటికీ ఓటమిలో వున్న భారీ తేడాలు గురించి ఎలాంటి వివరణా లేదు. అక్కడెక్కడో ఓట్ల శాతం పెరిగిందనో, మరోచోట మతోన్మాద నాయకులు పరాజయం పాలయ్యారనో చెప్పి తప్పుడు భ్రమలకు లోను కావద్దు. వాస్తవం ఏమిటంటే మనం న్యాయబద్ధంగానే ఓడిపోయాం.

రెండవ సత్యం : మనం ఓడిపోయింది ఏదో ఒక ఎన్నికలలో మాత్రమే కాదు. రాజనీతి శాస్త్రవేత్త సుహాస్ పాల్శీకర్ మనకు గుర్తు చేసినట్లు మన ముందున్న సవాలు అతి పెద్దదీ, లోతయినదీ, చిరకాలం కొనసాగేది! మనం తలపడుతున్నది ఒక ఆధిపత్య శక్తితో! భారతీయ జనతాపార్టీ ఎన్నికల ప్రాబల్యం అంతా దాని అపరిమితమైన, అత్యంత ప్రభావశీలమైన ప్రచారం మీదనూ, పార్టీయంత్రాంగం చేసే కృషి మీదనూ, మీడియా పై గల ఆధిపత్యం మీదనూ, ధనబలం మీదనూ ఆధారపడి ఉంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యక్తిగత సమ్మోహక శక్తి దానికి తోడవుతున్నది. మున్నెన్నడూ లేనంతగా రాజ్యాధికార శక్తీ, వీధిమూకల బలగమూ, అన్ని వ్యవస్థలనూ వంచడానికీ, అసమ్మతిగళాల నోరు మూయించడానికీ బీజేపీ రాజకీయ ఆధిపత్యానికి వెన్నుదన్నుగా నిలిచి పనిచేస్తున్నాయి.

వీటన్నిటినీ మించి భావజాలపరమైన, సాంస్కృతికపరమైన ఆమోదం ఒకటి ఉందనే ఉన్నది. భారతీయ రాజకీయాల్లో కీలకమైన వనరులుగా ఉన్న జాతీయవాదం, హిందూయిజం, భారతీయ సాంస్కృతిక వారసత్వం అనే మూడింటినీ బీజేపీ తన దారికి మళ్ళించుకోవడంలో సఫలం అయ్యింది. తాను గెలిచిన అనేక రాష్ట్రాలలో పరిపాలన అధ్వాన్నంగా ఉన్నప్పటికీ, దాన్నుండి తప్పించుకోవడానికి బీజేపీకి ఈ సాంస్కృతికి ఆమోదం ఉపకరిస్తున్నది. దీనిని 'ముందస్తు విశ్వాసం' అంటూ రాజకీయ పండితుడు ప్రతాప్ భాను మెహతా పేర్కొన్నారు.

భారతీయ ప్రజానీకంలో ఒక గణనీయమైన విభాగాన్ని మన రిపబ్లిక్ ధ్వంసం చేసే పథకం కోసం సమీకరించే పని ఇప్పటికే పూర్తయ్యిందనేది ఒక కఠోర వాస్తవం. ఒక మూడవ సత్యం ఏమిటంటే మన ముందు సిద్ధంగా ఉన్న ప్రత్యామ్నాయం ఏదీ లేదు.

ప్రస్తుతం ఉన్న స్థితిలో తానే సహజమైన ప్రత్యామ్నాయాన్నని కాంగ్రెస్ పార్టీ చెప్పుకోజాలదు. బీజేపీ యేతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్ పార్టీయే బీజేపీకి వ్యతిరేకంగా గట్టిగా నిలబడిందనేది వాస్తవమే. అలాగే రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న మాటా నిజమే. అయితే బీజేపీకి జాతీయ స్థాయిలో గట్టి ప్రత్యామ్నాయం తానే అని చెప్పుకోవడానికి అవి సరిపోవు.

కొన్ని ప్రాంతాల్లో ప్రాంతీయ ప్రత్యామ్నాయ పనికి వస్తాయోమోగానీ, హిందీ రాష్ట్రాలలో అవి పనికిరావు. అసలు అవి లెక్కించదగినవికావు. గోవాలో ప్రవేశించడానికి తృణమూల్ కాంగ్రెస్ చేసిన ప్రయత్నం మట్టి కరిచింది. బీజేపీ సాగిస్తున్న ఆధిపత్య దురాక్రమణను అడ్డుకోవడానికి కుల సమీకరణలు, కుల గణాంకాలు ఎంతమాత్రమూ సరిపోవు. సమాజవాదీ పార్టీ అత్యధికంగా ఆధారపడిన కుల సమీకరణాల రసాయనం పని చేయలేదనేది రుజువయ్యింది. ఇతర ప్రాంతీయ పార్టీలతో పోలిస్తే ఆమ్ ఆద్మీ పార్టీ ఒక లెక్కించదగిన శక్తిగా ఉన్నప్పటికీ, తానొక సహజమైన జాతీయ ప్రత్యామ్నాయ శక్తిగా చెప్పుకోవడానికి ముందు అది దాటాల్సిన అవరోధాలు ఎన్నో ఉన్నాయి. అందువల్ల మనం ఆమ్ ఆద్మీ పార్టీని ఒక జాతీయ ప్రత్యామ్నాయంగా పరిగణనలోనికి తీసుకోలేం.

లోటు బడ్జెట్ ఉన్న ఒక సాధారణ రాష్ట్రాన్ని పరిపాలించగల సత్తా తనకున్నదని ఆమే ఆద్మీ రుజువు చేసుకోవాలి. అలాగే వ్యవసాయ విధానాన్ని తాను అర్థం చేసుకున్నానని రైతులకు అవగతం చేయాల్సిన అవసరం ఉంది. ఢిల్లీదర్బారు పెత్తనం అంటే పంజాబీయులకు అస్సలు గిట్టదు. ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ నుండి పంజాబ్‌ను పాలిస్తున్నదన్న భావన రానీయకుండా చూసుకోవాలి. వీటన్నిటినీ మించి తన లౌకికవాద అర్హతలను ఆమ్ ఆద్మీ పార్టీ నిరూపించుకోవాలి. బీజేపీ సృష్టించి ఆధిపత్య భావజాల రంగం నుండి తన వంతు వాటా పొందడం కోసం ప్రయత్నించే పార్టీగా కాకుండా, బీజేపీ భావజాల ఆధిపత్యాన్ని వ్యతిరేకించే శక్తిగా తన గురించి తాను చెప్పుకోగలగాలి.

నాలుగో సత్యం మనకు సానుకూలమైనది. ప్రత్యామ్నాయాన్ని సృష్టించడానికి అవసరమైన సామర్థ్యాలు బొత్తిగా లేని వాళ్ళమేమీ కాదు. 2024 ఎన్నికల ఫలితం ఇప్పటికే 'ఖరారైపోయిన వ్యవహారం' అంటూ సాగుతున్న డాబుసరి ప్రచార ఆర్భాటం అంతా బీజేపీ ఆయుధాగారంలో కన్పించే పగుళ్ళ నుండి మన దృష్టిని మళ్ళించడానికి చేస్తున్న ప్రయత్నం మాత్రమే.

బీజేపీ ప్రాబల్యం భౌగోళికంగా చూస్తే చాలా పరిమితమైనది. ఎన్నికలపరంగా ఎదిరించడానికి వీలుగానూ, దుర్బలంగానూ ఉన్నది. నిజానికి సైద్ధాంతికంగా పైకి కనిపించే అంత బలమైనదేమీ కాదు. ఉత్సాహం, సామర్థ్యం, దృఢ సంకల్పం ఉన్న ప్రత్యర్థులను తట్టుకునేంత శక్తి బీజేపీకి లేదని పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితమూ, రైతాంగ ఉద్యమమూ, సిఎఎ వ్యతిరేక ప్రదర్శనలూ తిరుగులేని విధంగా రుజువు చేస్తాయి.

ప్రస్తుతానికి బీజేపీ భావజాలపరంగా ప్రబలంగానే ఉన్నట్లు కన్పించవచ్చు. కానీ కౌంటర్ హెజిమొనీ రాజకీయాలకు అవసరమైన బలమైన సాంస్కృతిక వనరులు అపారంగా మన ముందు ఉన్నాయి. ఘనమైన సాంస్కృతిక వారసత్వం, జాతీయోద్యమ వారసత్వం, భారత రాజ్యాంగం మనకున్న బలమైన వనరులు. దృఢ సంకల్పం, విజ్ఞత ఉంటే మనం తప్పక విజయం సాధించగలం.

వర్తమాన భారతీయ రాజకీయాల్లో కన్పిస్తున్న ఈ నాలుగు సత్యాలు కౌంటర్ హెజిమొనీ రాజకీయాలకు అవసరమైన దృఢమైన అంతస్సూత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయి. 'ఆధిపత్యంపై పోరాటం – ప్రజలతో సంభాషణ' అనే ద్విముఖ వ్యూహాన్ని సాహసంతో, చాతుర్యంతో, దృఢ విశ్వాసంతో రానున్న రెండేళ్ళూ మనం అమలు చేయడం కొనసాగిస్తే మన రిపబ్లిక్‌ను తిరిగి మనం కైవసం చేసుకోగలం.

గత ఎనిమిదేళ్ళుగా ప్రస్తుతం పాలక పక్షానికి ఎదురయిన ప్రతిఘటన అంతా పార్లమెంటరీ ప్రతిపక్షం నుండి కాకుండా ప్రజా ఉద్యమాల నుండి ఎదురయ్యింది.

న్యాయ వ్యవస్థ, పాలనా యంత్రాంగం, విశ్వవిద్యాలయాలు వంటి వ్యవస్థలలో తమ స్వయం ప్రతి పత్తి స్థానాన్ని కాపాడుకోవడానికి జరిగిన నిత్య ప్రతిఘటనలను మనం చూసాం. ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలకు ప్రతిఘటనగా సాగిన నిరంతర పోరాటాలను మనం చూసాం. నిరుద్యోగానికి వ్యతిరేకంగా పెల్లుబికిన చెదురు మదురు విస్ఫోటనాలను చూసాం. సిఎఎ వ్యతిరేక ఉద్యమమూ, రైతాంగ ఉద్యమమూ వంటి అనుసరించదగిన ప్రతిఘటనా పోరాటాలను కూడా మనం చూసాం.

ఇంతవరకూ జరిగిన ఈ ఉద్యమాలన్నీ ఒక దానితో మరొక దానికి సంబంధం లేనివి, ప్రధాన స్రవంతి ప్రతిపక్ష రాజకీయాలతో అనుసంధానం లేనివి. నానాటికీ తీవ్రతరమవుతున్న ఆర్థిక అసమానతలూ, నిరంతరం పెరుగుతున్న నిరుద్యోగమూ, ద్రోవ్యల్బణమూ వంటి వాటిని చూస్తూంటే ప్రతిఘటనా పోరాటాలు

మరింత తీవ్రమవుతాయని చెప్పచ్చు.

అటువంటి ఉద్యమాలకు మద్దతు ఇవ్వడం, వాటన్నిటినీ సమన్వయం చేసి కౌంటర్ హెజిమోనీ రాజకీయాలకు అనుసంధానం చేయడం మనముందున్న సవాలు.

హెజిమొనీ రాజకీయాలను మనం గట్టిగా ప్రతిఘటిస్తున్నామంటే దానర్థం హెజిమనీ రాజకీయాలకు మద్దతు ఇస్తున్న ప్రజలను వ్యతిరేకించడ కానేకాదు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం అంటే అర్థం ఎన్నికల ఫలితాలను అన్ని సందర్భాలలోనూ కీర్తిస్తున్నామని కాదు. ప్రజల తీర్పులో దాగి ఉన్న ప్రమాదాల విషయంలో మనం మాట్లాడకుండా ఉంటే అది అత్యంత బాధ్యతారహితమూ, అప్రజాస్వామికమూ అవుతుంది. ప్రజాతీర్పును గౌరవిస్తున్నామంటే అసలు అర్థం ప్రజలు ఆ విధంగా ఎందుకు ఓటు చేస్తున్నారో, అందుకు గల కారణాలను వారి నుండే గౌరవప్రదంగా వినడం, వారితో మర్యాదగా సంభాషించడం అవుతుంది.

ఐదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికల ఫలితాలు మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను బలహీన పరిచాయని చెప్పక తప్పదు. అయితే ఓటర్ల ఉద్దేశ్యం మాత్రం అది కాదని ఇటీవల యూపీలో నేను సాగించిన ప్రమాణాల ద్వారా కనుగొన్నాను. మన రోజువారీ జీవితంలో మన కుటుంబం నుండి, స్నేహితుల నుండీ, వాట్సాప్ బృందాల నుండీ ఎదుర్కొంటున్న సమస్య ఇదే!

విద్వేష రాజకీయాలను బలోపేతం చేస్తున్న ప్రజలంతా విద్వేషపూరిత మనస్తత్వం ఉన్నవారు కాదు. వారితో మనం సహానుభూతితోనూ, గౌరవంగానూ మాట్లాడాలి. ప్రజల భాషలో, వారి నుడి కారంలోనే మాట్లాడగలిగే సత్యసైన్యాన్ని మనం నిర్మాణం చేయాలి. అబద్ధాల కంచుకోటలు మనం వూహించిన దానికంటే త్వరితగతిన కరిగిపోతాయి!

అంతకుముందు 'చావుదెబ్బ అంటూ సందేశం పంపిన మిత్రుడి నుండి ఈ వ్యాసం ముగించే సమయానికి మరో సందేశం వచ్చింది. "నైరాశ్యం నుండి, కుంగుబాటు నుండీ బైటపడ్డాను. ఇప్పుడు మరింత కృతనిశ్చయంతో ఉన్నాను. అవాస్తవిక ఆశల నుండి బైటపడి, మన ముందున్న సవాలు లోని విస్తృతిని మనం గుర్తించగలిగాం, నువ్వు నిరాశావాదివి కావు" అనేది ఆ సందేశం! ◆

**(అనువాదం : దూసనపూడి సోమసుందర్)**





# మోదీని ఓడించే భావజాల పోరాటం

- డి.వి.వి.యస్. వర్మ

మోదీ రాజకీయం మామూలు రాజకీయం కాదు. సంప్రదాయ రాజకీయానికి పూర్తిగా భిన్నమైంది. ఈ ప్రత్యేక తరహా రాజకీయాన్ని ఆవిష్కరించడానికి, విశ్లేషించడానికి సంప్రదాయ రాజకీయ కొలబద్దలు పనికిరావు. ఇటాలియన్ మార్క్సిస్టు ఆంటోనియో గ్రాంసీ రచనలలోని భావజాలం మనకు ఉపకరిస్తుంది. మోదీ రాజకీయాన్ని ప్రతిఘటించడానికి, ప్రత్యామ్నాయ రాజకీయాన్ని రూపొందించడానికి అది దారి చూపిస్తుంది. ఈ భావజాలం నేపథ్యంలో మోదీ రాజకీయాన్ని అర్థం చేసుకోడానికి మనం కొత్త ఉపకరణాలను రూపొందించుకోవాలి. ప్రతిఘటించడానికి కొత్త మార్గాలను అన్వేషించుకోవాలి.

నిత్యజీవితంలో ప్రజలు కష్టాలను అనుభవిస్తున్నారు అయినా మోదీని ఆమోదిస్తున్నారు.ఇది మన కళ్లముందు కనిపిస్తున్న రాజకీయ వైరుధ్యం, పాలకులు ప్రజల నెత్తిన భారాలు పెడితే వారు దానిని నిరసించాలి. ప్రతిఘటించాలి. పాలకులు ప్రజాదరణ కోల్పోవాలి లేదా పరాజయం పొందాలి. కాని ప్రస్తుత పరిస్థితి దీనికి భిన్నంగా వుంది. పప్పులు నూనెల ధరలు విపరీతంగా పెరిగాయి. పెట్రోలు, డీజిల్ ధరలు సెంచరీ లు చేస్తున్నాయి. నిరుద్యోగం కోవిడ్‌కి ముందే తారాస్థాయికి చేరింది. తర్వాత ఉపాధి స్థితి అధ్వాన్నం అయింది. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు మద్దతు ధర పెరగకపోగా ఉన్నదీ ఉండగొట్టబడుతుంది. కొత్త వ్యవసాయ చట్టాలు, కొత్త కార్మిక చట్టాలు, కొత్త పౌరసత్వ చట్టాలు అన్నీ ప్రజావ్యతిరేకమైనవే. పౌరహక్కుల మీద, ప్రజాస్వామ్య వ్యవస్థల మీద నిత్యం దాడులు జరుగుతున్నాయి. రూపాయినోట్ల రద్దుతో కుదేలైన ఆర్థికవ్యవస్థ ఎన్ని ఉద్దీపనలు యిస్తున్నా తిరోగమనంలోనే వుంది. కోవిడ్ కాలంలో ప్రజలు పడ్డ, పడుతున్న కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. నిత్యజీవితంలో ప్రజలు ఇన్ని కష్టాలను భరిస్తున్నారు. ఒక ఒకనాడు ఉల్లిపాయల ధరలు పెరిగితే ప్రభుత్వాలు పడిపోయిన దేశంలో ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ప్రజలు కష్టాలను భరించడానికి సిద్ధం అవుతున్నారు. కాని మోదీని వదిలించుకోవాలని భావించడం లేదు.

2021జనవరిలో ఇండియాటుడే నిర్వహించిన "మూడ్ ఆఫ్ ది నేషన్" సర్వేలో మోదీ జనాకర్షణ కించిత్తు కూడా తగ్గలేదని, ఎన్నికలు జరిగితే 302 సీట్లు గెలుస్తారని వెల్లడించింది. ప్రజలు మోదీ పాలనలో కష్టాలను భరించడానికి ఎందుకు సిద్ధం అవుతున్నారు? మోదీ పట్ల మోజును ఎందుకు వదులుకోవడం లేదు? మోదీ రాజకీయంలోని ఈ ప్రత్యేకతను ఎలా అర్థం చేసుకోవాలి అన్న దానిని లోతుగా పరిశీలించాలి

2014 ఎన్నికలలో మోదీ ఘన విజయం సాధించారు. ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికలలో అధికార మార్పిడి సహజం. ఈ అధికార మార్పిడి సంప్రదాయ రాజకీయ పరిణామంగానే జరిగిందా? లేక సంక్షోభకాలపు ప్రత్యేకత వల్ల జరిగిందా అన్నఅంశాన్ని విశ్లేషించుకోవాలి

2014 ఎన్నికలనాటికి దేశంలో రాజకీయ సంక్షోభం లేదా నాయకత్వ సంక్షోభం చోటు చేసుకుంది. మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం అవినీతి కుంభకోణాల పరంపరలో చిక్కుకుంది. అవినీతికి వ్యతిరేకంగా లోక్‌పాల్ చట్టం కోసం అన్నా హజారే ప్రారంభించిన ఉద్యమం ఢిల్లీని కదిలించింది, దేశవ్యాపిత ఉద్యమ రూపం ధరించింది. రాజకీయాలకు దూరంగా వుండే మధ్యతరగతి వర్గాలు ఈ రాజకీయ ఉద్యమంలో పాత్రధారులయ్యారు. సోనియా గాంధీ చేతిలో కీలుబొమ్మ ప్రధానిగా మన్మోహన్‌ను నిర్ణయాలు తీసుకోలేని అసమర్థునిగా భావించారు. అలాగే ముంబై పేలుళ్లపై పాకిస్తాన్‌తో దీటుగా వ్యవహరించలేదన్న విమర్శలు చేశారు. ఎన్నికల నాటికి పాలక పార్టీ "నాయకత్వ సంక్షోభం" లో పడింది.

ఇలాంటి రాజకీయ సంక్షోభాలపై ఆంటోనియో గ్రాంసీ తన రచనలలోచాలా లోతైన విశ్లేషణలు చేశారు. పాలక పార్టీ తన అధికారాన్ని కొనసాగించలేని స్థితి మరో పక్క ప్రతిపక్షాలు దానిని తొలగించలేని స్థితి వున్నప్పుడు రాజకీయ సంక్షోభంలో అనిశ్చితి ఏర్పడుతుంది. అలాంటి అనిశ్చితి పరిస్థితులలో రాజకీయరంగంలో సమ్మోహనాశక్తులకు ద్వారాలు తెరుచుకుంటాయి. ఈ అనిశ్చితిని తొలగించగల హీరోలకోసం, ప్రజల వెదుకులాట ప్రారంభం అవుతుంది. ఇది స్థూలంగా గ్రాంసీ విశ్లేషణ సారాంశం.

2014 నాటికి కాంగ్రెస్ పార్టీ అధికారానికి నూకలు చెల్లాయి. కాని దాని స్థానాన్ని ఏ ఒక్క పార్టీ ఆక్రమించగల స్థితిలేదు. అలాగే ప్రాంతీయ పార్టీలు, వామపక్షాలు అధికారం చేపట్టగల స్థితి కనిపించలేదు. గ్రాంసీ పేర్కొన్నట్లు ఇలాంటి అనిశ్చితి కాలంలో ప్రజలు హీరోల కోసం వెదుకులాడడం సహజం.

అయితే దీనిని మోదీగాని బి.జె.పి పార్టీ గాని ముందుగానే పసిగట్టిన దాఖలాలు లేవు. మోదీ తన ఎన్నికల ప్రచారంలో హిందుత్వాన్నీ, రామాలయాన్ని తెర వెనుకనే వుంచారు అందరికీ మంచిరోజులు. అందరికీ అభివృద్ధి యువతకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, విదేశాలలో ఉన్న అవినీతి సొత్తు తెచ్చి తలా 15 లక్షల పంపిణీ వంటి సాధారణ వాగ్దానాలనే ఎన్నికల ప్రచారంలో ముందుకు తెచ్చారు. గుజరాత్‌లో సాధించిన విజయాలనే దేశం అంతా విస్తరింప చేస్తాననే ప్రచారాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. అయితే ఈ నినాదాలు ఆయన విజయానికి ఎంత వరకు దోహదం చేశాయో తెలియదు కాని ప్రజలు, ప్రత్యేకించి యువత ఆయన వాగ్దానాల కోణం నుండి కాకుండా దేశాన్ని రక్షించే, నడిపించే హీరోగా ఓట్ల ప్రభంజనాన్ని సృష్టించారు.

ఈ ఎన్నికల్లో ఆయన వాడిన నినాదాలకంటే ''నాయకత్వ సంక్షోభం'' కాలపు ప్రజల మనోస్థితి ప్రధానపాత్ర వహించింది . ఇది మోదీ నినాదాలు సృష్టించిన ప్రభంజనం కాదు. సంక్షోభకాలంలో ప్రజల మనోస్థితి సృష్టించిన ప్రభంజనం. అందువల్ల మోదీ బలం ఆయన ప్రచారం చేసిన నినాదాలలో కంటే ప్రజల మనోభావాల స్థితిలో వుందన్న అంశాన్ని మనం గుర్తించాలి

## మోదీని హీరోని చేసింది ఎవరు?

పౌరసమాజంలో భావజాల ఆధిపత్యం లేదా ప్రాబల్యం నిర్వహించే పాత్రపై గ్రాంసీ తన హెజమనీ సిద్ధాంతంలో విపులంగా చర్చించారు. పాలకవర్గాలు తన పాలన సాగించడానికి బలప్రయోగ పద్ధతులతోపాటు పౌరసమాజ సమ్మతిని పొందడం కూడా సాధనం చేసుకుంటారు. ఈ పౌర సమాజ సమ్మతిని ప్రభుత్వేతర పౌర సంస్థలన్నింటి ద్వారా అంటే పాఠశాలలు, మత సంస్థలు, సాంస్కృతిక సంస్థలు వగైరాలన్నింటినీ వినియోగించుకుంటారు. ఈ భావజాల ప్రాబల్యాన్ని సాధించడంలో సవర్గమేధావుల పాత్రను ఆయన వివరించారు. ఇది పాలక వర్గాల హెజమనీ సాధన లోనూ , దానికి ప్రత్యామ్నాయంగా రూపొందే కౌంటర్ హెజమనీ సాధనలోనూ కీలకపాత్ర పోషిస్తుంది. ఈ విశ్లేషణ నేపథ్యంలో మోదీని హీరోని చేసిన అంశాలను పరిశీలించడం అవసరం.

2017లో అమెరికాకు చెందిన అసోసియేషన్ ఫర్ పబ్లిక్ ఒపీనియన్ సంస్థ భారతప్రజల రాజకీయ అభిప్రాయాల మీద సర్వే నిర్వహించింది. దేశంలో ఎలాంటి మినహాయింపులు లేని ప్రజాస్వామ్య ప్రభుత్వమే వుండాలన్న స్పష్టమైన నిబద్ధతను ప్రకటించిన వారు కేవలం 8 శాతం వున్నారు. సర్వే చేసిన వారిలో 67 శాతం మంది ప్రజాస్వామ్యం పట్ల కొంత విశ్వాసం ప్రకటించినప్పటికీ వారు ప్రజాస్వామ్య రహిత ప్రభుత్వాల పట్ల కూడా సానుకూలతను వ్యక్తం చేశారు. 55 శాతం మంది నిరంకుశ ప్రభుత్వాలను సమర్థించారు.

27శాతం మంది ''బలమైన నాయకుడు'' అవసరం అన్నారు. అంతేకాదు 53 శాతం మంది సైనిక పాలన అవసరంగా భావించారు. భారతదేశానికి పాకిస్థాన్ "అత్యంత" ప్రమాదకరమైన దేశంగా భావించారు. ఈ సర్వే 2017లో నిర్వహించినా ఇలాంటి భావాలు చాలకాలంగా దేశంలో వ్యక్తం అవుతూనే వున్నాయి.

దీనికి తోడు బి.జె.పి మాతృసంస్థ రాష్ట్రీయ స్వయక్ సేవక్ సంఘ్ గత 95 ఏళ్లుగా చరిత్రనీ, సంస్కృతిని వక్రీకరిస్తూ మతవిద్వేష భావజాలాన్ని, గత కాలపు హిందూ వైభవాలనీ, మతజాతీయవాదాలు వగైరాలను నూరిపోస్తూనే వుంది. పైగా మన చరిత్రరచన నేటికీ హీరోల చుట్టూనే తిరుగుతున్నది , పురాణాలనే చరిత్రగా భావించడం ,దుష్ట శిక్షణకు యుగ పురుషుల అవతారాల పై ప్రచారం నేటికీ నడుస్తూనే వుంది.

రాజకీయరంగంలో ''నాయకత్వ సంక్షోభం'' తలెత్తినప్పుడు హీరోల కోసం వెదులాటలు ప్రారంభమైనప్పుడు పౌరసమాజంలోని ఇలాంటి భావజాలం కీలకపాత్ర పోషిస్తుంది.

మన పౌర సమాజంలో నెలకొనివున్న ఈ భావజాలానికి తగిన ప్రతినిధిగా మోదీ కనిపించారు. ఆయనను ఈ భావజాలమే హీరోని చేసింది. దేశాన్ని ఐక్యపరిచిన వ్యక్తిగా ప్రాచుర్యంలో వున్న ''సర్దార్ పటేల్''కు నివాళిగా ప్రపంచంలోనే అతి పెద్ద విగ్రహనిర్మాణాన్ని మోదీ ప్రకటించారు.ప్రజలు మోదీలో లోని ''ఉక్కుమనిషి"ని అందులో చూశారు. గుజరాత్ అభివృద్ధి నమూనా ప్రచారంతో ''మోదీ వికాస్ పురుష్'' అయ్యాడు. గుజరాత్ అల్లర్లలో ముస్లింలను "ఉక్కుపాదంతో" అణిచివేసిన తీరు ''ప్రతీకారేచ్ఛకు" ప్రతిరూపం అయ్యాడు . భార్యను విడనాడి భరతమాత సేవకు అంకితమైన ''సర్వసంగపరిత్యాగి'' 'భారత్‌మాతాకి జై" అంటూ దేశం కోసమే జీవిస్తున్న హీరోగా కనిపించాడు .

మొత్తంమీద పౌరసమాజంలో నెలకొని వున్న ఈ భావజాలం కోరుకున్నది ''దేశరక్షకుడైన ఉక్కుమనిషిని" దేశానికి "ప్రమాదకారి ''అయిన ముస్లిం పాకిస్థాన్‌కు తగిన బుద్ధిచెప్పగల

హిందూజాతీయవాదిని, గతకాలపు ''పురాణ'' వైభవాలను పునరుద్ధరించే హీరోనే.

మోదీ విజయం తర్వాత ప్రజలు ఆయన పాలనను ఈ భావజాలపు కళ్లద్దాలతోనే చూస్తున్నారు. నిత్య జీవితానికి సంబంధించిన మోదీ వైఫల్యాలు వారికి అంతగా పట్టకపోవడానికి ఇదే కారణం.

## ప్రజా సమస్యలకు దూరం – జనాకర్షణకు మార్గం

మోదీ ఒక సాధారణ రాజకీయవాదిగా వ్యవహరించడం లేదు. ప్రభుత్వపాలన తనకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఆయన ప్రసంగాలలో ప్రజలు నిత్యజీవితంలో పడుతున్న కష్టాలను ప్రస్తావించడం లేదు. వాటిని మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి వదిలేశారు. వాటివల్ల వచ్చే అసంతృప్తికి తాను గురికాకుండా జాగ్రత్తపడుతున్నారు. తాను హిందూ జాతీయవాదినని ప్రకటించుకున్నారు. తానొక సన్యాసిగా, యోగా సాధకునిగా సంసార జంఝాటం లేనివాడిగా, భౌతిక వస్తువుల సంపదపట్ల ఆసక్తిలేని వానిగా అందరి దృష్టినీ ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాడు. ఆయన భారతదేశాన్ని కేవలం రాజకీయవేత్తగా కాకుండా సామాజికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా నడిపించే నేతగా కనిపించే ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆయన తపస్సు గురించి, యజ్ఞం గురించి, యోగా గురించి, గతకాలపు హిందూవైభవం గురించి అనేక ప్రస్తావనలు చేస్తున్నారు. కష్టాలు పడకుండా సుఖాలు, ముక్తి దక్కదన్న భావన కల్పిస్తున్నాడు. ఈ మార్గంలో ఆయన రాజకీయ అభిమానులని కాకుండా భక్తులను సృష్టించుకుంటున్నాడు. భక్తులకు వచ్చే కష్టాలు దేవుడు పెట్టే పరీక్షలు......వారు కష్టాలను అనుభవిస్తారే తప్ప తమ ఆరాధనని వదులుకోరు పైగా మరింత పెంచుకుంటారు. దేశానికి మోదీ అవసరం అన్న నినాదం దీని నుండి పుట్టుకొచ్చిందే.

ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే నాయకుడు అన్న నినాదం అంతిమంగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేస్తుంది. వైవిధ్యాన్ని తొలగిస్తుంది. నియంతృత్వానికి, ఫాసిజానికి ద్వారాలను తెరుస్తుంది.

అందువల్ల మోదీ రాజకీయాన్ని మరింత లోతుగా అధ్యయనం చెయ్యాలి. మోదీ పాలనాపరంగా బలహీనుడే, ప్రజల మీద భారాలు మోదే సాధారణ రాజకీయవేత్తే, కార్పొరేట్ దోపిడీకి ద్వారాలు తెరిచేవారే. ఆయన ప్రజాకర్షణ ఆయన అనుసరిస్తున్న రాజకీయ విధానాలలో లేదు. పౌరసమాజంలో నెలకొన్న భావజాలంలో వుంది. దానిని తన ఆకర్షణగా మార్చుకునే పరిభాషలో వుంది. అందువల్ల మోదీ రాజకీయం మీద చేసే పోరాటం కేవలం ఆర్థిక అంశాల మీద చేస్తే సరిపోదు.

మోదీ రాజకీయం మీద పోరు పౌర సమాజంలో నెలకొన్న భావజాలం మీద జరగాలి. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటా జరగాలి. ఇందులో సాంస్కృతిక రంగంలో జరిగే పోరాటం కీలకం అవుతుంది. ప్రజల లోక జ్ఞానంలో భాగమైన ఈ భావజాలాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చే కొత్త రూపంలో, సరికొత్త నినాదాలతో జరగాలి.

పౌర సమాజంలో అలాంటి ప్రజాప్రత్యామ్నాయ భావజాలం మీద సాగించే ఉద్యమాల రూప కల్పనకు గ్రాంసీ భావజాలం మనకు దారి చూపిస్తుంది. ◆



# "దేశమును ప్రేమించుమన్నా"

- గురజాడ అప్పారావు గారి రచన

గురజాడ అప్పారావు గారు 1910 సంవత్సరంలో రచించిన ఈ గేయం ప్రజల్లో నిజమైన దేశాభిమానాన్ని ప్రబోధిస్తుంది.

"దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్

పాడి పంటలు పొంగిపొరలే
దారిలో నువు పాటు పడవోయ్
తిండి కలిగితే కండ కలదోయ్
కండ కలవాడేను మనిషోయ్

ఈసురోమని మనుషులుంటే
దేశమే గతి బాగుపడునోయ్
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశి సరుకులు నింపవోయ్

అన్ని దేశాల్ క్రమ్మవలె నోయ్
దేశి సరుకుల నమ్మవలెనోయి;
డబ్బు తేలేనట్టి నరులకు
కీర్తి సంపద లబ్బవోయి

వెనక చూసిన కార్యమేమోయి
మంచి గతము కొంచెమేనోయి
మందగించక ముందు అడుగేయి
వెనుకపడితే వెనకే నోయి

పూను స్పర్థను విద్యలందే
వైరములు వాణిజ్యమందే;
వ్యర్థ కలహం పెంచబోకోయ్
కత్తి వైరం కాల్చవోయ్

దేశాభిమానం నాకు కద్దని
వొట్టి గొప్పలు చెప్పుకోకోయ్
పూని ఏదైనాను ఒక మేల్
కూర్చి జనులకు చూపవోయ్

ఓర్వలేని పిశాచి దేశం
మూలుగులు పీల్చే సెనోయ్;
ఒరుల మేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయ్

పరుల కలిమికి పొర్లి యేడ్చే
పాపి కెక్కడ సుఖం కద్దోచ్;
ఒకరి మేల్ తన మేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయ్

సొంత లాభం కొంత మానుకు
పొరుగు వానికి తోడుపడవోయ్
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్

చెట్టపట్టాల్ పట్టుకొని
దేశస్థులంతా నడువవలెనోయ్
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నియు మెలగవలెనోయ్

మతం వేరైతేను యేమోయ్
మనసు లొకటై మనుషులుంటే;
జాతమన్నది లేచి పెరిగి
లోకమును రాణించునోయ్

దేశమనియెడి దొడ్డ వృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయ్;
నరుల చమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయ్

ఆకులందున అణగిమణగీ
కవిత కోవిల పలకవలెనోయ్,
పలుకులను విని దేశమందభి
మానములు మొలకెత్తవలెనోయ్

శుభాకాంక్షలతో....

# డా॥ బి. రమేష్ చంద్రబాబు

క్రాంతి నర్సింగ్ హోమ్

నన్నయ్య విగ్రహం దగ్గర

రాష్ట్రపతిరోడ్ - తణుకు